www.andhrajyothy.com

ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHI

ఉప ఎన్నికల్లో ఇండియా హవా

13 అసెంబ్లీ సీట్లకు 10 కైవసం.. బీజేపీకి రెండే

పశ్చిమ బెంగాల్‌లో నాలుగూ తృణమూల్‌కే

హిమాచల్, ఉత్తరాఖండ్‌లో కాంగ్రెస్ విజయం

బిహార్‌లో జేడీయూపై స్వతంత్ర అభ్యర్థి గెలుపు

ఈ ఫలితాలు మార్పునకు సంకేతం: జైరాం

2


ఆదివారం | 14-7-2024 | పేజీలు: 14 + 28 పేజీల ఆదివారం అనుబంధం | వెల (Price) : Rs. 8.00 | సంపుటి (Volume) : 65 సంచిక (Issue) : 89 | శ్రీ క్రోధి నామ సంవత్సరం, ఉత్తరాయణం, గ్రీష్మరుతువు, ఆషాఢమాసం, శుక్లపక్షం; తిథి: అష్టమి సా. 5.26 తదుపరి నవమి; నక్షత్రం: చిత్త రా. 10.06 తదుపరి స్వాతి; వర్జ్యం: శేషం ఉ.5.59, తె.4.15 మొదలు; దుర్ముహూర్తం: సా.5.05-5.57; అమృతఘడియలు: మ.2.56-4.43; రాహుకాలం: సా.4.30-6.00; సూర్యోదయం: 5.52; సూర్యాస్తమయం: 6.49 | హైదరాబాద్ సిటీ *

Hyderabad | Mahaboobnagar | Vijayawada | Tirupathi | Visakhapatnam | Ananthapuramu | Karimnagar | Tadepalligudem | Warangal | Guntur | Kurnool | Nellore | Srikakulam | Rajamahendravaram | Khammam | Kadapa | Ongole | Nallagonda | Nizamabad and Bengaluru

వన్‌టైమ్ సెటిల్‌మెంట్

ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలపై కాలేజీలకు సీఎం ప్రతిపాదన

- ఇక నుంచి సకాలంలో చెల్లింపులు చేస్తాం
- తెలంగాణ ఏర్పాటుకు నిరుద్యోగమే ప్రధాన కారణం
- దీన్ని పరిష్కరించకపోతే ప్రజాప్రతినిధులు విఫలమైనట్లే
- ఏ పరీక్షలూ రాయనివాళ్లే వాయిదా దీక్షలు చేస్తున్నారు
- జాబ్ క్యాలెండర్ ప్రకటించి నియామకాలు చేపడతాం
- ప్రైవేటు ఇంజనీరింగ్ కళాశాలల యాజమాన్యాల సమావేశంలో ముఖ్యమంత్రి రేవంత్ వ్యాఖ్యలు
- వినతిపత్రాల నుంచి పోస్టింగ్ ఇచ్చే స్థాయికి వచ్చా
- యువత లక్ష్యాన్ని ఏర్పరచుకుని ముందుకుసాగాలి
- తెలంగాణను డ్రగ్స్ రహిత రాష్ట్రంగా మారుద్దాం
- కళాశాలల్లో నైతిక పోలీసింగ్ పాఠాలూ నేర్పాలి
- ఎన్ఎస్ఎస్, పోలీసు ఉన్నతాధికారులతో సీఎం



కండువా కప్పి అరికెపూడి గాంధీని పార్టీలోకి ఆహ్వానిస్తున్న రేవంత్

హైదరాబాద్/హైదరాబాద్ సిటీ, జూలై 13 (ఆంధ్రజ్యోతి): ఫీజు రీయింబర్స్‌మెంట్ కింద ప్రైవేటు కాలేజీలకు ప్రభుత్వం రూ.వేల కోట్లు బకాయి పడిందని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి తెలిపారు. ఆ బకాయిలను వన్‌టైమ్ సెటిల్‌మెంట్ కింద చెల్లించాల్సిన పరిస్థితి వచ్చిందన్నారు. కాలేజీల యాజమాన్య ప్రతినిధులందరూ కలిసి వన్‌టైమ్ సెటిల్‌మెంట్‌కు ప్రతిపాదనలు ఇస్తే.. సమస్యను త్వరగా పరిష్కరించే బాధ్యతను ఐటీ మంత్రి శ్రీధర్‌బాబుకు అప్పగిస్తున్నానని చెప్పారు. ఈ విద్యా సంవత్సరం నుంచి ఒక్క రూపాయి కూడా బకాయి పడకుండా సకాలంలో

మిగతా 13వ పేజీలో...

వారానికొక జిల్లాలో ముఖ్యమంత్రి పర్యటన

నేడు రంగారెడ్డి జిల్లాకు రేవంత్

లష్కర్‌గూడలో గీత కార్మికులకు కాటమయ్య రక్షా కవచాల పంపిణీ

13

కాంగ్రెస్‌లోకి అరికెపూడి గాంధీ

సీఎం సమక్షంలో చేరిన శేరిలింగంపల్లి ఎమ్మెల్యే

నేడో, రేపో కాంగ్రెస్‌లోకి పటాన్‌చెరు ఎమ్మెల్యే?

12

ప్రభుత్వ పెన్షన్‌దారులకూ 'ఆసరా' ఇచ్చేశారు!

లబ్ధిదారుల్లో రిటైర్డ్ ఉద్యోగులు.. సెర్ప్ తనిఖీల్లో వెలుగులోకి అక్రమాలు

5,650 మందికి డబుల్ పింఛన్లు!.. వీరిలో 3,824 మంది మృతి

12

ఆండ్రాయిడ్ యూజర్లకు హెచ్చరిక!



పలు వ్యవస్థల్లో తీవ్ర లోపాలు.. 12, 12ఎల్, 13, 14 వెర్షన్లకు ప్రమాదం

- హ్యాకర్లు పంజా విసిరే చాన్స్.. సెర్ట్ హెచ్చరిక
- ప్యాచ్‌లను అప్‌డేట్ చేసుకోవాలని సూచన

న్యూఢిల్లీ, జూలై 13: భారత సైబర్ సెక్యూరిటీ సంస్థ కంప్యూటర్ ఎమర్జెన్సీ రెస్పాన్స్ టీమ్(సెర్ట్ ఇండియా) దేశంలోని ఆండ్రాయిడ్ యూజర్లకు తీవ్ర హెచ్చరికలు జారీ చేసింది. 10 కోట్లకు పైగా ఆండ్రాయిడ్ ఫోన్లు ప్రమాదంలో ఉన్నట్లు అప్రమత్తం చేసింది. ఈ కోవలో దిగ్గజ సంస్థలు సామ్‌సంగ్, రియల్‌మీ, షామీ, వివో, వన్‌ప్లస్ స్మార్ట్‌ఫోన్లు కూడా ఉన్నాయి. ఆండ్రాయిడ్ ఫోన్లలోని సిస్టమ్ ఫ్రేమ్ వర్క్, గూగుల్ ప్లే సిస్టమ్ అప్‌డేట్‌లు, కర్నల్, ఏఆర్‌ఎం కాంపొనెంట్లు, మీడియాటెక్ కాంపొనెంట్లు, క్వాల్కమ్ కాంపొనెంట్లు, క్వాల్కమ్ క్లోజ్-సోర్స్ కాంపొనెంట్లలో లొసుగులను గుర్తించినట్లు సెర్ట్ వివరించింది. ఆండ్రాయిడ్ వెర్షన్లు 12, 12ఎల్, 13, 14లో గుర్తించిన ఈ లొసుగులను ఆసరాగా చేసుకుని, హ్యాకర్లు పంజావిప్పే ప్రమాదముందని హెచ్చరించింది. యూజర్లు అప్రమత్తమవ్వకుంటే.. వారి సున్నితమైన డేటాను హ్యాకర్లు తస్కరించవచ్చని ఆందోళన వ్యక్తం చేసింది. పైన పేర్కొన్న వెర్షన్ల ఆండ్రాయిడ్ ఆపరేటింగ్ సిస్టమ్‌ను వినియోగించే స్మార్ట్‌ఫోన్ యూజర్లు వెంటనే సెక్యూరిటీ ప్యాచ్‌లను అప్‌డేట్ చేసుకోవాలని సూచించింది. నైజీరియాలో ఈ నెల 10న ఆండ్రాయిడ్‌లోని లొసుగులతో హ్యాకర్లు 70 వేల స్మార్ట్‌ఫోన్లపై పంజా విసిరినట్లు ఆ దేశ ప్రభుత్వ సైబర్ సెక్యూరిటీ సంస్థ వెల్లడించింది. ప్రస్తుతం గుర్తించిన ఆండ్రాయిడ్ లొసుగుల తీవ్రతను 'అత్యధికం(హై)'గా పేర్కొంది. హ్యాకర్లు 'అనస్టా బ్యాంకింగ్' పేరుతో ఈ 70 వేల ఫోన్లలో ట్రోజన్లను చొప్పించారని వివరించింది. ఈ ట్రోజన్ ద్వారా యూజర్ల బ్యాంకింగ్ వివరాలను కొల్లగొట్టినట్లు గుర్తించినట్లు తెలిపింది.

అప్‌డేట్ ఒక్కటే పరిష్కారం

ఆండ్రాయిడ్ ఫోన్లలో సెక్యూరిటీ ఫీచర్లను అప్‌డేట్ చేసుకోవడం ఒక్కటే ఈ సమస్యకు పరిష్కారమని సెర్ట్-ఇండియా, సైబర్ సెక్యూరిటీ నిపుణులు చెబుతున్నారు. ఆ వివరాలు..

- యూజర్లు తమ స్మార్ట్‌ఫోన్ సెట్టింగ్స్‌లోకి వెళ్లి.. సిస్టమ్ అప్‌డేట్ ఆప్షన్‌ను ఎంచుకోవడం ద్వారా సాఫ్ట్‌వేర్‌ను, సెక్యూరిటీ ప్యాచ్‌లను అప్‌డేట్ చేసుకోవచ్చు.
- పలు స్మార్ట్‌ఫోన్ కంపెనీలు ఇప్పటికే సెక్యూరిటీ ప్యాచ్‌లను విడుదల చేశాయి. మిగతావి కూడా ఈ వారంలో వాటిని అందుబాటులోకి తీసుకువచ్చే అవకాశాలున్నాయి.
- ట్రోజన్ దాడులను అడ్డుకోవడానికి.. స్మార్ట్‌ఫోన్‌లో ఏవైనా కొత్త యాప్‌లు ఇన్‌స్టాల్ అయ్యాయా? అనే విషయాన్ని గుర్తించి, వాటిని అన్‌ఇన్‌స్టాల్ చేసుకోవాలి.
- వాట్సాప్, సోషల్ మీడియా, ఈ-మెయిల్ ద్వారా వచ్చే అపరిచిత, అనుమానాస్పద లింకులను క్లిక్ చేయకూడదు.

లోకం తీరు



స్కైడైవింగ్ చేసిన గజేంద్రసింగ్ షెకావత్

భారత్‌లో తొలి స్కైడైవింగ్ కేంద్రాన్ని ప్రారంభించిన కేంద్ర మంత్రి



న్యూఢిల్లీ, జూలై 13: కేంద్ర పర్యాటకశాఖ మంత్రి గజేంద్ర షెకావత్ స్కై డైవింగ్ చేశారు. 'ప్రపంచ స్కై డైవింగ్ డే' సందర్భంగా శనివారం ఆయన ఈ అరుదైన సాహసం చేశారు. సముద్ర మట్టానికి 14 వేల అడుగుల ఎత్తులో ఎగురుతున్న విమానంలోంచి నిపుణుడి సహాయంతో డైవింగ్ చేసి సురక్షితంగా ల్యాండ్ అయ్యారు. హరియాణాలోని నార్నౌల్‌లో దేశంలోనే మొట్టమొదటి ప్రైవేటు స్కై డైవింగ్ కేంద్రాన్ని ఆయన ప్రారంభించారు. స్కై డైవింగ్ చేయడం అద్భుతంగా అనిపించిందని 56 ఏళ్ల షెకావత్ తన అనుభవాన్ని పంచుకున్నారు.

యూట్యూబర్ ధ్రువ్ రాఠీపై కేసు నమోదు

ముంబై, జూలై 13: ప్రముఖ యూట్యూబర్ ధ్రువ్ రాఠీపై మహారాష్ట్ర సైబర్ క్రైం పోలీసులు కేసు నమోదు చేశారు. ధ్రువ్ రాఠీ పేరిట ఉన్న ఓ పేరడీ 'ఎక్స్' ఖాతా నుంచి లోక్‌సభ స్పీకర్ ఓం బిర్లాకు కుమార్తెకు సంబంధించి తప్పుడు సమాచారం పోస్టు చేసిన నేపథ్యంలో.. బిర్లా బంధువుల ఫిర్యాదు మేరకు ఈ కేసు నమోదు చేశామని శనివారం పోలీసులు వెల్లడించారు. 'లోక్‌సభ స్పీకర్ ఓం బిర్లా కుమార్తె అంజలి యూపీఎస్సీ పరీక్షకు హాజరవ్వకుండానే ఉత్తీర్ణురాలయ్యారు' అంటూ తప్పుడు సమాచారం పోస్టు చేసినట్లు వివరించారు. అయితే ఆ ఖాతా బయోలో 'ఇది ఫ్యాన్, పేరడీ ఖాతా'. అని ఉంది. ఈ విషయాన్ని పోలీసుల దృష్టికి తీసుకెళ్లగా.. దీన్ని పరిశీలిస్తామని తెలిపారు. ఈ నేపథ్యంలోనే అదే ఖాతా నుంచి.. 'సైబర్ క్రైం పోలీసుల సూచనల మేరకు అంజలిపై చేసిన పోస్టును తొలగించాను. వాస్తవం తెలుసుకోకుండా వేరొకరి ట్వీట్‌ను కాపీ చేసి పోస్టు చేసినందుకు క్షమాపణలు' అని తాజా పోస్టులో పేర్కొన్నారు.

ట్రెయినీ కలెక్టర్ పూజ తల్లిపై కేసు నమోదు

పుణె, జూలై 13: వివాదాస్పద ట్రెయినీ కలెక్టర్ పూజా ఖేద్కర్ తల్లి మనోరమ ఖేద్కర్‌పై కేసు నమోదైంది. మనోరమ ఖేద్కర్ ఓ రైతును తుపాకీ చూపిస్తూ బెదిరించిన వీడియో ఒకటి సోషల్ మీడియాలో తాజాగా వైరల్‌గా మారింది. ఆ వీడియో ఆధారంగా బాధితుడి ఫిర్యాదు మేరకు శుక్రవారం రాత్రి పుణెలోని పౌడ్ పోలీసులు కేసు నమోదు చేశారు. పూజ తండ్రి దిలీప్ ఖేద్కర్ ప్రభుత్వ అధికారిగా పనిచేస్తున్న సమయంలో ధాడ్‌వాలీ గ్రామంలో కొంత భూమిని కొన్నారు. అయితే దాని పక్కనున్న రైతుల భూవిని ఖేద్కర్ కుటుంబం ఆక్రమించేందుకు ప్రయత్నించిందనే ఆరోపణలున్నాయి. ఈ నేపథ్యంలోనే ఏడాది కింద మనోరమ బౌన్సర్లతో అక్కడికెళ్లి తుపాకీతో హల్‌చల్ చేస్తూ ఓ రైతును బెదిరించినట్లు సమాచారం. ఈ వ్యవహారంలో దిలీప్‌తో పాటు మరో ఐదుగురిపై కూడా ఎఫ్‌ఐఆర్ నమోదైంది.

యూపీ యువకుడిపై పాముల పగ.. 7 సార్లు కాట్లు

ఫతేపూర్, జూలై 13: ఉత్తరప్రదేశ్‌లోని ఫతేపూర్‌లో ఓ యువకుడిని పాములు ఏడుసార్లు కాటువేశాయి. వీటిలో ఆరుసార్లు శనివారం నాడే.. ఇదంతా నలభై రోజుల వ్యవధిలో జరిగింది. ప్రతిసారీ కోలుకున్న అతడు.. ఇటీవల తన కలలోకి పాము వచ్చిందని, మరో రెండుసార్లు కూడా కాటేస్తానని, తర్వాత మాత్రం ప్రాణాలు దక్కవని అది చెప్పిందని కుటుంబ సభ్యులకు తెలిపాడు. సౌరా గ్రామానికి చెందిన అతడి పేరు వికాస్ దూబే (24). మంచం దిగుతుండగా జూన్ 2న తొలిసారి ఇతడిని పాము కరిచింది. ఈ నెల 6వ తేదీ నాటికి ఆరుసార్లు కరిచాయి. తాజాగా మరోసారి బంధువు ఇంటి వద్ద కాటుకు గురయ్యాడు. ప్రతిసారీ ఘటనకు మూడు-నాలుగు గంటల ముందు తనకు పాము కరవబోతుందనే సంకేతాలు వస్తున్నట్లు దూబె చెప్పాడు. పదేపదే ఆస్పత్రి పాలవడంతో తన ఆర్థిక పరిస్థితి ఇబ్బందికరంగా మారిందని అధికారులకు మొరపెట్టుకున్నాడు. కాగా, దూబెను ఇన్నిసార్లు పాము కరవడంపై అధికారులు అనుమానాలు వ్యక్తం చేశారు. వాస్తవాలు తేల్చాలని ముగ్గురు వైద్యులతో కమిటీ వేశారు.

కశ్మీర్ లెఫ్టినెంట్ గవర్నర్‌కు మరిన్ని అధికారాలు

న్యూఢిల్లీ, శ్రీనగర్, జూలై 13: జమ్మూకశ్మీర్ లెఫ్టినెంట్ గవర్నర్(ఎల్‌జీ)కు కేంద్ర ప్రభుత్వం తాజాగా మరిన్ని అధికారాలను కట్టబెట్టింది. వివిధ కేసులలో విచారణకు అనుమతి ఇవ్వడం, ఐఏఎస్, ఐపీఎస్ వంటి అఖిల భారత సర్వీసు అధికారులు, పోలీసులపై నిర్ణయం తీసుకోవడంలో ఎల్‌జీకి విస్తృత అధికారాలు కల్పించింది. అలాగే, అవినీతి నిరోధక బ్యూరోకు సంబంధించిన విషయాలతోపాటు అడ్వకేట్ జనరల్, ఇతర న్యాయ అధికారుల నియామకాలకు కూడా ఎల్‌జీ ఆమోదం తప్పనిసరి చేసింది. అయితే, ఇది ప్రజాస్వామ్యాన్ని హత్య చేయడమేనని కాంగ్రెస్ విమర్శించింది. దీన్ని బట్టి జమ్మూకశ్మీర్‌కు పూర్తిస్థాయి రాష్ట్ర హోదా సమీప భవిష్యత్తులో రాదని అర్థమవుతోందని విమర్శించింది. ఈ నిర్ణయం జమ్మూకశ్మీర్ ప్రజలను నిర్వీర్యం చేస్తుందని నేషనల్ కాన్ఫరెన్స్, పీడీపీ తప్పుబట్టాయి.

ఉప ఎన్నికల్లో 'ఇండియా' హవా

13 స్థానాలకు 10 కైవసం.. బీజేపీ రెండింటికే పరిమితం.. పశ్చిమబెంగాల్‌లో నాలుగుకు నాలుగూ టీఎంసీకే

- బీజేపీ సృష్టించిన భయం, భ్రమలు పటాపంచలు: రాహుల్‌గాంధీ

న్యూఢిల్లీ, జూలై 13 (ఆంధ్రజ్యోతి): లోక్‌సభ ఎన్నికల తర్వాత తొలిసారిగా పలు రాష్ట్రాలలో జరిగిన ఉప ఎన్నికలలో ఇండియా కూటమి సత్తా చాటింది. 7 రాష్ట్రాలలోని 13 అసెంబ్లీ స్థానాలకు జరిగిన ఉప ఎన్నికలలో పది సీట్లను కూటమి గెలుచుకుంది. కాంగ్రెస్ 4, తృణమూల్ కాంగ్రెస్ 4, డీఎంకే, ఆప్ ఒక్కో స్థానాన్ని కైవసం చేసుకున్నాయి. బీజేపీ కేవలం రెండు సీట్లకు పరిమితం కాగా, మరొకటి స్వతంత్ర అభ్యర్థి గెల్చుకున్నారు. పశ్చిమ బెంగాల్ (4), హిమాచల్ ప్రదేశ్ (3), ఉత్తరాఖండ్ (2), పంజాబ్ (1), మధ్యప్రదేశ్ (1), బిహార్ (1), తమిళనాడు (1) రాష్ట్రాల్లో ఇటీవల జరిగిన ఉప ఎన్నికల ఫలితాలు శనివారం వెలువడ్డాయి. పశ్చిమబెంగాల్‌లో నాలుగు స్థానాలకు జరిగిన ఎన్నికల్లో తృణమూల్ కాంగ్రెస్ అభ్యర్థులు తమ సమీప ప్రత్యర్థులైన బీజేపీ అభ్యర్థులపై విజయం సాధించారు. హిమాచల్ ప్రదేశ్‌లో బీజేపీలో చేరిన ముగ్గురు స్వతంత్ర అభ్యర్థులు రాజీనామా చేయటంతో ఆ స్థానాలకు ఎన్నికలు జరిగాయి. రెండింటిని అధికారపక్షమైన కాంగ్రెస్ కైవసం చేసుకుంది. వీటిలో ఒకటైన డెహ్రా స్థానం నుంచి రాష్ట్ర ముఖ్యమంత్రి సుఖ్వీందర్‌సింగ్ సుఖు భార్య కమలేశ్ ఠాకూర్ గెలిచారు. తాజా ఫలితాలతో, 68 సీట్లున్న రాష్ట్ర అసెంబ్లీలో కాంగ్రెస్ బలం 40కి చేరుకుంది. దీంతో ప్రభుత్వం సుస్థిరంగా ఉంటుందని రాష్ట్ర కాంగ్రెస్ ఇంచార్జి రాజీవ్ శుక్లా పేర్కొన్నారు. ఇక బీజేపీ పాలిత ఉత్తరాఖండ్‌లో ఎన్నికలు జరిగిన రెండు స్థానాలనూ కాంగ్రెస్ గెల్చుకుంది. బీజేపీ హిమాచల్‌ప్రదేశ్, మధ్యప్రదేశ్‌లలో ఒక్కొక్కటి చొప్పున మొత్తమ్మీద రెండు స్థానాల్లో విజయం సాధించింది. తమిళనాడులో ఒక స్థానానికి జరిగిన ఉప ఎన్నికలో ఇండియా కూటమికి చెందిన డీఎంకే అభ్యర్థి.. ఎన్‌డీఏ కూటమికి చెందిన పీఎంకే అభ్యర్థిని ఓడించారు. కాగా, పంజాబ్‌లో పశ్చిమ జలంధర్ నుంచి గతంలో ఆమ్‌ఆద్మీపార్టీ (ఆప్) తరఫున గెలిచిన శీతల్ అంగురల్ మార్చి నెలలో రాజీనామా చేసి బీజేపీలో చేరారు. అక్కడ తాజాగా జరిగిన ఉప ఎన్నికల్లో శీతల్‌పై ఆప్ అభ్యర్థి మొహిందర్ భగత్ ఘన విజయం సాధించారు. ఉత్తరాఖండ్‌లో బద్రీనాథ్ నుంచి కాంగ్రెస్ తరఫున గెల్చిన అభ్యర్థి రాజీనామా చేసి, లోక్‌సభ ఎన్నికల సమయంలో బీజేపీలో చేరారు. ప్రస్తుతం జరిగిన ఎన్నికల్లో ఆ స్థానాన్ని కాంగ్రెస్ తిరిగి గెల్చుకుంది. బిహార్‌లో ఒక స్థానానికి జరిగిన ఎన్నికలో జేడీయూ అభ్యర్థిపై స్వతంత్ర అభ్యర్థి విజయం సాధించారు.



జలంధర్‌లో ఆప్ అభ్యర్థి భగత్ గెలుపుతో ఢిల్లీలో ఆ పార్టీ ఎంపీ సంజయ్ సింగ్ సంబరాలు

కేజ్రీ ప్రాణాలతో బీజేపీ చెలగాటం

కేజ్రీవాల్ ప్రాణాలతో బీజేపీ చెలగాటమాడుతోందని ఆప్ ఆరోపించింది. బీజేపీ నేతృత్వంలోని కేంద్ర ప్రభుత్వం కేజ్రీవాల్‌ను అనారోగ్యానికి గురిచేస్తూ బాధపెట్టేందుకు కుట్ర పన్నుతోందని ఆప్ ఎంపీ సంజయ్ సింగ్ అన్నారు. ఈ ఏడాది మార్చి 21న ఈడీ అరెస్టు చేసిన రోజు కేజ్రీవాల్ 70 కేజీల బరువున్నారని జైల్లో ఆయన ఆరోగ్యం క్షీణించి 8.5 కిలోల బరువు తగ్గారని తెలిపారు. ఆయన షుగర్ లెవల్స్ సాధారణ స్థాయి కంటే 5రెట్లు పడిపోయాయన్నారు.

ప్రజలు నియంతృత్వాన్ని రూపుమాపాలనుకుంటున్నారు: రాహుల్

ఉప ఎన్నికల ఫలితాలపై కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ ఎక్స్ వేదికగా స్పందించారు. బీజేపీ సృష్టించిన భయం, భ్రమలను ఎన్నికల ఫలితాలు పటాపంచలు చేశాయన్నారు. రైతులు, యువత, కూలీలు, వ్యాపారవేత్తలు, ఉద్యోగులు సహా దేశంలోని ప్రతీ వర్గం.. నియంతృత్వాన్ని రూపుమాపి న్యాయపాలనను నెలకొల్పాలని కోరుకుంటున్నారని తెలిపారు. తమ జీవితాలను మెరుగుపరుచుకోవడానికి, రాజ్యాంగాన్ని రక్షించుకోవడానికి ప్రజలు ఇండియా కూటమి పక్షాన ఉన్నారని రాహుల్ పేర్కొన్నారు. కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి జైరాం రమేశ్ స్పందిస్తూ.. దేశంలో మారుతున్న రాజకీయ వాతావరణానికి ఈ ఫలితాలు సంకేతమన్నారు. హిమాచల్ ప్రదేశ్, ఉత్తరాఖండ్‌లలో బీజేపీ చేసిన అన్ని కుట్రలనూ ఓటర్లు తిప్పికొట్టారని చెప్పారు.

కాంగ్రెస్ తప్పులు మనం చేయొద్దు



పణజీ, జూలై 13: బీజేపీలో భిన్నమైన నేత కేంద్ర మంత్రి నితిన్ గడ్కరీ. తనదైన శైలిలో గోవాకు చెందిన బీజేపీ నేతలను శనివారం ఆయన అప్రమత్తం చేశారు. "కాంగ్రెస్ చేసిన తప్పులను మనమూ చేస్తే బీజేపీ అధికారంలో ఉండి ప్రయోజనం ఏమీ ఉండదు" అని ఆయన తేల్చేశారు. ఇటీవల ముగిసిన సార్వత్రిక ఎన్నికల్లో బీజేపీ మెజారిటీని కోల్పోయి, మిత్రపక్షాలతో కలిసి ప్రభుత్వంలోకి రావాల్సిన పరిస్థితిపై ఆయన పరోక్షంగా ఈ వ్యాఖ్యలు చేశారని భావిస్తున్నారు. గోవా రాజధాని పణజీలో జరిగిన బీజేపీ కార్యవర్గ సభ్యులతో జరిగిన భేటీకి గడ్కరీ హాజరయ్యారు. "మిగతా పార్టీల కంటే బీజేపీ భిన్నంగా రాజకీయాల్లో కొనసాగుతోంది. అందువల్లే మనం వరుసగా గెలుస్తున్నాం. ఓటర్ల విశ్వాసాన్ని పొందగలుగుతున్నాం" అని గడ్కరీ వ్యాఖ్యానించారు. 'బీజేపీ భిన్నమైన రాజకీయ పార్టీ' అని అడ్వాణీ అనేవారంటూ ఆ పార్టీ కురువృద్ధనేతను ఆయన గుర్తుచేసుకున్నారు. రాజకీయాలు అనేవి సమాజంలో సామాజిక, ఆర్థిక సంస్కరణలను తీసుకురావడానికి ఒక సాధనమనే విషయం పార్టీ కార్యకర్తలు అవగాహనలో ఉంచుకోవాలన్నారు. మహారాష్ట్ర కులాల రాజకీయాల్లో చిక్కుకుపోయిందన్న ఆయన.. తాను ఆ రొంపిలో దిగదలుచుకోలేదన్నారు. 'కులాల గురించి మాట్లాడేవారి అధికారం కూలిపోతుంది' అని నేను బలంగా నమ్ముతాను" అని తెలిపారు.

అదిగో జగన్నాథుడి ఖజానా!

నేడు తెరుచుకోనున్న పూరీ ఆలయ రత్నభాండాగారం.. రహస్య గదిలోకి వెళ్లనున్న 16మంది సభ్యుల బృందం

- 46 సంవత్సరాల తర్వాత సంపద లెక్కింపునకు ఏర్పాట్లు



భువనేశ్వర్, జూలై 13: ఒడిశా రాష్ట్రం పూరీ శ్రీక్షేత్ర రత్నభాండాగారం నేడు తెరుచుకోనుంది. దాదాపు 46 సంవత్సరాల తర్వాత ఈ గదిలో భద్రపరిచిన విలువైన ఆభరణాలను, ఇతర వస్తువులను లెక్కించడానికి ఒడిశా ప్రభుత్వం అన్ని ఏర్పాట్లు చేసింది. చివరిసారిగా ఈ ఖజానాను 1978లో తెరిచి, అందులోని సంపదను లెక్కించారు. అప్పట్లో ఈ లెక్కింపు ప్రక్రియ 70 రోజుల పాటు కొనసాగింది. తాము అధికారంలోకి వస్తే భాండాగారాన్ని తెరిపిస్తామని ఇటీవల జరిగిన సార్వత్రిక ఎన్నికల సమయంలో బీజేపీ హామీ ఇచ్చింది. ఈ నేపథ్యంలోనే ఒడిశా హైకోర్టు విశ్రాంత న్యాయమూర్తి జస్టిస్ బిశ్వనాథ్ రథ్ అధ్యక్షతన 16 మంది సభ్యుల ఉన్నత స్థాయి కమిటీని నియమించింది. జూలై 14న భాండాగారాన్ని తెరవాలని ఈ కమిటీ ప్రభుత్వానికి సిఫారసు చేసింది. 14న ఉదయం కమిటీ సభ్యులంతా సంప్రదాయ వస్త్రధారణలో ఆలయంలోకి ప్రవేశించి తొలుత జగన్నాథ స్వామికి ప్రత్యేక పూజలు నిర్వహిస్తారు. అనంతరం ఖజానా ఉన్న గదిలోకి అధీకృత సిబ్బందితో పాటు పాములు పట్టే వ్యక్తి మొదటగా ప్రవేశిస్తారు. నాలుగు దశాబ్దాలకు పైగా మూసి ఉన్న గదిని తెరవనుండటంతో అందులో భారీ విష సర్పాలు ఉంటాయన్న ఆందోళన నెలకొంది. ఒకవేళ విషపురుగు కాటు వేసినా సత్వర చికిత్స కోసం వైద్య సిబ్బందిని కూడా అందుబాటులో ఉంచారు. భాండాగారంలోకి ప్రవేశించే కమిటీ సభ్యులందరూ గత వారం రోజులుగా శాకాహారం మాత్రమే భుజిస్తూ, పూర్తి నియమ నిష్టలు పాటిస్తున్నారు. ఖజానాలోని ఆభరణాల గుర్తింపు ప్రక్రియను స్వర్ణకారులతో పాటు వాతావరణ శాస్త్రవేత్తల బృందం పర్యవేక్షణలో చేపట్టనున్నట్లు జస్టిస్ రథ్ తెలిపారు. రహస్య గదులకు ఏఎస్ఐ మరమ్మతులు చేపట్టనుండటంతో అక్కడే లెక్కింపు సాధ్యం కాదని, అందులోని సంపదను ఆలయంలోనే మరో సురక్షితమైన ప్రాంతానికి తరలించి పటిష్ఠ భద్రత ఏర్పాట్ల నడుమ లెక్కిస్తామని వివరించారు. ఈ మొత్తం ప్రక్రియను వీడియో రూపంలో భద్రపర్చనున్నట్లు పేర్కొన్నారు. ఈ సమయంలో భక్తులకు దర్శనాలకు ఇబ్బందులు లేకుండా జాగ్రత్తలు తీసుకుంటామన్నారు.

రత్నభాండాగారం విశేషాలివీ...

- జగన్నాథుడి ఆలయంలోని జగమోహన సమీపంలో రత్నభాండాగారం ఒక చిన్న ఆలయం తరహాలో ఉంటుంది. దీని ఎత్తు 11.78 మీటర్లు. ఇందులో దేవతా మూర్తుల ఆభరణాలను భద్రపరిచేందుకు బహరా భాండార్ (బాహ్య గది), భితరా భండార్ (లోపలి గది) అనే రెండు గదులు ఉంటాయి. బయటి గది కంటే లోపలి గది బాగా విశాలంగా ఉంటుంది. స్వామివారి నిత్య పూజల్లో ఉపయోగించే ఆభరణాలు బయటి గదిలో ఉంటాయి.
- గత కొన్ని శతాబ్దాలుగా ఒడిశాను పాలించిన అనేక రాజవంశాలకు చెందిన రాజులతో పాటు నేపాల్ పాలకులు సైతం ఇక్కడి స్వామికి 'అరుదైన వాటిలో అత్యంత అరుదైన' బంగారు, వెండి, వజ్రాలు వంటి విలువైన సంపదను విరాళంగా ఇచ్చారు. యుద్ధాల్లో గెలుచుకున్న అంతులేని ధనరాశులను స్వామికి కానుకలుగా సమర్పించారు. వీటిని లోపలి గదిలో భద్రపరిచారు.
- 2018లో 16మంది సభ్యుల బృందం రహస్య గది తలుపులు తెరిచేందుకు వెళ్లింది. అయితే అప్పట్లో భాండాగారం తాళం చెవి అందుబాటులో లేకపోవడంతో వారు లోపలకు ప్రవేశించడం సాధ్యపడలేదు. కేవలం ఫ్లాష్ లైట్ల వెలుగులో కిటికీ ద్వారా గది లోపలి భాగాన్ని పరిశీలించి వెనుదిరిగారు.

రహస్య గదిలో ఏముందంటే

- జగన్నాథ స్వామికి చెందిన వజ్ర వైడూర్యాలు, స్వర్ణాభరణాలు, వెండి వస్తువులను 15 చెక్క పెట్టెల్లో భద్రపరిచారు. ఒక్కో పెట్టె 9 అడుగుల పొడవు, 3 అడుగుల ఎత్తు ఉంటుంది.
- 1805లో అప్పటి పూరీ కలెక్టర్ చార్లెస్ గ్రోమ్ రూపొందించిన నివేదికలో రత్నభాండాగారపు అధికారిక సమాచారం మొదటిసారిగా బహిర్గతమైంది. రత్నాలు, మేలిమి బంగారం, వెండితో కూడిన 64 ఆభరణాలతో పాటు 128 బంగారు నాణేలు,1,297 వెండి నాణేలు, 106 రాగి నాణేలు ఉన్నాయని ఆ నివేదికలో పేర్కొన్నారు.
- 1950 తర్వాత శ్రీ జగన్నాథ ఆలయ పరిపాలన చట్టం అమలులోకి వచ్చినప్పుడు రూపొందించిన రికార్డు ఆఫ్ రైట్స్ ప్రకారం.. బయటి గదిలో 150 బంగారు ఆభరణాలు, లోపలి గదిలో 180 రకాల ఆభరణాలు, 146 వెండి వస్తువులున్నాయి.
- 1978లో చివరిసారిగా రూపొందించిన జాబితా ప్రకారం రత్నభాండాగారంలోని రెండు గదుల్లో విలువైన రాళ్లు పొదిగిన 128.380 కిలోల బరువైన 454 బంగారు ఆభరణాలు, 221.530 కిలోల వెండి వస్తువులు ఉన్నాయి. ఆ తర్వాత 1982, 1985లలో రెండుసార్లు లోపలి గదిని తెరిచినా ఆభరణాల ఆడిట్ నిర్వహించలేదు.





అనంత్ అంబానీ-రాధిక వివాహ వేడుకల్లో ద్వారకా పీఠం శంకరాచార్యులు సదానంద, జ్యోతిర్మఠ్ పీఠం శంకరాచార్యులు అవిముక్తేశ్వరానంద

అనంత్-రాధిక జంటకు మోదీ ఆశీర్వాదం

అంబానీల వివాహ వేడుకకు హాజరైన ప్రధాని.. శిందే, అఖిలేశ్ కూడా

ముంబై, జూలై 13: ముకేశ్ అంబానీ ఇంట జరుగుతున్న కళ్యాణమహోత్సవం అంగరంగ వైభవంగా కొనసాగుతోంది. వివాహ వేడుకల్లో భాగంగా 'శుభ్‌ఆశీర్వాద్' పేరిట శనివారం ప్రత్యేక కార్యక్రమాన్ని నిర్వహించారు. ముంబైలోని జియో వరల్డ్ కన్వెన్షన్ సెంటర్‌లో జరిగిన వేడుకకు ప్రధాని నరేంద్ర మోదీ స్వయంగా హాజరయ్యారు. నూతన వధూవరులు అనంత్ అంబానీ, రాధిక మర్చంట్‌ను ఆశీర్వదించారు. మహారాష్ట్ర సీఎం ఏక్‌నాథ్ షిండే, డిప్యూటీ సీఎంలు దేవేంద్ర ఫడణవీస్, అజిత్ పవార్, సమాజ్‌వాదీ పార్టీ అధ్యక్షుడు అఖిలేష్ యాదవ్ తదితర ప్రముఖులు శనివారం జరిగిన వేడుకలకు హాజరై నూతన వధూవరులకు శుభాకాంక్షలు తెలియజేశారు. వీరితోపాటు దేశ విదేశాలకు చెందిన పారిశ్రామికవేత్తలు, సినీ ప్రముఖులు, క్రికెటర్లు ఈ వేడుకల్లో పాల్గొన్నారు. అనంత్-రాధిక వివాహ రిసెప్షన్ ఆదివారం జరగనుంది.

ఆర్‌బీఐ నివేదికతో ప్రతిపక్షాల నోటికి తాళం

ఉద్యోగాల కల్పనపై ఆర్‌బీఐ ఇటీవల విడుదల చేసిన నివేదిక నిరుద్యోగం పేరిట అవాస్తవాలను ప్రచారం చేస్తున్న ప్రతిపక్షాల నోటికి తాళం వేసిందని ప్రధాని మోదీ అన్నారు. ముంబైలో చేపట్టిన రూ.29,400 కోట్ల విలువైన వివిధ అభివృద్ధి పనులకు ప్రధాని మోదీ శనివారం శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఆర్‌బీఐ నివేదిక ప్రకారం గత నాలుగేళ్లలో దేశంలో దాదాపు 8 కోట్ల కొత్త ఉద్యోగాల కల్పన జరిగిందన్నారు. ఈ గణాంకాలు ప్రతిపక్షాల నోటికి తాళం వేశాయని, దేశాభివృద్ధిని వ్యతిరేకిస్తున్న వారిని ప్రజలు ముందు నిలబెట్టాయని మోదీ అన్నారు. అలాగే, ముంబైలోని అటల్ సేతు వంతెన విషయంలో ప్రతిపక్షాలు అవాస్తవాలు ప్రచారం చేస్తున్నాయని మోదీ మండిపడ్డారు. అటల్ సేతు వంతెనపై ప్రతి రోజు 20 వేల వాహనాలు ప్రయాణిస్తున్నాయని, ప్రతి రోజు పెద్ద ఎత్తున ఇంధన ఆదా జరుగుతోందని వివరించారు.



'బుక్ బ్రహ్మ సాహిత్య ఉత్సవ్' పోస్టర్లు విడుదల

బెంగళూరు, జూలై 13 (ఆంధ్రజ్యోతి): దేశంలోనే అతిపెద్ద భారతీయ భాషా సాహిత్య ఉత్సవాన్ని 'బుక్ బ్రహ్మ సాహిత్య ఉత్సవ్ 2024' పేరిట ఆగస్టులో బెంగళూరులో నిర్వహించనున్నారు. ఉత్సవ్‌లో తెలుగు, కన్నడ, మళయాళం, తమిళం, ఇంగ్లీషు భాషలకు సంబంధించి 300 మందికిపైగా సాహితీవేత్తలు భాగస్వాములు అవుతారు. 80కు పైగా చర్చాగోష్ఠులు జరగనున్నాయని సీనియర్ సాహితీ పరిశోధకుడు నాడోజా హంపా నాగరాజయ్య వెల్లడించారు. బెంగళూరు ప్రెస్‌క్లబ్‌లో శనివారం బుక్ బ్రహ్మ సాహిత్య ఉత్సవ్ 2024కు సంబంధించి ప్రత్యేక పోస్టర్‌ను విడుదల చేశారు. సాహితీవేత్తలు, పరిశోధకులు డాక్టర్ మల్లేపురం జి. వెంకటేశ్, డాక్టర్ నడహళ్లి బాలసుబ్రహ్మణ్యం, సాహిత్య ఉత్సవ్ డైరెక్టర్, రచయిత సతీశ్ చప్పరికె పోస్టర్‌ను విడుదల చేశారు. నగరంలోని కోరమంగల ప్రాంతం సెయింట్ జాన్ ఆడిటోరియంలో ఆగస్టు 9 నుంచి మూడు రోజులపాటు సాహిత్య ఉత్సవ్ జరగనుంది. డాక్టర్ నడహళ్లి బాలసుబ్రహ్మణ్యం మాట్లాడుతూ ప్రపంచ సాహిత్యానికి కన్నడ, తెలుగు, తమిళ, మళయాళం భాషల సేవలు అపారమైనవని అన్నారు. చారిత్రాత్మకంగా మహత్తరమైన నాలుగు భాషలను ఒకే వేదికకు తీసుకొచ్చి పరస్పరం చర్చాగోష్ఠులు జరపడం ఈ ఉత్సవం ఉద్దేశ్యమని పేర్కొన్నారు.

720 కోట్ల విరాళాలు వెనక్కి!

ఎన్నికల వేళ బైడెన్‌కు భారీ దెబ్బ

- మద్దతుదారుల విశ్వసనీయత కోల్పోతున్న అమెరికా అధ్యక్షుడు
- జో వ్యతిరేకుల వెనుక ఒబామా?



వాషింగ్టన్, జూలై 13: అమెరికా అధ్యక్ష ఎన్నికలు సమీపిస్తున్న వేళ జో బైడెన్ తన మద్దతుదారుల విశ్వసనీయతను కోల్పోతున్నారు. సుమారు రూ.720 కోట్ల(90 మిలియన్ డాలర్లు) మేరకు ఎన్నికల విరాళాలు ఇస్తామని ముందుకు వచ్చిన దాతలు తాజాగా వెనక్కి తగ్గారు. ఎన్నికల వేళ ఈ పరిణామం బైడెన్‌కు భారీ దెబ్బేనని అంటున్నారు పరిశీలకులు. బైడెన్‌కు బలమైన మద్దతుదారుగా ఉన్న 'ఫ్యూచర్ ఫార్వర్డ్' సైతం వెనక్కి తగ్గినట్టు చెప్పారు. 250 మిలియన్ డాలర్ల ప్రకటన ఖర్చును భరించేందుకు సిద్ధమని ఈ సంస్థ సభ్యులు గతంలో వెల్లడించారు. కానీ, ఇప్పుడు వీరు కూడా రద్దు చేసుకున్నారు. మరోవైపు.. సొంతపార్టీ డెమొక్రాటిక్ ఎంపీల్లో 18 మంది సైతం బైడెన్ అభ్యర్థిత్వాన్ని వ్యతిరేకిస్తున్నారు. నవంబరు 5న జరగనున్న అధ్యక్ష ఎన్నికల రేసు నుంచి ఆయన తప్పుకోవాల్సిందేనని వారు పట్టుబడుతున్నారు. ఇలాంటి సమయంలో నిధుల రాకకూడా ఆగిపోవడంతో బైడెన్‌పై మరింత ఒత్తిడి పెరుగుతోంది. అయినప్పటికీ ఆయన మాత్రం ట్రంప్‌ను ఓడించి తీరుతానని ప్రకటనలు గుప్పిస్తున్నారు.

ఒబామా నుంచీ ఒత్తిడి?

ప్రస్తుత అధ్యక్ష ఎన్నికల్లో పోటీ నుంచి జో బైడెన్‌ను తప్పుకోవాలంటూ మాజీ అధ్యక్షుడు ఒబామా ఒత్తిడి చేస్తున్నట్టు సమాచారం. ట్రంప్‌ను ఓడించడం బైడెన్‌కు సాధ్యం కాదని ఆయన భావిస్తున్నట్టు తెలుస్తోంది. పోటీ నుంచి బైడెన్ తప్పుకోవాలని కోరుతున్న వారి వెనుక ఒబామా ఉన్నారని బైడెన్ ప్రచార బృందం కూడా సందేహిస్తోంది. సీఎన్ఎన్ మీడియా కథనం ప్రకారం ఒబామాతోపాటు మాజీ స్పీకర్ నాన్సీ పెలోసీ సైతం బైడెన్ తీరుపై విచారం వ్యక్తం చేస్తున్నట్టు తెలిసింది.

ఇమ్రాన్ ఖాన్ దంపతులకు ఊరట

'నిబంధనలకు విరుద్ధంగా పెళ్లి' కేసులో నిర్దోషులుగా తీర్పు

ఇస్లామాబాద్, జూలై 13 : పాకిస్థాన్ మాజీ ప్రధాని ఇమ్రాన్ ఖాన్ దంపతులకు న్యాయస్థానంలో శనివారం ఊరట లభించింది, ఇస్లాం నిబంధనలకు విరుద్ధంగా పెళ్లి చేసుకున్నారంటూ వారిపై ఉన్న అభియోగాలను ఇస్లామాబాద్ డిస్ట్రిక్ట్ సెషన్స్ కోర్టు శనివారం తోసిపుచ్చింది. ఇమ్రాన్ ఖాన్, ఆయన భార్య బుష్రా బీబీని నిర్దోషులుగా ప్రకటించింది. అలాగే, ఈ కేసులో దిగువ కోర్టు వారికి విధించిన ఏడేళ్ల జైలు శిక్షను రద్దు చేసింది. ఇమ్రాన్-బుష్రా ఇస్లాం నిబంధనలకు విరుద్ధంగా వివాహం చేసుకున్నారంటూ బుష్రా మాజీ భర్త ఫరీద్ ఈ కేసు వేయగా దిగువ కోర్టు వారికి జైలు శిక్ష విధించింది. ఈ తీర్పును సవాలు చేస్తూ ఇమ్రాన్ దంపతులు ఇస్లామాబాద్ న్యాయస్థానాన్ని ఆశ్రయించారు. కాగా, ఈ కేసులో ఇమ్రాన్ నిర్దోషి అని తేలినా ఆయన జైలు నుంచి విడుదలయ్యే అవకాశం కనిపించడం లేదు. అల్లర్లకు సంబంధించి మరో మూడు కేసుల్లో ఇమ్రాన్‌ను అరెస్టు చేసేందుకు లాహోర్ కోర్టు శనివారమే అనుమతినిచ్చింది.

ఎమ్మెల్యే ప్రేమ్‌సాగర్‌రావు బెదిరిస్తున్నారు

» ప్లాట్లు అమ్మాలని ఒత్తిడి... 'కృష్ణా నగర్' ప్లాట్ ఓనర్స్ సొసైటీ నేతల ఆరోపణ

» సీఎం స్పందించి న్యాయం చేయాలంటూ ఇందిరాపార్కు వద్ద ధర్నా


ధర్నా చేస్తున్న కృష్ణానగర్ ప్లాట్ ఓనర్స్ వెల్ఫేర్ సొసైటీ ప్రతినిధులు

కవాడిగూడ, జూలై 13 (ఆంధ్రజ్యోతి): తక్కువ ధరకే ప్లాట్లు అమ్మాలంటూ మంచిర్యాల ఎమ్మెల్యే కొక్కిరాల ప్రేమ్‌సాగర్‌రావు తమను బెదిరిస్తున్నారని కాప్రా మునిసిపాలిటీలోని కృష్ణానగర్ ప్లాట్ ఓనర్స్ వెల్ఫేర్ సొసైటీ ప్రతినిధులు ఆరోపించారు. "నేను ఎమ్మెల్యేను... కాబోయే మంత్రిని. నా వెనకాల సీఎం రేవంత్‌రెడ్డి, డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క ఉన్నారు. నాకు ప్లాట్లు అమ్మకపోతే తీవ్ర పరిణామాలు ఎదుర్కోవాల్సి ఉంటుందని హెచ్చరిస్తున్నారు" అని తెలిపారు. ఈ విషయంలో సీఎం రేవంత్ రెడ్డి జోక్యం చేసుకుని తమకు న్యాయం చేయాలని విజ్ఞప్తి చేశారు. ఈ మేరకు శనివారం ఇందిరాపార్కు వద్ద కృష్ణానగర్ ప్లాట్ ఓనర్స్ వెల్ఫేర్ సొసైటీ సభ్యులతోపాటు బాధితులు ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా సొసైటీ అధ్యక్షుడు వెంకటేశ్వర్లు, ప్రధాన కార్యదర్శి జీబీ రెడ్డి, ఉపాధ్యక్షుడు సత్యనారాయణ మీడియాతో మాట్లాడారు. కాప్రా మునిసిపాలిటీ పరిధిలోని వంపూగూడలో ఉన్న 639/1, 643/1 644/1 , 647/1, 648, 654 సర్వే నెంబర్లలో మొత్తం 706 ప్లాట్లను 1983లో తాము కొనుగోలు చేశామన్నారు. 2000 సంవత్సరంలో కొక్కిరాల ప్రేమ్‌సాగర్ రావు తమ సొసైటీలో ఉన్న కొందరు స్థల యజమానులను బెదిరించి 150ప్లాట్లను కొనుగోలు చేశారని తెలిపారు. తాజాగా ఇప్పుడు మార్కెట్ ధరతో సంబంధం లేకుండా తాను చెప్పిన ధరకే ప్లాట్లు విక్రయించాలంటూ దౌర్జన్యాలకు పాల్పడుతున్నారని ఆరోపించారు. రెవెన్యూ అధికారులు, పోలీసులను గుప్పెట్లో పెట్టుకొని నిర్మాణాలు చేపట్టకుండా అడ్డుకుంటున్నారని విమర్శించారు. సీఎం రేవంత్‌రెడ్డి స్పందించి ప్రేమ్‌సాగర్‌రావు బారి నుంచి తమను రక్షించాలని కోరారు.

అడవిలో కంటైనర్ ఆస్పత్రి



కంటైనర్ ఆస్పత్రిలో ఏఎన్ఎంకు బాధ్యతలు అప్పగిస్తున్న మంత్రి సీతక్క... కంటైనర్ ఆస్పత్రి

» ములుగు జిల్లా పోచాపూర్‌లో ఏర్పాటు

» రాష్ట్రంలోనే తొలి.. మంత్రి సీతక్క చొరవ

» వ్యాధుల సీజన్‌లో అడవి బిడ్డలకు అండ

ములుగు, జూలై 13: కడుపు నొప్పి వచ్చినా.. పురుటి నొప్పులు మొదలైనా.. అక్కడివారి బాధలు అరణ్య రోదనే..! విష సర్పం కాటువేసినా.. విష జర్వం బారినపడినా.. ప్రాణాలు అరచేతిలో పెట్టుకుని బతకాల్సిందే..! వైద్యం మాట దేవుడెరుగు.. మందు బిళ్లలూ అందనంత దైన్యం..! దట్టమైన అడవిలో.. విసిరేసినట్లుండే ఆ ఆదివాసీలకు ఆధునిక ప్రపంచమే కాదు.. ఆధునిక చికిత్సలూ దూరమే..! జోరు వానలో.. ఉప్పొంగే వాగులో నిండు గర్భిణులను, ఆరోగ్య విషమించిన వారిని తరలించిన ఉదంతాలెన్నో..! ఇలా ఇన్నాళ్లు, రోగమొస్తే దేవుడి మీద భారం వేస్తున్న వీరికి.. ఇకపై మాత్రం కళ్లెదుటే 'కంటైనర్ ఆస్పత్రిలో' వైద్యుడు కనిపించనున్నాడు..! ములుగు జిల్లా తాడ్వాయి మండలం బందాల పంచాయతీ పరిధిలోని బొల్లెపల్లి, అల్లిగూడెం, నర్సాపూర్, పోచాపూర్‌లు పూర్తి ఆదివాసీ గ్రామాలు. ఒక్కోటి రెండు, మూడు కిలోమీటర్ల దూరంలో ఉంటాయి. 600 పైగా గడపలు, వెయ్యిలోపు జనాభా ఉన్నారు. ప్రజలంతా వ్యవసాయం, అటవీ ఉత్పత్తుల సేకరణతో జీవనం సాగిస్తున్నారు. ఈ గూడేలకు ఎడ్ల బండి లేదా ద్విచక్ర వాహనాలపై మాత్రమే వెళ్లగలం. కార్లు అయితే అతికష్టమ్మీద వెళ్తాయి. వర్షాకాలంలో దారంతా బురదమయమై, మధ్యమధ్యలో వాగులు, ఒర్రెలు ఉప్పొంగితే రాకపోకలు పూర్తిగా నిలిచిపోతాయి. ఈ సమయంలో డయేరియా, మలేరియా, డెంగ్యూ ప్రబలితే 12 కిలోమీటర్ల దూరంలోని కొడిశాల పీహెచ్‌సీనే దిక్కు. కానీ, వాగుల ఉధృతిలో కాలు బయటపెట్టేందుకు అవకాశమే ఉండదు. దీంతో ఏటా పలువురు ప్రాణాలు కోల్పోతున్నారు. ఈ క్రమంలో స్త్రీ శిశు సంక్షేమ శాఖ మంత్రి, ములుగు ఎమ్మెల్యే సీతక్క చొరవ చూపి పోచాపూర్‌లో రాష్ట్రంలోనే తొలిసారిగా కంటైనర్ ఆస్పత్రిని ఏర్పాటు చేశారు. శనివారం దీనిని సీతక్క.. జిల్లా కలెక్టర్ దివాకర, ఎస్పీ శబరీశ్, డీఎంహెచ్‌వో అప్పయ్యతో కలిసి ప్రారంభించారు.

వైద్యుడు, మందులు అందుబాటు

కలెక్టర్ పర్యవేక్షణలో రూ.7 లక్షల వ్యయంతో కంటైనర్ ఆస్పత్రిని ప్రత్యేకంగా తయారు చేశారు. ఇందులో నాలుగు పడకలు, అనుబంధంగా మరుగుదొడ్డి ఉంటాయి. ఏఎన్ఎం, ల్యాబ్ టెక్నీషియన్, ఆశా కార్యకర్తలను నియమించారు. కొడిశాల పీహెచ్‌సీ వైద్యాధికారికి పర్యవేక్షణ బాధ్యతలను అప్పగించారు. భారీ వర్షాలు, వరదలతో వైద్యుడు వెళ్లలేని పరిస్థితుల్లో.. ఆదివాసీలకు వ్యాధి నిర్ధారణ చేసి చికిత్స అందించేలా సిబ్బందికి ప్రత్యేక శిక్షణ ఇచ్చారు. కావాల్సిన ఔషధాలను అందుబాటులోకి తెచ్చారు. మరోవైపు నిండు గర్భిణులను గుర్తించి ముందస్తుగా పీహెచ్‌సీకి తరలించేలా ప్రణాళిక రూపొందించారు. సాధారణ ప్రసవాన్ని చేసేలా సిబ్బంది సంసిద్ధంగా ఉన్నారు. కాగా, తాడ్వాయి, ఏటూరు నాగారం, మంగపేట, కన్నాయిగూడెం, గోవిందరావుపేట మండలాల్లో కూడా పలు మారుమూల గిరిజన గూడేలున్నాయి. వాటిలోనూ కంటైనర్ ఆస్పత్రులను ఏర్పాటుచేస్తే బాగుంటుందనే అభిప్రాయం వ్యక్తమవుతోంది.


కంటైనర్ ఆస్పత్రిలో ఏర్పాటు చేసిన బెడ్లు



కుప్పకూలిన హాస్టల్ స్లాబ్ పెచ్చులు

» కేయూ విద్యార్థినుల వసతి గృహంలో దారుణం

» పరిశీలించిన రిజిస్ట్రార్.. అదే గదిలో దిగ్బంధం

» వెంటనే కొత్త హాస్టల్‌కు విద్యార్థినుల తరలింపు

కేయూ క్యాంపస్, జూలై 13 : వరంగల్ కాకతీయ యూనివర్సిటీలోని పోతన హాస్టల్‌లో మరో దారుణం జరిగింది. జూన్ 28న ఇదే హాస్టల్‌లో ఓ విద్యార్థిని తలపై సీలింగ్ ఫ్యాన్ పడి తీవ్ర గాయమైన ఘటనను మరువక ముందే.. శుక్రవారం రాత్రి హాస్టల్ మూడో అంతస్థులోని రూం నం.94లో శ్లాబ్ పెచ్చులు ఊడి పడ్డాయి. దీంతో విద్యార్థినులు భయాందోళనకు గురయ్యారు. అయితే, ఆ సమయంలో గదిలో ఉన్న వారంతా మరో పక్కన కూర్చోవడంతో పెను ప్రమాదం తప్పింది. విషయం తెలుసుకుని హాస్టల్‌ను పరిశీలించేందుకు వచ్చిన రిజిస్ట్రార్ మల్లారెడ్డి, హాస్టల్ డైరెక్టర్ రాజ్‌కుమార్‌ను విద్యార్థులు పెచ్చులూడిన గదిలో దిగ్బంధించారు. తమకు హాస్టల్‌లో ప్రాణ భయం ఉందని, తాము అక్కడ ఉండలేమని వాగ్వాదానికి దిగారు. శనివారం తెల్లవారుఝామున విద్యార్థినులకు మద్దతుగా విద్యార్థి సంఘాల నేతలు ఆందోళన చేపట్టారు. దాంతో దిగొచ్చిన అధికారులు క్యాంపస్‌లోని శ్రీ సమ్మక్క-సారలమ్మ హాస్టల్‌కు విద్యార్థినులను పంపించేందుకు అంగీకరించారు. పోతన హాస్టల్‌లోని విద్యార్థినుల బెడ్లు, ఇతర సామగ్రిని కొత్త హాస్టల్‌కు తరలించారు. అయితే నూతన హాస్టల్‌లో వాచ్‌రూంలు, ఇతర సదుపాయాలు సక్రమంగా లేవని విద్యార్థులు అధికారులతో గొడవకు దిగారు. దాంతో హుటాహుటిన ఫెన్సింగ్‌తో పాటు సీసీ కెమెరాలను ఏర్పాటు చేయించారు.

ఆంధ్రజ్యోతి
▲ తమసోమా జ్యోతిర్గమయ

■ ఆర్కే RK



కొత్తపలుకు

ఏం చేద్దాం.. ఒకరినొకరు ఓదార్చుకోండి!

"చంద్రబాబు నాయుడులో మార్పు ఆశించడం వేస్ట్.. పేరుకే కూటమి ప్రభుత్వం గానీ వైసీపీ–2 ప్రభుత్వం ఉన్నట్టుగానే ఉంది" –సోషల్ మీడియాలో తెలుగు తమ్ముళ్లు పుంఖానుపుంఖాలుగా పెడుతున్న పోస్టులు, వ్యాఖ్యల సారాంశం ఇది. ఆంధ్రప్రదేశ్‌లో ప్రభుత్వం మారి చంద్రబాబు నేతృత్వంలో నూతన ప్రభుత్వం ఏర్పడి నెల రోజులు మాత్రమే అయింది. అయినా తెలుగు తమ్ముళ్లు ఆవేశపడిపోతున్నారు. చంద్రబాబులో ఏమి మార్పు ఆశిస్తున్నారో తెలియదు. అధికారుల పోస్టింగుల నుంచి ప్రతి చిన్న విషయానికీ సోషల్ మీడియా వేదికగా పోస్టులు పెడుతున్నారు. గత జగన్మోహన్‌రెడ్డి ప్రభుత్వంలో జరిగిన అరాచకాలకు తక్షణ శిక్షలు వేయాలని, అప్పట్లో ప్రభుత్వానికి సహకరించిన అధికారులు అందరినీ పక్కన పడేయాలని వారు కోరుకుంటున్నారు. ఈ నెల రోజులుగా తెలుగు తమ్ముళ్లు వ్యక్తంచేస్తున్న అభిప్రాయాలు ముఖ్యమంత్రి చంద్రబాబుకు తలనొప్పిగా మారాయి. ప్రజాస్వామ్యంలో ప్రభుత్వ వ్యవహారాలకు కొన్ని మార్గదర్శకాలు ఉంటాయి. అయితే


జగన్‌రెడ్డి లేదా చంద్రబాబుకు సేవ చేసి తరించడానికే ఆయా అధికారులు అఖిల భారత సర్వీసుకు ఎంపిక కాలేదు కదా! చట్టాలు, నిబంధనలకు అనుగుణంగా ప్రజలకు సేవ చేయడమే అధికారుల బాధ్యత. ముఖ్యమంత్రుల కళ్లలో ఆనందం చూడటం కోసం కాకుండా రాజ్యాంగానికి కట్టుబడి పనిచేయాలి. చంద్రబాబు, జగన్ మధ్య రాజకీయ వైరం ఉంటే వాళ్లిద్దరూ తేల్చుకుంటారు. వారికోసం అధికారులు కిరాయి సైనికులుగా మారడం సమర్థనీయం కాదు కదా! అధికారులు ఇంతగా చెడిపోవడమే ప్రస్తుత ముఖ్యమంత్రి చంద్రబాబుకు సమస్యగా మారింది. కీలక పోస్టుల భర్తీకి ఒకటికి రెండుసార్లు ఆలోచించవలసి వస్తోంది. ప్రభుత్వం మారినంత మాత్రాన అధికారులు కొత్తగా పుట్టుకు రారు. కనుక పూర్తిగా చెడిపోయిన అధికారులను వదిలేసి మిగతావాళ్లకు ప్రభుత్వ ప్రాధాన్యాలను వివరించి వారితోనే పనిచేయించుకోవాలి. ఈ విషయంలో తెలుగు తమ్ముళ్లు ఆవేశాన్ని తగ్గించుకోవాలి.

జగన్‌రెడ్డి హయాంలో ఈ మార్గదర్శకాలు అన్నింటినీ తుంగలో తొక్కి, పగ, ప్రతీకారాలకు అధిక ప్రాధాన్యం ఇవ్వడంతో అప్పుడు బాధితులుగా ఇబ్బందులు పడినవారందరూ ఇప్పుడు చంద్రబాబు ప్రభుత్వం కూడా అదే బాటలో నడవాలని కోరుకుంటున్నారు. జగన్‌రెడ్డి ప్రభుత్వంలో జరిగిన దురాగతాలలో భాగస్వాములైన అధికారులు అందరినీ శిక్షించాలని వారు కోరుకుంటున్నారు. నిజానికి కూటమి ప్రభుత్వం ఏర్పడి నెల రోజులు అవుతున్నప్పటికీ ప్రభుత్వం ఇంకా కుదురుకోలేదు. ఇందుకు అనేక కారణాలు ఉన్నాయి. జగన్‌రెడ్డి వ్యవహార శైలి కారణంగా వ్యవస్థలన్నీ కుప్పకూలిపోయాయి. మరకలు అంటని అధికారులను గుర్తించడం కష్టంగా మారింది. ఈ కారణంగా అధికారుల నియామకాలలో ముఖ్యమంత్రి ఆచితూచి వ్యవహరిస్తున్నారు. అయినప్పటికీ జగన్ హయాంలో తొత్తుగా వ్యవహరించిన ఫలానా అధికారిని ఎందుకు నియమించారు? అంటూ నిట్టూర్పులు వెలువరిస్తున్నారు. పోలీసు శాఖలో కీలక పదవుల భర్తీకి అనువైన అధికారుల కోసం వెదుక్కోవలసి వచ్చింది. ప్రభుత్వ శాఖల కార్యదర్శుల నియామకం ఇంకా పూర్తికాలేదు. శాఖాధిపతులుగా ఎవరిని నియమించాలో తెలియని పరిస్థితి. జిల్లా కలెక్టర్ల నియామకం కొంతవరకు పూర్తిచేసిన ప్రభుత్వం జిల్లా ఎస్పీల నియామకాన్ని ఈ శనివారం మాత్రమే చేపట్టగలిగింది. వాస్తవానికి కార్యదర్శులు, శాఖాధిపతులు, కలెక్టర్లు, ఎస్పీల నియామకం పూర్తి అయితే గానీ కింది స్థాయి అధికారుల బదిలీ గురించి ఆలోచించే పరిస్థితి ఉండదు. అయితే తెలుగు తమ్ముళ్లు మాత్రం సహనం కోల్పోతున్నారు. "మా దగ్గర ఫలానా పోలీసు అధికారే, ఫలానా రెవెన్యూ అధికారే కొనసాగుతున్నారు. ఇలా అయితే ప్రభుత్వం మారాలని ఒళ్లూ ఇళ్లూ హూనం చేసుకోవడం ఎందుకూ?" అని వ్యాఖ్యలు చేస్తున్నారు. ఈ ధోరణి ఎంత ప్రమాదకరంగా మారిందంటే, స్వేచ్ఛగా నిర్ణయాలు తీసుకోవలసిన ముఖ్యమంత్రి చంద్రబాబు వెనుకంజ వేయాల్సి వస్తోంది. ప్రభుత్వాలు మారినప్పుడు అప్పటిదాకా హడావిడి చేసిన అధికార పార్టీ నాయకులు, కార్యకర్తలు తెరమరుగై కొత్తగా అధికారంలోకి వచ్చిన పార్టీకి చెందిన నాయకులు, కార్యకర్తలు హల్‌చల్ చేయడం సర్వసాధారణం. ప్రభుత్వ యంత్రాంగంలో ఇలా చేయడం సాధ్యం కాదు. ఏ ప్రభుత్వమైనా అదే అధికారులు, సిబ్బందితో పనిచేయించుకోవాల్సి ఉంటుంది. అయితే తెలుగు తమ్ముళ్లు ఇప్పుడే ఎందుకు ఇంత అసహనానికి గురవుతున్నారంటే కారణం లేకపోలేదు. జగన్‌రెడ్డి పాలనలో రాజకీయ ప్రత్యర్థులను, ముఖ్యంగా తెలుగుదేశం పార్టీ కార్యకర్తలు, నాయకులను కేసులతో వేధించారు. వారు స్వేచ్ఛగా వ్యాపారాలు చేసుకోలేని పరిస్థితి ఉండింది. పోలీసులు కనీవినీ ఎరుగని రీతిలో అధికార దుర్వినియోగానికి పాల్పడ్డారు. బారా ఖూన్ మాఫీ అన్నట్టుగా ఎవరేమి చేసినా చెల్లుబాటు అయింది. ప్రశ్నించే వెసులుబాటు కూడా లేకుండాపోయింది. ప్రజాస్వామ్యంలో తాను ప్రజలు ఎన్నుకున్న ముఖ్యమంత్రిని మాత్రమే అన్న స్పృహ లేకుండా తాను ఒక చక్రవర్తిలాగా జగన్‌రెడ్డి వ్యవహరించారు. ఇక వైసీపీ నాయకులు సామంతుల్లాగా తమ తమ ప్రాంతాలపై ఆధిపత్యం చెలాయించారు. మొత్తంగా రాష్ట్రంలో రూల్ ఆఫ్ లా లేకుండా చేశారు. వ్యవస్థలు కుప్పకూలిపోయాయి. పగ, ప్రతీకారాలే రాజకీయాలకు పరమావధి అన్నట్టుగా రాజకీయాలకు కొత్త నిర్వచనం ఇచ్చారు. దీంతో నాటి బాధితులు ఇప్పుడు ఇన్‌స్టంట్ జస్టిస్ కోరుకుంటున్నారు. కంటికి కన్ను–పంటికి పన్ను సిద్ధాంతాన్ని అమలు చేయాలని డిమాండ్ చేస్తున్నారు. జగన్‌రెడ్డి బాటలోనే వ్యవహరించాలనుకుంటే రాష్ట్రంలో ప్రభుత్వం మారాల్సిన అవసరం లేదని మరచిపోతున్నారు. చంద్రబాబు నాయుడు కూడా జగన్ మాదిరిగా సైకో పనులు చేయాలనుకుంటున్నారు. ఇదొక దురదృష్టకర వాతావరణం.

జగన్ కళ్లలో ఆనందం కోసం..

తెలుగునాట ఎన్నో ప్రభుత్వాలు వచ్చాయి, పోయాయి. అయితే గతంలో ఇలాంటి పరిస్థితి ఉండేది కాదు. అధికారంలోకి వచ్చిన వారి ప్రాధాన్యతల ఆధారంగా పాలన ఉండేది. అధికారులపై పార్టీల ముద్ర ఉండేది కాదు. తమిళనాడులో డీఎంకే – అన్నాడీఎంకే అధిపతులుగా కరుణానిధి–జయలలిత ఉన్నప్పుడు, డీఎంకే అధికారంలోకి వస్తే వారికి అనుకూలమైన అధికారులు కీలక స్థానాల్లోకి వచ్చేవారు. అన్నాడీఎంకే అధికారంలోకి రాగానే వారందరినీ అప్రధాన పోస్టులలో నియమించేవారు. ఈ పరిస్థితి తెలుగునాట గతంలో లేదు. జగన్‌రెడ్డి అధికారంలోకి వచ్చిన తర్వాతే కొంతమంది అధికారులు కుల, మత ప్రాతిపదికన పార్టీలకు విధేయత ప్రకటించుకున్నారు. ఆ క్రమంలో వారు హద్దులు మీరి ప్రవర్తించారు. దీంతో రాష్ట్రంలో ప్రజల మైండ్‌సెట్ కూడా మారిపోయింది. పగ, ప్రతీకారాలే ఎజెండాగా అవతరించాయి. జగన్‌రెడ్డి హయాంలో ఏడెనిమిది మంది అధికారులు మరీ దిగజారి వ్యవహరించారు. రాష్ట్రంలో ప్రభుత్వం మారగానే ప్రవీణ్ ప్రకాశ్ అనే ఐఏఎస్ అధికారి స్వచ్ఛంద పదవీ విరమణకు దరఖాస్తు చేసుకున్నారు. అంటే, చంద్రబాబు ప్రభుత్వంలో పనిచేయడం ఆయనకు ఇష్టం లేకపోయి ఉండవచ్చు లేదా తన పాపాలకు శిక్ష అనుభవించాల్సి వస్తుందన్న భయం కావచ్చు. పరిటాల రవిని హత్య చేసిన వారిలో ఒకరైన మొద్దు శీను ఒక టీవీ ఇంటర్వ్యూలో మాట్లాడుతూ తన బావ (మద్దెలచెరువు సూర్యనారాయణ రెడ్డి) కళ్లలో ఆనందం చూడటానికే రవిని చంపానని చెప్పాడు. ప్రవీణ్ ప్రకాశ్ కూడా జగన్ కళ్లలో ఆనందం చూడటం కోసం ప్రభుత్వానికి దిక్కుమాలిన సలహాలు ఇస్తున్నానని తన సహచరులతో చెప్పేవారట. ఒక ఐఏఎస్ అధికారి ఆలోచించాల్సిన తీరు అదేనా? ఇలాంటి వారి సూచనలు అమలుచేసి ఆనందపడిన జగన్మోహన్‌రెడ్డి ఇంటికి పోయారు. ఆయన కళ్లలో ఆనందం చూడడమే ముఖ్యమనుకున్న ప్రవీణ్ ప్రకాశ్ కూడా స్వచ్ఛంద పదవీ విరమణ చేయాల్సి వచ్చింది. ఇలాంటి అధికారుల మూలంగానే అఖిల భారత సర్వీసుల ప్రతిష్ఠ మసకబారుతోంది. ప్రవీణ్ ప్రకాశ్ తరహాలోనే మరికొందరు ఐఏఎస్, ఐపీఎస్ అధికారులు వ్యవహరించారు. చంద్రబాబు ముఖ్యమంత్రిగా బాధ్యతలు చేపట్టి నెల రోజులు అవుతున్నా సదరు అధికారులకు ఆయన దర్శనం కూడా లభించలేదు. ఐఏఎస్ అధికారిణి శ్రీలక్ష్మి విషయమే తీసుకుందాం. దివంగత వైఎస్ రాజశేఖరరెడ్డి హయాంలో అడ్డగోలుగా వ్యవహరించిన కారణంగా సీబీఐ నమోదు చేసిన కేసులలో జగన్‌రెడ్డితో పాటు శ్రీలక్ష్మి కూడా జైలుకు వెళ్లి ఆరోగ్యం కూడా చెడగొట్టుకున్నారు. అయినా బుద్ధి తెచ్చుకోకుండా తెలంగాణ కోటాకు వెళ్లిన ఆమె.. విజయసాయి రెడ్డి ద్వారా పైరవీలు చేసుకొని జగన్‌రెడ్డి ముఖ్యమంత్రి అయ్యాక ఆంధ్రప్రదేశ్‌కు వెళ్లారు. ఇప్పుడు ఆమెకు చంద్రబాబు దర్శనం కూడా లభించడంలేదు. విధి నిర్వహణలో సక్రమంగా వ్యవహరించి ఉంటే శ్రీలక్ష్మి కేంద్ర కేబినెట్ సెక్రటరీగా పదోన్నతి పొంది ఉండేవారు. ఐపీఎస్ అధికారులు పీఎస్ఆర్ ఆంజనేయులు, పీవీ సునీల్ కుమార్, సంజయ్ వంటి వారు కూడా ఈ కోవలోకే వస్తారు. వారిని కలవడానికి కూడా చంద్రబాబు ఇష్టపడటం లేదు. అఖిల భారత సర్వీసుకు ఎంపికైన అధికారులు ఇలా ఎందుకు ప్రవర్తించారనే ప్రశ్నకు వారే సమాధానం చెప్పాలి. చంద్రబాబు గతంలో కూడా ముఖ్యమంత్రిగా పనిచేశారు. అయితే అధికారుల విషయంలో ఇంత కఠినంగా ఆయన ఎప్పుడూ వ్యవహరించలేదు. సౌమ్యుడైన చంద్రబాబు కఠినంగా మారడానికి ఇలాంటి అధికారులే కారణం. జగన్‌రెడ్డి లేదా చంద్రబాబుకు సేవ చేసి తరించడానికే ఆయా అధికారులు అఖిల భారత సర్వీసుకు ఎంపిక కాలేదు కదా! చట్టాలు, నిబంధనలకు అనుగుణంగా ప్రజలకు సేవ చేయడమే అధికారుల బాధ్యత. ముఖ్యమంత్రుల కళ్లలో ఆనందం చూడటం కోసం కాకుండా రాజ్యాంగానికి కట్టుబడి పనిచేయాలి. జగన్‌రెడ్డి పాలనలో అధికారుల బలహీనతలను వాడుకొని వారితో అడ్డమైన పనులూ చేయించారు. 'జగన్‌రెడ్డి జైలుకు వెళ్లడానికి కారకుడైన చంద్రబాబును జైలుకు పంపకపోతే ఎలా? మీరు మాతో సహకరించండి. లేదా మిమ్మల్ని కూడా జైలుకు పంపుతామ'ని సీనియర్ ఐఏఎస్ అధికారి అజయ్ జైన్ మెడపై కత్తి పెట్టిన చరిత్ర ఐపీఎస్ అధికారి కొల్లి రఘురామిరెడ్డిది. చంద్రబాబు, జగన్ మధ్య రాజకీయ వైరం ఉంటే వాళ్లిద్దరూ తేల్చుకుంటారు. వారికోసం అధికారులు కిరాయి సైనికులుగా మారడం సమర్థనీయం కాదు కదా! అధికారులు ఇంతగా చెడిపోవడమే ప్రస్తుత ముఖ్యమంత్రి చంద్రబాబుకు సమస్యగా మారింది. కీలక పోస్టుల భర్తీకి ఒకటికి రెండుసార్లు ఆలోచించవలసి వస్తోంది. తెలుగు తమ్ముళ్లూ.. ఇప్పుడు చెప్పండి– జగన్‌రెడ్డి బాటలోనే చంద్రబాబు కూడా పాలెగాడి తరహా పాలన చేయాలా? లేక రూల్ ఆఫ్ లా ప్రకారం వ్యవహరించాలా? జగన్ ప్రభుత్వం అరాచకంగా ఉండిందనే కదా ప్రజలు ఆయనను చిత్తుగా ఓడించారు. చంద్రబాబు కూడా అలాగే చేస్తే ఆయనను కూడా ప్రజలు అంతే చిత్తుగా ఓడిస్తారు. కక్ష సాధింపులు ప్రభుత్వాలకు ఎజెండాగా ఉండకూడదు. అయితే నాటి బాధితులకు ఉపశమనం లభించాల్సిందే. కాకపోతే అది చట్టబద్ధంగా జరగాలి. తప్పు చేసిన అధికారులను నిబంధనల ప్రకారం శిక్షించాలి గానీ ఆటవిక న్యాయం అమలు చేయాలని కోరుకోవడం సమంజసం కాదు కదా! ఈ నేపథ్యంలో ప్రభుత్వాన్ని

“ తెలుగు తమ్ముళ్లూ.. ఇప్పుడు చెప్పండి– జగన్‌రెడ్డి బాటలోనే చంద్రబాబు కూడా పాలెగాడి తరహా పాలన చేయాలా? లేక రూల్ ఆఫ్ లా ప్రకారం వ్యవహరించాలా? అధికారంలోకి వచ్చిన కూటమి నాయకులు ఎవరైనా రేపు అనేది లేకుండా వ్యవహరిస్తే వారిపై కఠిన చర్యలు తీసుకోవడానికి ముఖ్యమంత్రి వెనుకాడకూడదు.



గాడిలో పెట్టడానికి చంద్రబాబుకు తగినంత వ్యవధి ఇవ్వాలి. సోషల్ మీడియా పేరిట ఆయనను ప్రభావితం చేయాలనుకోవడం, ప్రభుత్వం అనుచిత నిర్ణయాలు తీసుకొనే విధంగా ప్రేరేపించడం సమర్థనీయం కాదు. జగన్‌రెడ్డి పాలనలో అనేక ఇబ్బందులు పడిన ప్రజలు.. చంద్రబాబు ప్రభుత్వంపై గంపెడు ఆశలు పెట్టుకున్నారు. ఈ ప్రభుత్వాన్ని వేయి కళ్లతో గమనిస్తున్నారు. ప్రభుత్వాలు రాజధర్మాన్ని పాటించాలి. గత ప్రభుత్వంలో లీజుదారులను వెళ్లగొట్టి గనులను కబ్జా చేశారు. వ్యాపారాలను కబళించారు. పోర్టులను చెరపట్టారు. రాష్ట్రంలో న్యాయబద్ధంగా వ్యాపారం చేసుకోవాలన్నా కప్పం కట్టాల్సిన దుస్థితి కల్పించారు. ఇప్పుడు కూటమి నాయకులు కూడా అలాగే వ్యవహరిస్తే ప్రజలు కచ్చితంగా హర్షించరు. నాయకులు, కార్యకర్తలలోనే కాదు ప్రజల్లో కూడా ఎన్నో ఆశలు, ఆకాంక్షలు ఉన్నాయని గుర్తించాలి.

వారిని కట్టడి చేయాల్సిందే!

గడచిన కొన్ని రోజులుగా ఆంధ్రప్రదేశ్‌లో చోటుచేసుకుంటున్న కొన్ని సంఘటనలు ఆందోళన కలిగిస్తున్నాయి. తెలుగుదేశం, జనసేన నాయకులు, ఎమ్మెల్యేలు గత పాలకుల బాటలోనే వ్యవహరిస్తున్నట్టు వార్తలు వస్తున్నాయి. నర్సరావుపేట పార్లమెంటు నియోజకవర్గానికి చెందిన ఒక ఎమ్మెల్యే తన నియోజకవర్గంలోని నాలుగు బార్ల యజమానులను తక్షణమే వాటిని ఖాళీ చేసి తమ మనుషులకు అప్పగించాలని హుకుం జారీ చేశారట. అనకాపల్లి పార్లమెంటు నియోజకవర్గంలోని ఒక జనసేన ఎమ్మెల్యే ఫార్మా కంపెనీ వాళ్లు తనకు కప్పం కట్టాలని ఆదేశిస్తున్నారట. కడప జిల్లాలో గతంలో మాదిరి భూ కబ్జాలు జరుగుతున్నట్టు సమాచారం. రాష్ట్రానికి పెట్టుబడులను ఆకర్షించే పనిలో ముఖ్యమంత్రి చంద్రబాబు ఉండగా, కూటమికి చెందిన ఎమ్మెల్యేలు ఇలా ప్రవర్తించడాన్ని ఎలా సమర్థించుకుంటారు? వ్యాపారాలు చేసుకొనే వారికి సహకరించాలే గానీ కప్పం కట్టాలని కోరడం ఏమిటి? గత పాలనలో ఇలా జరిగిందనే కదా ప్రజలు ఆ ప్రభుత్వాన్ని బంగాళాఖాతంలో నిమజ్జనం చేశారు! తూర్పు గోదావరి జిల్లాలో ఎన్నో ఏళ్లుగా లేటరైట్ క్వారీలు నడుపుకొంటున్న వారిని గత ప్రభుత్వంలో తరిమేసి వైవీ సుబ్బారెడ్డి కుమారుడు వాటిని చెరబట్టారు. ఇప్పుడు ప్రభుత్వం మారాక సానా సతీష్ అనే ఆయన అదే బాటలో పయనించే ప్రయత్నం చేసినట్టు వార్తలు వచ్చాయి. నెల్లూరు జిల్లాలో ప్రైవేటు భూములలో సిలికా ఇసుక లభిస్తుంది. ఆయా భూ యజమానులు లీజు పొంది సిలికా అమ్ముకొనేవారు. జగన్‌రెడ్డి అధికారంలోకి వచ్చాక అధికార పార్టీ వాళ్లు యజమానులను తరిమేసి వాటిని కబ్జా చేశారు. చీమకుర్తిలోని గెలాక్సీ గ్రానైట్ గనులు కూడా ఈ కోవలోకే వస్తాయి. ఈ నేపథ్యంలో ముఖ్యమంత్రి చంద్రబాబు కఠినంగా వ్యవహరించాలి. కబ్జాలకు గురైన గనులను, ఖనిజాలను వాటి యజమానులకు అప్పగించి వారు స్వయంగా వ్యాపారాలు చేసుకోగలిగే పరిస్థితులు కల్పించాలి. ప్రభుత్వ మార్పు మాత్రమే కాదు.. కొత్త ప్రభుత్వంలో ప్రజలు కోరుకుంటున్న మార్పు ఇదే. మంచికి పోతే చెడు ఎదురైందని అంటారు. ఉచిత ఇసుక విషయంలో ఇలాగే జరుగుతోంది. 2014–2019 మధ్య కాలంలో చంద్రబాబు ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు కూడా ఉచిత ఇసుక విధానం అమలు చేసినా విమర్శలపాలయ్యారు. స్పష్టమైన విధానం, అవగాహన లేకుండా లేడికి లేచిందే పరుగు అన్నట్టుగా ఉచిత ఇసుక అని ప్రకటించడంతో అప్పట్లో రీచ్‌లు అధికార పార్టీ ఎమ్మెల్యేలు, వారి మనుషుల అధీనంలోకి వెళ్లిపోయాయి. ఇసుక లోడింగ్, అన్ లోడింగ్ రవాణా చార్జీలు భరించాల్సి ఉంటుందని చెప్పి ఉంటే విమర్శలకు తావు ఉండేది కాదు. గతంలో అమరావతిలో సచివాలయం, అసెంబ్లీలకు తాత్కాలిక భవనాలు నిర్మించామని అన్నందుకు ఆ మాటను పట్టుకొని చిలువల పలువలు చేశారు. ఏడెనిమిదేళ్లుగా ఉపయోగిస్తున్న ఆ భవనాలను గుడారాలు అంటూ విమర్శించారు. ఇలాంటి అనుభవం దృష్ట్యా ప్రభుత్వం పదాల వాడకంలో మరింత అప్రమత్తంగా ఉండాలి. అధికారంలోకి వచ్చిన కూటమి నాయకులు ఎవరైనా రేపు అనేది లేకుండా వ్యవహరిస్తే వారిపై కఠిన చర్యలు తీసుకోవడానికి ముఖ్యమంత్రి చంద్రబాబు వెనుకాడకూడదు. ప్రభుత్వం మారినంత మాత్రాన అధికారులు కొత్తగా పుట్టుకురారు. కనుక పూర్తిగా చెడిపోయిన అధికారులను వదిలేసి మిగతావాళ్లకు ప్రభుత్వ ప్రాధాన్యాలను వివరించి వారితోనే పనిచేయించుకోవాలి. ఈ విషయంలో తెలుగు తమ్ముళ్లు కూడా ఆవేశాన్ని తగ్గించుకోవాలి.

..కానివ్వండి ఓదార్చుకోండి!

ఇప్పుడు తెలంగాణ మాజీ మంత్రి కల్వకుంట్ల తారక రామారావు ఢిల్లీలో విలేకరుల సమావేశంలో జగన్మోహన్‌రెడ్డి ఓటమిపై చేసిన వ్యాఖ్యల విషయానికి వద్దాం. ఆంధ్రప్రదేశ్‌లో ఎన్నికలకు ముందు జగన్ మళ్లీ అధికారంలోకి వస్తారన్నది తమకున్న సమాచారం అని కేటీఆర్ చెప్పుకొచ్చారు. ఇప్పుడు జగన్ చిత్తుగా ఓడిపోయి చంద్రబాబు ప్రభుత్వం కొలువుదీరి నెల అయింది. ఈ నేపథ్యంలో తెలంగాణలో తాము కోలుకోవడం ఎలాగో ఆలోచించకుండా జగన్ ఓడిపోవడం ఆశ్చర్యంగా ఉందని, అయినా 40 శాతం ఓట్లు సాధించిన ఆయన హీరో అని కేటీఆర్ సెలవిచ్చారు. తెలంగాణలో తాము జీరోలుగా మారిన విషయం వదిలేసి పక్క రాష్ట్రం వాళ్లను హీరోలని పొగిడితే వచ్చేది ఏమిటో ఆయనకే తెలియాలి. ఆంధ్రప్రదేశ్ మాజీ ముఖ్యమంత్రి జగన్ పట్ల తండ్రీ-కొడుకులైన కేసీఆర్‌కూ, కేటీఆర్‌కూ అవ్యాజమైన ప్రేమ ఉందన్న విషయం అందరికీ తెలిసిందే. ఆంధ్రప్రదేశ్‌లో రోడ్లు లేవు, కరెంటు లేదని ఒకప్పుడు విమర్శించిన ఇదే కేటీఆర్.. ఇప్పుడు జగన్ ఓటమికి

“ నిజానికి కూటమి ప్రభుత్వం ఏర్పడి నెల రోజులు అవుతున్నప్పటికీ ప్రభుత్వం ఇంకా కుదురుకోలేదు. ఇందుకు అనేక కారణాలు ఉన్నాయి. జగన్‌రెడ్డి వ్యవహార శైలి కారణంగా వ్యవస్థలన్నీ కుప్పకూలిపోయాయి. మరకలు అంటని అధికారులను గుర్తించడం కష్టంగా మారింది. ఈ కారణంగా అధికారుల నియామకాలలో ముఖ్యమంత్రి ఆచితూచి వ్యవహరిస్తున్నారు. అయినప్పటికీ జగన్ హయాంలో తొత్తుగా వ్యవహరించిన ఫలానా అధికారిని ఎందుకు నియమించారు? అంటూ నిట్టూర్పులు వెలువరిస్తున్నారు. పోలీసు శాఖలో కీలక పదవుల భర్తీకి అనువైన అధికారుల కోసం వెదుక్కోవలసి వచ్చింది. ప్రభుత్వ శాఖల కార్యదర్శుల నియామకం ఇంకా పూర్తికాలేదు. శాఖాధిపతులుగా ఎవరిని నియమించాలో తెలియని పరిస్థితి. జిల్లా కలెక్టర్ల నియామకం కొంతవరకు పూర్తిచేసిన ప్రభుత్వం జిల్లా ఎస్పీల నియామకాన్ని ఈ శనివారం మాత్రమే చేపట్టగలిగింది.

ఆశ్చర్యపోవడం ఎందుకో తెలియదు. తెలంగాణలో తాము ఎందుకు సోయిలో లేకుండా పోయామో సమీక్షించుకోవాల్సింది పోయి జగన్‌పై ప్రేమ ఒలకబోస్తే మరింత నష్టమే తప్ప లాభం ఉండదు. తెలంగాణలో ప్రస్తుతం జీరోగా మారిన కేటీఆర్‌కు ఆంధ్రప్రదేశ్‌లో జగన్‌రెడ్డిలో హీరో కనిపించడం విడ్డూరంగా ఉంది. 2019 ఎన్నికల్లో ఓటమి పాలైన చంద్రబాబుకు కూడా 40 శాతం ఓట్లు వచ్చిన విషయం కేటీఆర్‌కు గుర్తులేదా? ప్రతిరోజూ జనంలో తిరిగిన ధర్మవరం ఎమ్మెల్యే కేతిరెడ్డి ఓడిపోవడం ఆశ్చర్యంగా ఉందని కేటీఆర్ అన్న మాటలకు ఆంధ్రప్రదేశ్ మంత్రి, ధర్మవరం నుంచి గెలిచిన తాజా ఎమ్మెల్యే సత్యకుమార్ తగు విధంగా బదులిచ్చారు. జగన్, కేతిరెడ్డి వంటి వారి గురించి కేటీఆర్ వ్యాఖ్యలకు ప్రతిస్పందనగా సోషల్ మీడియాలో ఒక పోస్టు వచ్చింది. "గాడిద సంగీతానికి ఒంటె ఆశ్చర్యపోతే, ఒంటె అందానికి గాడిద మూర్ఛపోయిందట! ఏం చేద్దాం.. ఒకరినొకరు ఓదార్చుకోండి!!" అని ఆ పోస్టులో పేర్కొన్నారు. నిజమే కదా! పక్క రాష్ట్రంలో ప్రజలు ఎవరి కుర్చీనో మడతపెడితే దానిపై కేటీఆర్ విశ్లేషణలు ఎవరికి కావాలి? తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నుంచి భారత రాష్ట్ర సమితిని కాపాడుకోవడం కేటీఆర్ ప్రస్తుతం చేయాల్సిన పని. ఎన్నికల్లో ఓడిపోయినవారి వ్యాఖ్యలు, విశ్లేషణలకు పెద్దగా విలువ ఉండదని ఆయన ఎప్పుడు తెలుసుకుంటారో?

“ తెలుగు తమ్ముళ్లు ఇప్పుడే ఎందుకు ఇంత అసహనానికి గురవుతున్నారంటే కారణం లేకపోలేదు. జగన్‌రెడ్డి పాలనలో రాజకీయ ప్రత్యర్థులను, ముఖ్యంగా తెలుగుదేశం పార్టీ కార్యకర్తలు, నాయకులను కేసులతో వేధించారు. వారు స్వేచ్ఛగా వ్యాపారాలు చేసుకోలేని పరిస్థితి ఉండింది. పోలీసులు కనీవినీ ఎరుగని రీతిలో అధికార దుర్వినియోగానికి పాల్పడ్డారు. బారా ఖూన్ మాఫీ అన్నట్టుగా ఎవరేమి చేసినా చెల్లుబాటు అయింది. ప్రశ్నించే వెసులుబాటు కూడా లేకుండాపోయింది. ప్రజాస్వామ్యంలో తాను ప్రజలు ఎన్నుకున్న ముఖ్యమంత్రిని మాత్రమే అన్న స్పృహ లేకుండా తాను ఒక చక్రవర్తిలాగా జగన్‌రెడ్డి వ్యవహరించారు. ఇక వైసీపీ నాయకులు సామంతుల్లాగా తమ తమ ప్రాంతాలపై ఆధిపత్యం చెలాయించారు. మొత్తంగా రాష్ట్రంలో రూల్ ఆఫ్ లా లేకుండా చేశారు. వ్యవస్థలు కుప్పకూలిపోయాయి. పగ, ప్రతీకారాలే రాజకీయాలకు పరమావధి అన్నట్టుగా రాజకీయాలకు కొత్త నిర్వచనం ఇచ్చారు. దీంతో నాటి బాధితులు ఇప్పుడు ఇన్‌స్టంట్ జస్టిస్ కోరుకుంటున్నారు.

జ్ఞానయోధుడు: సన్నాఫ్ జోగిని చిన్నూబాయి

బ్రిటీష్ పాలకుల వ్యతిరేక ఉద్యమంలో, స్వతంత్ర భారతదేశ నిర్మాణంలో సవర్ణులతో పాటు దళితులకు సమాన భాగస్వామ్యం ఉందని నిగ్గుతేల్చిన చరిత్రకారుడు జంగం చిన్నయ్య. భారతదేశ భౌగోళిక, చారిత్రక, సాంస్కృతిక వైభవ ప్రభావాలను ఉన్నతీకరిస్తూనే దళిత వేదనను ఆర్ద్రంగా చిత్రించిన జాషువా కావ్యం 'గబ్బిలం'కు 'తల్లి పోలికలు బిడ్డలో ప్రతిఫలించిన' రీతిలో చిన్నయ్య చేసిన ఆంగ్లానువాదం 'Gabbilam: A Dalit Epic'కు ప్రతిష్ఠాత్మక ఎ.కె.రామానుజన్ అనువాద పురస్కారం లభించింది.





జోగినికి పుట్టిన బిడ్డ అంటూ లోకం అతనిని అవమానించింది. అంటరానివాడని ఊరు బాధించింది. పేదరికం వెక్కిరించింది. లెక్కలేని అవమానాలను ధిక్కరించి, కఠోర శ్రమతో, అచంచల కార్యదీక్షతో అతను ముందడుగు వేశాడు. ముళ్ళ తుప్పలను తొక్కుకుంటూ, నెత్తుటి పాదాలతోనే నడక సాగించి వెలివాడ నుండి కెనడాలోని కార్లెటాన్ విశ్వవిద్యాలయం పీఠంపై కాలు మోపాడు. నేడు ఆ జోగినీ పుత్రుడు ప్రఖ్యాత పరిశోధకుడిగా అణగారిన ప్రజల చరిత్రను తిరగరాస్తున్నాడు. తెలుగు దళిత సాహిత్య ఔన్నత్యాన్ని దశదిశలా చాటి చెబుతున్నాడు. ఆ జ్ఞానయోధుడు ద గ్రేట్ సన్నాఫ్ చిన్నూబాయి ప్రొఫెసర్ చిన్నయ్య జంగం. గుర్రం జాషువ గబ్బిలం కావ్యాన్ని (Gabbilam A Dalit Epic) జంగం చిన్నయ్య ఆంగ్లంలోకి అనువదించి ప్రతిష్ఠాత్మకమైన డాక్టర్ ఎ.కె రామానుజన్ అంతర్జాతీయ పురస్కారాన్ని (2024) పొందారు. దక్షిణాసియా దేశాల్లోని లబ్ధప్రతిష్ఠులైన రచయితలతో పోటీపడి ఈ విశిష్ట గౌరవాన్ని అందుకొన్న జంగం చిన్నయ్య ప్రస్థానాన్ని పరిశీలిస్తే మహత్తరమైన స్ఫూర్తి కలుగుతుంది.

జంగం చిన్నయ్య నిజామాబాద్ జిల్లా ఆర్మూర్ మండలం కోమన్‌పల్లి గ్రామంలో మాదిగ కుటుంబంలో చిన్నూబాయికి జన్మించాడు. బాల్యంలో పోలియో బారిన పడిన చిన్నూబాయిని ఊరిపెద్దలు జోగినిగా మార్చారు. ఆమె ఆ దురాచార సర్పపరిష్వంగంలో నలిగిపోయింది. ఐదేళ్ల ప్రాయం నుండే భూస్వాముల పశువులకొట్టంలో జీతగాడిగా బందీ అయిన చిన్నయ్య, దొరల బిడ్డల్లా తానూ చదువుకోవాలని ఆరాటపడ్డాడు. బిడ్డను చదివించాలనే ధ్యేయంతో పాఠశాలకు వెళ్ళిన చిన్నూబాయికి, చిన్నయ్య తండ్రి పేరు చెబితేనే ప్రవేశం లభిస్తుందని హెడ్‌మాస్టర్ ఒత్తిడిచేయడంతో చివరకు పోచయ్య అనే తన బావ పేరునే తండ్రి పేరుగా రాయించింది ఆమె. బాలకూలిగా పనిచేస్తూనే తెలివైన విద్యార్థిగా రాణిస్తున్న తన బిడ్డను చూసి చిన్నూబాయి మురిసిపోయింది. ఇంతలోనే పాము కాటుకు బలై చిన్నుబాయి చనిపోవడంతో చిన్నయ్య, అతని చెల్లి సుజాత అనాథలయ్యారు. ఆ తరువాత, చిన్నమ్మ భూదేవి ఆదరణ, ఉపాధ్యాయుడు షేక్ మన్నన్ సలహాతో ఉప్పలవాయి పాఠశాలలో హైస్కూల్ విద్యనభ్యసించి, ఉట్నూరులోని గురుకుల జూనియర్ కళాశాలలో చిన్నయ్య ఇంటర్ పూర్తిచేశాడు. తరువాత చిన్నయ్యను ఉట్నూరు సబ్ కలెక్టర్ డాక్టర్ పి.వి రమేశ్ దంపతులు చేరదీసి కన్నబిడ్డలా ఆదరించారు. వారు అతనిని ఉన్నత విద్యవైపు మళ్ళించారు. నాగార్జున సాగర్ గురుకుల డిగ్రీ కళాశాలలో బి.ఎ, హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీలో ఎం.ఎ(హిస్టరీ) పూర్తిచేసి, ఢిల్లీ జవహర్ లాల్ నెహ్రూ విశ్వవిద్యాలయంలో ఎం.ఫిల్. పరిశోధన చేశాడు. ఉస్మానియా విశ్వవిద్యాలయం చరిత్ర శాఖలో కొంతకాలం సహాయ ఆచార్యుడిగా పాఠాలు బోధించాడు. అనునిత్యం శ్రమించి ప్రఖ్యాత సంస్థల ఫెలోషిప్ సాధించి లండన్, న్యూయార్క్ యూనివర్సిటీలలో పిహెచ్.డితో పాటు పోస్ట్ డాక్టరేట్ చేశాడు. ప్రస్తుతం జంగం చిన్నయ్య కెనడాలోని కార్లెటాన్ యూనివర్సిటీలో చరిత్ర ఆచార్యుడు.


ఒక మారుమూల గ్రామం నుండి వచ్చిన చిన్నయ్య ఆంగ్లభాషపై అపారమైన పట్టుసాధించి, ప్రపంచంలోనే ప్రథమశ్రేణి విద్యాసంస్థల్లో విద్యనభ్యసించి ప్రత్యామ్నాయ చరిత్రకారుడిగా, ప్రభావశీలమైన పరిశోధకుడుగా ఎదిగిన తీరు ఆదర్శనీయం. వేటగాళ్ళు చెప్పే పిట్టకథలను తోసిరాజని సింహం తన వీరోచిత చరిత్రను రాసుకున్నట్లుగా దేశ సంస్కృతికి, నాగరికతకు నడకలు నేర్పిన దళితుల చరిత్రను చిన్నయ్య తవ్విపోస్తున్నాడు. భారత జాతీయోద్యమ పర్యవసానాల గురించి ఎంఫిల్ చేద్దామనుకున్న చిన్నయ్య కంచె ఐలయ్య సూచనతో దళితుల చరిత్ర వైపు దృష్టి సారించాడు. అణగారిన జాతుల మహా చరిత్రని వేయి కన్నులతో పరిశీలించి 'Dalits and the Making of Modern India' అనే గ్రంథాన్ని వెలువరించాడు. ఈ గ్రంథాన్ని ఆక్స్‌ఫర్డ్ యూనివర్సిటీ ప్రెస్ ప్రచురించడం విశేషం. 'Social and Intellectual History of Dalits in Modern South Acia' పేరుతో చిన్నయ్య రచించిన మరొక పరిశోధన గ్రంథం సుప్రసిద్ధ చరిత్రకారుల దృష్టిని ఆకర్షించింది. భారతీయ చరిత్రలోని విస్తృత కోణాలను చిన్నయ్య తన రచనల్లో ఆవిష్కరించాడు. బ్రిటీష్ పాలకుల వ్యతిరేక ఉద్యమంలో, స్వతంత్ర భారతదేశ నిర్మాణంలో సవర్ణులతో పాటు దళితులకు సమాన భాగస్వామ్యం ఉందని చిన్నయ్య నిగ్గుతేల్చాడు. సామాజికపరమైన, మేధోపరమైన దళితుల కృషిని, వారు సాగించిన రాజకీయ, పోరాటాల తీరుతెన్నులను ప్రామాణికంగా తన గ్రంథాల్లో విశ్లేషించాడు. నైతిక, సమానత్వంతో కూడిన సమాజ ఆవిర్భావానికి కులనిర్మూలన పోరాటమే ఆలంబనగా నిలుస్తుందని పరిశోధనా పత్రాల్లో చిన్నయ్య ప్రతిపాదించాడు.

తెలుగు ప్రాంతంలోని దళితుల సామాజిక, సాంస్కృతిక, సాహిత్య చరిత్ర స్వరూప స్వభావాలను చిన్నయ్య ఎంతో ఆసక్తిదాయకంగా వివరించాడు. కుసుమ ధర్మన్న, జాలా రంగస్వామి, మంగమ్మ, తాడి నాగమ్మ, గ్యార ప్రేమయ్య, వాగిరి ఆమోసు లాంటి తొలితరం దళిత సంస్కర్తల, రచయితల నిరుపమాన కృషిని ఆయన లోకానికి పరిచయం చేశాడు. పాఠశాలలో గుర్రం జాషువా పద్యాలు విని, ప్రేరణపొందిన చిన్నయ్య, దళిత ఉద్యమ చరిత్రను అధ్యయనం చేసే క్రమంలో జాషువ గబ్బిలం కావ్యాన్ని అర్థం చేసుకొని అందులో తనను తాను చూసుకున్నాడు. కుల, మత, లింగ, జాతి వివక్షలను వ్యతిరేకిస్తూ వెలువడిన సాహిత్యం అత్యంత శక్తిమంతమైనదని, ఈ విధమైన రచనలను ఆంగ్లంలోకి అనువదిస్తే ఎంతోమందికి గొప్ప ప్రేరణగా నిలుస్తుందని భావించాడు. అప్పుడే తనకిష్టమైన గబ్బిలం కావ్యం చిన్నయ్య మదిలో మెదిలింది.

జాతీయోద్యమ కాలధర్మాన్ని, తన అస్తిత్వ చైతన్యంతో సమన్వయించి, జాషువా గబ్బిలం కావ్యం రచించాడు. భారతదేశ భౌగోళిక, చారిత్రక, సాంస్కృతిక వైభవ ప్రభావాలను ఉన్నతీకరిస్తూనే దళిత వేదనను ఆర్ద్రంగా చిత్రించటం వల్ల ఈ కావ్యం ఒక క్లాసిక్‌గా మిగిలింది. చిన్నయ్య చరిత్ర విద్యార్థి అయినా గబ్బిలం కావ్యాన్ని అధ్యయనం చేసి, రెండు సంవత్సరాల పరిశ్రమతో ఆంగ్లంలోకి అనువదించాడు. దార్శనిక దృష్టితో గబ్బిలం కావ్యాన్ని దళిత ఇతిహాసంగా ఆయన పేర్కొన్నాడు. ఛందోబద్ధమైన భావధారను కవితాత్మక, ప్రతీకాత్మకమైన అభివ్యక్తులను సామాజిక, ప్రాదేశికపరమైన పరిభాషను నుడికారాలను, ఆంగ్లంలోకి అనువదించటం అత్యంత కష్టమైనా సాహితీవేత్తల సహకారంతో చిన్నయ్య ఈ బృహత్కార్యాన్ని సముచితంగా నిర్వహించాడు. వర్ణవ్యవస్థను ఆదర్శీకరించిన ప్రాచీన తెలుగు సాహిత్య రాజకీయాల వైఖరిని, గబ్బిలం చారిత్రక నేపథ్యాన్ని వివరించటంతో పాటు, రాజ్యాంగ నైతికతను, ఆత్మగౌరవాన్ని, కులనిర్మూలనా దృష్టిని ప్రబోధించే సాహిత్య ఆవశ్యకతను Dalit Epic గ్రంథ పీఠికలో ఈ రచయిత విశ్లేషణాత్మకంగా తెలియజేశాడు. ముఖ్యంగా ఆధునిక తెలుగు సాహిత్యంలో జాషువా నిర్వహించిన పాత్రను, ఆయన స్థానాన్ని సూక్ష్మ పరిశీలనతో పీఠికలో నిర్ధారించాడు. జెరాక్స్ కాపీలా కాకుండా తల్లి పోలికలు బిడ్డలో ప్రతిఫలించిన శైలితోనే గబ్బిలం అనువాదం సాగింది. చిన్నయ్య అనువాద గ్రంథానికి ఎ.కె రామానుజం బహుమతి లభించటం అత్యంత సమంజసం. భారతీయ సంప్రదాయ సాహిత్యాన్ని అనువాదం చేసి గతంలో ఎక్కువమంది రచయితలు ఈ పురస్కారాన్ని అందుకోగా, దళిత నేపథ్యం కలిగిన గ్రంథం ద్వారా చిన్నయ్య ఈ అరుదైన గౌరవాన్ని పొందారు.

తెలుగు రాష్ట్రాల్లోని వివిధ విశ్వవిద్యాలయాల్లో జంగం చిన్నయ్య రచనలను పాఠ్యాంశాలుగా చేరిస్తే నిజమైన చరిత్ర నిర్మాతలెవరో ఈ తరానికి బోధపడుతుంది. ప్రపంచాన్ని గెలిచిన జంగం చిన్నయ్య జీవిత కథను పాఠశాల చిన్నారులకు ఉపవాచకంగా నిర్ణయిస్తే, చిన్న కష్టాన్ని కూడా ఎదుర్కొనే ధైర్యం లేక క్షణికావేశంతో ఆత్మహత్య దిశగా అడుగులు వేస్తున్న విద్యార్థులకు గుణపాఠంగా నిలుస్తుంది.

■ డాక్టర్ కోయి కోటేశ్వరరావు
తెలుగుశాఖ అధ్యక్షులు, ప్రభుత్వ సిటీ కళాశాల



శనివారం ఉష్ణోగ్రత గరిష్ఠం 30.4 కనిష్ఠం 24.4



దట్టీ సమర్పణ

మొహర్రంను పురస్కరించుకుని డబీర్‌పురాలోని బీబీకా ఆలంను నగర సీపీ కె.శ్రీనివాస్‌రెడ్డి శనివారం సందర్శించి దట్టీ సమర్పించారు. సీపీతోపాటు పోలీస్ అధికారులు విశ్వప్రసాద్, విక్రమ్‌సింగ్‌మాన్, దక్షిణ మండలం డీసీపీ స్నేహ మెహెరా, అడిషనల్ డీసీపీ జహంగీర్ తదితరులున్నారు. అనంతరం మొహర్రం ఊరేగింపు రూట్‌మ్యాప్‌ను సీపీ పరిశీలించారు.

- చార్మినార్, జూలై 13 (ఆంధ్రజ్యోతి)



బుల్లెట్



బుల్లెట్ ధాటికి పగిలిన కిటికీ అద్దం

తుపాకీ మిస్‌ఫైర్

బెడ్‌రూంలోకి దూసుకొచ్చిన బుల్లెట్.. నార్సింగ్‌లో కలకలం

నార్సింగ్, జూలై 13 (ఆంధ్రజ్యోతి): నార్సింగ్ పోలీస్‌స్టేషన్ పరిధిలోని బైరాగిగూడలో తుపాకీ నుంచి దూసుకొచ్చిన ఓ బుల్లెట్ కలకలం రేపింది. ఆ బుల్లెట్ ధాటికి ఓ అపార్ట్‌మెంట్ ఐదో అంతస్తులో ఉన్న ఫ్లాట్ కిటికీ అద్దాలు పగిలాయి. బుల్లెట్ బెడ్‌రూమ్‌లో పడిపోవడంతో ఫ్లాట్ యజమాని భయభ్రాంతులకు గురయ్యాడు. అయితే, ఎవరికీ ఏమీ కాకపోవడంతో ఫ్లాట్‌లోని వారు ఊపిరి పీల్చుకున్నారు. సమీపంలో ఉన్న ఆర్మీ ఫైరింగ్ రేంజ్‌లో జవాన్లు ఫైరింగ్ ప్రాక్టీస్ చేస్తున్నట్లు పోలీసులు గమనించారు. మిస్‌ఫైర్ అయిన ఓ బుల్లెట్ అపార్ట్‌మెంట్‌లోకి దూసుకొచ్చినట్లు వారు గుర్తించి కేసు దర్యాప్తు చేస్తున్నారు.

కలుషిత నీటి సరఫరాపై చర్యలు

- ఆ ప్రాంతాలకు ట్యాంకర్ల ద్వారా నీళ్లు
- 64 బృందాలతో నాణ్యతా తనిఖీలు : వాటర్‌బోర్డు

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్


తాగునీటి పైపుల్లోంచి
మురుగు నీరు

ఆంధ్రజ్యోతిలో ప్రచురితమైన కథనం

హైదరాబాద్ సిటీ, జూలై13 (ఆంధ్రజ్యోతి): ఏ ప్రాంతంలోనైనా కలుషిత జలాలు సరఫరా అయితే వెంటనే అప్రమత్తమై నీటిసరఫరాను నిలిపివేసి ప్రత్యామ్నాయంగా ట్యాంకర్ల ద్వారా పంపిణీ చేస్తామని వాటర్‌బోర్డు ఉన్నతాధికారొకరు తెలిపారు. కలుషిత నీటి సరఫరా ప్రాంతాలను వెంటనే పరిశీలించి కారణాలు తెలుసు కుంటున్నట్లు పేర్కొన్నారు. వాటర్‌బోర్డు సరఫరా చేసే నీళ్లు కలుషితంగా రావడంపై 'తాగునీటి పైపుల్లోంచి మురుగునీరు' అనే శీర్షికతో శుక్రవారం 'ఆంధ్రజ్యోతి' కథనం ప్రచురించింది. దీనికి వాటర్‌బోర్డు స్పందించింది. యుద్ధ ప్రతిపాదికన పనులు చేపట్టి కలుషిత నీళ్ల రాకుండా చర్యలు తీసుకుంటున్నట్లు ఉన్నతాధికారి తెలిపారు. మొబైల్ వ్యాన్ సౌకర్యంతో 64బృందాల ద్వారా నీటి నాణ్యత పరీక్షలు చేపడుతున్నామని, నీరు తాగడానికి సురక్షితమైందా.? బ్యాక్టీరియా ఇతర అవశేషాలు ఏమైనా ఉన్నాయా? వివరాలను కూడా సేకరిస్తున్నామని పేర్కొన్నారు. 'ఆంధ్రజ్యోతి' కథనంలో వెల్లడించిన ప్రభావిత ప్రాంతాల్లో జనరల్ మేనేజర్లు తనిఖీలు జరిపారు.

గోల్కొండ బోనాల సందర్భంగా ట్రాఫిక్ ఆంక్షలు

హైదరాబాద్ సిటీ, జూలై13(ఆంధ్రజ్యోతి): శ్రీ జగదాంబ మహాకాళి అమ్మవారి బోనాల సందర్భంగా గోల్కొండ పరిసర ప్రాంతాల్లో ఈనెల 14న ట్రాఫిక్ ఆంక్షలు అమల్లో ఉంటాయని ట్రాఫిక్ అడిషనల్ సీపీ విశ్వప్రసాద్ పేర్కొన్నారు. ఈనెల 14, 18, 21, 25, 28, ఆగస్టు-1, 4 తేదీల్లో అమ్మవారికి ప్రత్యేక పూజలు జరగనున్నాయి. ఈ నేపథ్యంలో ఆయా తేదీల్లో ఉదయం 8 నుంచి రాత్రి 11 వరకు ట్రాఫిక్ ఆంక్షలు, మళ్లింపులు అమల్లో ఉంటాయన్నారు. ముఖ్యంగా.. రామ్‌దేవ్‌గూడ నుంచి గోల్కొండ కోట వయా మక్కాయ్ దర్వాజ, లంగర్‌హౌజ్ నుంచి గోల్కొండ కోట వయా ఫతే దర్వాజ, షేక్‌పేట నాలా సెవెన్ టూంబ్స్ నుంచి గోల్కొండ కోట వయా బంజారా దర్వాజ ప్రాంతాల్లో రద్దీ ఎక్కువగా ఉంటుందని తెలిపారు. ఆయా ప్రాంతాల్లో పోలీసులు ఏర్పాటు చేసిన ప్రత్యామ్నాయ మార్గాల ద్వారా వాహనదారులు తమ గమ్యస్థానాలకు చేరుకోవాలని సూచించారు.

కొంప ముంచిన సోషల్‌మీడియా పోస్ట్

- మద్యం సీసా డ్యామేజ్ కాకుండా ప్యాకింగ్ ఎలా? అంటూ వీడియో
- అక్రమంగా గోవా నుంచి తెచ్చిన మద్యం కావడంతో అరెస్ట్

6

మూసీ వెంట దందా

నగరం నడిబొడ్డున కబ్జాలు

- ఖాళీస్థలాల్లో వ్యాపారాలు
- 8,529 నుంచి 12వేలకు ఆక్రమణలు
- నిర్మాణ వ్యర్థాలను పోస్తున్నా చర్యల్లేవ్
- సీసీ కెమెరాలన్నీ మాయం

మూసీనది వెంట భారీ దందా సాగుతోంది. నదికిరువైపులా విస్తారంగా ఖాళీ స్థలముండడంతో ఎక్కడికక్కడే కబ్జా చేస్తున్నారు. మూసీని పూడ్చేసి పార్కింగ్ ఏరియాగా మార్చుకొని కొందరు పెద్దఎత్తున ఆదాయం పొందుతున్నారు. ఇంకొందరైతే వివిధ రకాల షెడ్‌లను, గోదాములను ఏర్పాటు చేసి భారీగా వ్యాపారమే చేస్తున్నారు. రాత్రివేళ పెద్దఎత్తున నిర్మాణ వ్యర్థాలు పోస్తున్నా అధికారులకు పట్టింపులేకుండా పోయింది.



అఫ్జల్‌గంజ్ సమీపంలో మూసీ పై ఏర్పాటు చేసిన అక్రమ పార్కింగ్

పార్కింగ్ రసీదు

పెయిడ్ పార్కింగ్ అంటూ బోర్డు

హైదరాబాద్ సిటీ, జూలై 13 (ఆంధ్రజ్యోతి): మూసీ నదికి ఎఫ్‌టీఎల్ హద్దులు లేవు. బఫర్ జోన్ ఎంత వరకు వస్తుందనే రాళ్లు పెట్టలేదు. ఇది కబ్జాదారులకు అనువుగా మారింది. ఔటర్ రింగ్ రోడ్డు నార్సింగ్ నుంచి నగరంలోకి ప్రవేశించిన మూసీనదిని నాగోల్ బ్రిడ్జి వరకు దాదాపు 25కిలోమీటర్ల మేర పూర్తిగా కబ్జాకు గురైంది. మూసీనది వెంట నార్సింగ్, గండిపేట, మంచిరేవుల, పీరం చెరువు బఫర్ జోన్‌లో అనేక నిర్మాణాలు యథేచ్ఛగా చేపడుతున్నారు. కార్వాన్ గిర్కాపల్లి, రాంసింగ్‌పురా, మొఘల్‌కానాలా, కార్వాన్ పరిసర ప్రాంతాల్లో మూసీ పరివాహక ప్రాంతాన్ని కొందరు కబ్జా చేసి నిర్మాణాలు చేపట్టారు. రాంసింగ్‌పురా ప్రాంతంలో మండపాలు నిర్మించారు. జియాగూడ, మొఘల్ కానాలా, కేసరి హనుమాన్, గిరకపల్లి తదితర ప్రాంతాలలో కొందరు స్థానికులు చిన్నపాటి దుకాణాలనే ఏర్పాటు చేశారు. చాదర్‌ఘాట్ కాజ్ వే బ్రిడ్జి కింద నుంచి నీరు ప్రవహించేందుకు 18 ద్వారాలను నిర్మించారు. వీటిలో కేవలం 8 ద్వారాలే కనిపిస్తున్నాయి. చాదర్‌ఘాట్ మూసానగర్‌లో మూసీని ఆక్రమించి ఇళ్లను నిర్మించారు. ఇక అంబర్‌పేట, రామంతాపూర్, ముసారంబాగ్, నాగోల్ తదితర ప్రాంతాల్లో పెద్దఎత్తున మూసీని పూడ్చుతూ షెడ్‌లను నిర్మిస్తున్నారు. కొన్ని ప్రాంతాల్లో అయితే, మూసీ బఫర్‌జోన్‌లోకి చొచ్చుకొచ్చి లేఅవుట్లను వేశారు.

పెరిగిన అక్రమాలు

ఐదేళ్ల క్రితం మూసీనది వెంట ఆక్రమణలను గుర్తించేందుకు హైదరాబాద్ రెవెన్యూ యంత్రాంగం సర్వే చేసింది. ఎనిమిది మండల రెవెన్యూ అధికారులు సర్వే చేసి దాదాపు 8,529 ఆక్రమణలున్నట్లుగా గుర్తించారు. తాజాగా రెవెన్యూ, హెచ్ఎండీఏ, జీహెచ్ఎంసీ, వాటర్‌బోర్డు, పోలీసు, ఎన్‌ఫోర్స్‌మెంట్ విభాగం అధికారులు సంయుక్తంగా మూసీనది ఔటర్‌రింగ్‌రోడ్డులోకి ప్రవేశించే గండిపేట మండలం నుంచి తూర్పున ఔటర్‌రింగ్‌రోడ్డు ఘట్‌కేసర్ మండల పరిధి వరకు మొత్తం 14మండలాల పరిధిలో సర్వే చేశారు. 12,184 అక్రమణలున్నట్లు గుర్తించారు. ఐదేళ్ల తర్వాత హైదరాబాద్ రెవెన్యూ పరిధిలో దాదాపు 150 నుంచి 300ల వరకు అక్రమణ నిర్మాణాలు మూసీనదిలో వచ్చినట్లు తెలిసింది.

గతంలో ఏర్పాటు చేసిన సీసీ కెమెరాలన్నీ మాయం

మూసీనదిలో నిర్మాణ వ్యర్థాలను పోయకుండా ఎంఆర్‌డీసీఎల్ ఆధ్వర్యంలో రెండేళ్ల క్రితం కట్టుదిట్టమైన చర్యలు చేపట్టారు. మూసీవెంట నిర్మాణ వ్యర్థాలను పోసే ప్రాంతాలను గుర్తించి ఆయా ప్రాంతాల్లో ప్రత్యేక సీసీ కెమెరాలను ఏర్పాటు చేశారు. వాటిని ఎంఆర్‌డీసీఎల్ ఆధ్వర్యంలో పర్యవేక్షించడంతో పాటు కమాండ్ కంట్రోల్ సెంటర్‌కు అనుసంధానం చేసినట్లుగా అప్పటి అధికారులు వెల్లడించారు. పలుచోట్ల మూసీనది వెంట ఫెన్సింగ్ కూడా ఏర్పాటు చేశారు. కానీ ఆయా ప్రాంతాల్లోని సీసీ కెమెరాలు మాయమయ్యాయి. మూసీ వెంట గల ఫెన్సింగ్‌ను కూడా తొలగించి కొందరు వ్యాపారం చేస్తుండడం గమనార్హం.

ఉస్మానియా ఆస్పత్రి వద్ద పార్కింగ్ దందా

ఉస్మానియా ఆస్పత్రికి దక్షిణం వైపు ఉన్న మూసీనదిని అఫ్జల్‌గంజ్ లైన్‌లో పెద్దఎత్తున ఆక్రమించారు. మూసీ ఆక్రమణకు గురవకుండా ఏర్పాటు చేసిన ఫెన్సింగ్‌లోనే మట్టి పోసి వాహనాలకు పార్కింగ్ సదుపాయాన్ని కల్పిస్తున్నారు. 24గంటల పాటు పార్కింగ్ చేస్తే ఒక్కో వాహనానికి ఒక్కో రకమైన ఫీజు నిర్ణయించి రసీదు సైతం ఇస్తున్నారు. లారీకి రూ.400లు కాగా, కారుకు రూ.100, ఆటోకు రూ.50, ద్విచక్ర వాహనానికి రూ.20 వసూలు చేస్తున్నారు. విక్టోరియా ప్లే గ్రౌండ్‌కు ఎదురుగా ఉన్న మూసీనది వెంట కూడా ప్రైవేటు బస్సులకు పార్కింగ్ అడ్డాగా మారింది. ఒక్కో బస్సుకు రూ.500ల వరకు రుసుం వసూలు చేస్తున్నారు. అంబర్‌పేట అలీకేఫ్ దాటిన తర్వాత మూసీనది బ్రిడ్జి వెంట ఏర్పాటు చేసిన నాలుగు లేన్ల రోడ్డు వెంట నిర్మాణ వ్యర్థాలను పోసి ఆక్రమించేయత్నం చేస్తున్నారు.

దిల్‌సుఖ్‌నగర్‌లో అర్ధరాత్రి ఆకస్మిక ధర్నా

డీఎస్సీ వాయిదా వేయాలని నిరుద్యోగుల డిమాండ్..



ర్యాలీలో నినాదాలు చేస్తున్న నిరుద్యోగులు

చాదర్‌ఘాట్, జూలై 13(ఆంధ్రజ్యోతి): దిల్‌సుఖ్‌నగర్‌లో నిరుద్యోగులు శనివారం అర్ధరాత్రి ఆకస్మిక ధర్నాకు దిగారు. ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేస్తూ డీఎస్సీ వాయిదా వేయాలని, గ్రూప్-2, గ్రూప్-3 పోస్టులు పెంచిన తర్వాతే ఈ ఏడాది డిసెంబర్‌లో పరీక్షలు నిర్వహించాలని డిమాండ్ చేస్తూ భారీ ర్యాలీ నిర్వహించారు. దిల్‌సుఖ్‌నగర్ రాజీవ్‌చౌక్ నుంచి మెట్రో స్టేషన్ మీదుగా సరూర్‌నగర్ పీఎస్ వైపు ఈ ర్యాలీ సాగింది. ఒంటిగంట వరకూ ఆందోళన సాగుతూనే ఉంది. దీంతో మలక్‌పేట, సరూర్‌నగర్ పోలీసులు పెద్ద ఎత్తున మోహరించి నిరుద్యోగులకు నచ్చజెప్పి పంపించే పనుల్లో నిమగ్నమయ్యారు. దీంతో వాహనాల రాకపోకలకు తీవ్ర అంతరాయం ఏర్పడింది.

నిరుద్యోగ యువతి ఆత్మహత్యాయత్నం

కవాడిగూడ: గ్రూప్ 2, 3 పోస్టులు పెంచాలని డిమాండ్ చేస్తూ అశోక్‌నగర్‌లో నిరుద్యోగులు చేస్తున్న ఆందోళనలో శనివారం రాత్రి అపశ్రుతి చోటుచేసుకుంది. గ్రూప్ పరీక్షలకు ప్రిపేరవుతున్న భద్రాచలం జిల్లా కొత్తగూడేనికి చెందిన మదగం మిత్ర అనే యువతి ఆత్మహత్యాయత్నం చేసుకోవడం కలకలం రేపింది. ధర్నాలో అందరూ చూస్తుండగా డోలో650ఎంజీ మాత్రలు భారీ మోతాదులో నోట్లో వేసుకుంది. గమనించిన పోలీసులు ఆమెను హుటాహుటిన గాంధీ ఆస్పత్రికి తరలించారు.





పట్టా తీసుకుంటున్న విద్యార్థి హర్షవర్ధన్, పక్కన గోల్డ్‌మెడల్‌ను అందుకున్న జైష్ణవ్

వేడుకగా ఐఐఐటీ-హెచ్ 23వ స్నాతకోత్సవం

- 600 మందికి పైగా విద్యార్థులకు సర్టిఫికెట్ల ప్రదానం
- ఇన్‌స్టిట్యూట్ చరిత్రలో అత్యధికంగా ఒకేసారి 32 మందికి పీహెచ్‌డీలు

హైదరాబాద్ సిటీ, రాయదుర్గం, జూలై 13 (ఆంధ్రజ్యోతి): ఇంటర్నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ, హైదరాబాద్ (ఐఐఐటీ-హెచ్) తమ 23వ స్నాతకోత్సవాన్ని శనివారం గచ్చిబౌలి బ్రహ్మకుమారీస్ శాంతిసరోవర్‌లోని గ్లోబల్ పీస్ ఆడిటోరియంలో ఘనంగా నిర్వహించింది. 600మందికి గ్రాడ్యుయేషన్ సర్టిఫికెట్లను అందజేయడంతో పాటుగా 32 మందికి పీహెచ్‌డీలు అందజేశారు. ఈ స్నాతకోత్సవానికి ముఖ్య అతిథిగా, కన్వొకేషన్ స్పీకర్‌గా సీఎస్ఐఆర్ డైరెక్టర్ జనరల్, డీఎస్ఐఆర్ సెక్రటరీ డాక్టర్ ఎన్.కలైసెల్వి పాల్గొన్నారు. గ్రాడ్యుయేషన్


మిగతా 8వ పేజీలో..

- అధికారిక లెక్కల ప్రకారమే 26 శాతం..
- క్షేత్రస్థాయిలో అంతకంటే ఎక్కువే
- అయినా.. నిర్వహణకు రూ.32 కోట్లు ఖర్చు
- టాయిలెట్ల ఏర్పాటుకు రూ.56 కోట్లకుపైగా
- ఒక్కోసారి ఒక్కోలా లెక్కలు



గాయబ్..

నగరంలో కనిపించని స్వచ్ఛ టాయిలెట్లు



మహానగరంలోని పలు ప్రాంతాల్లో స్వచ్ఛ టాయిలెట్లు మాయమయ్యాయి. బహిరంగ మల, మూత్ర విసర్జన రహితంగా(ఓడీఎఫ్ ప్లస్ ప్లస్) హైదరాబాద్‌ను తీర్చిదిద్దే క్రమంలో కోట్లాది రూపాయలు వెచ్చించి ఏర్పాటు చేసిన మరుగుదొడ్లలో 26 శాతం ప్రస్తుతం కనిపించడం లేదు. అక్కడక్కడా ఉన్న వాటిలోనూ మెజార్టీ వినియోగంలో లేవు. స్వచ్ఛ భారత్‌లో మెరుగైన ర్యాంకు లక్ష్యంగా నగరంలో ఏర్పాటు చేసిన స్వచ్ఛ, షీ టాయిలెట్లు మాయమవడం వెనుక ఎవరి హస్తం ఉందన్నది చర్చనీయాంశంగా మారింది.

హైదరాబాద్ సిటీ, జూలై 13 (ఆంధ్రజ్యోతి): ప్రధాన, అంతర్గత రహదారుల పక్కన ఫుట్‌పాత్‌లపై విస్తృతంగా టాయిలెట్లు ఏర్పాటుచేశారు. ఇందుకోసం రూ.56.56 కోట్లు వెచ్చించారు. నిర్వహణ పేరిట ఇప్పటికే రూ.32 కోట్లకుపైగా ఖర్చు చేశారు. గతంలో ప్రతి రహదారిలో కనిపించిన ప్రీ ఫ్యాబ్రికేటెడ్ టాయిలెట్లు(పీఎఫ్‌టీ) ప్రస్తుతం చాలా ప్రాంతాల్లో కనిపించడం లేదు. ఇటీవలి కౌన్సిల్ సమావేశంలో ఓ సభ్యుడు అడిగిన ప్రశ్నకు సమాధానంగా.. గ్రేటర్‌లో 4,826 సీటింగ్‌తో 1,857 పబ్లిక్ టాయిలెట్లు ఏర్పాటు చేయగా.. ప్రస్తుతం 1,385 ఉన్నట్టు పేర్కొన్నారు. అధికారిక లెక్కల ప్రకారం 472 టాయిలెట్లు మాయమయ్యాయి. ఏడాది క్రితం అధికారులు వెల్లడించిన వివరాలతో పోలిస్తే ప్రస్తుతం 788 టాయిలెట్లు తక్కువగా ఉండడం గమనార్హం. యేటికేడు మరుగుదొడ్ల సంఖ్య క్రమేణా తగ్గుతోంది.

రూ.90 కోట్లు ఖర్చు

గర్ప్, బిల్ట్ ఆపరేట్ ట్రాన్స్‌ఫర్(బీఓటీ), సులభ్ కాంప్లెక్స్‌లు మినహా నగరంలో మెజార్టీ ప్రీ ఫ్యాబ్రికేటెడ్ టాయిలెట్లున్నాయి. ఒక్కో పీఎఫ్‌టీకి సీటింగ్ సామర్థ్యాన్ని బట్టి రూ.5 లక్షల నుంచి రూ.8 లక్షల వరకు ఖర్చు చేశారు. పది వరకు టాయిలెట్లను ఒక క్లస్టర్‌గా పేర్కొంటూ నిర్వహణ బాధ్యతలను ఏజెన్సీలకు అప్పగించారు. రోజూ మూడు పర్యాయాలు

మిగతా 8వ పేజీలో..

కొంప ముంచిన సోషల్‌మీడియా పోస్ట్

- మద్యం సీసా డ్యామేజ్ కాకుండా ప్యాకింగ్ ఎలా? అంటూ వీడియో
- అక్రమంగా గోవా నుంచి తెచ్చిన మద్యం కావడంతో అరెస్ట్

బంజారాహిల్స్, జూలై 13(ఆంధ్రజ్యోతి): సోషల్ మీడియా పిచ్చి ఓ వ్యక్తిపై క్రిమినల్ కేసు నమోదు చేసేలా చేసింది. నిబంధనల ప్రకారం ట్యాక్స్ కట్టకుండా పది మద్యం సీసాలను గోవా నుంచి తీసుకువచ్చి అక్రమంగా నిల్వ ఉంచిన వ్యక్తిని ఎక్సైజ్ పోలీసులు అరెస్ట్ చేశారు. మద్యం బాటిళ్లను సీజ్ చేశారు. జూబ్లీహిల్స్ రోడ్డు నంబరు2 రిజెన్సీ ఆర్కేడ్‌లో ఉండే బొరిగోర్ల ఆనంద్ పాల్ అలియాస్ కోటి యాదవ్ గోవా నుంచి పది మద్యం సీసాలను నగరానికి తీసుకువచ్చి అక్రమంగా నిల్వ చేశాడు. అయితే, రవాణా సమయంలో మద్యం సీసాలను ఎలా ప్యాకింగ్ చేయాలి.. అవి డ్యామేజ్ కాకుండా ఎక్కడికైనా ఎలా తీసుకెళ్లాలనే దానిపై రెండు నిమిషాల నిడివి గల వీడియో తీసి ఫేస్‌బుక్‌లో కొద్ది రోజుల క్రితం పోస్టు చేశాడు. ఈ పోస్టును చూసిన డిస్ట్రిక్ట్ టాస్క్‌ఫోర్స్ హైదరాబాద్ బృందం డీపీఈఓ సీహెచ్ విజయ్, ఎక్సైజ్ ఇన్‌స్పెక్టర్ వాసుదేవ రావు సంయుక్తధ్వర్యంలో దాడులు నిర్వహించారు. ఎక్సైజ్ డ్యూటీ కట్టకుండా నిబంధనలకు విరుద్ధంగా 750 లీటర్ల చొప్పున 10 మద్యం సీసాలను తీసుకు వచ్చినట్లు గుర్తించారు. మద్యం సీసాలను సీజ్ చేసి పాల్‌ను అదుపులోకి తీసుకొని జూబ్లీహిల్స్ పోలీసులకు అప్పగించారు.

అరుణాచలానికి ఆర్టీసీ ప్రత్యేక బస్సులు

చాదర్‌ఘాట్, జూలై 13 (ఆంధ్రజ్యోతి): పవిత్ర గురుపౌర్ణమి పర్వదినాన్ని పురస్కరించుకుని తమిళనాడులోని ప్రసిద్ధ పుణ్యక్షేత్రమైన అరుణాచలం గిరి ప్రదక్షిణకు వెళ్లే భక్తుల సౌకర్యార్థం ఆర్టీసీ రంగారెడ్డి రీజియన్ ఈనెల 19వ తేదీన ప్రత్యేక బస్సులను నడపనున్నట్లు రీజినల్ మేనేజర్ జె.శ్రీలత తెలిపారు. ఈ ప్రత్యేక బస్సులు జూలై 19న రాత్రి 8గంటలకు నగరంలోని ఎంజీబీఎస్ నుంచి బయల్దేరి మరుసటి రోజైన 20వ తేదీన ఉదయం ఏపీలోని కాణిపాకం చేరుకుంటుందన్నారు. కాణిపాకంవినాయక ఆలయాన్ని దర్శించుకున్న తర్వాత తమిళనాడులోని వేలూరులోని స్వర్ణ దేవాలయానికి చేరుకుని దర్శనానంతరం అరుణాచలం ఆలయానికి చేరుకుంటుందన్నారు. 21వ తేదీన గురుపౌర్ణమి రోజున అరుణాచలంలో గిరిప్రదక్షిణ అనంతరం సాయంత్రం 6 గంటలకు బయల్దేరి 22వ తేదీన ఉదయం 6గంటలకు నగరానికి చేరుకుంటుందని ఆర్ఎం వివరించారు. ప్రయాణ చార్జిగా ఒక్కరికి రూ.3,700 చెల్లించాల్సి ఉంటుందన్నారు. ముందుగా టికెట్లను రిజర్వు చేసుకోడానికి రిజర్వేషన్ సౌకర్యం స్వయంగా బస్‌స్టేషన్లలో, ఏటీబీ ఏజెంట్ల వద్ద గానీ, ఆన్‌లైన్ రిజర్వేషన్ ద్వారా గానీ పొందవచ్చని ఆర్ఎం తెలిపారు.

'జిమ్నాస్టిక్'లో హైదరాబాద్‌కు 19 పతకాలు

హైదరాబాద్ (ఆంధ్రజ్యోతి క్రీడాప్రతినిధి): ఇంటర్ సాయ్ ఆర్టిస్టిక్ జిమ్నాస్టిక్ టోర్నమెంట్‌లో హైదరాబాద్ 'సాయ్ ట్రైనింగ్ సెంటర్'లోని క్రీడాకారులు 19 పతకాలు కొల్లగొట్టి సంచలనం సృష్టించారు. జూనియర్ బాలుర విభాగంలో షేక్.అఫ్తాబ్ ఒక స్వర్ణం, ఒక రజతం, రెండు కాంస్యాలు, వీఎస్ఎస్ శ్రీకర్ ఒక కాంస్యం సాధించారు. సబ్ జూనియర్ బాలికల విభాగంలో కె.హిమశ్రీ ఒక రజతం, ఒక కాంస్యం, జూనియర్ కేటగిరిలో నిధి మిట్టల్ నాలుగు రజతాలు, ఒక కాంస్యం, బాలుర సబ్ జూనియర్ విభాగంలో మేదాన్ష్‌గౌండ్ ఒక కాంస్యం నెగ్గారు. సీనియర్ విభాగంలో జి.సిద్ధార్థ్ నాలుగు స్వర్ణాలు, ఒక రజతం, ఒక కాంస్యం సొంతం చేసుకున్నారు.



కాంగ్రెస్‌లో చేరిన ఎమ్మెల్యే ప్రకాశ్‌గౌడ్‌ను సన్మానిస్తున్న రాజేంద్రనగర్ డివిజన్ కాంగ్రెస్ అధ్యక్షుడు ప్రభాకర్‌రెడ్డి, తదితరులు

ఎమ్మెల్యే ప్రకాశ్‌గౌడ్‌కు సన్మానం

రాజేంద్రనగర్, జూలై 13 (ఆంధ్రజ్యోతి): బీఆర్ఎస్ పార్టీ నుంచి కాంగ్రెస్ పార్టీలో చేరిన రాజేంద్రనగర్ ఎమ్మెల్యే ప్రకాశ్‌గౌడ్‌ను శనివారం మైలార్‌దేవుపల్లిలోని ఆయన నివాసంలో పలువురు కాంగ్రెస్ పార్టీ నాయకులు కలిసి సన్మానించారు. ఎమ్మెల్యే ప్రకాశ్‌గౌడ్‌ను కలిసిన వారి లో రాజేంద్రనగర్ డివిజన్ కాంగ్రెస్ అధ్యక్షుడు బొక్క ప్రభాకర్‌రెడ్డి, కో ఆర్డినేటర్ పలుగుచెరువు మహేశ్, నాయకులు అనుముల జాన్‌పాల్, కోరని శ్యామ్, సాయికిరణ్, మాజీ కౌన్సిలర్ కె.ఎస్ దయానంద్, పంబాల రాజు, కోరని ఉదయ్‌కిరణ్ తదితరులు ఉన్నారు. ఎమ్మెల్యే ప్రకాశ్ గౌడ్ మాట్లాడుతూ పాత కొత్త నాయకులంతా కలిసి పనిచేయాలన్నారు.



ప్రసంగిస్తున్న ట్రాఫిక్ ట్రైనింగ్ ఇనిస్టిట్యూట్ ఏసీపీ శంకర్‌రాజు

ప్రతి ఒక్కరూ ట్రాఫిక్ నిబంధనలు పాటించాలి

అఫ్జల్‌గంజ్, జూలై 13 (ఆంధ్రజ్యోతి): గోషామహల్ సీటీసీలో శనివారం పోలీస్ ట్రైనీ విద్యార్థులు, సిబ్బందికి రోడ్డు ప్రమాదాలు-నివారణ అనే అంశంపై పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ట్రాఫిక్ ట్రైనింగ్ ఇనిస్టిట్యూట్ ఏసీపీ శంకర్‌రాజు మాట్లాడుతూ ప్రమాదాల నివారణ ప్రతి ఒక్కరి బాధ్యత అని, ట్రాఫిక్ నిబంధనలను ప్రతిఒక్కరూ పాటించాలని సూచించారు. యువత ఎక్కువగా ఓవర్ స్పీడ్, రాంగ్‌రూట్, సిగ్నల్ జంపింగ్, సెల్‌ఫోన్ డ్రైవింగ్ చేస్తున్నారన్నారు. సిగ్నల్ జంపింగ్ ప్రమాదకరమని, ముఖ్యంగా రెడ్ సిగ్నల్ పడినప్పుడు తప్పనిసరిగా వాహనం ఆపాలన్నారు. కార్యక్రమంలో సుమారు 150 ట్రైనీ పోలీస్ విద్యార్థులతోపాటు ప్రిన్సిపాల్ ఎం.ఆనంద్, వైస్ ప్రిన్సిపాల్ విక్రమ్‌దేవ్, నర్సింహమూర్తి, ఆర్ఐ ఆర్ఎస్ఐ కుమార్, అశోక్‌కుమార్, సీటీసీ గోషామహల్ సిబ్బంది పాల్గొన్నారు.



మాధవీలత కనిపించడంలేదటూ పోస్టర్లు ప్రదర్శిస్తూ నిరసన వ్యక్తం చేస్తున్న బీఆర్ఎస్ కార్యకర్తలు

మూసీ పరివాహక ప్రాంతాల్లో శ్రీనివాస్ యాదవ్ పర్యటన

అఫ్జల్‌గంజ్, జూలై 13 (ఆంధ్రజ్యోతి): గోషామహల్ నియోజకవర్గం పార్టీ కార్యకర్తలతో కలిసి బీఆర్ఎస్ పార్లమెంట్ నియోజకవర్గం అభ్యర్థి గడ్డం శ్రీనివాస్ యాదవ్ శనివారం మూసీ పరివాహక ప్రాంతాలను సందర్శించారు. మూసీ సుందరీకరణ ప్రాజెక్టుతో దాదాపు 2 వేల గృహాలు అస్తిత్వం కోల్పోయే అవకాశముందన్నారు. ఇళ్లు కోల్పోయే వారికి అండగాఉంటానని, త్వరలోనే ముఖ్యమంత్రిని కలిసి సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకుంటానన్నారు. లోక్‌సభ ఎన్నికల్లో ప్రజలను మభ్యపెట్టే మాటలతో బస్తీల్లో తిరిగిన బీజేపీ అభ్యర్థి మాధవీలత ప్రస్తుతం ప్రజలు ఇబ్బందుల్లో ఉన్నప్పుడు కనిపించకుండాపోయారని విమర్శించారు. కార్యక్రమంలో మంగళ్‌హాట్ డివిజన్ ఇన్‌చార్జి శ్రీనివాస్ యాదవ్, లోకేశ్, సతీష్, సురేశ్, రాజుతోపాటు సీనియర్ నాయకులు, కార్యకర్తలు పెద్దసంఖ్యలో పాల్గొన్నారు.



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న మైలార్‌దేవుపల్లి డివిజన్ కార్పొరేటర్ తోకల శ్రీనివాస్‌రెడ్డి

ఆస్తులను కాపాడుకోవడానికే కాంగ్రెస్‌లో చేరిక

- ఎమ్మెల్యే ప్రకాశ్‌గౌడ్‌పై కార్పొరేటర్ శ్రీనివాస్‌రెడ్డి ఆరోపణ

రాజేంద్రనగర్, జూలై 13 (ఆంధ్రజ్యోతి): రాజేంద్రనగర్ నియోజకవర్గంలో వందల ఎకరాలను కబ్జా చేసిన బీఆర్ఎస్ ఎమ్మెల్యే టి. ప్రకాశ్‌గౌడ్ వాటిని కాపాడుకోవడానికే ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డితో డీల్ కుదుర్చుకుని కాంగ్రెస్‌లో చేరారని, ఆయనకు నియోజకవర్గం అభివృద్ధిపై ఎలాంటి ప్రేమ లేదని మైలార్‌దేవుపల్లి డివిజన్ బీజేపీ కార్పొరేటర్ తోకల శ్రీనివాస్‌రెడ్డి ఆరోపించారు. శనివారం కాటేదాన్‌లోని బీజేపీ పార్టీ కార్యాలయంలో మైలార్‌దేవుపల్లి డివిజన్ బీజేపీ అధ్యక్షుడు అడికె జనార్దన్, చేవెళ్ల పార్లమెంట్ నియోజకవర్గం దళితమోర్చా కన్వీనర్ జోగి రవి, ఓబీసీ మోర్చా రాజేంద్రనగర్ అధ్యక్షుడు బొమ్మరాజు నర్సింహ్మా, సీనియర్ నాయకులు ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఎమ్మెల్యే ప్రకాశ్‌గౌడ్ పై తీవ్ర ఆరోపణలు చేశారు. ఎమ్మెల్యే ప్రకాశ్‌గౌడ్ ప్రభుత్వ భూములను కబ్జా చేస్తుంటే చూస్తు ఊరుకోమని, బీజేపీ ఆయన అవినీతిపై పోరాడుతుందన్నారు. విలేకరుల సమావేశంలో బీజేపీ నాయకులు ఎ.శివశంకర్, తుమ్మల రాజ్‌కుమార్, గోపాల్‌రాజు, రవి, రామారావు, శేఖర్, కురుమయ్య, శంకర్‌రెడ్డిలు పాల్గొన్నారు.



ప్రిన్సిపాల్ చంద్రమోహన్‌రెడ్డితో కళాశాల బృందం

ఉపాధ్యాయులు నైపుణ్యాలను మెరుగుపర్చుకోవాలి

నార్సింగ్, జూలై 13 (ఆంధ్రజ్యోతి): మారుతున్న కాలానికి అనుగుణంగా ఫ్యాకల్టీలు తమలోని నైపుణ్యాలను మెరుగుపర్చుకొని విద్యార్థులకు ఉత్తమ బోధన అందించాలని మహాత్మాగాంధీ ఇనిస్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ ప్రిన్సిపాల్ డాక్టర్ చంద్రమోహన్‌రెడ్డి అన్నారు. కళాశాల సీఎస్ఈ, ఐటీ, ఈటీ డిపార్ట్‌మెంట్స్ సంయుక్తంగా ఫుల్‌స్టాక్ డెవలప్‌మెంట్ కార్యక్రమాన్ని శనివారం నిర్వహించారు. ముఖ్య అతిథిగా ప్రిన్సిపాల్ చంద్రమోహన్‌రెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఫుల్‌స్టాక్ డెవలప్‌మెంట్ మీద ఫ్యాకల్టీలకు శిక్షణ ఇవ్వడం వల్ల భవిష్యత్‌లో విద్యార్థులకు ఉద్యోగ అవకాశాలు మెరుగ్గా ఉంటాయని ఆయన సూచించారు. రానున్న కాలానికి అనుగుణంగా అధ్యాపకులకు ఇలాంటి ప్రోగ్రామ్స్ ఎంతగానో దోహదపడతాయని ఆయన సూచించారు. కార్యక్రమంలో డాక్టర్ శ్యామ్‌సుందర్, ఆర్‌కె. రెడ్డి, విజయలక్ష్మీ, కళాశాల సిబ్బంది పాల్గొన్నారు.

రైల్వే స్టేషన్‌లో సెల్‌ఫోన్ దొంగల పట్టివేత

సికింద్రాబాద్ రైల్వే స్టేషన్, జూలై 13 (ఆంధ్రజ్యోతి): రైల్వేస్టేషన్‌లో ప్రయాణికుల సెల్‌ఫోన్ చోరీ చేసిన నిందితుడిని సికింద్రాబాద్ డివిజన్ ఆర్పీఎఫ్ నాగమ్మ శక్తి మహిళా కానిస్టేబుళ్లు పట్టుకున్నారు. బేగంపేట్ ఆర్పీఎఫ్ ఎస్సై నసీమా తెలిపిన వివరాల ప్రకారం.. సికింద్రాబాద్ రైల్వేస్టేషన్‌లో శుక్రవారం మధ్యరాత్రి సమయంలో సికింద్రాబాద్ డివిజన్ ఆర్పీఎఫ్ నాగమ్మ శక్తి మహిళా కానిస్టేబుళ్లు సుధ, వందనలు మాటువేశారు. రైలు ప్రయాణికులు రైలు ఎక్కే సమయంలో ప్రయాణికుల సెల్‌ఫోన్ కొట్టేస్తుండగా రెడ్‌హ్యాండెడ్‌గా పట్టుకున్నారు. అదేవిధంగా మరోచోట రైల్వే స్టేషన్‌లో రైలు ఎక్కుతున్న ప్రయాణికుల జేబుల నుంచి సెల్‌ఫోన్ కొట్టేసిన మరో నిందితుడిని ఆర్పీఎఫ్ పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. నిందితుడి నుంచి సెల్‌ఫోన్లను స్వాధీనం చేసుకున్నారు.

వైభవంగా జగన్నాథ రథయాత్ర

రాజేంద్రనగర్, జూలై 13 (ఆంధ్రజ్యోతి): అత్తాపూర్ ఇస్కాన్ దేవాలయం ఆధ్వర్యంలో శనివారం జగన్నాథ స్వామి రథయాత్ర నిర్వహించారు. ఇస్కాన్ దేవాలయ జనరల్ మేనేజర్ సచితానందన్ హరిదాస్, దేవాలయ ప్రతినిధి మధుర కన్నయ్య దాస్‌ల ఆధ్వర్యంలో ఈ రథయాత్ర జరిగింది. మధ్యాహ్నం 2 గంటలకు దేవాలయ ప్రాంగణం నుంచి రథయాత్ర ప్రారంభమై తేజస్విని నగర్ కాలనీ నుంచి పీవీ నర్సింహారావు ఎక్స్‌ప్రెస్ వే పిల్లర్ నంబర్ 175 వద్ద గల ఎస్‌బీఆర్ గార్డెన్ కు చేరుకుంది. ఈ రథయాత్రలో వందల సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు. ఎస్‌బీఆర్ గార్డెన్‌లో సాయంత్రం సాంస్కృతిక కార్యక్రమాలను నిర్వహించారు. రథయాత్రలో ఇస్కాన్ దేవాలయ ముఖ్య స్వాములు సీతరామదాసు, వేదాంత చైతన్య దాస్, ప్రదేశం దాస్, వరద క్రిష్ణ దాస్, చైతన్య అవతార్ దాస్‌లు హాజరయ్యారు. రథాన్ని లాగడం ద్వారా మోక్షం లభిస్తుందన్నారు. రథయాత్రలో పాల్గొనే భక్తులందరికీ అన్నదానం నిర్వహించారు.



జగన్నాథ స్వామి రథయాత్రలో భక్తులు



మణికొండలో జగన్నాథుని రథాయాత్ర

మణికొండలో..

నార్సింగ్, జూలై 13 (ఆంధ్రజ్యోతి): మణికొండ పంచవటి కాలనీ రామాయలం వద్ద జగన్నాథ రథాయాత్రను శనివారం ప్రారంభించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా మున్సిపల్ వైస్ చైర్మన్ నరేందర్‌రెడ్డి, కాలనీ అధ్యక్షుడు సీతారాం ధూళిపాళ్ల పాల్గొన్నారు.

చిన్నారుల భగవద్గీత శ్లోకాలు, ఆటపాటలతో రథాయాత్ర విశిష్టతను తెలియజేశారు. కార్యక్రమంలో అధ్యక్షుడు లక్ష్మీనారాయణ, రామారావు, భీమ్‌రెడ్డి, పుల్లారావు, మూర్తి, శివ, భక్తులు పెద్దఎత్తున పాల్గొన్నారు.

పార్లమెంట్‌లో బీసీ బిల్లు పెట్టాలని

ఆగస్టు 6న చలో ఢిల్లీ

- ఎంపీ ఆర్. కృష్ణయ్య

బర్కత్‌పుర, జూలై 13 (ఆంధ్రజ్యోతి): పార్లమెంట్‌లో బీసీ బిల్లు పెట్టి చట్టసభల్లో 50 శాతం రిజర్వేషన్లు కల్పించాలని, బీసీల సంక్షేమానికి బడ్జెట్‌లో 2 లక్షల కోట్లు కేటాయించాలని డిమాండ్ చేస్తూ ఆగస్టు 6న చలో ఢిల్లీ పార్లమెంట్ ముట్టడి కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు రాజ్యసభ సభ్యుడు ఆర్. కృష్ణయ్య వెల్లడించారు. రెండు తెలుగు రాష్ట్రాలతో పాటు కర్నాటక, ఉత్తరప్రదేశ్, హరియాణ, తమిళనాడు రాష్ట్రాల నుంచి పెద్ద ఎత్తున బీసీ సంఘాల ప్రతినిధులు వేలాదిగా ఢిల్లీకి తరలివస్తున్నారని తెలిపారు. శనివారం బషీర్‌బాగ్ ప్రెస్‌క్లబ్‌లో జాతీయ బీసీ యువజన సంఘం అధ్యక్షుడు గువ్వల భరత్‌కుమార్ ఆధ్వర్యంలో బీసీ సంఘాల కోర్ కమిటీ సమావేశం నిర్వహించారు. సమావేశానికి ముఖ్య అతిథిగా హాజరైన ఆర్.కృష్ణయ్య మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం దిగివచ్చేంతా వరకు బీసీల పోరాటం ఆగదన్నారు. కేంద్రంలో బీసీలకు ప్రత్యేక మంత్రిత్వ శాఖను ఏర్పాటు చేయాలని, క్రిమిలేయర్‌ను రద్దు చేయాలని, విద్య, ఉద్యోగ రిజర్వేషన్లను 56 శాతానికి పెంచాలని డిమాండ్ చేశారు. ప్రైవేట్ రంగంలో ఎస్సీ, ఎస్టీ, బీసీలకు రిజర్వేషన్లు ప్రవేశపెట్టాలని, కేంద్రంలో ఖాళీగా ఉన్న 16 లక్షల ఉద్యోగాలను భర్తీ చేయాలని డిమాండ్ చేశారు.



సమావేశంలో అభివాదం చేస్తున్న ఎంపీ ఆర్. కృష్ణయ్య, గువ్వల భరత్‌కుమార్, తదితరులు

ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ మాదిరిగా బీసీలకు సామాజిక రక్షణ భద్రతకై ప్రత్యేక చట్టం తీసుకురావాలని డిమాండ్ చేశారు. ఫీజు రీయింబర్స్‌మెంట్ పథకాన్ని దేశవ్యాప్తంగా అమలు చేయాలని డిమాండ్ చేశారు.

కార్యక్రమంలో బీసీ సంఘాల నాయకులు ప్రవీణ్ ముదిరాజ్, జి. అనంతయ్య, సతీష్, నాగరాజు, శ్రీధర్, రోహిత్, ప్రణీత, ఉదయ్, మల్లికార్జున్, బి. పవన్ తదితరులు పాల్గొన్నారు.

మహారాష్ట్ర శాసనసభ ఎన్నికల్లో

పది మంది ఎమ్మెల్యేలను గెలిపించుకునేందుకు మజ్లిస్ వ్యూహం

హైదరాబాద్, జూలై 13 (ఆంధ్రజ్యోతి): మహారాష్ట్రలో నెలకొన్న రాజకీయపరిణామాలను సానుకూలంగా మలుచుకుని రానున్న శాసన సభ ఎన్నికల్లో కనీసం పది స్థానాలను దక్కించుకునేందుకు ఆలిండియా మజ్లిస్ ఇత్తెహాదుల్ ముస్లిమీన్ (ఏఐఎంఐఎం) పావులు కదుపుతోంది. దళితులు, ఓబీసీల సమన్వయంతో ముస్లిం మైనారిటీ ఓటర్లు అధికంగా నివసించే నియోజకవర్గాల్లో పార్టీని పటిష్టం చేయడానికి ప్రణాళిక సిద్ధం చేయాలని ఆపార్టీ అధినేత అసదుద్దీన్ ఒవైసీ మహారాష్ట్ర మజ్లిస్‌పార్టీ శ్రేణులకు మార్గనిర్దేశం చేశారు. లోకసభ ఎన్నికల్లో మహారాష్ట్ర నుంచి మైనారిటీ వర్గం అభ్యర్థులను గెలిపించుకోలేకపోవడంపై విశ్లేషణ చేసి రానున్న అక్టోబర్‌లో జరిగే ఎన్నికల్లో కనీసం పది స్థానాలను కైవసం చేసుకునేందుకు పకడ్బందీ వ్యూహాన్ని ఖరారు చేసుకోవాలని ఆదేశించినట్టు తెలిసింది. శనివారం ఔరంగాబాద్‌లో మలక్‌పేట మజ్లిస్ ఎమ్మెల్యే అహ్మద్‌బిన్ అబ్దుల్లా బలాలతో కలిసి మహారాష్ట్ర పార్టీ అధ్యక్షుడు సయ్యెద్ ఇంతియాజ్ జలీల్‌తో సమావేశమయ్యారు. రానున్న శాసన సభ ఎన్నికల కోసం మజ్లిస్ అనుసరించవలిసిన రాజకీయ వ్యూహాలపై చర్చించారు.



మహారాష్ట్ర మజ్లిస్ పార్టీ నేతలతో ఔరంగాబాద్‌లో సమావేశమైన ఆ పార్టీ అధ్యక్షుడు అసదుద్దీన్ ఒవైసీ

మహారాష్ట్ర లోని వివిధ జిల్లాల మజ్లిస్ పార్టీ అధ్యక్షులు, పార్టీ సీనియర్ నేతలతో వేర్వేరుగా సమావేశమై శాసనసభ ఎన్నికలపై ఓవైసీ చర్చించారు మైనారిటీ వర్గం ఓట్లు చీలిపోకుండా శాసనసభ ఎన్నికల వ్యూహాన్ని రూపొందించుకోవాలని సూచించినట్టు సమాచారం. తమతో కలిసి వచ్చేరాజకీయ పార్టీలతో అవగాహనతో ఎన్నికల్లో పోటీకి సిద్ధం కావాలని సూచించినట్టు తెలిసింది.



గ్రాడ్యుయేషన్ డే వేడుకలో విద్యార్థులు, ఉపాధ్యాయులు

చైతన్య భారతిలో గ్రాడ్యుయేషన్ డే

నార్సింగ్, జూలై 13 (ఆంధ్రజ్యోతి): చైతన్య భారతి ఇనిస్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీలో 4వ గ్రాడ్యేయేషన్ డే నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా విశిష్ట శాస్త్రవేత్త, డీఆర్‌డీఎల్ హైదరాబాద్ డైరెక్టర్ శ్రీనివాస మూర్తి, ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ సీవీ నరసింహులు పాల్గొన్నారు. అనంతరం నరసింహులు చేతులు మీదుగా వేడుకలను ప్రారంభించారు. 2100 మంది గ్రాడ్యుయేట్‌లకు డిగ్రీలు పదానం చేశారు. ప్రతిభ కనబర్చిన వారికి బంగారు పతకాలు అందజేశారు. కార్యక్రమంలో ప్రొఫెసర్‌లు ఎం.రాములు, సీనియర్ డైరెక్టర్ అశ్వినీ వేణుగోపాల్, విద్యార్థులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



మహిళా కండక్టర్ల సదస్సులో మాట్లాడుతున్న ఎస్‌డబ్ల్యూ యూఐ ఎన్‌టీయూసీ జాతీయ ప్రధానకార్యదర్శి ఆర్‌డీ.చంద్రశేఖర్, నేతలు

మహిళా కండక్టర్లకు సెకండ్‌షిఫ్ట్ డ్యూటీలు వద్దు

- ఎస్‌డబ్ల్యూయూఐఎన్‌టీయూసీ

హైదరాబాద్‌సిటీ, జూలై 13 (ఆంధ్రజ్యోతి): ఆర్టీసీలో మహిళా కండక్టర్లకు సెకండ్‌షిఫ్ట్ డ్యూటీలు నిలిపివేయాలని ఎస్‌డబ్ల్యూయూ ఐఎన్‌టీయూసీ జాతీయ ప్రధానకార్యదర్శి ఆర్‌డీ.చంద్రశేఖర్ అన్నారు. ఎస్‌డబ్ల్యూ యూఐఎన్‌టీయూసీ మహిళా విభాగం ఆధ్వర్యంలో తెలంగాణ ఆర్టీసీ మహిళా కండక్టర్ల సదస్సును శనివారం నిర్వహించారు. సదస్సులో మహిళా కండక్టర్లు ఎదుర్కొంటున్న సమస్యలపై ఆయన మాట్లాడుతూ ఆర్టీసీలో మహిళా కండక్టర్ల పాత్ర చాలా ప్రధానమైందన్నారు. ప్రధానకార్యదర్శి అబ్రహం మాట్లాడుతూ చిన్నచిన్న కేసుల్లో మహిళా కండక్టర్లను సస్పెండ్ చేయవద్దని సూచించారు. కొంతమంది అధికారులు మహిళా కండక్టర్లకు కష్టమైన డ్యూటీలేవేస్తూ వేధిస్తున్నారన్నారు. కార్యక్రమంలో నాయకులు సునీల్ శ్రీజెన్ సుశీల్, జక్కుల మల్లేష్, ఆఫీఎఖాన్, సుధాకర్, ఎల్.రమేష్ తదితరులు పాల్గొన్నారు.

కాశీ విశాలక్షి అమ్మవారికి బంగారు బోనం

చాంద్రాయణగుట్ట, జూలై 13 (ఆంధ్రజ్యోతి): అష్టాదశ శక్తిపీఠాల్లో ఒకటైన కాశి విశాలాక్షి అమ్మవారికి లాల్‌దర్వాజ సింహవాహిని శ్రీ అమ్మవారి తరపున శనివారం బంగారుబోనం, పట్టు వస్త్రాలను సమర్పించారు. ఆలయ కమిటీ ప్రతినిధులు మాణిక్‌ప్రభుగౌడ్, కె.విష్ణుగౌడ్, వెంకటేశ్, నర్సింగ్‌రావు, సీరా రాజ్‌కుమార్, వినోద్‌కుమార్, శేష నారాయణ, విఠల్, రవికుమార్, నర్సింహాగౌడ్, శ్రీనివాస్ పాల్గొన్నారు.



చైర్మన్ మెట్టు సాయికుమార్‌ను సన్మానిస్తున్న మత్స్యకారులు

కార్పొరేషన్ చైర్మన్‌ను కలిసిన మత్స్యకారులు

కార్వాన్, జూలై 13 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ రాష్ట్ర ఫిషరీస్ కో-ఆపరేటివ్ సొసైటీస్ ఫెడరేషన్ చైర్మన్ మెట్టు సాయికుమార్‌ను హుజూరాబాద్ మత్స్యకారులు శనివారం మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా మత్స్యకారులంతా కలసి సాయికుమార్‌ను ఘనంగా సత్కరించి శుభాకాంక్షలు తెలిపారు. వారి సమస్యలను సాయికుమార్‌కు వివరించారు. ఈ సందర్భంగా సాయికుమార్ మాట్లాడుతూ హుజురాబాద్ నియోజకవర్గంలోని పలు మండలాలలోని సమస్యలను పరిష్కరిస్తానని హామీ ఇచ్చారు. మత్స్యకారులు ఆందోళన చెందాల్సిన అవసరం లేదని ఆయన హామీ ఇచ్చారు. బీఆర్ఎస్ ప్రభుత్వంలో మత్స్యకారులకు తీవ్రమైన సమస్యలు నెలకొన్నాయని, అందుకే ప్రజలు గత ప్రభుత్వాన్ని గద్దె దించి ప్రజా ప్రభుత్వాన్ని ఎన్నుకున్నారని ఆయన పేర్కొన్నారు. మత్స్యకారుల సంక్షేమానికి ఎల్లవేళలా కృషి చేస్తానని ఆయన అన్నారు.

భార్యను హత్య చేసి పారిపోయిన భర్తకు రిమాండ్

ఉప్పల్, జూలై 13 (ఆంధ్రజ్యోతి): భార్యను కిరాతకంగా హత్య చేసి గోనె సంచిలో పెట్టి పారిపోయిన భర్తను ఉప్పల్ పోలీసులు అరెస్టు చేసి శనివారం రిమాండ్‌కు తరలించారు. ఉప్పల్ పోలీస్‌స్టేషన్‌లో శనివారం మల్కాజిగిరి ఏసీపీ చక్రపాణి, ఉప్పల్ ఇన్‌స్పెక్టర్ ఎలక్షన్‌రెడ్డి ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో కేసు వివరాలను వెల్లడించారు. ఒరిస్సా కేంద్రపరా జిల్లా అయభ గ్రామానికి చెందిన ప్రదీప్‌బోలా(32), మధుమిత(24)లకు 2019లో వివాహం జరిగింది. మూడు నెలల కాపురం అనంతరం జీవనోపాధి కోసం భార్యాభర్తలు ఇద్దరు కలిసి హైదరాబాద్‌లోని ఉప్పల్ న్యూభరత్‌నగర్‌లో ఉంటున్నారు. తర్వాత మధుమిత గర్భవతి కావడంతో ఒరిస్సాలోని ఆమె తల్లిదండ్రుల ఇంటి వద్ద వదిలిపెట్టి తిరిగి హైదరాబాద్‌కు వచ్చాడు. మధుమితకు కుమార్తె పుట్టిన తర్వాత ప్రదీప్‌బోలా వారిని చూసేందుకు వెళ్లలేదు. దీంతో మధుమిత కేంద్రపరా పోలీస్‌స్టేషన్‌లో పోలీసులకు ఫిర్యాదు చేసింది. అనంతరం గ్రామ పెద్ద సమక్షంలో రాజీ కుదుర్చుకున్న ప్రదీప్ తన వెంట మధుమితను హైదరాబాద్‌కు తీసుకొచ్చాడు. ఆ తర్వాత కూడా తరుచూ దంపతులిద్దరి మధ్య చీటికి మాటికి గొడవల కొనసాగాయి. ఈనెల 7న ఉదయం ఇద్దరి మధ్య వివాదం ముదరడంతో ప్రదీప్ రొట్టె లు చేసే పీటతో మధుమిత తలపై బాదాడు. దీంతో ఆమె కింద పడిపోయింది. వెంటనే చున్నీని మెడకు చుట్టి చంపాడు. తర్వాత మృతదేహాన్ని సంచిలో కుక్కి బాత్‌రూమ్‌లో పెట్టి ఇంటికి తాళం వేసి కుమార్తెను తీసుకొని సికింద్రాబాద్ రైల్వేస్టేషన్‌కు పారిపోయాడు. అక్కడ ఒక వ్యక్తికి ఇప్పుడే వాష్‌రూమ్‌కు పోయి వస్తానని చెప్పి తన చేతిలోని పాపను ఇచ్చి పారిపోయాడు. ప్రదీప్ ఎంతకు రాకపోవడంతో పాపను రైల్వే పోలీసుల సహాయంతో చైల్డ్ హోమ్‌కు అప్పగించారు.



నిందితుడు ప్రదీప్ బోలా

పారిపోయిన ప్రదీప్ తనకు తెలిసిన వ్యక్తి ద్వారా బేగంపేటలోని హోటల్‌లో పని చేస్తున్నాడు. కేసు నమోదు చేసుకున్న పోలీసులు గతంలో పని చేసిన హోటల్ యజమాని ఇచ్చిన సమాచారంతో నిందితుడిని బేగంపేటలో అదుపులోకి తీసుకొని విచారించగా అసలు విషయం బయటపెట్టాడు. దీంతో అతడిని అరెస్టు చేసి రిమాండ్‌కు పంపారు.

మరిన్ని మెహిదీపట్నం జోన్ వార్తల కోసం ఈ క్యూఆర్ కోడ్ స్కాన్ చేయండి. లేదా ఈ కింది యూఆర్ఎల్ https://ejyothy.com/2GVCbs4 లో చదవండి.
Note: Andhrajyothi.com/editions/hyd/set-6 abids, mehadipatnam, charminarలో చూడగలరు.
నోట్: htpps://epaper.andhrajyothy.comలో లాగిన్ అయిన తరువాత క్యూఆర్‌కోడ్‌ని స్కాన్ చేయగలరు.



ఆవిర్భావ సదస్సులో ప్రసంగిస్తున్న డాక్టర్ చీమ శ్రీనివాస్

తెలంగాణ పీపుల్స్ జేఏసీ ఆవిర్భావం

బర్కత్‌పుర, జూలై 13 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ అస్తిత్వం, ఆత్మగౌరవం, సమానత్వంతో కూడిన అభివృద్ధి సాధించడానికి నూతన తెలంగాణ పీపుల్స్ జేఏసీ ఆవిర్భవించింది. శనివారం బషీర్‌బాగ్ ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆవిర్భావ సదస్సు నిర్వహించారు. జేఏసీ కన్వీనర్ బి.సీతయ్య అధ్యక్షతన సమావేశం జరిగింది. ముఖ్య అతిథిగా రావాల్సిన ప్రొఫెసర్ జి. హరగోపాల్ అనారోగ్యం కారణంగా ఇంటి వద్ద నుంచే ఫోన్‌లో సందేశం ఇచ్చారు. తెలంగాణలో రాజ్యాంగ విలువలు, ప్రజాస్వామ్యాన్ని కాపాడుకోవాల్సిన బాధ్యత అందరిపై ఉందన్నారు. విద్య, వైద్యం ఉచితంగా ప్రతి ఒక్కరికి అందాలని అందుకోసం సమాజాన్ని చైతన్యవంతం చేయాలని ఆయన కోరారు. దేశ సంపద ప్రజలకు చెందాలని కోరారు. తెలంగాణ ఉద్యమకారుల ఫోరం చైర్మన్ డాక్టర్ చీమ శ్రీనివాస్, ఉపాధ్యాయ సంఘం నాయకుడు హనుమండ్లు మాట్లాడుతూ కామన్ స్కూల్ విధానాన్ని అమలు చేయాలని, ప్రభుత్వ పాఠశాలలను బలోపేతం చేయాలని, అందరికీ ఉచితంగా ఆదునిక వైద్యం అందించాలన్నారు. జేఏసీ కన్వీనర్ బి. సీతయ్య మాట్లాడుతూ విద్య వైద్య రంగానికి బడ్జెట్‌లో 40 శాతం నిధులు కేటాయించాలని, రైతు బంధు, రైతు భరోసా పథకాలను చిన్నకారు రైతులు, సాగు రైతులు, కౌలు రైతులకు మాత్రమే వర్తింపచేయాలని డిమాండ్ చేశారు. రాజ్యాంగ ప్రతులను పాఠశాల స్థాయి నుంచి యూనివర్సిటీ వరకు విద్యార్థులకు ఉచితంగా పంపిణీ చేయాలన్నారు. కార్యక్రమంలో నాయకులు ఎస్. ఆర్, డాక్టర్ ఎల్. అన్నపూర్ణ, సీ. హెచ్. రాములు, డాక్టర్ నతానియేల్ తదితరులు పాల్గొన్నారు.



టీపీఏ అవార్డు అందుకున్న సైకాలజిస్ట్‌లు

టీపీఏ అవార్డుల ప్రదానోత్సవం

బర్కత్‌పుర, జూలై 13 (ఆంధ్రజ్యోతి): బషీర్‌బాగ్ ప్రెస్‌క్లబ్‌లో శనివారం తెలంగాణ ఫిజికలిస్ట్ అసోసియేషన్ ఆధ్వర్యంలో టీపీఏ అవార్డు ప్రదానోత్సవ కార్యక్రమం నిర్వహించారు. 15 మంది మహిళా సైకాలజిస్ట్‌లకు తెలంగాణ ఇన్‌స్పైరింగ్ ఉమెన్ సైకాలజిస్ట్ అవార్డులను, 10 మంది సైకాలజిస్ట్‌లకు తెలంగాణ ఇన్‌స్పైరింగ్ సైకాలజిస్ట్ అవార్డులను ప్రదానం చేశారు. కార్యక్రమంలో కేంద్రమాజీ మంత్రి సముద్రాల వేణుగోపాలచారి, డాక్టర్ త్రిపుణ వెంకటరత్నం, అసోసియేషన్ అధ్యక్షుడు డాక్టర్ మోత్కూరి రాంచందర్, ప్రముఖ నటులు కె. వి. ప్రదీప్, సైక్రియాటిస్ట్‌లు డాక్టర్ హరిణి, డాక్టర్ శేఖర్‌రెడ్డి, నాయకులు వెంపటి రాజు, శ్రీపుజ, సుధాకర్, శ్రీదేవి, కృష్ణసాహితి, రోజా తదితరులు పాల్గొన్నారు.



సావనీర్‌ను ఆవిష్కరిస్తున్న మంత్రి జూపల్లి కృష్ణారావు, మాజీ మంత్రి శ్రీనివాస్‌గౌడ్, తదితరులు

విద్యతోనే స్వేచ్ఛ, సమానత్వం సాధ్యమవుతుంది

- మంత్రి జూపల్లి కృష్ణారావు

రవీంద్రభారతి, జూలై 13 (ఆంధ్రజ్యోతి): విద్యతోనే స్వేచ్ఛ, సమానత్వం సాధ్యమవుతుందని రాష్ట్ర ఎక్సైజ్, పర్యాటక, సాంస్కృతిక శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు అన్నారు. రవీంద్రభారతిలో శనివారం నారాయణ గురు ధర్మ ప్రచార సభ ఆధ్వర్యంలో సెంటినరీ వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా సర్వమత సమ్మేళనం నిర్వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన మంత్రి జూపల్లి కృష్ణారావు కేరళకు చెందిన ప్రముఖ ఆధ్యాత్మిక గురువు సంఘ సంస్కర్త నారాయణ గురు విగ్రహానికి పుష్పాంజలి ఘటించి నివాళి అర్పించారు. అనంతరం మంత్రి మాట్లాడుతూ సమాజంలోని మూఢ విశ్వాసాలను, కులతత్వాన్ని నిరసించి, కులం కారణంగా కొన్ని వర్గాల ప్రజలు అన్యాయానికి గురవుతున్నారని, వారికి ఆధ్యాత్మిక స్వేచ్ఛ, సామాజిక స్వాతంత్రం ఉండాలని భావించిన గొప్ప వ్యక్తి నారాయణ అని పేర్కొన్నారు. నారాయణ గురు ఆలోచనలకు అనుగుణంగా నడుచుకోవాల్సిన అవసరముందని అన్నారు. కార్యక్రమంలో జాతీయ బీసీ కమిషన్ మాజీ చైర్మన్ జస్టిస్ ఈశ్వరయ్య, మాజీ మంత్రి శ్రీనివాస్‌గౌడ్, లోక్‌సత్తా అధినేత జయప్రకాష్ నారాయణ, నిర్వాహకులు సాయిబాబాగౌడ్, ఉపేందర్, మురళీ మనోహర్, చెన్నయ్య, జంగయ్య తదితరులు పాల్గొన్నారు.

17న రవీంద్రభారతిలో కాకతీయం నృత్యప్రదర్శన

- హాజరుకానున్న సీఎం రేవంత్‌రెడ్డి

రవీంద్రభారతి, జూలై 13 (ఆంధ్రజ్యోతి): కాకతీయ రాజవంశం కాలం నాటి ప్రాచీన నృత్య సంప్రదాలను పునరుద్ధరించడానికి, తెలంగాణ నృత్య ఖ్యాతిని ప్రపంచానికి చాటి చెప్పేందుకు కాకతీయం నృత్య నాటకం రూపొందించినట్లు ప్రముఖ నర్తకీమణి పద్మశ్రీ డాక్టర్ పద్మజా రెడ్డి తెలిపారు. పదేళ్లుగా విస్తృత పరిశోధనలు చేసి తీర్చిదిద్దిన కాకతీయం రెండు భాగాలను ఇటు భారతదేశం, అటు అమెరికాలోని పలు వేదికలపై ప్రదర్శించి అభినందనలు అందుకున్నట్లు వివరించారు. సుసంపన్నమైన వారసత్వం, క్లిష్టమైన సుందరమైన నృత్యప్రక్రియలను ప్రోత్సహించడంలో భాగంగా ఇప్పుడు కాకతీయం పార్ట్-3 ప్రదర్శించనున్నట్లు పద్మజారెడ్డి తెలిపారు. శనివారం పద్మజారెడ్డి మీడియాకు పలు వివరాలు వెల్లడించారు. ఈ నెల 17వ తేదీ సాయంత్రం 6 గంటలకు రవీంద్రభారతిలో కాకతీయం నృత్యనాటకాన్ని ప్రదర్శించున్నట్లు తెలిపారు. ఈ నృత్యాన్ని తిలకించేందుకు రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి హాజరవుతారని తెలిపారు. సీఎంతో పాటు కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి, రాష్ట్ర మంత్రులు పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి, జూపల్లి కృష్ణారావు, మాజీ స్పీకర్ పోచారం శ్రీనివాస్‌రెడ్డి, ఎమ్మెల్యే సుదర్శన్‌రెడ్డి, ప్రభుత్వ ముఖ్య కార్యదర్శి బుర్రా వెంకటేశం పాల్గొంటారని తెలిపారు.

యువకుడి అదృశ్యం

అడ్డగుట్ట, జూలై 13 (ఆంధ్రజ్యోతి): పెయింటింగ్ పనికోసమని వచ్చిన ఓ యువకుడు సికింద్రాబాద్‌లో అదృశ్యమైన ఘటన గోపాలపురం పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగింది. సబ్‌ఇన్‌స్పెక్టర్ వేణుగోపాల్ తెలిపిన వివరాల ప్రకారం.. నిజామాబాద్ అరుంధతి కాలనీకి చెందిన శీలం సుజాత కుమారుడు శీలం రాజేష్ (19) గత నెల 29న సికింద్రాబాద్ బేగంపేట్‌లో పెయింటింగ్ పనికోసమని తన బంధువుతో ఇద్దరు కలిసి హైదరాబాద్‌కు వచ్చి పని ముగించుకున్నారు. సాయంత్రం సమయంలో అదేరోజు నిజామాబాద్‌కు వెళదామని సికింద్రాబాద్ రైల్వేస్టేషన్ ఎదురుగా 10వ నంబరు బస్టాపునకు ఇద్దరు కలిసి వచ్చారు. బస్సు ఎక్కే క్రమంలో రాజేష్ కనించలేదు. వెంటనే తల్లికి సమాచారం ఇవ్వడంతో బంధువులు స్నేహితుల ఇళ్లలో వాకబు చేసినా ఫలితం లేకపోవడంతో ఈ నెల 10న గోపాలపురం పోలీస్ స్టేషన్‌లో తల్లి ఫిర్యాదు చేసింది. శనివారం కేసు నమోదు చేసుకున్న పోలీసులు సీసీ ఫుటేజీలను పరిశీలించారు. సీసీ ఫుటేజీలో రాజేష్ ఫుట్‌పాత్‌పై నడుచుకుంటూ వెళుతున్నట్లు విజువల్స్‌లో కనిపించాయి. అక్కడి నుంచి ఎక్కడికి వెళ్లాడో తెలియకపోవడంతో పోలీసులు మిస్సింగ్ కేసు కింద నమోదు చేశారు. కేసు నమోదు చేసుకున్న పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.



ప్రాణాలకు ప్రమాదమని తెలిసినా యువత బైక్‌లతో ప్రమాదకర విన్యాసాలు చేస్తున్నారు. కొన్నిసార్లు గాయపడుతున్నా పట్టించుకోవడం లేదు. తాజాగా శనివారం ట్యాంక్‌బండ్ వద్ద ఓ యువకుడు బైక్‌తో ఇలా స్టంట్స్ చేస్తూ కెమెరాకు చిక్కాడు - ఫొటో: స్టాఫ్‌ఫొటోగ్రాఫర్, ఆంధ్రజ్యోతి

మిగిలింది 20 అడుగులే..!

ఛే నంబర్ వంతెనతో కొత్త సమస్యలు

- ఆ రెండుచోట్ల ఇరుకుగా సర్వీస్ రోడ్డు
- తగ్గిన శ్రీరమణ నుంచి ఛే నంబర్‌కు వెళ్లే మార్గం
- గాంధీబొమ్మ వద్ద ఓ వైపు 10 అడుగులే
- డిజైన్‌లో మార్పులు.. ఆస్తుల సేకరణలో నిర్లక్ష్యమే కారణం

ఛే నంబర్ వంతెన నిర్మాణం హైదరాబాద్-వరంగల్ జాతీయ రహదారిపై కొత్త ట్రాఫిక్ ఇక్కట్లకు దారి తీస్తోంది. ఫ్లై ఓవర్ అందుబాటులోకి వచ్చిన తర్వాత కూడా ట్రాఫిక్ ఇబ్బందులు తప్పడం లేదు. డిజైన్ ప్రకారం పనులు చేయకపోవడం.. మార్క్ చేసిన మేరకు ఆస్తులు సేకరించకపోవడం వల్లే ఈ దుస్థితి నెలకొందన్న అభిప్రాయం వ్యక్తమవుతోంది.

హైదరాబాద్ సిటీ, జూలై 13(ఆంధ్రజ్యోతి): ఫ్లై ఓవర్ నిర్మాణంతో ఇప్పటికే తక్కువ వెడల్పు ఉన్న శ్రీరమణ చౌరస్తా నుంచి ఛే నంబర్‌కు వెళ్లే మార్గం మరింత ఇరుకుగా మారుతోంది. రహదారికి ఇరువైపులా పిల్లర్లు నిర్మించడంతో మెయిన్ క్యారేజ్ వే సుమారు 20 అడుగులు మాత్రమే ఉంది. దీంతో కీలకమైన సర్వీస్ రోడ్డులో వాహనాల రాకపోకలు ఎలా..? అన్నది ప్రశ్నార్థకంగా మారింది. వేలాది వాహనాలు రాకపోకలు సాగించే మార్గం తక్కువ వెడల్పు(20 అడుగులు) మాత్రమే ఉన్న నేపథ్యంలో రెండువైపులా వాహనాలు అనుమతిస్తారా..? వన్ వేగా మారుస్తారా..? అంటే ఇప్పుడే ఏం చెప్పలేమని అధికారులు పేర్కొంటున్నారు. వంతెన దిగే గాంధీబొమ్మ వద్దా అదే దుస్థితి నెలకొంది. ఇక్కడ ఓ వైపు సర్వీస్ రోడ్డు కనీసం 10 అడుగులు కూడా లేకపోవడం గమనార్హం.

ఆ రెండు చోట్ల...

హైదరాబాద్-వరంగల్ జాతీయ రహదారి(163)పై అంబర్‌పేట ఛే నంబర్, శ్రీరమణ చౌరస్తాల వద్ద సిగ్నల్ చిక్కులు లేని ప్రయాణం కోసం 1.4 కిలోమీటర్ల మేర రూ.467.55 కోట్లతో వంతెన నిర్మిస్తున్నారు. 2018లో శంకుస్థాపన చేయగా, నేటికీ పనులు సా..గుతున్నాయి. ఫ్లై ఓవర్ కోసం 80 అడుగులుగా ఉన్న రోడ్డును 120 అడుగులకు విస్తరించారు. ఇందుకోసం 281 ఆస్తులు సేకరించారు. కొన్ని ప్రాంతాల్లో విస్తరణ పూర్తిస్థాయిలో జరగకపోవడంతో పలు ప్రాంతాల్లో సర్వీస్ రోడ్లు ఇరుకుగా మారాయి. ప్రధాన రహదారులపై వంతెనలు నిర్మిస్తే.. స్థానిక వాహనదారులకు(లోకల్ ట్రాఫిక్) ఇబ్బంది లేకుండా అంతకుముందున్న మార్గాన్ని విస్తరించి సర్వీస్ రోడ్లు నిర్మిస్తారు. ప్రమాణాల ప్రకారం వంతెనలు నిర్మించిన చోట 7.5 మీటర్ల మేర సర్వీస్ రోడ్డు ఉండాలని నిపుణులు చెబుతున్నారు. కానీ, అంబర్‌పేట వంతెన వద్ద ఆ పరిస్థితి లేదు. శ్రీరమణ నుంచి ఛే నంబర్‌కు వెళ్లే మార్గంలో శ్మశానవాటిక వద్ద 20 అడుగులు, గాంధీబొమ్మ వద్ద వంతెన దిగే చోట ఓ వైపు 10 అడుగుల వెడల్పు కూడా సర్వీస్ రోడ్డు లేదు. దీంతో వాహనాల రాకపోకలకు తీవ్ర ఇబ్బంది కలుగుతోంది.



కొనసాగుతున్న ఛే నంబర్ వంతెన పనులు

ఆ మార్గంలో..

శ్రీరమణ చౌరస్తా నుంచి ఛే నంబర్‌కు వెళ్లే మార్గంలో శ్మశానవాటిక వద్ద వంతెన నిర్మాణాన్ని అధికారులు మార్చారు. శ్మశానవాటికలో ఒక్కో వైపు పిల్లర్ల ద్వారా పోర్టల్ ఫ్రేమ్ నిర్మించేలా డిజైన్ చేశారు. శంకుస్థాపన సమయంలోనూ అధికారులు అదే విషయం చెప్పారు. తర్వాత ఏమైందో కానీ.. ఇరుకుగా ఉన్న రోడ్డు పైనే పిల్లర్ల నిర్మాణం జరిగింది. దీంతో ఆ మార్గం వెడల్పు మరింత తగ్గింది. ఇప్పటికే మెజార్టీ స్పాన్‌ల నిర్మాణం పూర్తవడంతో సర్వీస్ రోడ్డు ఎలా ఉండనుందనే దానిపై స్పష్టత వచ్చింది. దిల్‌సుఖ్‌నగర్, నల్లకుంట, అంబర్‌పేట సీపీఎల్, పటేల్‌నగర్, బాగ్‌అంబర్‌పేట, ఉస్మానియా యూనివర్సిటీ, నారాయణగూడ, హిమాయత్‌నగర్ వైపు వెళ్లే వారూ ఈ సర్వీస్ రోడ్డు మీదుగా రాకపోకలు సాగిస్తారు. రహదారి ఇరుకుగా మారిన నేపథ్యంలో వారంతా తీవ్ర ఇబ్బందులు పడే అవకాశముంది. 20 అడుగులుగా ఉన్న రోడ్డులో డివైడర్ ఏర్పాటు చేసే అవకాశం లేదు. దీంతో రెండువైపులా వాహనాలను అనుమతించిన పక్షంలో జామ్‌జాటానికి దారి తీస్తుంది. వన్ వేగా మారిస్తే.. వాహనాలు ఎక్కడి నుంచి మళ్లిస్తారన్నది ప్రశ్నార్థకంగా మారింది.

ఎంఎస్‌ఎఫ్ బలోపేతం : మందకృష్ణమాదిగ



సమావేశంలో మాట్లాడుతున్న మందకృష్ణమాదిగ

బౌద్ధనగర్, జూలై 13 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ, ఆంధ్రప్రదేశ్‌లో మాదిగ స్టూడెంట్ ఫెడరేషన్ (ఎంఎస్ఎఫ్)ను బలోపేతం చేస్తామని మాదిగ రిజర్వేషన్ పోరాట సమితి వ్యవస్థాపక అధ్యక్షుడు మందకృష్ణమాదిగ అన్నారు. శనివారం పార్శీగుట్ట కార్యాలయంలో నిర్వహించిన ఎంఎస్ఎఫ్ జాతీయ ముఖ్యకార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడారు. సంక్షేమ హాస్టళ్లు, యూనివర్సిటీ, పాఠశాలలు, కళాశాలల్లో సమస్యలపై అధ్యయనం చేసి వాటి పరిష్కారానికి పోరాడతామని తెలిపారు. ఆగస్టులో విశాఖపట్నం అరకులో ఎంఎస్ఎఫ్ శిక్షణ తరగతులు నిర్వహిస్తామని, సెప్టెంబర్‌లో పాలమూరు యూనివర్సిటీలో ఎంఎస్ఎఫ్ జాతీయ మహాసభను నిర్వహిస్తామని తెలిపారు. సమావేశంలో పుల్ల శ్రీనివాస్‌మాదిగ, ఎంఎస్ఎఫ్ అధ్యక్షులు సందే కార్తీక్(తెలంగాణ), బాయికాటి బెనర్జీమాదిగ(ఆంధ్రప్రదేశ్), రాష్ట్ర అధికార ప్రతినిధి కె.శేఖర్‌మాదిగ, జాతీయ ఉపాధ్యక్షుడు తోకల చిరంజీవి, పల్లె మణిందర్ మాదిగ, శివకుమార్, ముఖేశ్ తదితరులు పాల్గొన్నారు.

పారిశుధ్య కార్మికుల హక్కుల సాధనకు సైకిల్‌యాత్ర

- టీఎస్ ఎంఆర్‌పీఎస్ అధ్యక్షుడు వంగపల్లి శ్రీనివాస్



సమావేశంలో మాట్లాడుతున్న వంగపల్లి

రాంనగర్, జూలై 13 (ఆంధ్రజ్యోతి): పారిశుధ్య కార్మికుల హక్కుల సాధన కోసం టీఎస్ఎంఆర్‌పీఎస్ ఆధ్వర్యంలో త్వరలోనే రాష్ట్రవ్యాప్తంగా సైకిల్ యాత్ర చేపట్టనున్నట్లు ఆ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు వంగపల్లి శ్రీనివాస్ తెలిపారు. శనివారం విద్యానగర్‌లోని సంఘం కార్యాలయంలో విలేకరులతో మాట్లాడారు. పారిశుధ్య కార్మికుల సేవలకు తగ్గట్టుగా చట్టపరంగా అందాల్సిన హక్కులను అందించడంలో మోదీ ప్రభుత్వం విఫలమైందని ఆరోపించారు. కరోనా సమయంలో కార్మికుల సేవలను గుర్తించి హెలికాప్టర్‌తో పారిశుధ్య కార్మికులపై పూలవర్షం కురిపించిన ప్రధాని మోదీ నేడు వారి అభివృద్ధి, సంక్షేమానికి ఎలాంటి చర్యలు చేపట్టడం లేదని ఆరోపించారు. సమావేశంలో అంజన్న, పల్లెల నరేష్, శ్యామ్‌రావు, చందు, తిరుమలేష్, జీవన్, శ్రీకాంత్, సురేష్, కార్తీక్, మణిధర్ పాల్గొన్నారు.



నూతన కార్యవర్గంతో సహకార సంస్థ అధికారులు

ఫిలింనగర్ హౌసింగ్ కో-ఆపరేటివ్ సొసైటీ ఎన్నిక

బంజారాహిల్స్, జూలై 13 (ఆంధ్రజ్యోతి): ఫిలింనగర్ హౌసింగ్ కో-ఆపరేటివ్ సొసైటీ నూతన కార్యవర్గం ఏకగ్రీవంగా ఎన్నికైంది. సహకార సంస్థ అసిస్టెంట్ రిజిస్ట్రార్ అతిక ఫాతిమా, సీనియర్ ఇన్‌స్పెక్టర్లు మల్లేష్, శివ సమక్షంలో శనివారం ఎన్నికలు జరిగాయి. అధ్యక్షులుగా ఆది శేషగిరిరావు, కార్యదర్శిగా కాజా సూర్యనారాయణ, ఉపాధ్యక్షుడిగా కైకాల నాగేశ్వర్‌రావు, కోశాధికారిగా వై.కోటిబాబు, కార్యవర్గ సభ్యులుగా ఉదయ్‌భాస్కర్, వై.పల్లవి, పరుచూరి విజయలక్ష్మి, గోపాలరావు, జగదీశ్‌చంద్రప్రసాద్, నాగినీడు, నిరంజన్, బాలరాజు, ఎన్.భాస్కర్, వి.రఘునాథ్‌బాబు నియమితులయ్యారు. ఈ సందర్భంగా నూతన అధ్యక్ష, కార్యదర్శులు మాట్లాడుతూ సొసైటీలో సభ్యులు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించనున్నట్టు చెప్పారు. కాగా, గత నెలలోనే సొసైటీ ఎన్నికలు నిర్వహించాలని సహకార సంస్థ నోటిఫికేషన్ విడుదల చేయగా, కొందరు అడ్డుకునేందుకు కోర్టుకు వెళ్లారు. ఎన్నికలు నిర్వహించాలని న్యాయమూర్తి ఆదేశించారు.

గాయబ్..

(5వ పేజీ తరువాయి)

శుభ్రపర్చడం.. అవసరమైన పరికరాలు ఏర్పాటు చేయడం ఏజెన్సీల బాధ్యత. సిబ్బంది సరిగా పని చేస్తున్నారా.. లేదా.. తెల్సుకునేందుకు క్లీన్ చేసిన ప్రతిసారి స్కానింగ్ చేసేలా క్యూఆర్ కోడ్ ఏర్పాటు చేశారు. అయినా చాలా పీఎఫ్‌టీల్లో క్లీనింగ్ జరగడం లేదు. కానీ నిర్వహణ వ్యయం మాత్రం ఠంచనుగా ఏజెన్సీలకు చెల్లిస్తున్నారు. ఇప్పటి వరకు రూ.32 కోట్లకుపైగా నిర్వహణ కోసం ఖర్చు చేసినట్టు పారిశుధ్య నిర్వహణ విభాగం వర్గాలు పేర్కొన్నాయి. ఏర్పాటు, నిర్వహణకు రూ.90 కోట్ల వరకు వెచ్చించడం గమనార్హం.

స్వచ్ఛ టాయిలెట్ల లెక్క ఇది..

జోన్	2023	2024
ఎల్బీనగర్	532	369
చార్మినార్	355	123
ఖైరతాబాద్	201	174
కూకట్‌పల్లి	352	381
శేరిలింగంపల్లి	445	198
సికింద్రాబాద్	288	140
మొత్తం	2173	1385

తాజా లెక్కల ప్రకారం..

కేటగిరీ	మొత్తం	ప్రస్తుతం
పబ్లిక్ టాయిలెట్లు	1818	1366
షీ టాయిలెట్లు	39	19
మొత్తం	1857	1385

ఆది నుంచి గందరగోళమే..

పీఎఫ్‌టీల ఏర్పాటుపై ఆది నుంచి అనుమానాలున్నాయి. బల్దియా అధికారికంగా వెల్లడిస్తోన్న వివరాలూ ఇందుకు బలం చేకూరుస్తున్నాయి. గతేడాది 2,173 టాయిలెట్లు ఉన్నట్టు చూపగా.. ఇప్పుడా సంఖ్యను 1,857గా పేర్కొనడం గమనార్హం. వేర్వేరు రకాల టాయిలెట్లు ఉండడంతో కొంత గందరగోళం జరుగుతోందని అధికారులు చెబుతున్నారు. ఒక్కోసారి ఒక్కో కేటగిరీ మరుగుదొడ్లను ఒక్కోలా చూపుతున్నారు. గతంలో పలు ప్రాంతాల్లో స్వచ్ఛ టాయిలెట్లు ఏర్పాటు చేయకుండానే బిల్లులు తీసుకున్నారని, గతంలో విమర్శలు వ్యక్తమయ్యాయి. ఏర్పాటుచేసిన అనంతరం సంబంధిత ఏజెన్సీలు కొన్ని తిరిగి తీసుకెళ్లాయన్న ఫిర్యాదులు రాగా.. ఇంకొన్ని చోట్ల స్ర్కాప్‌గా విక్రయించారు. టాయిలెట్లలోని కమోడ్‌లు, నల్లాలు, వాష్ బేసిన్‌లూ చోరీకి గురయ్యాయి.



నిరుపయోగంగా మరుగుదొడ్డి

జీహెచ్‌ఎంసీ, జలమండలి విభాగాలకు అధిక నిధులు కేటాయించాలి

- కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి



ఓపెన్ జిమ్ ప్రారంభోత్సవంలో కిషన్‌రెడ్డి, ముఠా గోపాల్, అనిల్‌కుమార్ యాదవ్

కవాడిగూడ, జూలై 13 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర జనాభాలో ముప్పై శాతం హైదరాబాద్‌లో ఉంటున్నారని, వారికి కనీస సదుపాయాలు కల్పించేందుకు రాష్ట్ర ప్రభుత్వం జీహెచ్‌ఎంసీ, జలమండలి విభాగాలకు అధిక నిధులు కేటాయించాలని కేంద్ర బొగ్గు గనుల శాఖ మంత్రి జి. కిషన్‌రెడ్డి రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. శనివారం కవాడిగూడ డివిజన్ దోమలగూడ ఈ-సేవా వద్ద రూ.7లక్షలతో నిర్మించిన ఓపెన్‌జిమ్, పార్కును కిషన్‌రెడ్డి రాజ్యసభసభ్యుడు అనిల్‌కుమార్‌యాదవ్, ముషీరాబాద్ ఎమ్మెల్యే ముఠా గోపాల్, కవాడిగూడ కార్పొరేటర్ జి.రచనశ్రీలతో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా కిషన్‌రెడ్డి మాట్లాడుతూ భవిష్యత్ తరాలకు పర్యావరణాన్ని అందించాలంటే ఏకైక మార్గం చెట్లు నాటడమేనన్నారు. అనిల్‌కుమార్ యాదవ్ మాట్లాడుతూ జీహెచ్‌ఎంసీ, జలమండలి శాఖలకు నిధులు పెంచాలని సీఎం రేవంత్‌రెడ్డిని కోరుతానన్నారు. ముఠా గోపాల్ మాట్లాడుతూ నియోజకవర్గంలో పెండింగ్‌లో ఉన్న అభివృద్ధి పనులు పూర్తయ్యేందుకు తనవంతు కృషి చేస్తానన్నారు. కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్ టి.రవీందర్, బీఆర్ఎస్‌వై నాయకుడు ముఠా జైసింహ, బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు బండారు విజయలక్ష్మి, పూస రాజు, ఓబీసీ మోర్చా నగర అధ్యక్షుడు సలంద్రి శ్రీనివాస్‌యాదవ్, బీజేపీ డివిజన్ అధ్యక్ష, కార్యదర్శులు ఎంసీ మహేందర్‌బాబు, ప్రభాకర్ గంగపుత్ర, కాంగ్రెస్ పార్టీ డివిజన్ అధ్యక్షుడు పోతరాజు భాస్కర్, బీఆర్ఎస్ డివిజన్ అధ్యక్ష, కార్యదర్శులు వల్లాల శ్యామ్‌యాదవ్, ఎన్డీ సాయికృష్ణ, సర్కిల్-15 ఏఎంహెచ్‌ఓ డాక్టర్ మైత్రేయి, మునిసిపల్ డీఈ సన్నీ, ఏఈ సుభాష్, వాటర్‌వర్క్స్ మేనేజర్ శ్రీధర్, బస్తీవాసులు పాల్గొన్నారు.

ఇళ్ల స్థలాల సాధన సమితి సమావేశం రసాభాస

ఎన్జీవోస్ సమావేశాన్ని అడ్డుకున్న బీటీఎన్జీవో సొసైటీ సభ్యులు ● ఇరువర్గాల మధ్య వాగ్వాదం, తోపులాట



వాగ్వాదం చేసుకుంటున్న ఇరు సొసైటీల సభ్యులు

బర్కత్‌పుర, జూలై 13 (ఆంధ్రజ్యోతి): బీటీఎన్జీవో(గచ్చిబౌలి) మ్యూచ్‌వల్ ఎయిడెడ్ కో-ఆపరేటివ్ హౌసింగ్ సొసైటీ అధ్యక్షుడు సత్యనారాయణగౌడ్ అక్రమాలపై విచారణ జరిపించాలని డిమాండ్ చేస్తూ గచ్చిబౌలి ఎన్జీవోస్ ఇళ్ల స్థలాల సాధన సమితి నిర్వహించిన సమావేశం రసాభాసగా మారింది. బషీర్‌బాగ్ ప్రెస్‌క్లబ్‌లో శనివారం నిర్వహించిన ఈ సమావేశాన్ని సత్యనారాయణగౌడ్ అనుచరులు అడ్డుకోవడంతో ఇరు సొసైటీ సభ్యుల మధ్య వాగ్వాదం, తోపులాట జరిగింది. వేదికపైకి దూసుకెళ్లేందుకు ప్రయత్నించగా పోలీసులు అడ్డుకున్నారు. దీంతో కొద్ది సేపు ఉద్రిక్తత పరిస్థితులు నెలకొన్నాయి. సత్యనారాయణగౌడ్ అనుచరులను పోలీసులు బలవంతంగా కిందకు తీసుకెళ్లారు. గొడవ సద్దుమణిగిన తర్వాత ఇళ్ల స్థలాల సాధన సమితి అధ్యక్షుడు పాండురంగారావు, కార్యదర్శి బి.నర్సింగ్‌రావు, కోశాధికారి బి.రాజేశ్వరి మాట్లాడారు. హౌసింగ్ సొసైటీలో అక్రమాలపై పూర్తి విచారణ జరిపిస్తే వాస్తవాలు వెలుగులోకి వస్తాయని, ఇందుకోసం సీఎం రేవంత్‌రెడ్డి ప్రత్యేక చొరవ తీసుకుని ఐఏఎస్‌లతో ప్రత్యేక కమిటీ ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. హౌసింగ్ సొసైటీ ప్రస్తుత అధ్యక్షుడు సత్యనారాయణగౌడ్, కార్యదర్శి మల్లారెడ్డి, కోశాధికారి శ్రీనివాసులు సొసైటీ సభ్యులను బెదిరిస్తూ అక్రమంగా డబ్బులు వసూలు చేస్తున్నారని ఆరోపించారు. ఏపీఎన్జీవోస్‌కు 2008లో అప్పటి ప్రభుత్వం శేరిలింగంపల్లి మండలం గోపనపల్లిలోని సర్వేనంబర్ 36, 37లలో 189 ఎకరాల 11 గుంటల స్థలాన్ని ఉద్యోగుల ఇళ్ల స్థలాల కోసం కేటాయించిందన్నారు. గత కేసీఆర్ ప్రభుత్వం 2014లో ఈ భూమిని స్వాధీనం చేసుకుందన్నారు. కేసీఆర్ పాలనలో ఓ మాజీ మంత్రి అండదండలతో సొసైటీ నేతలు అనేక అక్రమాలకు పాల్పడ్డారని ఆరోపించారు. ఇళ్ల స్థలాలు ఇప్పిస్తామని చెప్పి సొసైటీ సభ్యులు ఒక్కొక్కరి నుంచి రూ.4 లక్షల వరకు వసూలు చేశారని, ఇదేమిటని ప్రశ్నిస్తే వేధింపులకు గురిచేయడమేగాక సొసైటీ సభ్యత్వం రద్దు చేస్తామని బెదిరించారని ఆరోపించారు. ఇప్పటికే రూ.40 కోట్ల వరకు అక్రమాలు జరిగాయని, దీనిపై పోలీసులకు ఫిర్యాదు చేస్తే సొసైటీ కోశాధికారి శ్రీనివాస్ అదే డిపార్ట్‌మెంట్ వ్యక్తి కావడం వల్ల పట్టించుకోవడం లేదని ఆరోపించారు. ఇప్పటికైనా అర్హులందరికీ ఇళ్ల స్థలాలు వచ్చేలా తగు చర్యలు తీసుకోవాలని ప్రభుత్వాన్ని కోరారు. సమావేశంలో సాధన సమితి నాయకులు ఏవీఎస్ ప్రసాద్, వి.ధన్‌రాజ్, కార్యవర్గ సభ్యులు టి.అనిల్‌కుమార్, వి.హేమలత, కె.వెంకటేశ్వరరావు, చంద్రకళ, పద్మారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

తెలంగాణను తట్టిలేపిన సదాశివుడి పాటలు

- మాజీ మంత్రి హరీష్‌రావు ● మోహన్‌రుషి, పసునూరు శ్రీధర్‌బాబులకు సదాశివుడి స్మారక పురస్కారాలు



పురస్కారగ్రహీతను సత్కరిస్తున్న హరీష్‌రావు తదితరులు

రవీంద్రభారతి, జూలై 13 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర సాధన ఆకాంక్షను తెలియజేస్తూ మల్లావఝుల సదాశివుడు రచించిన పాటలు తెలంగాణను తట్టిలేపాయని మాజీ మంత్రి హరీష్‌రావు అన్నారు. శనివారం రవీంద్రభారతిలో తెలంగాణ వికాస సమితి, చేతన సాహితీ సమాఖ్య సంయుక్త ఆధ్వర్యంలో మల్లావఝుల సదాశివుడి స్మారక సభ నిర్వహించారు. ఈ సందర్భంగా కవులు పసునూరు శ్రీధర్‌బాబు, మోహన్‌రుషిలకు సదాశివుడి స్మారక పురస్కారాలను ప్రదానం చేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా విచ్చేసిన హరీష్‌రావు పురస్కారగ్రహీతలను సత్కరించి అభినందించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ సదాశివుడి పాట గోదావరి జలంలా పారిందన్నారు. తెలంగాణ రాష్ట్రంలో మళ్లీ పాత రోజులు వచ్చాయని అనిపిస్తోందన్నారు. గోదావరి వరదతో ప్రవహిస్తుంటే ప్రభుత్వం ఇంకా మోటర్లు ప్రారంభించడం లేదన్నారు. వర్షాలు లేక రైతులు ఆత్మహత్యలు చేసుకుంటున్నా ప్రభుత్వం పట్టించుకోవడం లేదని ఆరోపించారు. కవులు, కళాకారులు, సాహితీవేత్తలు ఇప్పుడు తమ కలాలకు పని చెప్పాల్సిన అవసరం ఉందన్నారు. సదాశివుడి కలం నుంచి జాలువారిన 'తలాపున పారుతుంది గోదారి' అనే పాటను స్ఫూర్తిగా తీసుకొని కేసీఆర్ పనిచేశారని గుర్తు చేశారు. ఎమ్మెల్సీ దేశపతి శ్రీనివాస్ మాట్లాడుతూ తెలంగాణ సమాజాన్ని కదిలించిన రచనలు సదాశివుడి కలం నుంచి వచ్చాయన్నారు. కార్యక్రమంలో కోయి కోటేశ్వరరావు, వంశీ, విజయానంద్ తదితరులు పాల్గొన్నారు.

అతిపిన్న వయసులో రెండు ప్రభుత్వ ధ్రువపత్రాలు

- ఇంటర్నేషనల్ బుక్ ఆఫ్ రికార్డ్స్‌లో చోటు



ఠాకూర్ మన్విక్ చౌహాన్

కొత్తపేట, జూలై 8 (ఆంధ్రజ్యోతి): అతిపిన్న వయసులో రెండు భారత ప్రభుత్వ ధ్రువపత్రాలు కలిగిన చిన్నారికి ఇంటర్నేషనల్ బుక్ ఆఫ్ రికార్డ్స్‌లో చోటు దక్కింది. ఎల్బీనగర్ కొత్తపేట న్యూమారుతీనగర్‌కు చెందిన వ్యాపారి కార్తీక్ చౌహాన్ ఠాకూర్, స్రవంతి చావ్లా దంపతులకు ఈ యేడాది ఏప్రిల్ 19న ఠాకూర్ మన్విక్ చౌహాన్ జన్మించాడు. ఈ చిన్నారి పుట్టిన 29 రోజుల్లో ఆధార్ కార్డు అందుకున్నాడు. 65 రోజులకే పాస్‌పోర్టు హోల్డర్ అయ్యాడు. ఈ వివరాలను తల్లిదండ్రులు ఇంటర్నేషనల్ బుక్ ఆఫ్ రికార్డ్స్‌కు అప్‌లోడ్ చేశారు. వారు శనివారం అతిపిన్న వయసులో రెండు భారత ప్రభుత్వ ధృవపత్రాలు కలిగిన చిన్నారిగా ఠాకూర్ మన్విక్ చౌహాన్ ఇంటర్నేషనల్ బుక్ ఆఫ్ రికార్డ్స్‌లో చోటు దక్కించుకున్నాడని అభినందించారు.



జగన్నాథ రథయాత్రలో భక్తులు

వైభవంగా ఇస్కాన్ జగన్నాథ రథయాత్ర

మియాపూర్, జూలై 13 (ఆంధ్రజ్యోతి): ఇస్కాన్ జగన్నాథ రథయాత్రను శనివారం శేరిలింగంపల్లి నియోజకవర్గంలో ఘనంగా నిర్వహించారు. బీజేపీ నియోజకవర్గ ఇన్‌చార్జి రవికుమార్‌యాదవ్ ప్రత్యేక పూజలు చేసి రథయాత్రను ప్రారంభించారు. చందానగర్ ఆర్ఎస్‌బ్రదర్స్ నుంచి మియాపూర్ విశ్వనాథ్‌గార్డెన్స్ వరకు యాత్ర నిర్వహించారు. కార్యక్రమంలో ఇస్కాన్ పెద్దలు పాల్గొన్నారు.

రోడ్డుప్రమాద మృతుల కుటుంబాలను ఆదుకోవాలి

- సీఎం రేవంత్‌రెడ్డికి ఎమ్మెల్యే జాఫర్ హుస్సేన్ మెరాజ్ విజ్ఞప్తి

హైదరాబాద్/చాంద్రాయణగుట్ట, జూలై 13 (ఆంధ్రజ్యోతి): పాతబస్తీ నుంచి తీర్థయాత్రకు వెళ్లిన ఉప్పుగూడకు చెందిన ఉదయ్‌సింగ్ ఠాకూర్, క్రాంతి బాయి, బడంగ్‌పేటకు చెందిన ఉప్పలయ్య ఒడిశాలోని బరిపడా ప్రాంతంలో శనివారం తెల్లవారుజామున జరిగిన రోడ్డు ప్రమాదంలో మృతిచెందారు. వీరి కుటుంబాలను ఆదుకోవాలని మజ్లిస్ యాకుత్‌పురా ఎమ్మెల్యే జాఫర్‌హుస్సేన్ మెరాజ్ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి విజ్ఞప్తి చేశారు. ఒడిశా ప్రభుత్వ అధికారులతో మాట్లాడి మృతదేహాలు నగరానికి వచ్చేలా చూడాలని కోరారు. కాగా, మజ్లిస్ పార్టీ నాయకులు సమద్ బిన్ అబ్దాద్, ఉప్పుగూడ మజ్లిస్ కార్పొరేటర్ ఫహత్ బిన్ అబ్దాద్‌తో కలిసి ఉప్పుగూడలోని ఉదయ్‌సింగ్ ఠాకూర్ కుటుంబసభ్యులను ఎమ్మెల్యే పరామర్శించారు. కాగా, ఢిల్లీలోని హోం మంత్రిత్వ శాఖ ప్రమాదంపై ఆరా తీసింది. ఒడిశా అధికారులతో మాట్లాడి మృతదేహాలను తక్షణమే హైదరాబాద్‌కు పంపాలని, గాయపడ్డ వారికి మెరుగైన వైద్యం అందించాలని కోరింది. ఈ ఘటనపై కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ దిగ్ర్భాంతి వ్యక్తం చేశారు.

ప్రతిభా పురస్కారాలకు దరఖాస్తుల ఆహ్వానం

బర్కత్‌పుర, జూలై 13 (ఆంధ్రజ్యోతి): మున్నూరుకాపు విద్యార్థి వసతి గృహం ట్రస్టు బోర్డు ఆధ్వర్యంలో 2023-24లో పదవతరగతి, ఇంటర్‌లో 80 శాతానికిపైగా మార్కులు సాధించిన విద్యార్థులకు ప్రతిభా పురస్కారాలను ప్రదానం చేసేందుకు రాష్ట్రవ్యాప్తంగా దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు ట్రస్టు బోర్డు చైర్మన్ ప్రొఫెసర్ వెంకట్రావ్ తెలిపారు. ఈ నెల 11వ తేదీ నుంచి కాచిగూడలోని మున్నూరుకాపు భవన్‌లోని ట్రస్టు బోర్డు కార్యాలయంలో దరఖాస్తులను పొందవచ్చని ఆయన తెలిపారు. పూర్తి చేసిన దరఖాస్తులను ఈ నెల 31లోపు అందజేయాలని కోరారు. వివరాలకు 9491627404లో సంప్రదించాలని ఆయన సూచించారు.

వేడుకగా ఐఐఐటీ-హెచ్ 23వ స్నాతకోత్సవం

(5వ పేజీ తరువాయి): సర్టిఫికెట్లు పొందిన విద్యార్థులను ఆమె అభినందించారు. ఉత్తీర్ణులైన విద్యార్థులు దేశం గర్వించేలా చరిత్ర సృష్టించాలని ఆమె పిలుపునిచ్చారు. ఐటీ శిక్షణ పొందిన నిపుణులు దేశ పురోగతిలో భాగస్వాములు కావాలన్నారు. ఐఐఐటీహెచ్ డైరెక్టర్‌ప్రొఫెసర్ పీజె నారాయణన్ మాట్లాడుతూ ప్రొఫెషనల్ ప్రపంచంలోకి అడుగుపెట్టబోతున్న విద్యార్థులను అభినందించారు. ఈ కార్యక్రమంలో ఐఐఐటీ హైదరాబాద్ గవర్నింగ్ కౌన్సిల్ చైర్మన్ ప్రొఫెసర్ అశోక్ ఝున్‌ఝున్‌వాలా, విద్యార్థులు, వారి తల్లిదండ్రులు తదితరులు పాల్గొన్నారు.

జైష్ణవ్‌కు గోల్డ్‌మెడల్

ఈ సంవత్సరం గ్రాడ్యుయేషన్ పొందిన విద్యార్థులలో బీటెక్ ఈసీఈ విద్యార్థి యర్రమనేని జైష్ణవ్ గోల్డ్‌మెడల్ సాధించగా, కంప్యూటర్ సైన్స్ అండ్ ఇంజనీరింగ్ ఆల్‌రౌండర్‌గా తాటిపాముల హర్షవర్ధన్ గుర్తింపు పొందారు.

నాలాపై భద్రతా చర్యలు

- సర్కిల్ పరిధిలో మెయింటెనెన్స్ విభాగం ఏర్పాటు

హైదరాబాద్ సిటీ, జూలై 13 (ఆంధ్రజ్యోతి): వరద కాలువల్లో ప్రమాదాల నివారణకు జీహెచ్‌ఎంసీ భద్రతా చర్యలు చేపట్టింది. వరదలతో ఆస్తి, ప్రాణ, జంతు నష్టం జరగకుండా అప్రమత్తంగా ఉండేందుకు సర్కిల్ పరిధిలో ఒక మెయింటెనెన్స్ విభాగాన్ని ఏర్పాటు చేస్తోంది. అసిస్టెంట్ ఇంజనీర్ అధికారికి కొన్ని కిలోమీటర్ల వరకు బాధ్యతలు అప్పగిస్తూ చర్యలు తీసుకుంది. గ్రేటర్‌లో 203 మంది నోడల్ అధికారులను నియమించగా వారు నాలా పనులను పర్యవేక్షిస్తున్నారు. అవసరమైనప్పుడు తగిన సూచనలు, సలహాలు ఇస్తూ భద్రతా చర్యలను అమలు చేస్తుంటారు. వరద నాలాలో కూడా అక్కడక్కడా వల్నరబుల్ పాయింట్లను గుర్తించి ప్రమాదాలు జరగకుండా చుట్టూ మెష్‌లు ఏర్పాటు చేసి హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేస్తున్నారు.

1,302 కిలోమీటర్ల పొడవు వరద కాలువ..

గ్రేటర్ పరిధిలో 1,302 కి.మీ పొడవు వరద కాలువ ఉండగా అందులో 390 కి.మీ మేజర్ నాలా ఉంది. దీంతో పాటు రెండు మీటర్లపై బడిన నాలా కచ్చా, లైన్ 11,572 మీటర్లు, రెండు మీటర్లలోపు గల 368.18 మీటర్ల వెడల్పు, పైప్ డ్రైన్ 720.68 మీటర్లు ఉంది. కచ్చా, లైన్, పైప్‌డ్రైన్ కలుపుకొని మొత్తం 1302.98 మీటర్ల వరద నీటి కాలువ జీహెచ్‌ఎంసీ పరిధిలో ఉంది.



నాలాపై ఏర్పాటు చేసిన ఫెన్సింగ్, హెచ్చరిక పోస్టర్

ట్రాన్స్‌జెండర్లకు రక్షణ కల్పించాలి : జేఏసీ

పంజాగుట్ట, జూలై 13 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో ట్రాన్స్‌జెండర్లపై దాడులకు పాల్పడుతున్న మాఫియా గ్యాంగ్ సభ్యులపైన పీడీ యాక్ట్ పెట్టాలని మహిళా, ట్రాన్స్‌జెండర్స్ జేఏసీ ప్రతినిధులు డిమాండ్ చేశారు. ట్రాన్స్‌జెండర్ల రక్షణ కోసం సమగ్ర చట్టం రూపొందించాలని ప్రభుత్వాన్ని కోరారు. జేఏసీ ఆధ్వర్యంలో శనివారం సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో పీఓడబ్ల్యూ జాతీయ కన్వీనర్ వి.సంధ్య, జేఏసీ ప్రతినిధులు కె.సత్యవతి, సిమ్రాన్, మోనాలిసా, రచన, వైజయంతి, పీఓడబ్ల్యూ రాష్ట్ర అధ్యక్షులు ఝాన్సీ, తదితరులు మాట్లాడారు. మూడు కమిషనరేట్ల పరిధిలో మాఫియా గ్యాంగ్, రౌడీషీటర్లు అర్జున్ అలియాస్ అర్జున్‌సింగ్, జమీల్, పుష్పాల సాగర్, శశి, వినీత్ ధంకర్ అలియాస్ మున్నా తదితరులు ట్రాన్స్‌జెండర్లను లక్ష్యంగా చేసుకొని దాడులకు పాల్పడుతున్నారని ఆరోపించారు. గ్యాంగ్ సభ్యుల అరాచకాలకు పోలీసులు అడ్డుకట్ట వేయాలని డిమాండ్ చేశారు. సమావేశంలో జేఏసీ నాయకులు స్వరూప, తదితరులు పాల్గొన్నారు.

ఆదివారం

ప్రథమార్థం... పరిశ్రమకో వివాదం

ఎంతో గౌరవాన్ని అందుకున్న సౌత్ సినిమా తన స్థాయిని తానే తగ్గించుకుంటోందా! డ్రగ్స్ వివాహేతర సంబంధాలు, లైంగిక వేధింపులు, బహిరంగ దూషణలు.. ఒకటేమిటి రకరకాలుగా వివాదాలతో వార్తల్లో నిలుస్తూ నిత్యం జనం నోళ్లలో నానుతోంది. టాలీవుడ్ ఒక్కటే కాదు, మాలీవుడ్, శాండల్‌వుడ్, కోలీవుడ్.. పరిశ్రమ ఏదైనా ఈ ఏడాది ఆరంభం నుంచి ఏదో ఒక వివాదంతో జనం నోళ్లలో నానుతోంది.

2017లో టాలీవుడ్ మెడకు చుట్టుకున్న డ్రగ్స్ కేసు ఇప్పటికీ వదలడం లేదు. పరిశ్రమలోని కొన్ని పెద్ద తలకాయలే పోలీసుల విచారణకు హాజరయ్యారు. నెలల తరబడి విచారణ, రక్త నమూనాల సేకరణ, న్యాయస్థానాల విచారణలతో వార్తల్లో నిలిచింది. నిజానిజాల సంగతి ఎలా ఉన్నా టాలీవుడ్ ఇమేజ్‌ను దెబ్బతీసింది. ఇప్పటికీ పరిస్థితిలో మార్పేం లేదు. ఏదో ఒక సందర్భంలో ఎవరో ఒకరు డ్రగ్స్ కేసులో దొరకడం, అరెస్టవడం లాంటి సంఘటనలతో పరిశ్రమ వైపు వేలెత్తి చూపే పరిస్థితి ఏర్పడింది. ఇటీవలే బెంగళూరు రేవ్ పార్టీ కేసులో అరెస్టయిన నటి హేమ వ్యవహారంలో హడావిడి తెలిసిందే. ఇదిలా సద్దుమణిగిందో లేదో రాజ్‌తరుణ్ అతని మాజీ ప్రియురాలు లావణ్య కేసు తెరపైకి వచ్చింది. ఇందులో వర్ధమాన కథానాయిక మాల్వీ మల్హోత్రా పేరు తెరపైకి వచ్చింది. కేసులు, విమర్శలు, పోటాపోటీ ఇంటర్వ్యూలతో ట్రెండింగ్‌లో నిలుస్తున్నారు. ప్రేమ, పెళ్లి, వివాహేతర సంబంధం ఇలా పలు కోణాల్లో ఆరోపణలు, ప్రత్యారోపణలతో వినోదం పంచుతున్నారు.



అభిమానినే హత్య చేసిన హీరో

ప్రియురాలు కోసం సొంత అభిమానినే హత్యచేసిన హీరోగా చీత్కారాలకు గురువుతున్నాడు కన్నడ హీరో దర్శన్. రేణుకా స్వామి అనే అభిమానిని చిత్ర హింసలు పెట్టి చంపిన ఘటన కన్నడ చిత్ర పరిశ్రమలో సంచలనం సృష్టించింది. హత్య కేసులో ప్రస్తుతం జైల్లో ఊచలు లెక్కబెడుతున్నాడు దర్శన్. తొలుత ఈ కేసులో కన్నడ అగ్రహీరో కిచ్చా సుదీప్ పేరు వినిపించినా, ఆ తర్వాత ఆయన ప్రమేయం లేదని విచారణలో తేలింది.

మరోసారి బెడ్ రూమ్ వీడియోలతో

కొన్నేళ్ల క్రితం కోలీవుడ్ హీరోలు, హీరోయిన్ల బెడ్‌రూమ్ వీడియోలు లీక్ అవ్వడం సంచలనం సృష్టించింది. తాజాగా తమిళ చిత్ర పరిశ్రమలో మళ్లీ ఆ వీడియోల గొడవ మొదలైంది. సుచీ లీక్స్ పేరుతో కొన్నేళ్ల క్రితం తమిళ హీరో, హీరోయిన్ల శృంగార వీడియోలు, రహస్యాలు బయటకు వచ్చి సన్సేషన్ క్రియేట్ చేశాయి. అయితే ఆ వీడియోలు బయటకు రావడంలో త్రిష, ధనుష్ పాత్ర ఉందంటూ గాయని సుచిత్ర తాజాగా ఆరోపణలు చేస్తున్నారు.

గతేడాదిచివర్లో కోలీవుడ్ నటుడు మన్సూర్ అలీఖాన్ కథానాయిక త్రిషపై తన వాచాలత్వాన్ని ప్రదర్శించాడు. 'త్రిషతో బెడ్‌రూమ్ సీన్ కావాలి' అని ఆయన చేసిన వ్యాఖ్యలు సంచలనం రేపాయి. 'లియో' సినిమాలో తాను త్రిషపై అత్యాచారం చేసే సన్నివేశం లేకపోవడం బాధాకరమని ఆయన అన్నారు. 'గతంలో ఖుష్బూ రోజా లాంటి నటీమణులతో రేప్ సీన్లు చేశాను. లియోలో అవకాశం వచ్చినప్పుడు అలాంటి సీన్ ఉంటుందని ఆశించాను. అది జరగ్గపోవడంతో నిరాశపడ్డాను' అని ఓ ఇంటర్వ్యూలో ఆయన చెప్పారు. తమిళ పరిశ్రమ ప్రముఖులు కొందరు మన్సూర్ వ్యాఖ్యలను ఖండించారు.

మాలీవుడ్‌లో మల్టీప్లెక్స్ వివాదం


అయితే వీటన్నింటికి భిన్నమైన వివాదంతో ఈ ఏడాది మలయాళ చిత్ర పరిశ్రమ వార్తల్లో నిలిచింది. పరిమిత బడ్జెట్‌తో తెరకెక్కిన మాలీవుడ్ చిత్రాలు పర భాషల్లోకి డబ్ అయ్యి మంచి వసూళ్లను సాధిస్తున్నాయి. 'ప్రేమలు, భ్రమయుగం, మంజుమ్మెల్ బాయ్స్' లాంటి మలయాళ సినిమాలు పరభాషల్లోనూ ఆదరణ పొందాయి. అయితే పృథ్వీరాజ్ కథానాయకుడిగా నటించిన 'ఆడుజీవితం' చిత్రం ప్రదర్శనను మల్టీప్లెక్స్‌లు నిలిపివేశాయి. వర్చువల్ ప్రింట్ ఫీజుకు సంబంధించి మల్టీప్లెక్స్ సంస్థలు, కేరళ సినీ నిర్మాతల సంఘానికి మధ్య ఏర్పడిన వివాదమే దీనికి కారణం. అకస్మాత్తుగా సినిమాను ఎత్తేయడంతో నిర్మాతలకు నష్టం వాటిల్లింది. దీంతో ఇకపై ఏ మలయాళ సినిమాను మల్టీప్లెక్స్‌ల్లో ప్రదర్శించేందుకు ఇవ్వబోమని కేరళ సినీ నిర్మాతల సంఘం హెచ్చరించడం, కేరళ ప్రభుత్వం రంగంలోకి దిగి చర్చలు జరపడంతో ఈ వివాదం సద్దుమణిగింది.

ఈ వారమే విడుదల

ఈ ఆదివారం నుంచి వచ్చే శనివారంలోగా విడుదలవుతున్న సినిమాలు, వెబ్‌సిరీస్‌ల వివరాలు

ఓటీటీ వేదిక	సినిమా/సిరీస్	విడుదల తేదీ
నెట్‌ఫ్లిక్స్		
కోబ్రా కై	వెబ్‌సిరీస్	జూలై 18
త్రిభువన్ మిశ్రా సీఏ	హిందీ సిరీస్	జూలై 18
ఫైండ్ మీ ఫాలింగ్/	హాలీవుడ్ మూవీ	జూలై 19
స్వీట్ హోమ్	కొరియన్ సిరీస్	జూలై 19
అమెజాన్ ప్రైమ్		
స్పై స్పై	హాలీవుడ్ మూవీ	జూలై 18
జీ 5		
బహిష్కరణ	తెలుగు సిరీస్	జూలై 19
బర్బాద్/	హిందీ సిరీస్	జూలై 19
లయన్స్ గేట్ ప్లే		
అర్కేడియన్	హాలీవుడ్ మూవీ	జూలై 19
జియో సినిమా		
మిస్టర్ బిగ్‌స్టఫ్	వెబ్‌సిరీస్	జూలై 18
ఆపిల్ టీవీ ప్లస్		
లేడీ ఇన్ ది లేక్	వెబ్ సిరీస్	జూలై 19
డిస్కవరీ ప్లస్		
ది బ్లాక్ విడోయర్	వెబ్ సిరీస్	జూలై 18
డిస్నీ ప్లస్ హాట్‌స్టార్		
నాగేంద్రన్స్ హనీమూన్స్	మలయాళ చిత్రం(తెలుగులో)	జూలై 19





మన దేశం గర్వించదగిన నటులలో **నవాజుద్దీన్ సిద్ధఖీ** ఒకరు. 'భజరంగ్ భాయిజాన్' సినిమాలో ఒక చిన్న పాత్రలో అందరినీ ఆకర్షించిన నవాజుద్దీన్ ఆ తర్వాత అనేక సినిమాల్లో.. ఓటీటీ వెబ్‌సిరీస్‌లలో తన నటనా కౌశల్యాన్ని ప్రదర్శించారు. ప్రేక్షకుల మన్ననలు పొందారు. తాజాగా జీ5 ఓటీటీలో వస్తున్న 'రౌతావు కా రాజ్' అనే సిరీస్‌లో ఇన్‌స్పెక్టర్‌గా నటిస్తున్న నవాజుద్దీన్‌ను 'నవ్య' పలకరించింది.

ఎలా నటించకూడదనే విషయాన్నే ఆలోచిస్తా




సండే సెలబ్రిటీ

ఈ వెబ్ సిరీస్‌లో నటించటం ఎలా అనిపిస్తోంది?

చాలా బావుంది. ఈ సిరీస్‌లో నాది ఒక సబ్ ఇన్‌స్పెక్టర్ పాత్ర. ఒక చిన్న ఊరు. అక్కడ నివసించే ప్రజలు. అక్కడో మర్డర్. దానిని పరిష్కరించాలి. నా ఉద్దేశంలో చాలా సింపుల్‌గా కనిపించే పాత్రలను ప్రేక్షకులు ఇష్టపడతారు. నేను కూడా అలాంటి పాత్రలే చేయాలని కోరుకుంటూ ఉంటా!

మీరు సినిమాల్లోనూ, ఓటీటీల్లోనూ నటించారు. ఈ రెండింటికీ ఏదైనా తేడా కనిపించిందా?

నా ఉద్దేశంలో ఒక మంచి నటుడికి ఓటీటీ అయినా.. సినిమా అయినా ఒకటే. కెమెరా ముందు నిలబడినప్పుడు- నటనలో ఎటువంటి తేడా ఉండదు. అయితే ఈ రెండింటికీ కొన్ని మౌలికమైన తేడాలున్నాయి. సినిమా బావుంటే ప్రేక్షకుల స్పందన వెంటనే తెలిసిపోతుంది. ఓటీటీలో



అయితే కొద్ది సమయం పడుతుంది. ఉదాహరణకు ఒక సినిమా శుక్రవారం విడుదలయిందనుకుందాం. బావుంటే ఓకే! లేకపోతే ఫ్యాన్స్, నిర్మాతలు కలిపి శని, ఆదివారాలు బలవంతంగా ఆడించగలరు. సోమవారం మాత్రం ఆడించలేరు. అప్పటికి ప్రపంచమంతా ఆ సినిమా బాలేదని తెలిసిపోతుంది. అంటే కంటెంట్ ఉంటే ప్రేక్షకులు ఆదరిస్తారు. లేకపోతే మనం ఎంత బలవంతంగా వాళ్లపై రుద్దినా ప్రయోజనం ఉండదు.

నటుడిగా పైకి రావటం కష్టమా.. వచ్చిన తర్వాత ఆ స్థానాన్ని నిలబెట్టుకోవటం కష్టమా?

దీనికి సమాధానంగా నా కథనే తీసుకుందాం. నేను ఒక చిన్న పట్టణం నుంచి వచ్చాను. చాలా ఆటుపోట్లు ఎదుర్కొని నటుడిని అయ్యాను. విజయం సాధించాను. ఇప్పుడు అనేక ప్రాజెక్టుల్లో నటిస్తున్నాను. అంటే పైకి వచ్చినట్లే కదా! నా వరకూ ఆ తర్వాత ఏం జరుగుతుందనే విషయాన్ని నేను ఆలోచించను. నటనకు సంబంధించిన విషయాల్లో- మొదటి రోజు ఎంత నిజాయితీగా ఉన్నానో ఇప్పుడు కూడా అంతే నిజాయితీగా ఉన్నాను. నాకు ఫలితం ముఖ్యం కాదు. నిర్మాణ ప్రక్రియను ఎంజాయ్ చేస్తాను. నా చుట్టుపక్కల ఏమవుతోంది? ఇండస్ట్రీలో ఏం జరుగుతోంది? సినిమా రిలీజ్ ఎలా?- ఇలాంటి విషయాలను నేను పట్టించుకోను. నా పాత్రకు నేను ఎంత న్యాయం చేస్తున్నాను.. అనే అంశంపై నా దృష్టంతా ఉంటుంది. అయితే ఎవరైనా వచ్చి- 'మీరు బాగా చేశారు' అని పొగిడితే మాత్రం చాలా ఆనందంగా అనిపిస్తుంది. మంచి మోటివేషన్ వస్తుంది.

> ఆంథోని హాప్‌కిన్స్, కమల్ హాసన్, నజీర్‌సాబ్... వీళ్లందరూ నా అభిమాన నటులు. వీరు సహజనటులు. ఎలాంటి పాత్రలోనైనా ఒదిగిపోతారు.

> దక్షిణాది భాషల్లో కూడా నటించాలనుకుంటున్నాను. తెలుగులో కూడా మంచి పాత్ర వస్తే చేస్తాను. నా వద్ద కొన్ని స్క్రిప్ట్స్ ఉన్నాయి. మిగిలిన వివరాలు ఇప్పుడే చెప్పలేను.

> మళయాళం సినిమాలంటే నాకు చాలా ఇష్టం. వాటిలో కొన్ని ప్రయోగాలు జరుగుతున్నాయి. అక్కడ తీసేవన్నీ చిన్న సినిమాలే. కానీ ప్రేక్షకులపై అవి చూపే ప్రభావం మాత్రం చాలా ఎక్కువగా ఉంటుంది. నిజ జీవితంలో సంఘటనలే వారు చూపిస్తారు. ఇక పాన్ ఇండియా అనే భావనపై నాకు అంత ఆసక్తి లేదు.

మీ ఉద్దేశంలో ప్రేక్షకులకు ఎలాంటి పాత్రలు నచ్చుతాయి..?

సినిమాలో ఒక పాత్రను చూసిన తర్వాత- 'ఇది ఫలానా వాళ్లలా ఉంది.. ఇలాంటి వాళ్లను మా సొసైటీలో చూశాను..' అని ప్రేక్షకులు అనుకుంటే- ఒక నటుడు విజయవంతమయినట్లే! అయితే ఈ తరహా నటన అంత సులభం కాదు. చాలా కష్టం. పది మందిని కొట్టడం.. జెండాను పట్టుకొని పరిగెత్తడం.. ఇలాంటివి చేయటం సులభం. ప్రేక్షకుల హృదయాలను తాకటం మాత్రం చాలా కష్టం.

మీరు చేసిన పాత్రల్లో అతి కష్టమైనది ఏమిటి?

చాలా ఉన్నాయి. 'హడ్డి'లో పాత్ర చాలా కష్టం. 'బాల్ థాకరే'.. 'రామన్ రాఘవ్'లలో పాత్రలు కూడా చాలా కష్టం. ఉదాహరణకు బాల్ థాకరేనే తీసుకుందాం. దీనిని చూసిన వారికి- బాల్ థాకరేను నేను అనుకరిస్తున్నాననో.. ఆయన గొంతును మిమిక్రీ చేస్తున్నాననో అనుకోకూడదు. నవాజ్ ఈ పాత్రను చేస్తున్నాడు అనుకోవాలి. అదే సమయంలో బాల్ థాకరే కూడా వారికి కనిపించాలి. ఇది చాలా కష్టమైన ప్రక్రియ. మెథడ్ యాక్టింగ్‌లో కష్టం ఇదే! ప్రేక్షకులకు- 'నేను బాల్ థాకరేలా' నటిస్తున్నానని ఒక ఇంప్రెషన్ ఇవ్వాలి. కానీ ప్రేక్షకులకు తాము చూసే వ్యక్తి- బాల్‌థాకరే, నవాజ్ ఇద్దరూ అని భావించాలి. అలాగే హడ్డిని కూడా తీసుకుందాం. ఇందులో నేను ట్రాన్స్‌జెండర్ పాత్రలో నటించాను. నేను ట్రాన్స్‌జెండర్‌లను కాపీ కొట్టకూడదు. కానీ వాళ్లలాగా కనిపించాలి. నేను ఏదైనా పాత్రను చేసేటప్పుడు- దీనిలో ఎలా నటించాలనే విషయం కన్నా 'ఎలా నటించకూడదు' అనే విషయాన్ని ఎక్కువగా ఆలోచిస్తా.

ఇలాంటి పాత్రల కోసం ఎలాంటి హోంవర్క్ చేస్తారు?

ఆ పాత్ర గురించి లోతుగా తెలుసుకుంటా. దానికి తగినట్లుగా నా బాడీ లాంగ్వేజ్ మార్చుకుంటా.

• సీవీఎల్ఎన్ ప్రసాద్



అలనాటి కథ

వానాకాలం వచ్చిదంటే... 'శాకుంతలం'లోని మేఘ సందేశం జ్ఞాపకం వస్తుంది. మహాకవి కాళిదాసు వర్ణనలు గుర్తుకొస్తాయి. ప్రపంచమంతా మెచ్చుకున్న 'అభిజ్ఞాన శాకుంతలం' గురించి ఇప్పటి కవులకు పెద్దగా తెలియకపోవచ్చు. కానీ తప్పనిసరిగా తెలుసుకోవాల్సిన అవసరం మాత్రం ఎంతైనా ఉంది. 'శాకుంతలం' అనగానే... నేను, శేషేంద్ర కలిసి ఉజ్జయినిలోని 'ప్రేమ్‌చంద్ పీఠాన్ని' సందర్శించిన రోజులు గుర్తుకొచ్చాయి.

శాకుంతలం... కాళిదాసు సృజించిన అద్భుతం!

ఉజ్జయినీ అనగానే గుర్తుకొచ్చేవి రెండు.. ఒకటి మహాకాల్ గుడి. రెండోది శాకుంతలం. ఈ అద్భుత గ్రంథంలోని మేఘదూతంలో మహాకవి కాళిదాసు ఉజ్జయినీ వర్ణిస్తాడు. ఉజ్జయినీలోని ప్రేమచంద్ పీఠం ఆహ్వానించటంతో నేను శేషేంద్ర ఉజ్జయినీకి వెళ్లాం. అక్కడ మమల్ని స్వాగతించటానికి- పీఠం అధ్యక్షుడు, జ్ఞానపీఠ్ అవార్డు గ్రహీత నరేష్ మెహతా వచ్చారు. మమల్ని హోటల్‌కు తీసుకువెళ్లారు. ఆ హోటల్ అంతా ఒకటే ఫ్లోర్. పక్కనే అందమైన మొక్కలతో గార్డెన్. ఆ రోజు రాత్రి ఇద్దరు గ్రీకు ఆర్టిస్టులు- 'శాకుంతలం' ఇంగ్లీషు నాటకాన్ని వేశారు. ఎన్ని భాషల్లోకి తర్జుమా అయినా ఆత్మను కోల్పోని నాటకమది. నేను కూడా హిందీ అనువాదాన్ని చదివాను. ఆ మర్నాడు ఉదయాన్నే లేచాం. ఉదయాన్నే పీఠంలో కార్యక్రమం. మేము తయారవుతున్నాం. హోటల్ అంతా హడావిడిగా ఉంది. ఎందుకో నాకు అర్థం కాలేదు. బయటకు వచ్చి చూశాను. ఒక ఫ్రెంచి అమ్మాయి నా దగ్గరకు వచ్చి- 'మీకు ఎగ్ ప్లాంట్ ఎక్కడ దొరుకుతాయో తెలుసా? హోటల్ వాళ్లు చెప్పలేకపోతున్నారు' అంది. మన వంకాయను ఇంగ్లీషులో ఎగ్ ప్లాంట్ అంటారని హోటల్ వాళ్లకు తెలియకపోవటం వల్ల ఆ అమ్మాయి హడావిడి చేస్తోంది. ఎగ్‌ప్లాంట్‌ను హిందీలో అంటారని చెప్పిన తర్వాత ఆమె హోటల్ కిచెన్ లోకి వెళ్లి వాటిని తెచ్చుకుంది. హమయ్య! హడావిడి అయిపోయిందనుకొనే సరికి పొడవుగా ఉన్న ఒకాయన మా రూమ్‌కు వచ్చాడు. "నా పేరు రాధ వల్లభ త్రిపాఠి.. శేషేంద్రజీని కలవటానికి వచ్చాను" అన్నాడు. ఆయనను రూమ్‌లోపలికి తీసుకువెళ్లి కూర్చోబెట్టాను. శేషేంద్ర, ఆయన మాట్లాడుకోవటం మొదలుపెట్టారు. త్రిపాఠి నాట్యశాస్త్రం గురించి మాట్లాడటం మొదలుపెట్టారు. శేషేంద్ర కూడా ఆయనకు ధీటుగా తన వద్దనున్న సమాచారాన్ని చెప్పటం మొదలుపెట్టాడు. శేషేంద్రకు నాట్య శాస్త్రం గురించి అంత విపులంగా తెలుసని నేను ఎప్పుడూ అనుకోలేదు. ఈ లోపులో టీ వచ్చింది. త్రిపాఠి టీ తాగి లేచి వెళ్లిపోయాడు. శేషేంద్ర జ్ఞానాన్ని పరీక్షించటానికి ఆయన మా గదికి వచ్చాడా అనిపించింది.

మేము పీఠానికి వెళ్లాం. మా సెషన్‌కు ప్రముఖ



కర్ణాటక సంగీత విద్వాంసుడు బాలమురళీ సహా అనేక మంది ప్రముఖులు వచ్చారు. ఢిల్లీలోని జేఎన్‌యూ విశ్వవిద్యాలయం వైస్‌ఛాన్సరల్ ఆ సెషన్‌కు అధ్యక్షుడు. ఒక దేశ అంబాసిడర్ భార్య అన్న కూడా ఉపన్యాసాలు వినటానికి వచ్చింది. సెషన్ ప్రారంభమవుతుందనగా- ఎవ్వరూ ఊహించని విధంగా- 'రచయితలు ముందుగా తయారు చేసుకున్న పత్రాలు చదవద్దు. ఉపన్యాసం మాత్రమే ఇవ్వండి' అని త్రిపాఠి కోరారు. దానితో శ్రోతల్లో కూడా కలకలం రేగింది. శేషేంద్ర వంతు వచ్చింది. శేషేంద్ర లేచి తన ప్రసంగాన్ని ఒక సంస్కృత శ్లోకంతో ప్రారంభించాడు. దానికి ప్రతిగా శ్రోతల్లో ఒకరు మరో శ్లోకాన్ని చదివారు. దానికి కొనసాగింపుగా శేషేంద్ర మరో శ్లోకాన్ని చదివాడు. సభ అంతా ఇలా రంజుగా సాగింది. ఒక అంబాసిడర్ భార్య ముందు పరువు పోనందుకు నాకు చాలా ఆనందం వేసింది. ఆ సెషన్ ముగిసే ముందు- పీఠం అధ్యక్షుడు నరేష్ మెహతాను- శాకుంతలం గురించి కొన్ని మాటలు మాట్లడమని అడిగారు. "నేను కాళిదాసును చదవలేదు. నేను ఏం మాట్లాడతాను" అన్నారు నరేష్ మెహతా. అక్కడున్న ప్రేక్షకులు అవాక్కయ్యారు.

ఆ రోజు సాయంత్రం మెహతా మా రూమ్‌కు వచ్చారు. "అసలు నేను చదవని పుస్తకం గురించి మాట్లాడమని నన్ను ఎలా అడుగుతారు" అని గొణగటం మొదలుపెట్టాడు. శాకుంతలం గ్రంథాన్ని మెహతా చదవలేదనే విషయం నాకు ఆశ్చర్యమేసింది. "నన్ను అడిగితే- నా దగ్గరున్న హిందీ ట్రాన్స్‌లేషన్ అయినా ఇచ్చేదాన్ని కదా.." అనుకున్నా. సాధారణంగా హిందీ రచయితలు- గొప్ప సంస్కృత గ్రంథాలన్నింటినీ చదువుతారని అనుకుంటారు. కానీ అది వాస్తవం కాదనే విషయం నాకు ఆ రోజు తెలిసింది. ఆ మర్నాడు అంబాసిడర్ భార్య అన్నా ఢిల్లీకి వెళ్లిపోయింది. ఆమెను అప్పటి ప్రధాని పి.వి.నరసింహారావును కలవమని చెప్పాం. ఆమె ఢిల్లీ నుంచి మద్రాసు వెళ్లి ప్రొఫెసర్ పానీకర్ అనే మళయాళం రచయితను కలిసింది. ఆ తర్వాత హైదరాబాద్‌కు వచ్చి నన్ను కూడా కలిసింది.

> ఉజ్జయినికి సమీపంలో ఉన్న పెద్ద నగరం ఇండోర్. ఇండోర్ రాజకుటుంబంతో మాకు సన్నిహిత సంబంధాలు ఉండేవి. ఇండోర్ మహారాజు శ్రీమంత్ టుకోజీ రావ్ మహారాజ్, ఆయన శర్మిష్ఠ దేవి ముంబయిలోని ధన్‌రాజ్ మహల్‌కు వస్తూ ఉండేవారు. ఒక దశలో వారి కుమార్తె సుశీలారాజే హోల్కర్‌ను మా తమ్ముడికి ఇచ్చి పెళ్లి చేద్దామనుకున్నారు కూడా.

విశ్వవిదిత 'శాకుంతలం'

శాకుంతలాన్ని ప్రపంచవ్యాప్తంగా ప్రజలు ఆదరించారు. ఆదరిస్తున్నారు. ఇంగ్లీషు నుంచి జర్మన్‌కు అనువాదమయిన తొలి గ్రంథం శాకుంతలం. ప్రఖ్యాత జర్మన్ రచయిత గోథే- శాకుంతలాన్ని చదివి ఆనందంతో డ్యాన్స్ చేశాడని చెబుతారు. "శాకుంతలాన్ని చదివేటప్పుడు కలిగే అనుభూతి అసామాన్యం" అంటాడా కవి. ఆయనే కాళిదాసును 'షేక్స్పియర్ ఆఫ్ ఇండియా' అని పిలిచాడు కూడా! జర్మన్ తత్వవేత్త ఆర్థర్ షోపెనూర్ కూడా శాకుంతలంపై ప్రశంసల జల్లు కురిపించాడు. ఆర్థర్ రాసిన పుస్తకాలలో మన చందోగనిషత్‌కి చెందిన 'తత్వమసీ' అనే భావన.. విల్ అండ్ రిప్రజంటేషన్‌గా కనిపిస్తుంది. "దుష్యంతుడి కోసం వెళ్లే ముందు వశిష్టుడి కోసం శకుంతల వేచి చూస్తూ ఉంటుంది. ఆయన వచ్చిన తర్వాత శకుంతల నమస్కారం చేసి- 'తెలియనితనంతోను.. అమాయకత్వంతోను 'నేను నిన్ను నాన్న అని పిలిచాను. నువ్వు మహాముని వశిష్టుడివి అనే మాట మరిచాను..' అంటుంది. అప్పుడు వశిష్టుడి కంట నీరు కారుతుంది. శకుంతల ఆయనకు మూడు ప్రదక్షిణలు చేసి, కాళ్లకు నమస్కారం చేసి బయలుదేరుతుంది. ఈ ఒక్క ఘట్టంలో అనేక కోణాలు మనకు తెలుస్తాయి" అంటారు ఆర్థర్.

• రాజకుమారి ఇందిరాదేవి ధన్‌రాజ్‌గిర్

కథానాయికగానే కాదు... నిర్మాత, వ్యాపారవేత్తగానూ పేరు తెచ్చుకున్న బాలీవుడ్ నటి ప్రీతి జింతా. ఐపీయల్‌లో పంజాబ్ జట్టు సహ యజమాని కూడా అయిన ఆమెది అటు కెరీర్‌లో... ఇటు వ్యక్తిగత జీవితంలో విజయవంతమైన ప్రయాణం.

వారే నా ప్రపంచం

ప్రీతి జింతా అంటే సొట్టబుగ్గల అందం. బాలీవుడ్ కథానాయికగా ఆమె క్రేజ్ విభిన్నం. పక్కా క్రికెట్ ఫ్యాన్. ఐపీఎల్ ఫ్రాంఛైజీ సహ యజమానిగా ఆమె చేసిన సాహసం కొనియాడాల్సిందే. ఇన్‌స్టాలో ఆమెను కోటిమందికి పైగా ఫాలో అవుతున్నారు. అందులో తన కెరీర్‌తో పాటు లైఫ్‌స్టయిల్ విషయాలనూ షేర్ చేస్తుంటుంది. 'ప్రతి రోజూ కొత్త ఛాలెంజ్. నటిగా అయినా, పారిశ్రామికవేత్తగా అయినా పని విషయంలో రాజీ ఉండదు' అంటుందీమె.

అలా వెండితెరకు...

హిమాచల్ ప్రదేశ్‌లోని సిమ్లాలో పుట్టింది ప్రీతి. రాజ్‌పుత్ వంశానికి చెందిన వ్యక్తి. ఆమె తండ్రి మిలిటరీలో ఆఫీసర్‌గా పని చేశారు. 'సిమ్లా లాంటి అందమైన ప్రదేశంలో పుట్టి పెరగటం అదృష్టం' అంటుందీమె. ప్రీతికి ఇద్దరు అన్నదమ్ములు. చిన్నప్పటి నుంచే టామ్‌బాయ్‌లా పెరిగింది. జీసెస్ అండ్ మేరీ బోర్డింగ్ స్కూల్‌లో చదవటం వల్ల ఆమెకు క్రమశిక్షణ అబ్బింది. ముఖ్యంగా బోర్డింగ్ స్కూల్‌లో ఒంటరిగా ఉండటం వల్ల బయటి ప్రపంచంతో ఎలా మెలగాలో తెలుసుకుంది. కవిత్వం అంటే ప్రేమ అక్కడే పుట్టింది. వాలీబాల్ ఆడేది. షేక్స్‌పియర్ పోయెట్రీని విపరీతంగా ఇష్టపడేది. డిగ్రీ అయ్యాక.. క్రిమినల్ సైకాలజీ చదివింది. ఆ తర్వాత మోడలింగ్ చేసింది. చాక్లెట్ యాడ్‌లో నటించిన తర్వాత ఆమెకు బ్రాండ్స్‌తో పాటు సీరియల్స్‌లో కూడా అవకాశాలు వచ్చాయి. అలా ఆమె కెరీర్ ప్రారంభమైంది. దర్శకులు శేఖర్ కపూర్ ఓ సినిమాకి అవకాశం ఇచ్చారు. అయితే ఆ సినిమా ఆగిపోయింది. శేఖర్‌కపూర్ రిఫరెన్స్‌తో మణిరత్నం 'దిల్ సే'లో అవకాశం వచ్చింది. 'సోల్జర్' అనే చిత్రం ప్రారంభమైనా ఆలస్యంగా షూటింగ్ పూర్తి చేసుకుంది. అయితే ఈ రెండు చిత్రాలకూ 'ఫిల్మ్‌ఫేర్ బెస్ట్ డెబ్యూట్ యాక్ట్రెస్'గా అవార్డు దక్కించుకుంది. దీంతో ప్రీతి కెరీర్ ఊపందుకుంది.

> కేవలం నటనకే పరిమితం కాకుండా ఎప్పటికప్పుడు తన పయనాన్ని మార్చుకుంది ప్రీతి. అడుగెట్టిన ప్రతిచోటా విజయం అందుకుంది. కొన్ని సామాజిక కార్యక్రమాల్లో కూడా పాల్గొంది. ముఖ్యంగా చైల్డ్, విమెన్ ట్రాఫికింగ్‌కు వ్యతిరేకంగా నిర్వహించిన పలు కార్యక్రమాల్లో భాగమైంది.

ఎక్కడా ఆగలేదు...

ఈలోపు 'ప్రేమంటే ఇదేరా', 'రాజకుమారుడు'.. లాంటి తెలుగు చిత్రాలతో దక్షిణాది ప్రేక్షకులకు దగ్గరైంది. బాలీవుడ్‌లో 'మిషన్ కాశ్మీర్', 'చోరీ చోరీ చుప్కే చుప్కే', 'దిల్ చాహతా హై', 'కోయి మిల్ గయా', 'వీర్ జారా', 'సలామ్ నమస్తే', 'కభీ అల్విదా నా కెహనా' లాంటి విజయాలు అందుకుంది. 2007 తర్వాత ఆమె హవా తగ్గింది. అయినా టెలివిజన్ లైవ్‌షోస్‌లో కనిపించింది. అక్కడితే కెరీర్‌కు ఫుల్‌స్టాప్ పెట్టకుండా అతిథి పాత్రల్లో కనపడేది. 2011లో ప్రొడక్షన్ కంపెనీ పెట్టింది. ఆ తర్వాత క్రికెట్ వీరాభిమాని కావటంతో నెస్‌వాడియా, మోహిత్ బర్మన్‌లాంటి పెట్టుబడిదారులతో కలసి కింగ్స్ ఎలెవన్ పంజాబ్ ఐపీయల్ జట్టు బాధ్యతలు తానూ తలకెత్తుంది. పబ్లిసిటీ ఇవ్వటానికి తానూ భాగమై నడిచింది.



'ఇంత ప్రేమ నాకెక్కడా దొరకదు'...


2016లో అమెరికన్‌ను పెళ్లిచేసుకుంది ప్రీతి. అతను బిజినెస్‌మాన్. పవర్ కంపెనీకి వైస్‌ప్రసిడెంట్. పెళ్లి తర్వాత ప్రీతిజింతా పూర్తిగా లాస్‌ఏంజెల్స్‌కే పరిమితమైంది. తరచుగా మన దేశానికి వచ్చిపోతోంది. అన్నట్లు సరోగసీ పద్ధతిలో ఒక కొడుకు, కూతురు. ప్రస్తుతం రాజ్ కుమార్ సంతోషి దర్శకత్వంలో 'లాహోర్ 1947' చిత్రంలో నటిస్తోంది. ఇదో పీరియాడిక్ ఫిల్మ్. 'ఇకమీదట సినిమాలు వచ్చినా చేయలేను. బిజినెస్‌తో పాటు పర్సనల్ లైఫ్ ముఖ్యం అనిపిస్తోంది. హీరోయిన్లను జనాలు త్వరగా మర్చిపోతారు. ఏమీ చేయలేం. ఇప్పటికైతే పిల్లలే నాప్రపంచం. ఇంత ప్రేమ నాకెక్కడ దొరకదు' అంటోంది ప్రీతి జింతా.

'దిక్సూచి' వెబ్ పేజీలో..
సమాచారం కోసం ఈ క్యూఆర్ కోడ్ స్కాన్ చేయండి. లేదా ఈ కింది యూఆర్ఎల్ https://ejyothy.com/I8QbERLలో చదవండి.

నవ్య 'దృశ్యం పేజీ' లో ఆసక్తికర కథనాల కోసం... ఈ క్యూఆర్ కోడ్ స్కాన్ చేయండి. లేదా ఈ కింది యూఆర్ఎల్ https://ejyothy.com/2K7rzhGలో చదవండి.



అమరావతిలో చంద్రబాబు బయోపిక్ ప్రారంభం



ఆంధ్రప్రదేశ్ రాజధాని అమరావతిలో ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు బయోపిక్ 'ధర్మ చక్ర' షూటింగ్‌ను తాడికొండ ఎమ్మెల్యే తెనాలి శ్రావణ్ కుమార్ క్లాప్ కొట్టి శనివారం ప్రారంభించారు. రాజధాని గ్రామం మల్కాపురం వి స్క్వేర్ ఆడిటోరియంలో ఈ కార్యక్రమం జరిగింది. పసుపులేటి వెంకట రమణ దర్శకత్వంలో మనోహర్ నాయుడు నిర్మిస్తున్నారు. పది రోజుల పాటు అమరావతిలో షూటింగ్ జరుగుతుంది. ఇందులో రాజధాని కోసం భూములిచ్చిన రైతులు కూడా కళాకారులతో నటిస్తారు.

- తుళ్లూరు(ఆంధ్రజ్యోతి)

రూ. వెయ్యి కోట్ల క్లబ్‌లో కల్కి



ప్రభాస్ కథానాయకుడిగా నాగ్ అశ్విన్ దర్శకత్వం వహించిన 'కల్కి 2898 ఏడీ' చిత్రం బాక్సాఫీస్ వద్ద దుమ్మురేపే వసూళ్లతో దూసుకుపోతోంది. తెలుగు రాష్ట్రాల్లోనే కాకుండా హిందీ బెల్ట్‌లో, విదేశాల్లోనూ సంచలన వసూళ్లను సాధిస్తోంది. తాజాగా 'కల్కి' చిత్రం కీర్తి కిరీటంలో మరో మైలురాయి చేరింది. ఈ చిత్రం రూ. వెయ్యి కోట్ల వసూళ్లను అందుకున్నట్లు నిర్మాణ సంస్థ వైజయంతీ మూవీస్ శనివారం తెలిపింది. విడుదలైన మూడు వారాల తర్వాత కూడా బాక్సాఫీసు దగ్గర నిలకడైన వసూళ్లతో కొనసాగుతున్నట్లు తెలిపింది. ఈ చిత్రంలో అమితాబ్‌బచ్చన్, కమల్‌హాసన్, దీపికా పదుకొనే, దిశాపటానీ కీలకపాత్రలు పోషించారు. సి. అశ్వనీదత్ నిర్మించారు.


మోసపోయా.. ఆత్మహత్య చేసుకుంటా




నటుడు రాజ్ తరుణ్, అతని ప్రియురాలు లావణ్య వ్యవహారం రోజుకో మలుపు తిరుగుతోంది. రాజ్ తరుణ్ 11 ఏళ్లు తనతో సహజీవనం చేసి.. ఇప్పుడు మాల్వీ మల్హోత్రా అనే హీరోయిన్‌తో తిరుగుతూ తనను దూరం పెడుతున్నాడంటూ కేసు పెట్టిన లావణ్య.. శుక్రవారం రాత్రి ఆత్మహత్యా యత్నానికి పాల్పడినట్టు తెలిసింది. ఆత్మహత్య చేసుకుంటున్నానంటూ తన న్యాయవాదికి వాట్సాప్ చాటింగ్‌లో చెప్పడం.. ఆయన 112కు ఫోన్ చేయడంతో నార్సింగ్ పోలీసులు వెంటనే ఆమె ఇంటికి చేరుకుని కౌన్సిలింగ్ ఇచ్చారు. తనకు రూ.5 కోట్లు ఇస్తామని, కేసు వెనక్కి తీసుకోవాలని కొందరు బెదిరిస్తున్నారని న్యాయవాదితో చాటింగ్‌లో ఆమె పేర్కొన్నారు. రాజ్ తరుణ్ చేతిలో దారుణంగా మోసపోయాయని, ప్రతిదీ ఓ పథకం ప్రకారం జరిగిందన్నారు. అందుకే ఆత్మహత్య చేసుకోవాలనుకున్నానని, తన చావుకు రాజ్ తరుణ్, అతని తల్లిదండ్రులతో పాటు మాల్వీ మల్హోత్రా కారణమని పేర్కొన్నారు. లావణ్య శనివారం తన న్యాయవాదితో కలిసి నార్సింగ్ పోలీసుల ఎదుట విచారణకు హాజరై రాజ్ తరుణ్‌తో తనకు ఉన్న సంబంధంపై పలు విషయాలు వెల్లడించినట్లు తెలిసింది. నార్సింగ్ పోలీసులు పలు సెక్షన్ల కింద మాల్య, మయాంక్, రాజ్ తరుణ్‌పై కేసు నమోదు చేశారు.

హైదరాబాద్ సిటీ/నార్సింగ్ (ఆంధ్రజ్యోతి)













నాలుగా.. ఒక్కటా..!

ఇంగ్లండ్‌తో స్పెయిన్ ఢీ
'యూరో' ఫైనల్ నేడే

రాత్రి 12.30 నుంచి సోనీలో..

బెర్లిన్: జైత్రయాత్ర కొనసాగిస్తున్న స్పెయిన్ రికార్డుస్థాయిలో నాలుగోసారి యూరో ఫుట్‌బాల్ చాంపియన్‌షిప్ నెగ్గాలనే పట్టుదలతో ఉండగా.. గత టోర్నీలో తుది మెట్టుపై తడబడిన ఇంగ్లండ్ తొలిసారి విజేతగా నిలవాలనే కసితో ఉంది. ఆదివారం రాత్రి జరిగే టైటిల్ ఫైట్‌లో జోరుమీదున్న స్పెయిన్‌తో ఇంగ్లండ్ అమీతుమీ తేల్చుకోనుంది. సెమీస్‌లో బలమైన ఫ్రాన్స్‌ను ఓడించిన స్పెయిన్ ఫేవరెట్‌గా కనిపిస్తోంది. కెప్టెన్ మొరాటా పూర్తి ఫిట్‌నెస్‌తో కనిపిస్తుండగా.. చిచ్చరపిడుగు యమల్‌పైనే అందరి దృష్టి నెలకొనే అవకాశం ఉంది. ఓల్మో కూడా ఫామ్‌లో ఉన్నాడు. మరోవైపు ఇంగ్లండ్ అద్భుత పోరాటపటిమను ప్రదర్శిస్తోంది. నాకౌట్ మ్యాచ్‌ల్లో వెనుకబడినా అద్భుతంగా పుంజుకొని విజయాలు అదుకొంటోంది. నెదర్లాండ్స్‌తో ఫైనల్ ఫోర్ మ్యాచ్‌లోనూ వెనుకంజలో నిలిచినా.. వాట్కిన్స్ లేటు గోల్‌తో జట్టును గెలిపించాడు. కెప్టెన్ హ్యారీ కేన్, బెలింగమ్, సాకా జట్టుకు కీలకం కానున్నారు.


(సా. 6.30 నుంచి స్టార్‌స్పోర్ట్స్‌లో)

బిగ్‌ఫైట్
అల్కారజ్ x జొకోవిచ్
పురుషుల ఫైనల్ నేడే

గత ఏడాది ఫైనలిస్టులు రెండో సీడ్ నొవాక్ జొకోవిచ్, మూడో సీడ్ కార్లోస్ అల్కారజ్ ఆదివారం జరిగే వింబుల్డన్ పురుషుల సింగిల్స్ టైటిల్ ఫైట్‌లో అమీతుమీ తేల్చుకోనున్నారు. నిరుడు ఇక్కడ జొకో ఆధిపత్యానికి గండికొట్టి తొలి గ్రాస్‌కోర్టు గ్రాండ్‌స్లామ్ అందుకున్న అల్కారజ్, గత ప్రదర్శనను పునరావృతం చేయాలన్న పట్టుదలతో ఉన్నాడు. మరోవైపు మోకాలి గాయానికి ఆపరేషన్ తర్వాత కూడా అమోఘమైన ఆటతీరుతో తుదిపోరుకు దూసుకొచ్చిన 37ఏళ్ల జొకో.. ఈవేదికపై ఎనిమిదో టైటిల్‌తో ఫెడరర్ రికార్డును సమం చేయాలని ఆరాటపడుతున్నాడు.

క్వీన్ క్రెజికోవా

● చెక్ భామ ఖాతాలో వింబుల్డన్
● ఫైనల్లో పాలినీపై విజయం



లండన్: తొలిసారి వింబుల్డన్ ఫైనల్ చేరిన చెక్ రిపబ్లిక్ భామ బార్బరా క్రెజికోవా అదేజోరులో టైటిల్‌ను సొంతం చేసుకొంది. శనివారం జరిగిన తుది పోరులో 31వ సీడ్ క్రెజికోవా 6-2, 2-6, 6-4తో ఏడో సీడ్, ఇటలీ తార జాస్మిన్ పౌలినిని ఓడించింది. వింబుల్డన్‌కు ముందు ఫ్రెంచ్ ఓపెన్‌లో రన్నరప్‌గా నిలిచిన జాస్మిన్‌కు ఇక్కడా నిరాశే ఎదురైంది. కాగా, 28 ఏళ్ల క్రెజికోవాకిది కెరీర్‌లో రెండో సింగిల్స్ గ్రాండ్‌స్లామ్. 2021లో ఫ్రెంచ్ ఓపెన్ గెలిచింది. గంటా 56 నిమిషాలపాటు సాగిన ఫైనల్లో క్రెజికోవా బేస్‌లైన్ షాట్లు ఆడుతూనే తెలివిగా డ్రాప్ చేస్తూ పాయింట్లు రాబడుతుంటే.. ప్రత్యర్థి పౌలినికి ఏం చేయాలో కూడా అర్థం కాలేదు. తొలిసెట్ మొదటి గేమ్‌లోనే ఇటలీ ప్లేయర్ సర్వీస్‌ను బ్రేక్ చేసిన బార్బరా 2-0 ఆధిక్యంలోకి దూసుకెళ్లింది. అయితే, మూడో గేమ్‌లో సర్వీస్ నిలబెట్టుకొన్న పౌలిని 1-2తో నిలిచింది. కానీ, ఆ తర్వాత వరుసగా మూడు గేమ్‌లు నెగ్గిన క్రెజికోవా 5-1తో పైచేయి సాధించింది. అదే ఊపులో సెట్‌ను సొంతం చేసుకొంది. కానీ, రెండో సెట్‌లో పుంజుకొన్న జాస్మిన్ తొలి మూడు గేమ్‌లు గెలిచి 3-0తో ముందంజ వేసింది. వరుసగా సర్వీస్‌లను నిలబెట్టుకొంటూ రెండో సెట్‌ను నెగ్గిన పౌలిని.. మ్యాచ్ ఫలితాన్ని మూడో సెట్‌కు తీసుకెళ్లింది. నిర్ణాయక సెట్‌లో ఇద్దరూ సర్వీస్‌లను నిలబెట్టుకొంటూ 3-3తో హోరాహోరీగా తలపడ్డారు. అయితే, ఏడో గేమ్‌లో డబుల్ ఫౌల్ కారణంగా పౌలిని సర్వీస్ బ్రేక్ కాగా.. తర్వాతి గేమ్ నెగ్గిన బార్బరా 5-3తో ఆధిక్యం సాధించింది. 9వ గేమ్ గెలిచిన జాస్మిన్.. తర్వాతి గేమ్‌లో సమం కోసం పోరాడినా బ్యాక్ హ్యాండ్ తప్పిదంతో మ్యాచ్‌ను చేజార్చుకొంది.



ఇద్దరే బాదేశారు

జైస్వాల్, గిల్ అజేయ అర్ధసెంచరీలు
3-1తో భారత్‌దే సిరీస్
నాలుగో టీ20లోనూ జింబాబ్వే ఓటమి

హరారే: సిరీస్ నిర్ణాయక మ్యాచ్‌లో యువ భారత్ మరింత దూకుడును ప్రదర్శించింది. ప్రత్యర్థి బౌలర్లపై సంపూర్ణ ఆధిపత్యాన్ని చూపిన ఓపెనర్లు యశస్వీ జైస్వాల్ (53 బంతుల్లో 13 ఫోర్లు, 2 సిక్సర్లతో 93 నాటౌట్), కెప్టెన్ శుభ్‌మన్ గిల్ (39 బంతుల్లో 6 ఫోర్లు, 2 సిక్సర్లతో 58 నాటౌట్) అజేయ అర్ధసెంచరీలతో చెలరేగారు. దీంతో శనివారం జరిగిన నాలుగో టీ20లో భారత్ పది వికెట్లతో గెలిచింది. 3-1తో సిరీస్‌ను ఖాతాలో వేసుకుంది. ఆఖరి మ్యాచ్ ఆదివారమే జరుగనుంది. ముందు గా జింబాబ్వే 20 ఓవర్లలో 7 వికెట్లకు 152 పరుగులు చేసింది. సికిందర్ రజా (46) టాప్ స్కోరర్. ఆరంభంలో ఓపెనర్లు మరుమని (32), మధెవెరె (25) నిలకడను ప్రదర్శించారు. మిడిలార్డర్‌లో రజా ధాటిగా ఆడాడు. కానీ మరో ఎండ్‌లో వికెట్ల పతనం కొనసాగింది. అలాగే 19వ ఓవర్‌లో రజాను అరంగేట్ర పేసర్ తుషార్ దేశ్‌పాండే అవుట్ చేయడంతో జింబాబ్వే ఓ మాదిరి స్కోరుకే పరిమితమైంది. చివరి ఓవర్‌లో పేసర్ ఖలీల్ 2 వికెట్లు తీసి 5 పరుగులే ఇచ్చాడు. ఛేదనలో భారత్ 15.2 ఓవర్లలో వికెట్ నష్టపోకుండా 156 రన్స్ చేసి గెలిచింది. ప్లేయర్ ఆఫ్ ద మ్యాచ్‌గా జైస్వాల్ నిలిచాడు.

మెరుపు ఆరంభం: ఛేదనలో ఓపెనర్లు జైస్వాల్, గిల్ ఎదురుదాడిని జింబాబ్వే బౌలర్లు ఏమాత్రం అడ్డుకోలేకపోయారు. ఈ జోడీ తొలి వికెట్‌కు అజేయంగా 156 రన్స్ అందించడంతో 28 బంతులుండగానే మ్యాచ్ ముగిసింది. తొలి ఓవర్‌లోనే జైస్వాల్ హ్యాట్రిక్ ఫోర్లతో వేట ఆరంభించాడు. అదే దూకుడుతో మూడో ఓవర్‌లోనూ 4 ఫోర్లు బాదడంతో పవర్‌ప్లేలోనే జట్టు 61 రన్స్ సాధించింది. 29 బంతుల్లోనే జైస్వాల్ ఫిఫ్టీ కూడా పూర్తయ్యింది. అప్పటికి గిల్ స్కోరు 13 రన్సే. ఇక గిల్ కూడా పదో ఓవర్‌లో మూడు ఫోర్లతో ఆకట్టుకోగా స్కోరు వంద దాటింది. 15వ ఓవర్‌లో చెరో సిక్సర్‌తో 16 రన్స్ రావడంతో జట్టు విజయానికి చేరువైంది. అటు గిల్ అర్ధసెంచరీ కూడా పూర్తయ్యింది. అయితే ఫోర్‌తో మ్యాచ్‌ను ముగించిన జైస్వాల్ సెంచరీకి 7 పరుగుల దూరంలో ఆగిపోయాడు.

స్కోరుబోర్డు

జింబాబ్వే: మధెవెరె (సి) రింకూ (బి) దూబే 25; మరుమని (సి) రింకూ (బి) అభిషేక్ 32; బెన్నెట్ (సి) జైస్వాల్ (బి) సుందర్ 9; రజా (సి) గిల్ (బి) తుషార్ 46; క్యాంప్‌బెల్ (రనౌట్) 3; మైర్స్ (సి అండ్ బి) ఖలీల్ 12; మదండె (సి) రింకూ (బి) ఖలీల్ 7; ఫరాజ్ (నాటౌట్) 4; ఎక్స్‌ట్రాలు: 14; **మొత్తం: 20 ఓవర్లలో 152/7. వికెట్ల పతనం:** 1-63, 2-67, 3-92, 4-96, 5-141, 6-147, 7-152. **బౌలింగ్:** ఖలీల్ 4-0-32-2; తుషార్ 3-0-30-1; రవి బిష్ణోయ్ 4-0-22-0; సుందర్ 4-0-32-1; అభిషేక్ 3-0-20-1; శివమ్ దూబే 2-0-11-1.

భారత్: జైస్వాల్ (నాటౌట్) 93; గిల్ (నాటౌట్) 58; ఎక్స్‌ట్రాలు: 5; **మొత్తం:** 15.2 ఓవర్లలో వికెట్ నష్టపోకుండా 156. **బౌలింగ్:** ఎన్‌గరవ 3-0-27-0; ముజరబాని 3.2-0-25-0; చటార 2-0-23-0; ఫరాజ్ 4-0-41-0; రజా 2-0-24-0; బెన్నెట్ 1-0-16-0.

1 టీ20ల్లో వికెట్ నష్టపోకుండా 150+ స్కోరును ఛేదించడం భారత్‌కిదే తొలిసారి. అలాగే ఎక్కువ బంతులు (28) మిగిలి ఉండగానే మొదటిసారి మ్యాచ్‌ను పూర్తి చేసింది.

2 ఛేదనలో ఏ వికెట్‌కైనా రెండో అత్యధిక భాగస్వామ్యం అందించిన జైస్వాల్-గిల్.

5 భారత్ నుంచి టీ20ల్లో తొలి వికెట్‌కు 150+ భాగస్వామ్యం నమోదవడం ఇది ఐదోసారి.



మెస్సీ సేనకు ఎదురుందా?

కొలంబియాతో అర్జెంటీనా టైటిల్‌ఫైట్
కోపా అమెరికా కప్

సోమవారం ఉదయం 5.30 నుంచి

మయామి (యూఎస్): డిఫెండింగ్ చాంప్ అర్జెంటీనా రికార్డుస్థాయిలో 16వసారి కోపా అమెరికా కప్‌ను సొంతం చేసుకోవాలనుకొంటోంది. సోమవారం తెల్లవారుజామున జరిగే ఫైనల్లో కొలంబియాతో అమీతుమీ తేల్చుకోనుంది. ఈపాటికే 15సార్లు కోపా టైటిల్ నెగ్గిన అర్జెంటీనా.. ఉరుగ్వేతో సమంగా నిలిచింది. మరోసారి విజేతగా నిలిస్తే మెస్సీ సేన సరికొత్త చరిత్రను సృష్టించనుంది. కాగా, 28 మ్యాచ్‌ల్లో ఓటమనేదే లేని కొలంబియా అదే జోరును కొనసాగించాలనుకొంటోంది. సెమీస్‌లో పటిష్ట ఉరుగ్వేకు ఝలకిచ్చిన కొలంబియా.. సంచలనం సృష్టించాలనే పట్టుదలతో ఉంది. 23 ఏళ్ల తర్వాత మళ్లీ టైటిల్‌ను ముద్దాడాలనుకొంటోంది.

శ్రీలంక టూర్‌లో మార్పులు

ముంబై: శ్రీలంకలో పర్యటించే భారత పురుషుల క్రికెట్ జట్టు షెడ్యూల్‌లో స్వల్ప మార్పులు చోటు చేసుకున్నాయి. ఈనెల 26 నుంచి మొదలవ్వాల్సిన ఈ టూర్ ఒకరోజు ఆలస్యంగా అంటే 27 నుంచి ప్రారంభం కానుందని బీసీసీఐ శనివారం తెలిపింది. ఈ టూర్‌లో భారత్ 3 టీ20లు, 3 వన్డేలు ఆడనుంది. ఈనెల 26న జరగాల్సిన తొలి టీ20 27న జరగనుంది. రెండో టీ20 28న, మూడోది 30న జరుగుతాయి. ఆగస్టు 1న జరగాల్సిన తొలి వన్డే 2వ తేదీకి మారింది. 4న రెండోది, 7న మూడో వన్డే జరగనుంది.

రిత్విక్‌కు రజతం



లా ప్లాగ్నే (ఫ్రాన్స్): తెలంగాణ క్రీడాకారుడు రాజా రిత్విక్ లా ప్లాగ్నే ఓపెన్ చెస్ టోర్నీలో రన్నరప్‌గా నిలిచాడు. స్థానిక గ్రాండ్‌మాస్టర్ మౌస్సార్డ్ జూల్స్ విజేతగా నిలిచాడు.

పాంటింగ్‌కు ఢిల్లీ వీడ్కోలు

కోచ్‌గా తొలగింపు

న్యూఢిల్లీ: ఐపీఎల్ ఫ్రాంచైజీ ఢిల్లీ క్యాపిటల్స్‌తో రికీ పాంటింగ్ ఏడేళ్ల బంధం ముగిసింది. జట్టు ప్రధాన కోచ్ పదవి నుంచి అతడిని తొలగిస్తున్నట్టు యాజమాన్యం ప్రకటించింది. ప్రస్తుతం టీమ్ డైరెక్టర్‌గా కొనసాగుతున్న గంగూలీకే కోచ్ బాధ్యతలు అప్పగించనున్నట్టు సమాచారం. 2018 నుంచి పాంటింగ్ డీసీ కోచ్‌గా వ్యవహరించాడు. అతడి శిక్షణలో జట్టు ఒక్కసారి కూడా ఫైనల్‌కు రాలేకపోయింది.

గైక్వాడ్‌ను బీసీసీఐ ఆదుకోవాలి: కపిల్

న్యూఢిల్లీ: క్యాన్సర్‌తో బాధపడుతూ లండన్‌లోని ఆసుపత్రిలో చికిత్స తీసుకుంటున్న టీమిండియా మాజీ క్రికెటర్ అన్షుమన్ గైక్వాడ్‌ను ఆర్థికంగా ఆదుకోవాలని బీసీసీఐని మాజీ కెప్టెన్ కపిల్ దేవ్ కోరాడు. దేశం కోసం ఆడిన గైక్వాడ్‌కు ఇప్పుడు అండగా నిలవాలని కోరాడు. అవసరమైతే బోర్డు నుంచి తనకు లభించే పెన్షన్‌నుఅతనికి ఇస్తా అని కపిల్ అన్నాడు.



స్పోర్ట్స్ అథారిటీ ఆఫ్ తెలంగాణ (శాట్జ్) నూతన చైర్మన్‌గా కె.శివసేనారెడ్డి శనివారం బాధ్యతలు స్వీకరించారు. గచ్చిబౌలి స్టేడియంలో కొత్తగా ఏర్పాటైన శాట్జ్ కార్యాలయంలో జరిగిన ఈ కార్యక్రమానికి మంత్రులు ఉత్తమ్, జూపల్లి తదితరులు హాజరయ్యారు.

కార్ల స్టాక్ క్లియరెన్స్ సేల్

డీలర్ల వద్ద పేరుకుపోయిన రూ.60,000 కోట్ల వాహన నిల్వలు.. ఇప్పటివరకిదే అత్యధిక ఇన్వెంటరీ

- విక్రయాలు మందగించడం వల్లే..
- కస్టమర్లకు భారీ రాయితీలతో గాలం

న్యూఢిల్లీ: దేశీయ కార్ల కంపెనీలు జోరుగా డిస్కౌంట్లు కల్పిస్తున్నాయి. ఎందుకంటే, గడిచిన కొన్ని నెలల్లో వాహన విక్రయాల జోరు తగ్గింది. లోక్‌సభ ఎన్నికలు, ఎండల జోరుతో ఈ వేసవి సీజన్ ప్యాసింజర్ వాహన మార్కెట్‌కు అంతగా కలిసి రాలేదు. ఎన్నికల తర్వాత విక్రయాలు మళ్లీ జోరందుకోవచ్చని కంపెనీలు భావించినప్పటికీ, ఉత్తరాదిలో భారీ ఎండల కారణంగా కార్ల షోరూమ్‌లను సందర్శించే వారి సంఖ్య గణనీయంగా తగ్గింది. దాంతో గత నెల కార్ల విక్రయాల్లో కేవలం 3 శాతం వృద్ధి నమోదైంది. ఇప్పుడేమో వర్షాకాలం.

సాధారణంగానే ఈ సీజన్‌లో వాహన మార్కెట్ సెంటిమెంట్ బలహీనంగా ఉంటుంది. మళ్లీ పండగ సీజన్ ప్రారంభమైతే తప్ప విక్రయాలు పుంజుకునే అవకాశాల్లేవు. దాంతో కంపెనీలు కస్టమర్లను ఆకర్షించే ప్రత్యామ్నాయాలపై దృష్టి సారించాయి. ప్రస్తుత స్టాక్‌ను క్లియర్ చేయడంతో పాటు విక్రయాలు పెంచుకునేందుకు కంపెనీలు పలు మోడళ్ల కార్ల ధరలను తగ్గించడంతో పాటు భారీగా డిస్కౌంట్లు, ప్రోత్సాహకాలను ఆఫర్ చేస్తున్నాయి.



ప్రస్తుతం కార్ల కంపెనీలు, డీలర్ల వద్ద మరో రెండు నెలలకు సరిపోయే రూ.60,000 కోట్ల విలువైన వాహన నిల్వలు పేరుకుపోయాయి. దేశీయ కార్ల పరిశ్రమ చరిత్రలో ఇప్పటి వరకిదే అత్యధిక ఇన్వెంటరీ. "ప్రస్తుతం డీలర్ల వద్ద అమ్ముడుపోకుండా ఉన్న కార్ల నిల్వలు 6-6.5 లక్షల యూనిట్ల వరకు ఉంటాయి. గడిచిన రెండు నెలల్లోనే నిల్వలు 77,000 యూనిట్ల మేర పెరిగాయి. ప్రస్తుతం ఇన్వెంటరీలోని కార్ల సగటు ధర రూ.9.5 లక్షల స్థాయిలో ఉంటుంది. ఈ లెక్కన కార్ల నిల్వల విలువ రూ.60,000 కోట్ల వరకు ఉంటుంద"ని ఫెడరేషన్ ఆఫ్ ఆటోమొబైల్ డీలర్స్ అసోసియేషన్ (ఫాడా) అధ్యక్షుడు మనీశ్ రాజ్ సింఘానియా తెలిపారు.

జూన్ నెలలో కార్ల కంపెనీల టోకు విక్రయాలు (డీలర్లకు సరఫరా చేసినవి) 3.41 లక్షల యూనిట్లుగా ఉండగా.. డీలర్లు మాత్రం 2,81,600 యూనిట్ల వాహనాలను విక్రయించగలిగారు. కంపెనీల నుంచి డీలర్లకు సరఫరా.. రిటైల్ విక్రయాలకు మధ్య అంతరం భారీగా ఉందనడానికిదే నిదర్శనం. అయితే, అధిక నిల్వలపై అంతగా ఆందోళన చెందాల్సిన అవసరం లేదని.. గిరాకీ, సరఫరా మధ్య సమతుల్యం సాధించడం కంపెనీలకు బాగా తెలుసునని భారత వాహన తయారీదారుల సమాఖ్య (సియామ్) ప్రెసిడెంట్ వినోద్ అగర్వాల్ అన్నారు.

తగ్గిన రుణ లభ్యత

గడిచిన కొన్ని నెలలుగా బ్యాంకులు సైతం కార్ల కొనుగోలుకు రుణాలిచ్చే విషయంలో జాగ్రత్తగా వ్యవహరిస్తున్నాయని డీలర్లు అంటున్నారు. మంచి క్రెడిట్ స్కోర్ ఉన్న వారికి తప్ప మిగతా వారికి వాహన రుణాలిచ్చేందుకు బ్యాంకులు ముందుకు రావట్లేదని, ఇందుకు తోడు అధిక వడ్డీ రేట్లు కూడా కార్ల విక్రయాలపై ప్రభావం చూపాయని వారన్నారు.

ఫోక్స్‌వేగన్

జర్మన్ ఆటోమొబైల్ కంపెనీ ఫోక్స్‌వేగన్ తన ఎస్‌యూవీ టైగున్‌పై రూ.1.78 లక్షల క్యాష్ డిస్కౌంట్, రూ.73,000 ఉచిత యాక్సెసరీలు, రూ.40,000 ఎక్స్ఛేంజ్ బోనస్ కలిపి రూ. 2.9 లక్షల వరకు ప్రయోజనాలందిస్తున్నట్లు తెలిసింది. అలాగే, తన అత్యంత ఖరీదైన ఎస్‌యూవీ మోడల్ టిగ్వాన్‌పై రూ.3.4 లక్షల డిస్కౌంట్ ఆఫర్ చేస్తున్నట్లు సమాచారం.

స్కోడా

చెక్ రిపబ్లిక్ ఆటో కంపెనీ స్కోడా తన కాంపాక్ట్ ఎస్‌యూవీ కుషాక్‌పై ఏకంగా రూ.2.5 డిస్కౌంట్ అందిస్తోంది. తెలిసింది. అలాగే, 3ఏళ్ల కార్ మెయింటెనెన్స్ ప్యాకేజీతో పాటు 5 ఏళ్ల ఎక్స్‌టెండెడ్ వారంటీ సైతం కల్పిస్తోంది. కంపెనీ తన ఎస్‌యూవీ కొడియాక్‌పైనా రూ.2.5లక్షల వరకు డిస్కౌంట్ ఇస్తోంది.

హ్యుండయ్

హ్యుండయ్ మోటార్ గ్రాండ్ ఐ10 నియోస్‌పై వేరియంట్‌ను బట్టి రూ.15,000-35,000 వరకు డిస్కౌంట్ ఆఫర్ చేస్తోంది. ఐ20పై రూ.20,000 -35,000, వెర్నాపై రూ.15,000, అల్కజార్‌పై రూ.55,000, టూసన్‌పై రూ.50,000-2 లక్షల వరకు రాయితీ అందిస్తోంది. అలాగే, ఎక్స్‌టర్‌పై రూ.10,000, వెన్యూపై రూ.35,000 -45,000 నగదు ప్రయోజనాలను కల్పిస్తోంది. ఇందుకు తోడు, రూ.10,000-30,000 ఎక్స్ఛేంజ్ బెనిఫిట్, రూ.3,000 కార్పొరేట్ బోనస్ కూడా అందిస్తోంది. కంపెనీ హైయెస్ట్ సెల్లింగ్ మోడల్ క్రెటాపైన మాత్రం ఎలాంటి డిస్కౌంట్ ఆఫర్ చేయడం లేదు.

టాటా మోటార్స్

టాటా మోటార్స్ తన హ్యాచ్‌బ్యాక్ కారు టియాగోపై రూ.25,000-30,000 క్యాష్ డిస్కౌంట్ అందిస్తోంది. టిగోర్‌పై రూ.25,000-30,000, ఆల్ట్రోజ్‌పై రూ.15,000-25,000, నెక్సాన్‌పై రూ.20,000 రాయితీ ఆఫర్ చేస్తున్నట్లు కంపెనీ డీలర్లు వెల్లడించారు. టియాగో, టిగోర్ ఎలక్ట్రిక్ వేరియంట్లపైనేతే రూ.75,000- 85,000 నగదు ప్రయోజనాలందిస్తోంది. నెక్సాన్ ఈవీపై రూ.1.1 లక్షల వరకు ఆఫర్ చేస్తున్నట్లు సమాచారం. అలాగే, రూ.10,000-30,000 ఎక్స్ఛేంజ్ బెనిఫిట్, రూ.3,000-8,000 కార్పొరేట్ డిస్కౌంట్ సైతం అందిస్తున్నట్లు వారు తెలిపారు.

బిజినెస్

మారుతి సుజుకీ

దేశంలో అతిపెద్ద కార్ల విక్రయ కంపెనీ మారుతి సుజుకీ ఇండియా తన కాంపాక్ట్ కార్ల ఆటోమేటిక్ ట్రాన్స్‌మిషన్ వేరియంట్లపై క్యాష్ బ్యాక్ డిస్కౌంట్లు ఆఫర్ చేస్తోంది. బ్రెజ్జా ఆటోమెటిక్‌పై రూ.10,000, ఆల్టో కే 10పై రూ.30,000-45,000 వరకు, ఎస్-ప్రెస్సోపై రూ.35,000-40,000 వరకు, వ్యాగన్ ఆర్‌పై రూ.30,000-40,000 వరకు, ఈకోపై రూ.10,000-20,000 వరకు, డిజైర్‌పై రూ.10,000-15,000 వరకు రాయితీ అందిస్తున్నట్లు తెలిసింది. దీనికి అదనంగా రూ.10,000 -20,000 ఎక్స్ఛేంజ్ బోనస్, రూ.2000-5000 కార్పొరేట్ డిస్కౌంట్ కూడా ఆఫర్ చేస్తున్నట్లు సమాచారం.

నెక్సా షోరూమ్ మోడళ్ల విషయానికొస్తే, ఇగ్నిస్ మరియు బాలెనోపై రూ.35,000-40,000, ఫ్రాంక్స్‌పై రూ.22,500-35,000 వరకు, సియాజ్, ఎక్స్‌ఎల్ 6పై రూ.20,000, గ్రాండ్ విటారాపై రూ.30,000-50,000 వరకు, జిమ్నీపై రూ.3.3 లక్షల వరకు డిస్కౌంట్ ఆఫర్ చేస్తున్నట్లు డీలర్ వర్గాలు తెలిపాయి.

మహీంద్రా అండ్ మహీంద్రా

ఎక్స్‌యూవీ 700 ధరను రూ.2.2 లక్షల వరకు తగ్గించిన మహీంద్రా అండ్ మహీంద్రా.. బొలెరో నియోపై ఎక్స్ఛేంజ్ బోనస్‌తో కలిపి రూ.90,000 క్యాష్ డిస్కౌంట్, ఎక్స్‌యూవీ 300పై రూ.1.5 లక్షల డిస్కౌంట్ ఆఫర్ చేస్తోంది. అలాగే, కొన్ని నగరాల్లో కంపెనీ థార్, స్కార్పియో ఎన్‌పై పరిమిత ఆఫర్లను సైతం అందిస్తున్నట్లు డీలర్లు వెల్లడించారు.ఎక్స్‌యూవీ 3ఎక్స్‌ఓ పై మాత్రం ఎలాంటి రాయితీలు లేవు.

ఎంజీ మోటార్

బ్రిటన్ మోటార్ బ్రాండ్ ఎంజీ తన ఎస్‌యూవీ గ్లోస్టర్‌పై రూ.2 లక్షల వరకు డిస్కౌంట్‌ను కల్పిస్తోంది. జెడ్ఎస్ ఈవీపై రూ.1.5 లక్షల వరకు రాయితీ అందిస్తున్నట్లు తెలిసింది.

ఎంజీఎం హెల్త్‌కేర్ చేతికి సెవెన్‌హిల్స్ హాస్పిటల్

రూ.171 కోట్ల రిజొల్యూషన్ ప్రణాళికకు ఎన్‌సీఎల్‌టీ అమరావతి బెంచ్ ఓకే



హైదరాబాద్: కార్పొరేట్ దివాలా ప్రక్రియ (సీఐఆర్‌పీ)లో ఉన్న సెవెన్ హిల్స్ హాస్పిటల్‌ను చెన్నైకి చెందిన ఎంజీఎం హెల్త్‌కేర్ చేజిక్కించుకుంది. ఎంజీఎం హెల్త్‌కేర్ సమర్పించిన రూ.171 కోట్ల రిజొల్యూషన్ ప్రణాళికకు ఎన్‌సీఎల్‌టీ అమరావతి బెంచ్ ఆమోదం తెలిపింది. కాగా రూ.171 కోట్ల రిజొల్యూషన్ ప్రణాళికలో భాగంగా రూ.18 కోట్లను మూలధన వ్యయం, వర్కింగ్ క్యాపిటల్ నిమిత్తం ఎంజీఎం హెల్త్‌కేర్ వినియోగించనుంది. 1988లో కార్యకలాపాలు ప్రారంభించిన సెవెన్‌హిల్స్ హెల్త్‌కేర్ ప్రైవేట్ లిమిటెడ్.. ఆంధ్రప్రదేశ్‌లోని విశాఖపట్నంలో 300 పడకల సామర్థ్యం గల హాస్పిటల్‌తో పాటు ముంబైలో 1,500 పడకల సామర్థ్యం గల హాస్పిటల్‌ను నిర్వహిస్తోంది.

2018లో దివాలా ప్రక్రియ ప్రారంభం

ఇన్‌సాల్వెన్సీ అండ్ బ్యాంక్‌రప్టసీ కోడ్ (ఐబీసీ) కింద యాక్సిస్ బ్యాంక్.. సెవెన్‌హిల్స్ హాస్పిటల్‌పై ఎన్‌సీఎల్‌టీ అమరావతి బెంచ్‌లో 2018 మార్చిలో దివాలా పిటిషన్ దాఖలు చేసింది. దాదాపు రూ.1,273 కోట్ల బకాయిలు రాబట్టుకునేందుకు యాక్సిస్ బ్యాంక్ ఈ పిటిషన్‌ను దాఖలు చేసింది. రుణదాతలు, ఉద్యోగులు, ఇతరులు కలిపి మొత్తం రూ.1,361.89 కోట్ల క్లెయిమ్స్‌కు పిటిషన్ దాఖలు చేయగా అందులో సెక్యూర్డ్ రుణదాతలు క్లెయిమ్ చేసిన మొత్తం రూ.1,273 కోట్లుగా ఉంది. ఎంజీఎం హాస్పిటల్ ప్రమోటర్ రాజగోపాలన్‌తో పాటు మోహన్ రెడ్డి కన్సార్షియం, క్యాప్రీ గోల్డ్ హోల్డింగ్స్ ప్రైవేట్ లిమిటెడ్ కూడా తమ రిజొల్యూషన్స్ ప్రణాళికలు సమర్పించాయి. అయితే రుణదాతల కమిటీ (సీఓసీ) వంద శాతం మెజారిటీతో ఎంజీఎం రాజగోపాలన్ ప్రణాళికకు ఆమోదం తెలిపింది. 2023-24 ఆర్థిక సంవత్సరంలో సెవెన్‌హిల్స్ రెవెన్యూ రూ.100 కోట్లుగా ఉంది. సెవెన్‌హిల్స్ హాస్పిటల్‌లో 100 మందికి పైగా డాక్టర్లు, 700 మందికి సిబ్బంది విధులు నిర్వర్తిస్తున్నారు.

తొలిసారిగా చెన్నై వెలుపలకు..

సెవెన్‌హిల్స్ కొనుగోలుతో ఎంజీఎం హెల్త్‌కేర్ తొలిసారిగా చెన్నై వెలుపలికి తన కార్యకలాపాలు విస్తరించనుందని సంస్థ డైరెక్టర్ ప్రశాంత్ రాజగోపాలన్ వెల్లడించారు. అంతేకాకుండా ఐదేళ్ల వ్యవధిలోనే ఎంజీఎం మొత్తం పడకల సామర్థ్యం 1,000కి చేరుకోనుందన్నారు. మరోవైపు పొరుగున ఉన్న తెలంగాణ, ఒడిశా, ఛత్తీస్‌గఢ్ రాష్ట్రాల్లోని ప్రజలకు సేవలందించే అవకాశం లభించనుందని పేర్కొన్నారు.

పేటీఎం నుంచి సాఫ్ట్‌బ్యాంక్ ఎగ్జిట్

న్యూఢిల్లీ: డిజిటల్ చెల్లింపుల సేవల కంపెనీ పేటీఎం నుంచి జపాన్ ఇన్వెస్ట్‌మెంట్ దిగ్గజం సాఫ్ట్‌బ్యాంక్ పూర్తిగా వైదొలిగింది. పేటీఎం బ్రాండ్ యాజమాన్య సంస్థ వన్97 కమ్యూనికేషన్స్‌లో ఈ మార్చి నాటికి మిగిలిన 1.4 శాతం వాటాను సైతం వదిలించుకుంది. అయితే, పేటీఎంలో పెట్టుబడులపై సాఫ్ట్‌బ్యాంక్‌కు 15 కోట్ల డాలర్ల వరకు నష్టం వాటిల్లిందని విశ్వసనీయ వర్గాలు వెల్లడించాయి. సాఫ్ట్‌బ్యాంక్ 2017లో విడతలవారీగా పేటీఎంలో 150 కోట్ల డాలర్ల పెట్టుబడులు పెట్టింది. ఈ లెక్కన తన పెట్టుబడిపై 10 శాతం వరకు నష్టపోయిందన్నమాట.

డీమార్ట్ లాభం రూ.774 కోట్లు

న్యూఢిల్లీ: డీమార్ట్ బ్రాండ్‌తో కార్యకలాపాలు సాగిస్తున్న అవెన్యూ సూపర్‌మార్ట్స్ లిమిటెడ్.. ప్రస్తుత ఆర్థిక సంవత్సరం జూన్‌తో ముగిసిన తొలి త్రైమాసికంలో ప్రోత్సాహకర ఫలితాలు ప్రకటించింది. ఏప్రిల్-జూన్ త్రైమాసికానికి గాను కంపెనీ నికర లాభం కన్సాలిడేటెడ్ ప్రాతిపదికన 17.5 శాతం వృద్ధి చెంది రూ.773.68 కోట్లుగా నమోదైంది. గత ఏడాది ఇదే కాలంలో కంపెనీ లాభం రూ.658.71 కోట్లుగా ఉంది. కాగా త్రైమాసిక సమీక్షా కాలంలో కంపెనీ అమ్మకాలు కూడా 18.57 శాతం వృద్ధితో రూ.11,865.44 కోట్ల నుంచి రూ.14,069.14 కోట్లకు పెరిగాయి. త్రైమాసిక కాలంలో సాధారణ ఉత్పత్తులతో పాటు అపారెల్ అమ్మకాలు గణనీయంగా పెరగటంతో స్థూల లాభం మెరుగ్గా నమోదైందని అవెన్యూ సూపర్ మార్ట్స్ సీఈఓ, ఎండీ నెవెల్లీ నోరొన్హా తెలిపారు. జూన్ త్రైమాసికంలో కొత్తగా ఆరు స్టోర్లను ప్రారంభించటంతో మొత్తం స్టోర్ల సంఖ్య 371కి చేరుకుందని కంపెనీ తెలిపింది.

ప్రత్యక్ష పన్ను వసూళ్లలో 20% వృద్ధి

ఈనెల 11 నాటికి రూ.5.74 లక్షల కోట్ల ఆదాయం

న్యూఢిల్లీ: ప్రస్తుత ఆర్థిక సంవత్సరం (2024-25)లో ఇప్పటివరకు (ఏప్రిల్ 1 నుంచి జూలై 11 వరకు) నికర ప్రత్యక్ష పన్ను వసూళ్లు వార్షిక ప్రాతిపదికన 19.54 శాతం పెరిగి రూ.5.74 లక్షల కోట్లకు చేరుకున్నాయి. అందులో కార్పొరేట్ పన్ను వసూళ్లు రూ.2,10,274 కోట్లుగా, వ్యక్తిగత ఆదాయం పన్ను ఆదాయం రూ.3,46,036 కోట్లుగా నమోదయ్యాయి. సెక్యూరిటీల లావాదేవీలపై పన్ను రూపంలో మరో రూ.16,634 కోట్లు సమకూరాయని ప్రత్యక్ష పన్నుల కేంద్ర బోర్డు (సీబీడీటీ) తెలిపింది. గత ఆర్థిక సంవత్సరం (2023-24)లో ఇదే కాలానికి నికర ప్రత్యక్ష పన్ను వసూళ్లు రూ.4.80 లక్షల కోట్లుగా నమోదయ్యాయి. కాగా, ఈ ఏప్రిల్ 1- జూలై 11 మధ్య కాలంలో రూ.70,902 కోట్ల రిఫండ్లు జారీ చేయడం జరిగిందని, గత ఏడాదిలో ఇదే సమయానికి జారీ చేసిన రిఫండ్లతో పోలిస్తే 64.4 శాతం అధికమని సీబీడీటీ వెల్లడించింది. ఈ నెల 11 నాటికి స్థూల వసూళ్లు 23.24 శాతం వృద్ధితో రూ.6.45 లక్షల కోట్లుగా నమోదయ్యాయి. 2024-25లో ప్రత్యక్ష పన్నుల రాబడి రూ.21.99 లక్షల కోట్ల స్థాయిలో ఉండవచ్చని ఫిబ్రవరి 1న పార్లమెంట్‌లో ప్రవేశపెట్టిన తాత్కాలిక బడ్జెట్లో ఆర్థిక శాఖ అంచనా వేసింది.

ఫామ్‌గేట్ ధర (కిలో) రూ. వెన్‌కాబ్ బ్రాయిలర్ చికెన్



హైదరాబాద్	110	విజయవాడ	115
వరంగల్	110	గుంటూరు	115
కరీంనగర్	110	ఒంగోలు	115
మహబూబ్‌నగర్	110	చిత్తూరు	122
కర్నూలు	110	నెల్లూరు	122
విశాఖపట్నం	107	అనంతపురం	115
గోదావరి	115		

బంగారం ధరలు (10 గ్రాములకు రూ.లలో)



	24 క్యారెట్లు	22 క్యారెట్లు	కేజీ వెండి
హైదరాబాద్	73,800 ▲	67,700 ▲	1,00,000 ▲
ముంబై	72,660 ▲	66,560 ▲	92,204 ▲

ఫారం గేటు అమ్మకం ధరలు (నెక్ 100 గుడ్లు)



14వ తేదీ			
హైదరాబాద్	530	విజయవాడ	555
వరంగల్	532	గోదావరి	555
చిత్తూరు	573	విశాఖపట్నం	575
		డజను గుడ్లు రూ. 72	

ఒకటో తేదీనే వేతనాలు ఉత్తమాటే

- మోడల్ స్కూళ్ల ఉపాధ్యాయులకు జీతాలివ్వండి
- మాజీ మంత్రి హరీశ్ రావు డిమాండ్

హైదరాబాద్, జూలై 13 (ఆంధ్రజ్యోతి): ఉద్యోగులకు ప్రతి నెలా ఒకటో తేదీనే వేతనాలు చెల్లిస్తామన్న ప్రభుత్వ మాట ఆచరణకు నోచుకోవడం లేదని మాజీ మంత్రి హరీశ్ రావు ఎద్దేవా చేశారు. మోడల్ స్కూళ్లలోని ఉపాధ్యాయులకు తక్షణమే వేతనాలు విడుదల చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేస్తూ శనివారం ఓ ప్రకటన చేశారు. మోడల్ స్కూళ్ల ఉపాధ్యాయులకు గత ఏడు నెలల్లో ఒక్కసారి కూడా ఒకటో తేదీన వేతనం అందలేదని హరీశ్ పేర్కొన్నారు. ఈ నెలలో 13 రోజులు గడిచినప్పటికీ ఇంకా జీతాలు రాకపోవడంతో మోడల్ స్కూళ్లలో పని చేసే రెగ్యులర్ ఉపాధ్యాయులు ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. ప్రభుత్వం స్పందించి ఉపాధ్యాయులకు వేతనాలు చెల్లించాలని ఆయన డిమాండ్ చేశారు. అలాగే, ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో పనిచేసే గెస్ట్ లెక్చరర్ల విషయంలో ప్రభుత్వం మాట తప్పడం బాధాకరమని హరీశ్ వాపోయారు.

బీజేపీలో చేరే ప్రసక్తే లేదు: ఎంపీ వద్దిరాజు

ఖమ్మం, జూలై 13(ఆంధ్రజ్యోతి ప్రతినిధి): తాను బీజేపీలో చేరుతున్నానని, బీఆర్ఎస్ పార్లమెంటరీ పార్టీ బీజేపీలో విలీనమవుతుందని జరుగుతున్న ప్రచారంలో నిజం లేదని రాజ్యసభ సభ్యుడు, బీఆర్ఎస్ రాజ్యసభ పక్ష ఉపనేత వద్దిరాజు రవిచంద్ర తెలిపారు. బీఆర్ఎస్ ఎంపీలు బీజేపీలో చేరుతున్నారని, బీఆర్ఎస్ పార్లమెంటరీ పార్టీ బీజేపీలో విలీనవమతుందని కొందరు మీడియాలో ప్రచారం చేస్తున్నారని, ఇందులో వాస్తవం లేదన్నారు. తాను పార్టీ మారే ప్రసక్తే లేదని శనివారం రవిచంద్ర ఒక ప్రకటనలో స్పష్టం చేశారు.

కాంబోడియా సైబర్ కేసులోకీలక వ్యక్తి అరెస్టు

హైదరాబాద్, జూలై 13 (ఆంధ్రజ్యోతి): కాంబోడియాలో ఉద్యోగాల పేరుతో భారతదేశ యువకులను పంపి.. అక్కడ బలవంతంగా సైబర్ నేరాలు చేయిస్తున్న ముఠాలోని కీలక నిందితుడిని సైబర్ సెక్యూరిటీ బ్యూరో(సీఎస్‌బీ) అరెస్టు చేసింది. బిహార్‌కు చెందిన మహమ్మద్ షాబాద్ ఆలం ఇక్కడి నుంచి యువకులను కాంబోడియాకు పంపేవాడని గుర్తించింది. అతను ఎక్కడికక్కడ ఏజెంట్లను నియమించుకుని.. యువతను ఉద్యోగాల పేరుతో వంచిస్తున్నాడు. కాంబోడియాకు తీసుకువెళ్లిన యువకులను చైనా ఏజెంట్లకు అప్పగిస్తున్నాడని సీఎస్‌బీ వెల్లడించింది. చైనా ఏజెంట్లు బాధితుల వీసా, పాస్‌పోర్టులను తీసుకుని, వారితో బలవంతంగా సైబర్ నేరాలు చేయిస్తుంటారని.. సిరిసిల్లకు చెందిన ఓ యువకుడి వద్ద ప్రాసెసింగ్ ఫీజు పేరుతో రూ.1.40లక్షలు తీసుకుని, అక్కడ బానిసలా మార్చి, సైబర్ నేరాలు చేయించారని పేర్కొన్నారు. ఆ యువకుడి కుటుంబ సభ్యులు పోలీసులకు ఫిర్యాదు చేయడంతో.. ఈ విషయం వెలుగులోకి వచ్చింది. షాబాద్ ఆలం దుబాయ్ పారిపోయే ప్రయత్నంలో ఉండగా.. అతణ్ని అరెస్టు చేసినట్లు సీఎస్‌బీ తెలిపింది.

అరటిపండ్లతో అల్లం వెల్లుల్లి పేస్ట్ తయారీ

- 600 కేజీలు పట్టివేత.. వ్యాపారి అరెస్ట్

కంది, జూలై 13: అరటిపండ్లు, ఉప్పు, నాసిరకం అల్లం, వెల్లుల్లితో కల్తీ అల్లం వెల్లుల్లి పేస్ట్ తయారుచేస్తున్న వ్యక్తిని పోలీసులు అరెస్టు చేశారు. విశ్వసనీయ సమాచారం మేరకు సంగారెడ్డి జిల్లా కంది మండలం జుల్కల్ గ్రామ శివారులోని 'తాహా ఫుడ్స్'పై పోలీసులు, ఆహారభద్రతా అధికారులతో కలిసి ఈ నెల 4న దాడులు నిర్వహించి 600 కిలోల అల్లం వెల్లుల్లి పేస్ట్ డబ్బాలను సీజ్ చేశారు. శాంపిళ్లను పరీక్షల నిమిత్తం హైదరాబాద్‌లోని ఆహార భద్రత ల్యాబ్‌కు పంపించారు. ల్యాబ్‌లో నిర్వహించిన పరీక్షల్లో తాహా ఫుడ్స్‌లో తయారవుతున్న అల్లం వెల్లుల్లి పేస్ట్ నాసిరకమని తేలింది. అరటిపండ్లు, ఉప్పు, నాసిరకం అల్లం, వెల్లుల్లితో అల్లం వెల్లుల్లి పేస్ట్ తయారు చేస్తున్నారని ఆహార భద్రతా అధికారులు వెల్లడించారు. శనివారం తాహా ఫుడ్స్ యజమాని వసీంను అరెస్ట్ చేసి, ఆహార కల్తీ చట్టం కింద కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు.

వర్సిటీల ఉద్యోగుల సమస్యలు పరిష్కరించండి

- ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి ఉద్యోగుల వినతి

తార్నాక, జూలై 13 (ఆంధ్రజ్యోతి) : తెలంగాణలోని అన్ని విశ్వవిద్యాలయాల్లో పనిచేస్తున్న ఉద్యోగుల సమస్యలను పరిష్కరించాలని తెలంగాణ ఆల్ యూనివర్సిటీస్ టీచర్స్ అసోసియేషన్ ఎగ్జిక్యూటివ్ కమిటీ సభ్యులు శనివారం సీఎం రేవంత్ రెడ్డిని కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు జి.మల్లేశం మాట్లాడుతూ ఉద్యోగ విరమణ వయస్సును 65సంవత్సరాలకు పెంచడం, పెండింగ్ బకాయిల చెల్లింపు, ఆరోగ్యకార్డుల మంజూరు వంటి సమస్యలను అత్యవసరంగా పరిష్కరించాలని ముఖ్యమంత్రికి విన్నవించినట్లు చెప్పారు. దానికి ఆయన సానుకూలంగా స్పందించారని తెలిపారు.

పదోన్నతుల కల్పించాకే బదిలీలు చేపట్టాలి

- ఎలక్ట్రిసిటీ ఎంప్లాయీస్ 1104 యూనియన్

హైదరాబాద్ సిటీ, జూలై 13 (ఆంధ్రజ్యోతి): విద్యుత్తు సంస్థల్లో ఉద్యోగులకు పదోన్నతులు కల్పించాకే బదిలీల ప్రకియ చేపట్టాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని తెలంగాణ ఎలక్ట్రిసిటీ ఎంప్లాయీస్ 1104 యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జి.సాయిబాబా డిమాండ్ చేశారు. ఐదేళ్లుగా ఉద్యోగుల పదోన్నతులు పెండింగ్‌లో ఉన్నాయని, ఈ ఏడాది మార్చి నుంచి పదవీ విరమణలు ప్రారంభమవడంతో ఉద్యోగులు తీవ్రంగా నష్టపోతున్నారని చెప్పారు. శనివారం హైదరాబాద్ ఖైరతాబాద్ మింట్‌కాంపౌండ్ 1104 ప్రధాన కార్యాలయం ఆవరణలో నిర్వహించిన ఆత్మీయ సన్మానసభలో కాంగ్రెస్ ఎంపీ మల్లు రవి పాల్గొన్నారు. ఈ సందర్భంగా యూనియన్ రాష్ట్ర అధ్యక్షుడు వి.వెంకటేశ్వర్లు, నేతలు సుధీర్, వరప్రసాద్ తదితరులు మల్లు రవిని సన్మానించారు. అనంతరం సంఘం నేతలు మాట్లాడుతూ.. కార్మికుల సమస్యల పరిష్కారం కోసం ప్రభుత్వంతో చర్చలు జరిపేందుకు సిద్ధంగా ఉన్నామని.. సర్కారు స్పందించపోతే ఆందోళనలు చేపడతామన్నారు. మల్లు రవి మాట్లాడుతూ సమస్యలను సీఎం, డిప్యూటీ సీఎంల దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించే దిశగా ప్రయత్నిస్తానని చెప్పారు.

కాంగ్రెస్‌ను అప్రతిష్ఠపాలు చేసేలా కేటీఆర్ కుట్ర

- టీపీసీసీ అధికార ప్రతినిధి చనగాని దయాకర్

తార్నాక, జూలై 13 (ఆంధ్రజ్యోతి): మాజీ మంత్రి కేటీఆర్ తన స్వార్థ ప్రయోజనాల కోసం నిరుద్యోగులను రెచ్చగొట్టి కాంగ్రెస్ ప్రభుత్వాన్ని అప్రతిష్ఠపాలు చేసేందుకు కుట్ర పన్నారని టీపీసీసీ అధికార ప్రతినిధి చనగాని దయాకర్ మండిపడ్డారు. దయాకర్ ఆధ్వర్యంలో శనివారం ఓయూ ఆర్ట్స్ కాలేజీ ఆవరణలో విద్యార్థులు నిరసన కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా దయాకర్ మాట్లాడుతూ పది సంవత్సరాలుగా ఉద్యోగ అవకాశాలు కల్పించకుండా మోసం చేసిన కేటీఆర్ తెలంగాణ యువతకు క్షమాపణలు చెప్పాలని డిమాండ్ చేశారు. నిరసనలో భాగంగా.. 'నిరుద్యోగుల ద్రోహి కేటీఆర్' అని నినాదాలు చేస్తూ కేటీఆర్ దిష్టిబొమ్మను దహనం చేసేందుకు యత్నించారు. దీంతో పోలీసులు దయాకర్‌ను అడ్డుకుని అరెస్టు చేసి పోలీస్ స్టేషన్‌కు తరలించారు.

అక్క సంతోషం కోసం కిడ్నాప్!

- భర్తతో కలిసి శిశువును అపహరించిన మహిళ
- 3 రోజుల్లో నిందితులను పట్టుకున్న పోలీసులు

హైదరాబాద్ సిటీ, జూలై 13(ఆంధ్రజ్యోతి): పిల్లలు లేని తన అక్క సంతోషం కోసం..ఓ మహిళ తన భర్తతో కలిసి ఆరు నెలల బాలుడిని కిడ్నాప్ చేసిన ఉదంతమిది. సౌత్ జోన్ డీసీపీ స్నేహ మెహ్రా శనివారం వివరాలు వెల్లడించారు. సంగారెడ్డి జిల్లా పటాన్‌చెరుకు చెందిన నస్రీమ్ బేగంకు పిల్లలు లేరు. తనకు పిల్లలంటే ఇష్టమని, ఎలాగైనా.. ఎక్కడి నుంచైనా పాపను గానీ, బాబును గానీ తెచ్చివ్వాలని తన చెల్లెలు నూర్జాన్ బేగం, ఆమె భర్త మహ్మద్ ఆదిల్‌ను అడుగుతుండేది. నూర్జాన్, ఆదిల్ దంపతులు తరచూ నెల్లూరు జిల్లా ఏఎస్ పేటలోని బారాషాహీద్ దర్గాకు వెళ్తుండేవారు. వారికి దర్గా వద్ద హబీబ్ ఉన్నీసా అనే మహిళ పరిచయమైంది. ఆమెకు 6 నెలల బాబు ఉండటాన్ని వారు గుర్తించారు. ఆమె నర్సింగ్ కోర్సు చదివినట్లు తెలుసుకుని, హైదరాబాద్‌లో తమకు పెద్దపెద్ద ఆస్పత్రుల్లో వైద్యులు తెలుసని, నర్సు ఉద్యోగం ఇప్పిస్తామని నమ్మబలికారు. దాంతో ఆమె ఈ నెల 9న రాత్రి వారితో పాటు నెల్లూరు నుంచి హైదరాబాద్ వచ్చింది. ఈక్రమంలో హబీబ్ ఉన్నీసా తన కుమారుడిని వారికిచ్చి సులభ్ కాంప్లెక్స్‌లోకి వెళ్లగానే వారు పరారయ్యారు. బాధితురాలు మీర్‌చౌక్ పోలీసులను ఆశ్రయించింది. సీసీటీవీ కెమెరాలను జల్లెడపట్టిన పోలీసులు మూడు రోజుల్లో నూర్జాన్, ఆదిల్‌తో పాటు కిడ్నాప్‌నకు ప్రోత్సహించిన నస్రీమ్ బేగంను పోలీసులు అరెస్టు చేశారు.

కాంగ్రెస్‌లోకి మరో బీఆర్ఎస్ ఎమ్మెల్యే

సీఎం సమక్షంలో చేరిన అరికెపూడి గాంధీ.. నలుగురు జీహెచ్ఎంసీ కార్పొరేటర్లు కూడా..

నేడో, రేపో హస్తం గూటికి పటాన్‌చెరు ఎమ్మెల్యే గూడెం మహిపాల్‌రెడ్డి?

హైదరాబాద్/పటాన్‌చెరు, జూలై 13(ఆంధ్రజ్యోతి): కాంగ్రెస్‌లోకి బీఆర్ఎస్ ఎమ్మెల్యేల చేరిక పరంపర కొనసాగుతూనే ఉంది. తాజాగా శనివారం శేరిలింగంపల్లి ఎమ్మెల్యే అరికెపూడి గాంధీ సైతం సీఎం రేవంత్‌రెడ్డి సమక్షంలో కాంగ్రెస్ గూటికి చేరారు. ఎమ్మెల్యేతోపాటు శేరిలింగంపల్లి, మియాపూర్, చందానగర్, హైదర్‌నగర్ కార్పొరేటర్లు నాగేందర్‌యాదవ్, ఉప్పలపాటి శ్రీకాంత్, మంజులా రఘునాథ్‌రెడ్డి, నార్నె శ్రీనివాస్, పలువురు అనుచరులు కాంగ్రెస్ కండువాలు కప్పుకొన్నారు. కార్యక్రమంలో ఎమ్మెల్సీ పట్నం మహేందర్‌రెడ్డి, సీఎం సలహాదారు వేం నరేందర్‌రెడ్డి పాల్గొన్నారు. కాగా.. అరికెపూడి గాంధీతో కలిపి కాంగ్రెస్‌లో చేరిన బీఆర్ఎస్ ఎమ్మెల్యేల సంఖ్య 9కి చేరుకుంది. హైదరాబాద్, ఉమ్మడి రంగారెడ్డి జిల్లాల పరిధిలోని మరో నలుగురు ఎమ్మెల్యేలు సైతం ఈ వారంలో కాంగ్రెస్ తీర్థం పుచ్చుకోనున్నట్లు పార్టీ వర్గాలు తెలిపాయి. బడ్జెట్ సమావేశాలు ప్రారంభమయ్యే నాటికి మూడింట రెండొంతుల మంది ఎమ్మెల్యేలను చేర్చుకోవడం ద్వారా బీఆర్ఎస్ఎల్పీని విలీనం చేసుకునే దిశగా కసరత్తు సాగుతున్నట్లు వెల్లడించాయి. కాగా, పటాన్‌చెరు ఎమ్మెల్యే గూడెం మహిపాల్‌రెడ్డి కూడా నేడో, రేపో కాంగ్రెస్‌లో చేరేందుకు రంగం సిద్ధమైనట్లు తెలిసింది. మైనింగ్‌కు సంబంధించి ఈడీ దాడుల నేపథ్యంలో తొలుత బీజేపీలో చేరాలని గూడెం భావించినా.. అనుచరుల ఒత్తిడితో నిర్ణయం మార్చుకున్నట్లు సమాచారం. మరోవైపు, మహిపాల్ రెడ్డి చేరికను పటాన్‌చెరు కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు వ్యతిరేకిస్తుండగా, వారికి నచ్చజెప్పేందుకు రాష్ట్ర నాయకత్వం యత్నిస్తున్నట్లు తెలిసింది.

నేడు, రేపు భారీ వర్షాలు

హైదరాబాద్, జూలై 13 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో రెండ్రోజుల పాటు భారీ వర్షాలు కురిసే అవకాశముందని హైదరాబాద్ వాతావరణ కేంద్రం హెచ్చరించింది. ఆది, సోమ వారాల్లో కామారెడ్డి, మెదక్, సిద్దిపేట, జనగామ జిల్లాల్లో భారీ వర్షాలు కురుస్తాయని పేర్కొంది. ఈ నాలుగు జిల్లాలకు ఆరెంజ్ అలెర్ట్ జారీ చేసింది. అలాగే నిర్మల్, నిజామాబాద్, జగిత్యాల, మంచిర్యాల, ఆసిఫాబాద్, ములుగు, భూపాలపల్లి, హనుమకొండ, పెద్దపల్లి, ఆదిలాబాద్, వరంగల్, భద్రాద్రి కొత్తగూడెం జిల్లాల్లో కూడా అక్కడక్కడ భారీ వానలు పడే అవకాశముందని తెలిపింది. వర్షాలు తగ్గుముఖం పట్టడంతో ప్రాజెక్టులకు వరద ప్రవాహాలు తగ్గాయి.

ప్రభుత్వ పింఛన్‌దారులకూ ఆసరా!

5650 మంది విశ్రాంత ఉద్యోగులకు డబుల్ పింఛన్లు.. సెర్ప్ తనిఖీల్లో వెలుగులోకి అక్రమాలు



హైదరాబాద్, జూలై 13 (ఆంధ్రజ్యోతి): ఆపన్నులకు ఇవ్వాల్సిన 'ఆసరా'.. అనర్హులకూ అందించేశారు. ఒంటరి మహిళలు, వితంతువులు, వృద్ధులు, బీడీ కార్మికులు, స్టోన్ కట్టర్లు, చేనేత కార్మికులు, వికలాంగులు, డయాలసిస్, ఫైలేరియా, ఎయిడ్స్ రోగులకు ఆసరా పథకం కింద గత ప్రభుత్వం పింఛన్లు అందజేసింది. దారిద్ర్య రేఖకు దిగువన ఉండి, తెల్ల రేషన్ కార్డు కలిగిన వారు ఈ పథకానికి అర్హులు. కానీ, బీఆర్ఎస్ సర్కారు హయాంలో ఈ పథకం పక్కదారి పట్టింది. పింఛన్లు అందుకున్న విశ్రాంత ప్రభుత్వోద్యోగులు కూడా ఆసరా పింఛన్లు తీసుకున్నారు! ఇలా ఒకరో ఇద్దరో కాదు.. ఏకంగా 5650 మంది తీసేసుకున్నారు! అర్హులకు అందించాల్సిన పింఛన్లు అనర్హుల జేబుల్లోకి వెళ్లిపోయాయి. ఆసరా పథకం అమల్లో అవకతవకలపై కాంగ్రెస్ ప్రభుత్వం జరిపిన విచారణలో ఈ విషయాలు వెలుగులోకి వచ్చాయి. ప్రభుత్వ ఉద్యోగులుగా పదవీ విరమణ చేసిన అనంతరం ప్రభుత్వ పింఛనుతోపాటు ఆసరా పింఛను కూడా తీసుకున్న వారు రాష్ట్రవ్యాప్తంగా 5650 మంది ఉన్నారని ఇటీవల సెర్ప్ అధికారులు చేసిన సర్వేలో తేలింది. వీరిలో 3824 మంది ఇప్పటికే మృతి చెందినట్లు గుర్తించారు. మిగిలిన 1826 మంది ఇప్పటికీ రెండు పింఛన్లు అందుకుంటున్నారని గుర్తించారు. ఆసరా అక్రమాలపై ప్రభుత్వానికి నివేదిక అందడంతో జూన్ నుంచి ఇలాంటి వారి పింఛన్లు నిలిపివేసింది. ఉద్యోగులుగా పదవీ విరమణ చేసిన వారు.. వారి కుటుంబ సభ్యులు సైతం ఆసరా కింద పింఛను పొందారు. దీని వల్ల భారీగా నిధుల దుర్వినియోగం అయినట్లు అధికారులు గుర్తించారు. ఒక్క ఉమ్మడి ఖమ్మం జిల్లాలోనే 427మంది అక్రమంగా రెండు పింఛన్లు తీసుకున్నట్లు విచారణలో వెలుగు చూసింది. రూ.2.50 కోట్లు అనర్హులకు అందినట్లు అధికారులు పేర్కొన్నారు.

మల్లమ్మకూ డబుల్ పింఛన్!

భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో 80 ఏళ్ల మల్లమ్మకు అందించిన పింఛను నగదు వెనక్కు ఇవ్వాలంటూ అధికారులు నోటీసులు ఇవ్వడం అమానవీయమైన చర్య అని కేటీఆర్ ట్వీట్ చేశారు. కానీ, ఈమె కూడా డబుల్ పింఛను జాబితాలోనే ఉందని అధికారులు పేర్కొన్నారు. దాసరి మల్లమ్మ కుమార్తె దాసరి రాజేశ్వరి ఏఎన్ఎంగా పని చేస్తూ 2010లో మరణించారు. ఆమెకు పెళ్లికాకపోవడంతో తల్లి దాసరి మల్లమ్మకు ఫ్యామిలీ పింఛను కింద ప్రభుత్వం ప్రతి నెలా రూ.24,073 చెల్లిస్తోంది. దీంతోపాటు ఆసరా పింఛను సైతం మల్లమ్మకు అందుతున్నట్లు గత నెలలో నిర్వహించిన సర్వేలో అధికారులు గుర్తించారు. దీంతో ఆమెకు వెంటనే చేయూత పింఛన్‌ను నిలిపివేశారు.

పింఛను సొమ్ము వెనక్కి ఇవ్వాలంటూ నోటీసులా?

- వృద్ధురాలి పట్ల రేవంత్ సర్కారు అమానవీయ వైఖరి: కేటీఆర్



కొత్తగూడెం, జూలై 13 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రజలకు దొంగ హామీలు ఇచ్చి గద్దెనెక్కిన రేవంత్.. ఇప్పుడు పింఛనుదారులకు నోటీసులు ఇస్తోందని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ఆరోపించారు. "కొండనాలుకకు మందు వేస్తే ఉన్న నాలుక ఊడినట్లు ఉంది. అనేక పథకాలు ఇస్తామని, ఉన్న పథకాలకు వచ్చే డబ్బును పెంచుతామని దొంగ హామీలు ఇచ్చి, గద్దెనెక్కిన రేవంత్ సర్కార్ ఇప్పుడు రాష్ట్రంలో ఉన్న లబ్ధిదారుల నుంచి సొమ్మును వెనక్కి రాబట్టే వింత చేష్టలు మొదలు పెట్టింది" అని విమర్శించారు. "భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో దాసరి మల్లమ్మ అనే 80 ఏళ్ల వృద్ధురాలికి ఆసరా పింఛన్ కింద వచ్చిన రూ.1,72,928 ప్రభుత్వానికి చెల్లించాలంటూ నోటీసు ఇచ్చారు. పక్షవాతంతో బాధపడుతున్న వృద్ధురాలికి కేసీఆర్ సర్కారు ఇచ్చిన పింఛన్ సొమ్మును తిరిగి లాక్కోవడానికి ప్రయత్నించడం రేవంత్ సర్కార్ అమానవీయ వైఖరికి నిదర్శనం. ఇలాంటి దుర్మార్గపు చర్యలు మానుకోవాలి. లేకుంటే ప్రజలే సర్కారు మీద తిరగబడతారు"అని కేటీఆర్ శనివారం ట్వీట్ చేశారు.

నిబంధనలకు విరుద్ధమైనందునే తొలగించాం: మంత్రి సీతక్క



ములుగు, జూలై 13: రాష్ట్రంలో ప్రజా పాలన కొనసాగుతోందని, అర్హులైన లబ్ధిదారులకే పథకాలు అందిస్తామని మంత్రి సీతక్క చెప్పారు. పింఛన్లు రద్దు చేస్తున్నారంటూ మాజీ మంత్రి కేటీఆర్ ట్వీట్ చేయడం.. రాజకీయంగా చర్చనీయాంశం కావడంతో శనివారం మంత్రి స్పందించారు. భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో దాసరి మల్లమ్మ అనే వృద్ధురాలు డబుల్ పింఛను తీసుకుంటున్నట్లు అధికారులు జరిపిన విచారణలో తేలిందన్నారు. ట్రెజరీ అధికారులు వివరణ కోరుతూ నోటీసు జారీ చేసినట్లు చెప్పారు. కేటీఆర్ వాస్తవాలు తెలుసుకోకుండా ఏదిపడితే అది మాట్లాడుతున్నారని దుయ్యబట్టారు. తమ ప్రభుత్వం మానవీయకోణంలో ఆలోచిస్తోందని.. అర్హులందరికీ పింఛను అందించడమే తమ ప్రభుత్వ లక్ష్యమని చెప్పారు. ప్రతి పైసా అర్హులకే దక్కాలన్నది తమ సంకల్పమన్నారు. మల్లమ్మ విషయంలో రెండు రకాల పింఛన్లు ఇచ్చేందుకు నిబంధనలు అంగీకరించవన్న విషయాన్ని తెలుసుకోవాలని కేటీఆర్‌కు సూచించారు.



ప్రభుత్వ వైద్యుల పోస్టులకు పెరిగిన పోటీ

- 435 పోస్టులకు 4,800 దరఖాస్తులు
- ప్రైవేటులోఎంబీబీఎస్‌లకు తగ్గుతున్న డిమాండ్
- ప్రభుత్వ ఆస్పత్రులకు మరలుతున్నవైద్యులు

హైదరాబాద్, జూలై 13 (ఆంధ్రజ్యోతి): ప్రైవేటు ఆస్పత్రుల్లో ఎంబీబీఎస్ వైద్యులకు డిమాండ్ తగ్గటంతో ప్రభుత్వ ఆస్పత్రులవైపు దృష్టి సారిస్తున్నారు. తాజాగా ప్రభుత్వ వైద్యుల నియామకాలకు అభ్యర్థుల నుంచి వచ్చిన స్పందన దీనినే తెలియజేస్తోంది. 435 సివిల్ అసిస్టెంట్ సర్జన్ పోస్టుల భర్తీకి ఈ నెల 2వ తేదీ నుంచి 11వ తేదీ వరకు పది రోజుల్లో 4,800 దరఖాస్తులు వచ్చినట్లు మెడికల్ రిక్రూట్‌మెంట్ బోర్డు వర్గాలు తెలిపాయి. అంటే ఒక్కో పోస్టుకు సగటున 11 మంది పోటీ పడుతున్నారు. ఈ స్థాయిలో దరఖాస్తులు వస్తాయని అధికార వర్గాలు కూడా ఊహించలేకపోయాయి. ప్రభుత్వ వైద్యులుగా చేరితే ప్రైవేటు ప్రాక్టీస్ చేయకూడదన్న నిబంధన ఉండటంతో గతంలో చాలామంది సర్కారీ డాక్టర్ కొలువులపై ఆసక్తి చూపలేదు. కానీ ఈసారి మాత్రం గట్టి పోటీ నెలకొందని వైద్యవర్గాలు తెలిపాయి. 2022లో 960 సివిల్ అసిస్టెంట్ సర్జన్ పోస్టుల భర్తీకి నోటిఫికేషన్ జారీ కాగా, ఐదువేలలోపే అప్లికేషన్లు వచ్చాయి. కానీ ఈసారి అందులో సగం పోస్టులకే 4,800 దరఖాస్తులొచ్చాయి. కాగా ఈనెలాఖరుకు దరఖాస్తులన్నింటిని పరిశీలించి నియామక ప్రక్రియ చేపట్టాలని మెడికల్ బోర్డును ఇప్పటికే సర్కారు ఆదేశించింది. రాష్ట్రంలో ఎంబీబీఎస్ సీట్లు పెరగడంతో వైద్యుల సంఖ్య కూడా అందుకు తగ్గట్టే పెరుగుతోంది. దాంతో వారికి ప్రైవేటు ఆస్పత్రుల్లో ఉద్యోగావకాశాలు తగ్గుతున్నాయి. ఎంబీబీఎస్ చేసి.. పీజీ సీటు రాక, ఖాళీగా ఉండటం ఇష్టం లేక ప్రైవేటు ఆస్పత్రుల్లో చేరితే పెద్దగా వేతనాలు ఇవ్వటం లేదు. కొన్ని ఆస్పత్రులైతే రూ.20-25 వేలే ఇస్తున్నారు. ఈ నేపథ్యంలోనే డాక్టర్లు ప్రభుత్వ ఉద్యోగాల వైపు మొగ్గుచూపుతున్నారు.

పోలీసులపై కత్తులు, కర్రలతో దాడి

- రూ. 25 కోట్ల స్థల వివాదంలో ఎమ్మార్పీఎస్ నేత కిడ్నాప్
- అక్కడికి వెళ్లిన పోలీసులపై దుండగుల దాడి... నలుగురి అరెస్ట్

హైదరాబాద్ సిటీ/నార్సింగ్, జూలై 13 (ఆంధ్రజ్యోతి): నాంపల్లి రైల్వే స్టేషన్‌లో దొంగలు గొడ్డలి, రాళ్లతో పోలీసులపై దాడి చేసిన మరుసటి రోజే సైబరాబాద్ కమిషనరేట్ పరిధిలోని నార్సింగ్ పోలీసులపై రౌడీ మూకలు కత్తులు, హాకీ కర్రలతో దాడికి పాల్పడిన ఘటన కలకలం రేపింది. పోలీసులు వెంటనే అదనపు బలగాలను రప్పించి నలుగురిని అదుపులోకి తీసుకున్నారు. సినీ ఫక్కీలో జరిగిన ఈ ఘటన నార్సింగ్ పరిధిలోని బృందావన్ కాలనీలో శనివారం వెలుగులోకి వచ్చింది. మూడు రోజుల క్రితం అదృశ్యమైన ఎమ్మార్పీఎస్ నాయకుడు నరేందర్ కోసం నార్సింగ్ పోలీసులు గాలిస్తున్నారు. ఆయన్ను ఎవరో కిడ్నాప్ చేశారని తెలియడంతో పోలీసులు బృందాలుగా ఏర్పడి వెతుకుతున్నారు. ఈ క్రమంలో నరేందర్ గండిపేట బృందావన్ కాలనీలో ఉన్నట్లు పోలీసులకు సమాచారం అందింది. దాంతో పోలీసులు శుక్రవారం అర్ధరాత్రి దాటిన తర్వాత అక్కడికి చేరుకున్నారు. అక్కడ ఓ ఖాళీ జాగాలో అలజడిగా ఉండటంతో.. పోలీసులు వెళ్లి అక్కడ ఉన్న వారిని ప్రశ్నించారు. నరేందర్‌ను వారు అక్కడే దాచిపెట్టినట్లు పోలీసులకు అర్థమైంది. 'ఈ సైట్ ఎవరిది.? ఇక్కడ మీరు ఎందుకు ఉన్నారు..?' అని గట్టిగా అడగడంతో గుంపుగా ఉన్న రౌడీలు ఒక్కసారిగా పోలీసుల పైకి కత్తులు, హాకీ కర్రలతో తిరగబడ్డారు. పోలీసుల పైకి కుక్కలను వదలండి అంటూ రెచ్చిపోయారు. ఎదురు దాడిని ఊహించని పోలీసులు భయభ్రాంతులకు గురయ్యారు. వెంటనే అప్రమత్తమై అదనపు బలగాలను రప్పించారు. దాంతో వారిని చూసి రౌడీలు పారిపోయే ప్రయత్నం చేశారు. వెంటపడిన పోలీసులు నలుగురిని అదుపులోకి తీసుకున్నారు. వారిని విచారించగా.. రూ.25కోట్ల విలువ చేసే స్థలం వద్ద తిష్ట వేసి హల్‌చల్ సృష్టిస్తున్నట్లు తేలింది. అరెస్టు అయిన నలుగురు రౌడీషీటర్లు అహ్మద్ ఖాన్, షేక్ హమ్దన్, మహ్మద్ జాఫర్, హామద్ మసూద్‌ను రాజేంద్రనగర్ ఉప్పర్‌పల్లి కోర్టులో హాజరుపరిచారు.వారికి 7 రోజుల రిమాండ్ విధిస్తూ కోర్టు తీర్పునిచ్చింది. ఎట్టకేలకు వారి చెరలో ఉన్న నరేందర్‌ను కాపాడటంతో ఎమ్మార్పీఎస్ నేతలు ఊపిరి పీల్చుకున్నారు. రూ.25 కోట్ల స్థల వివాదంలో భాగంగానే నరేందర్‌ను రౌడీలు కిడ్నాప్ చేశారని గుర్తించి దర్యాప్తు చేస్తున్నారు.

డీఏలు విడుదల చేయండి

- రిటైర్డ్ గెజిటెడ్ అధికారుల సంఘం వినతి

హైదరాబాద్, జూలై 13 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ పింఛనుదారుల సమస్యలు పరిష్కరించి, పెండింగ్‌లో ఉన్న డీఏలను వెంటనే విడుదల చేయాలని తెలంగాణ రిటైర్డ్ గెజిటెడ్ అధికారుల సంఘం అధ్యక్షుడు ఎం.మోహన్‌నారాయణ, కార్యదర్శి ఎస్.నర్సరాజు సీఎం రేవంత్‌రెడ్డికి శనివారం వినతిపత్రం అందజేశారు. ఆరోగ్య పథకాన్ని అమలుచేయాలని, ఆర్టీసీ బస్సుల్లో 50శాతం రాయితీ ఇవ్వాలని కోరారు. ఆరోగ్య శాఖ మంత్రి దామోదర రాజనర్సింహను కలిసి రిటైర్డ్ ఉద్యోగులకు ఆరోగ్య పథకం అమలుచేయాలని కోరారు.

ఎస్ఆర్ఎస్పీ రెండో దశ ఆయకట్టును ఎన్ని ప్రాజెక్టుల్లో చూపిస్తారు?

- కాళేశ్వరంతో పాటు సమ్మక్కసాగర్ లోనూ చూపిన గత ప్రభుత్వం
- అభ్యంతరం తెలిపిన సీడబ్ల్యూసీ
- సమగ్ర నివేదిక సమర్పించాలని ఆదేశం

హైదరాబాద్, జూలై 13 (ఆంధ్రజ్యోతి): శ్రీరాంసాగర్ ప్రాజెక్టు రెండో దశ కింద ఉన్న ఆయకట్టును ఎన్ని ప్రాజెక్టుల్లో చూపిస్తారని కేంద్ర జలవనరుల సంఘం (సీడబ్ల్యూసీ) ప్రశ్నించింది. సమ్మక్కసాగర్ (తుపాకులగూడెం బ్యారేజీ) ప్రాజెక్టులో ఎస్ఆర్ఎస్పీ రెండో దశ కింద 4.40 లక్షల ఎకరాల ఆయకట్టు సాగులోకి రానుందని గత ప్రభుత్వం డీపీఆర్‌లో పొందుపరిచింది. వాస్తవానికి కాళేశ్వరం ఎత్తిపోతల పథకం డీపీఆర్‌లో కూడా ఎస్ఆర్ఎస్పీ రెండో దశ కింద 4.40 ఎకరాల ఆయకట్టును స్థిరీకరించనున్నట్లు చూపించారు. అయితే 2006-07లో సత్వర సాగునీటి ప్రయోజన పథకం (ఏఐబీపీ) కింద ఎస్ఆర్ఎస్పీ రెండో దశ ప్రాజెక్టును నాటి కేంద్ర ప్రభుత్వం మంజూరు చేసింది. దీనికింద 2006-07 నుంచి కేంద్రం నిధులు విడుదల చేస్తూనే ఉంది. ఇప్పటికే చేపట్టిన ప్రాజెక్టు ఆయకట్టును కాళేశ్వరం ఎత్తిపోతల పథకంలోనూ, సమ్మక్క సాగర్‌లోనూ చూపించడాన్ని సీడబ్ల్యూసీ తప్పుపట్టింది. ఇటీవల సీడబ్ల్యూసీలో జరిగిన అంతరాష్ట్ర వ్యవహారాల సమావేశంలో సమ్మక్కసాగర్ ప్రాజెక్టు క్లియరెన్స్ అంశం చర్చకు రాగా.. ఈ ప్రాజెక్టులో చూపించిన ఆయకట్టుపై ప్రశ్నించారు. ఎస్ఆర్ఎస్పీ-2 ఆయకట్టును ఎన్ని ప్రాజెక్టుల్లో చూపిస్తారని? దీనిపై సమగ్ర నివేదికను అందించాలని సీడబ్ల్యూసీ స్పష్టం చేసింది. రూ.9257 కోట్లతో చేపట్టిన సమ్మక్కసాగర్ ప్రాజెక్టు పనులు 95 శాతం మేర పూర్తయ్యాయి. ఒక్క రూపాయి వెచ్చిస్తే.. రూ.1.67ల రాబడి వస్తుందని డీపీఆర్‌లో పొందుపరిచారు. లబ్ధిని ఎక్కువగా చూపే క్రమంలోనే గత ప్రభుత్వం ఎస్ఆర్ఎస్పీ రెండో దశ స్థిరీకరణను ఈ ప్రాజెక్టు ఖాతాలో వేసింది. ఈ బ్యారేజీలో నీటిని నిల్వ చేసి.. బ్యాక్‌వాటర్‌ను ఎత్తిపోయడం ద్వారా ఉమ్మడి ఖమ్మం, నల్లగొండ, వరంగల్ జిల్లాలకు నీరందించాలని లక్ష్యంగా పెట్టుకున్నారు. ఇక ఛత్తీస్‌గఢ్ నుంచి నిరభ్యంతర పత్రం(ఎన్ఓసీ) తెచ్చుకొని సమర్పిస్తే తప్ప ఈ ప్రాజెక్టుకు అనుమతులు ఇచ్చే అవకాశాల్లేవని సీడబ్ల్యూసీ తాజాగా తేల్చిచెప్పింది.

గరిష్ఠ వరద పరిహారానికి ఛత్తీస్‌గఢ్ పట్టు

గోదావరిపై ములుగు జిల్లాలో నిర్మిస్తున్న తుపాకులగూడెం బ్యారేజీ పూర్తిస్థాయి నీటినిల్వ 83 మీటర్లు కాగా.. అక్కడిదాకా ముంపునకు గురయ్యే భూములకే పరిహారం చెల్లిస్తామని తెలంగాణ ప్రభుత్వం తేల్చిచెప్పింది. అయితే గరిష్ఠ వరద 2022 జూలై 17, 19వ తేదీల్లో 88 మీటర్ల దాకా రికార్డయిందని.. ఆ మేరకు ముంపునకు గురయ్యే భూములకు కూడా పరిహారం చెల్లించాల్సిందేనని ఛత్తీస్‌గఢ్ పట్టుబడుతోంది. గరిష్ఠ వరదతో ముంపునకు గురయ్యే ప్రాంతాల్లో భూసేకరణ చేయాల్సిందేనని తేల్చడంతో ఎన్ఓసీ జారీ సంక్లిష్టంగా మారింది. రేవంత్ సర్కారు ఈ ప్రాజెక్టుకు అనుమతి తెచ్చే బాధ్యతను నీటిపారుదల శాఖ సలహాదారుడు ఆదిత్యనాథ్‌దాస్‌కు అప్పగించింది. ఇందులో భాగంగా ఆయన ఇప్పటికే ఢిల్లీకి వెళ్లారు.



అనంత్ అంబానీ-రాధికా మర్చంట్ వివాహానికి హాజరైన ఏపీ ముఖ్యమంత్రి చంద్రబాబు, ఉప ముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్

అనంత్ అంబానీ వివాహానికి బాబు కుటుంబం

- వేడుకలో పాల్గొన్న పవన్ కల్యాణ్

అమరావతి, జూలై 13 (ఆంధ్రజ్యోతి): ముకేశ్ అంబానీ తనయుడు అనంత్ అంబానీ వివాహ వేడుకలకు ఏపీ ముఖ్యమంత్రి చంద్రబాబు దంపతులు, వారి కుమారుడు, మంత్రి లోకేశ్ దంపతులు హాజరయ్యారు. శనివారం మధ్యాహ్నం వారందరూ విమానంలో బయలుదేరి ముంబై చేరుకున్నారు. కాగా, ఇదే పెళ్లి వేడుకకు వచ్చిన బ్రిటన్ మాజీ ప్రధాని టోనీ బ్లెయిర్‌ను లోకేశ్, బ్రాహ్మణి దంపతులు కలిశారు. పరిపాలన, విద్య, ఆరోగ్యం, రాజకీయ రంగాల్లో ఏఐ సాంకేతిక వినియోగం తదితర అంశాలపై చర్చించారు. వివిధ రంగాల్లో ఏఐ వినియోగం ద్వారా ఆదాయ సృష్టికి ఉన్న అవకాశాల గురించి మాట్లాడుకున్నారు. ఏపీ ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్, కేంద్ర మంత్రులు కె. రామ్మోహన్‌నాయుడు, పెమ్మసాని చంద్రశేఖర్ తదితర ప్రముఖులు ఈ వేడుకలో పాలుపంచుకున్నారు.

కాళ్లు మొక్కే సంస్కృతి వద్దు

- ఎవరైనా మొక్కితే నేనూ అదే పనిచేస్తా
- టీడీపీ అధినేత, ఏపీ సీఎం చంద్రబాబు

అమరావతి, జూలై 13 (ఆంధ్రజ్యోతి): ప్రజలు, పార్టీ కార్యకర్తలు, నేతలు తన కాళ్లకు నమస్కారం చేయవద్దని, ప్రజల సేవకులమైన తాము వారితో కాళ్లకు నమస్కారం పెట్టించుకోవడం తగదని ఏపీ సీఎం చంద్రబాబు స్పష్టం చేశారు. శనివారం టీడీపీ ప్రధాన కార్యాలయానికి వచ్చిన ఆయన విలేకరులతో మాట్లాడారు. "కాళ్లకు నమస్కారం పెట్టి కుటుంబ పెద్దల నుంచి ఆశీర్వాదం తీసుకుంటాం. మిగతా సందర్భాల్లో అలా చేయడం మంచిది కాదు. ఒక వేళ ఎవరైనా బలవంతంగా కాళ్లకు దండం పెడితే నేను కూడా వారి కాళ్లకు నమస్కారం పెడతా. తల్లిదండ్రులు, గురువులు , దేవుడికి మాత్రమే కాళ్లకు మొక్కాలి....నాయకులకు కాదు. అందరూ ఆత్మగౌరవంతో నడుచుకోవాలి" అని చంద్రబాబు కోరారు.

నిరుద్యోగులకు జెన్‌కో షాక్!

- సాంకేతిక కారణాల సాకుతో ఒక్కరోజు ముందు పరీక్షా కేంద్రం మార్పు
- నేడు రెండు కేంద్రాల్లో పరీక్షలు

హైదరాబాద్, జూలై 13 (ఆంధ్రజ్యోతి): నిరుద్యోగులతో తెలంగాణ జెన్‌కో ఆటాడుతోంది. ఒక్క రోజు ముందు పరీక్ష కేంద్రాన్ని మార్చి వారికి షాక్ ఇచ్చింది. జెన్‌కోలో ఖాళీగా ఉన్న అసిస్టెంట్ ఇంజనీర్స్ (ఎలక్ట్రికల్, మెకానికల్, ఎలక్ట్రానిక్స్, సివిల్)తోపాటు కెమిస్ట్ ఉద్యోగాల భర్తీకి ఈ నెల 14న కంప్యూటర్ ఆధారిత పరీక్షలు కేపీఎం టెక్నాలజీ అండ్ సొల్యూషన్స్‌లో జరగనున్నట్లు తొలుత సమాచారమిచ్చింది. ఈ మేరకు హాల్‌టికెట్లనూ జారీ చేశారు. అయితే అనూహ్యంగా 13న (పరీక్షకు ఒక రోజు ముందు) సాంకేతిక కారణాలతో పరీక్ష కేంద్రం మార్పుతున్నట్లు ప్రకటించారు. పరీక్షా కేంద్రం మార్పుపై ఒక్క రోజు ముందు నిర్ణయం తీసుకొని అభ్యర్థులు మళ్లీ హాల్ టికెట్లను డౌన్‌లోడ్ చేసుకోవాలని జెన్‌కో సూచించడం పట్ల విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. అభ్యర్థులు కొత్త హాల్‌టికెట్ల కోసం టీటీటీ.జజ్ఞఛొ.ఛొౌఖ వెబ్‌సైట్ సందర్శించవచ్చు. వాస్తవానికి ఈ పరీక్షలు గత మార్చి 31న జరగాల్సి ఉండగా లోక్‌సభ ఎన్నికల కారణంగా వాయిదా వేశారు. ఎన్నికల కోడ్ ముగిశాక గత జూన్ 12న షెడ్యూల్‌ను ప్రకటిస్తూ ఈ నెల 14న పరీక్షలుంటాయని ప్రకటించారు. కాగా ఆదివారం (ఈ నెల 14న) ఉదయం 9 నుంచి 10:40 గంటల దాకా మెకానికల్, కెమిస్ట్ విభాగాలకు చెందిన అభ్యర్థులకు సైదాబాద్ సంతోష్‌నగర్‌లోని వినయ్‌నగర్‌లో ఉన్న భోజ్‌రెడ్డి మహిళా ఇంజనీరింగ్ కాలేజీలో పరీక్ష జరగనుంది. తర్వాత మధ్యాహ్నం ఒంటి గంట నుంచి 2:40 గంటల దాకా ఎలక్ట్రికల్ అభ్యర్థులకు సరూర్‌నగర్‌లోని బాలాపూర్ మండలం నాదర్‌గుల్‌లో ఉన్న ఎంవీఎస్ఆర్ ఇంజనీరింగ్ కాలేజీలో పరీక్ష నిర్వహించనున్నారు. సాయంత్రం 5 నుంచి 6:40 గంటల దాకా సివిల్, ఎలక్ట్రానిక్స్ విభాగం వారికి భోజ్‌రెడ్డి మహిళా ఇంజనీరింగ్ కాలేజీలో పరీక్ష నిర్వహించనున్నారు. పరీక్షలు రాసే అభ్యర్థులు విధిగా హాల్‌టికెట్‌తోపాటు ఒక ఒరిజినల్ ఫొటో గుర్తింపు కార్డు వెంట తెచ్చుకోవాలని జెన్‌కో పేర్కొంది.

డ్రగ్స్ విద్యార్థుల దరి చేరకుండా..
హైస్కూళ్లలో 'ప్రహరీ సంఘాలు'

హైదరాబాద్, జూలై 13 (ఆంధ్రజ్యోతి): విద్యార్థులు మాదకద్రవ్యాలు, మత్తు పదార్థాల బారిన పడకుండా ఉండేందుకు రాష్ట్రంలోని ప్రభుత్వ, ప్రైవేటు ఉన్నత పాఠశాలల్లో ప్రహరీ సంఘాలు ఏర్పాటు చేయాలని ప్రభుత్వం నిర్ణయించింది. ఈ సంఘాల ఏర్పాటుకు అనుమతినిస్తూ పాఠశాల విద్యా శాఖ ముఖ్య కార్యదర్శి బీ వెంకటేశం ఉత్తర్వులు జారీ చేశారు. విద్యార్థులను డ్రగ్స్‌కు దూరంగా ఉంచడం, పాఠశాలల పరిసరాల్లో వాటి లభ్యత, స్మగ్లింగ్, విక్రయాలు లేకుండా చూడడం ఈ సంఘాల లక్ష్యమని ప్రభుత్వం పేర్కొంది. వీటిని అన్ని హైస్కూళ్లలో ఏర్పాటు చేయాలని తెలిపింది. డ్రగ్స్ నిరోధానికి తమకు అనుకూలమైన వ్యూహాత్మక పద్ధతులు రూపొందించుకోవాలని పేర్కొంది. డ్రగ్స్‌కు దగ్గరవుతున్న పిల్లలపై ఈ సంఘం సభ్యులు అప్రమత్తంగా ఉండాలని, వారికి అవగాహన కల్పించాలని తెలిపింది. మాదకద్రవ్యాలు, మత్తు పదార్థాల రవాణాలో ఇరుక్కున్న పిల్లలను రక్షించాలని, పాఠశాల పరిసరాల్లో వాటి స్మగ్లింగ్, అమ్మకాలపై నిఘా పెట్టాలని సూచించింది. ఈ సంఘం అధ్యక్షుడిగా పాఠశాల ప్రధానోపాధ్యాయుడు/ప్రిన్సిపాల్, ఉపాధ్యక్షుడిగా సీనియర్ ఉపాధ్యాయుడు ఉండాలని తెలిపింది. 6 నుంచి 10 వరకు ఒక్కో తరగతి నుంచి ఇద్దరేసి చురుకైన విద్యార్థులను సభ్యులుగా చేర్చాలని, తల్లిదండ్రులు-ఉపాధ్యాయుల సంఘం, తల్లిదండ్రుల సంఘం నుంచి ఒక్కో ప్రతినిధిని, స్థానిక పోలీస్ స్టేషన్ నుంచి ఒక పోలీసును కూడా తీసుకోవాలని సూచించింది. హైదరాబాద్, సైబరాబాద్, రాచకొండ పోలీస్ కమిషనరేట్ల పరిధిలోని స్కూళ్లపై మరింత దృష్టి పెట్టాలని తెలిపింది.



కేపీహెచ్‌బీ ఏడో ఫేజ్ వద్ద నర్సరీలు కనపడకుండా ఏర్పాటుచేసిన ఆకుపచ్చ పరదాలు

సీఎంకు నర్సరీలు కన్పించకూడదా?

▸ కేపీహెచ్‌బీలో పరదాలతో మూయించిన అధికారులు!

కేపీహెచ్‌బీ కాలనీ, జూలై 13 (ఆంధ్రజ్యోతి): హైదరాబాద్‌లో హైటెక్ సిటీ నుంచి జేఎన్‌టీయూకు వచ్చే మార్గంలోని కేపీహెచ్‌బీ ఏడో ఫేజ్ నుంచి నెక్సస్ మాల్ వరకు హౌసింగ్ బోర్డు స్థలంలో అక్రమంగా ఏర్పాటుచేసిన నర్సరీలు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కంటపడకుండా అధికారులు జాగ్రత్తపడ్డారు. వారి అంతర్యం ఏమిటోనని ఆ మార్గంలో రాకపోకలు సాగించే వారు చర్చించుకున్నారు. కొందరు తమ వద్దకు వచ్చి సీఎం వస్తున్నారంటూ.. భద్రతా ఏర్పాట్లలో భాగంగా తమను దుకాణాలు మూసేయన్నారని పలువురు నర్సరీ వ్యాపారులు తెలిపారు. తాము రాత్రివేళ అడ్డుగా కట్టే పరదాలనే పగటిపూటా కట్టి ఉంచామని, సాయంత్రం మళ్లీ తెరిచి వ్యాపారాలు చేసుకున్నామన్నారు.



నల్లగొండ ఆర్టీసీ బస్టాండ్‌లో నూతన బస్సును జెండా ఊపి ప్రారంభిస్తున్న మంత్రులు పొన్నం ప్రభాకర్, కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి

అన్ని జిల్లా కేంద్రాలకు ఏసీ బస్సులు:మంత్రి పొన్నం

నల్లగొండ, జూలై 13: ఆర్టీసీని బలోపేతం చేసేందుకు ప్రభుత్వం కృషి చేస్తోందని రాష్ట్ర రవాణా, సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ అన్నారు. రాష్ట్రంలోని అన్ని జిల్లాల కేంద్రాల నుంచి హైదరాబాద్‌కు అతి త్వరలో ఏసీ బస్సులు నడుపుతామని ప్రకటించారు. అనంతరం అన్ని అసెంబ్లీ నియోజకవర్గాల నుంచి రాష్ట్ర రాజధానికి ఏసీ బస్సులు నడుపుతామని తెలిపారు. నల్లగొండ నుంచి హైదరాబాద్‌కు ఏర్పాటు చేసిన మూడు కొత్త ఏసీ బస్సులను నల్లగొండ ఆర్టీసీ బస్టాండ్‌లో మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డితో శనివారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి పొన్నం మాట్లాడుతూ ఆర్టీసీలో కొత్తగా 3,035 ఉద్యోగాలను భర్తీ చేస్తున్నామని తెలిపారు. దసరాలోగా ఉమ్మడి నల్లగొండ జిల్లాకు 30 డీలక్స్ బస్సులు, 30 ఎక్స్‌ప్రెస్ బస్సులు కేటాయిస్తామని ప్రకటించారు.

రేపు యాదగిరిగుట్టలో గిరి ప్రదక్షిణ

యాదాద్రి, జూలై 13 (ఆంధ్రజ్యోతి): యాదగిరిగుట్టలో గిరి ప్రదక్షిణపై విస్తృత ప్రచారం చేసేందుకు అధికారులు సన్నాహాలు చేస్తున్నారు. జూన్ 18న లక్ష్మీనరసింహస్వామివారి జన్మనక్షత్రం స్వాతి నక్షత్రాన్ని పురస్కరించుకుని గిరి ప్రదక్షిణను ప్రారంభించగా.. భక్తుల నుంచి విశేష స్పందన లభించింది. దాంతో ప్రతి నెలా స్వాతి నక్షత్రం రోజున ఉదయం 6.05 గంటలకు కొండ కింద వైకుంఠ ద్వారం నుంచి ప్రారంభించి, మళ్లీ అక్కడే ముగిసేలా గిరి ప్రదక్షిణ చేపట్టనున్నారు. భక్తులు సంప్రదాయ దుస్తులు ధరించి రావాలి. ఆలయం చుట్టూ రెండున్నర కిలోమీటర్ల మేర గిరి ప్రదక్షిణ దారిలో వసతులు కల్పిస్తున్నారు. ఇప్పటికే యాదగిరిగుట్ట కింద టైల్స్ వేసి ఫుట్‌పాత్ నిర్మించారు. మంచినీరు, మరుగుదొడ్లు తదితర వసతులు కల్పించారు. గుట్ట చుట్టూ లైటింగ్ ఏర్పాటు చేశారు.



అశోక్ నగర్‌లో ఆందోళన చేస్తున్న నిరుద్యోగులు

అశోక్‌నగర్‌లో నిరుద్యోగుల ఆందోళన

▸ గ్రూప్ 2, 3 పోస్టులు పెంచాలని డిమాండ్

▸ గ్రూప్ 2 పరీక్ష డిసెంబరులో పెట్టాలని విజ్ఞప్తి

చిక్కడపల్లి, జూలై 13 (ఆంధ్రజ్యోతి): గ్రూప్-2, 3 పోస్టులు పెంచాలని.. డిసెంబరులో గ్రూప్-2 పరీక్ష నిర్వహించాలని డిమాండ్ చేస్తూ శనివారం రాత్రి నిరుద్యోగులు హైదరాబాద్‌లోని అశోక్‌నగర్ చౌరస్తాలో ఆందోళన చేపట్టారు. పెద్ద సంఖ్యలో ర్యాలీగా వచ్చిన అభ్యర్థులు అశోక్ నగర్ చౌరస్తాలో బైఠాయించారు. ప్లకార్డులు చేతపట్టి ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. గ్రూప్-1, డీఎస్సీలో పోస్టులు పెంచడం సంతోషమని.. గ్రూప్-2, 3లో కూడా పెంచాలని డిమాండ్ చేశారు. కొలువులు నింపడంలో కేసీఆర్‌కు కాంగ్రెస్‌కు తేడా ఏం లేదని మండిపడ్డారు. తాము పుస్తకం పట్టుకోవాలా..? కొలువుల కోసం పోరాటం చేయాలా..? అని ప్రభుత్వాన్ని నిలదీశారు. బీఆర్ఎస్ పాలనలో ఇదే సమస్య అయిందని ఇప్పుడు కాంగ్రెస్ ప్రభుత్వంలో కూడా ఇదే సమస్యగా మారిందని ఆందోళన వ్యక్తం చేశారు. రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం రావడానికి తామంతా కష్టపడ్డామని, తమ డిమాండ్లను ప్రభుత్వం నెరవేర్చాలని కోరారు. నిరుద్యోగుల ఆందోళనతో అశోక్‌నగర్‌లో ట్రాఫిక్ జామ్ ఏర్పడింది. దీంతో పోలీసులు అక్కడికి చేరుకుని వాహనాలను దారి మళ్లించి ఇబ్బందులు రాకుండా చర్యలు తీసుకున్నారు. డీఎస్సీ వాయిదాతోపాటు గ్రూప్-2, గ్రూప్-3 పోస్టులు పెంచాలన్న డిమాండ్‌తో దిల్‌సుఖ్‌నగర్‌లో కూడా నిరుద్యోగులు శనివారం అర్ధరాత్రి ధర్నా నిర్వహించారు.

వన్‌టైమ్ సెటిల్‌మెంట్

(మొదటిపేజీ తరువాయి)

ఫీజు చెల్లింపులు చేస్తామన్నారు. శనివారం 'క్వాలిటీ ఇంజనీరింగ్ ఎడ్యుకేషన్ ఇన్ తెలంగాణ' అనే అంశంపై వివిధ ప్రైవేటు ఇంజనీరింగ్ కాలేజీల యాజమాన్యాలతో జేఎన్‌టీయూలో నిర్వహించిన సమావేశానికి సీఎం రేవంత్‌రెడ్డి ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. ప్రతి పేదవాడి బిడ్డకు కార్పొరేట్ విద్యను అందించాలనే ఉద్దేశంతో కాంగ్రెస్ ప్రభుత్వం ఫీజు రీయింబర్స్‌మెంట్ పథకాన్ని ప్రవేశపెట్టిందన్నారు. ప్రపంచంలో ఏవైనా మానవ నిర్మాణ అద్భుతాలు ఉన్నాయంటే.. అందుకు కారకులు ఇంజనీర్లేనని సీఎం అన్నారు. ఇంజనీరింగ్ కాలేజీలు నిరుద్యోగులను తయారు చేసే కర్మాగారాలుగా ఉండొద్దని, ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కల్పించే గొప్ప సంస్థలుగా తయారు కావాలని ప్రభుత్వం కోరుకుంటోందని తెలిపారు. తాత్కాలిక ఉద్యోగాలకు అవకాశమున్న కోర్సులపైనే యాజమాన్యాలు దృష్టిపెడుతున్నాయని, దేశ నిర్మాణానికి అవసరమైన సివిల్, మెకానికల్, ఎలక్ట్రికల్ ఇంజనీరింగ్ కోర్సులను చాలా కళాశాలలు తగ్గించుకుంటున్నాయని పేర్కొన్నారు. దేశ భవిష్యత్తును నిర్మించే కోర్ ఇంజనీరింగ్ బ్రాంచ్‌లను తప్పనిసరిగా కాలేజీల్లో నడపాలని, లేదంటే దేశం అత్యంత ప్రమాదాన్ని ఎదుర్కోవాల్సి వస్తుందని చెప్పారు. గత ముఖ్యమంత్రులు చూపిన చొరవ కారణంగా తెలంగాణ రాష్ట్రం ఐటీ, ఫార్మా రంగాల్లో దూసుకుపోతోందని సీఎం పేర్కొన్నారు. రాబోయే 20 ఏళ్లలో ఏ బహుళజాతి సంస్థ సీఈవో అయినా భారతీయుడే ఉంటారని తెలిపారు.

గ్రూప్-1కు 1:100 చొప్పున అంటే ఇబ్బందులే..

తెలంగాణ రాష్ట్ర ఏర్పాటుకు ప్రధాన కారణం నిరుద్యోగ సమస్య అని, దీనిని పరిష్కరించకపోతే ప్రజాప్రతినిధులు విఫలమైనట్లేనని సీఎం రేవంత్ అన్నారు. ఈ మేరకే నిరుద్యోగ యువకులు, విద్యార్థుల కోసం తమ ప్రభుత్వం వివిధ ప్రణాళికలు రూపొందిస్తోందని చెప్పారు. గత పదేళ్లుగా పెండింగ్‌లో ఉన్న కోర్టు కేసులను క్లియర్ చేసి.. ఏకకాలంలో 19 వేల మంది టీచర్లకు ప్రమోషన్లు, బదిలీల ప్రక్రియను పారదర్శకంగా నిర్వహించామన్నారు. నాలుగు లక్షల మంది దరఖాస్తు చేసుకున్న గ్రూప్-1 పరీక్షను ఎలాంటి ఇబ్బంది లేకుండా నిర్వహించామని సీఎం తెలిపారు. గత ప్రభుత్వ హయాంలో గ్రూప్-1 పరీక్షకు బయోమెట్రిక్ తీసుకుంటామని నోటిఫికేషన్‌లో పేర్కొని.. తీసుకోకపోవడంతో న్యాయస్థానం కొట్టివేసిందని గుర్తు చేశారు. కానీ, తమ ప్రభుత్వం టీజీపీఎస్సీ ఆధ్వర్యంలో నోటిఫికేషన్‌లో పొందుపరిచిన అంశాల ప్రకారమే పరీక్షలు నిర్వహించి ఫలితాలు ఇచ్చిందని చెప్పారు. 2022లో గత ప్రభుత్వం 1:50 నిష్పత్తిలో మెయిన్స్‌కు ఎంపికచేస్తామని నోటిఫికేషన్‌లో పేర్కొందని, అవే మార్గదర్శకాలతో పరీక్షలు నిర్వహించాక.. కొందరు ఇప్పుడు 1:100 చొప్పున అవకాశమివ్వాలంటున్నారని సీఎం అన్నారు. అందుకు తమకేమీ ఇబ్బంది లేదని, కానీ.. కోర్టు మళ్లీ కొట్టేస్తే గ్రూప్-1 వ్యవహారం మొదటికి వస్తుందని పేర్కొన్నారు. 2011 నుంచి ఇప్పటి వరకు గ్రూప్-1 నియామకాలు పూర్తి కాలేదని, అభ్యర్థుల యుక్తవయసు మొత్తం కోచింగ్ సెంటర్లలోనే గడిచిపోయిందని ఆవేదన వ్యక్తం చేశారు.

అసెంబ్లీలో జాబ్ క్యాలెండర్ ప్రకటిస్తాం..

మార్చి 31 వరకు ఉద్యోగ ఖాళీల వివరాలు సేకరించి.. జూన్ 2లోగా నోటిఫికేషన్ విడుదల చేసి.. డిసెంబర్ 9లోపు నియామకాలు చేపడతామని సీఎం రేవంత్ ప్రకటించారు. యూపీఎస్సీ సివిల్స్ మాదిరిగా జాబ్ క్యాలెండర్ ఉండాలన్నది తమ ప్రభుత్వ ఉద్దేశమన్నారు. గతంలో ఔట్‌సోర్సింగ్ వారిని పబ్లిక్ సర్వీస్ కమిషన్‌లో నియమించారని, ఉద్యోగాల భర్తీ వాళ్లకు అప్పగిస్తే ఎలా చేస్తారని ప్రశ్నించారు. ఆర్ఎంపీ డాక్టర్‌ను టీఎస్‌పీఎస్సీ సభ్యుడిని చేశారని, ఆయన గ్రూప్-1 అధికారిని ఇంటర్వ్యూ చేసి నియమించడమేంటో చెప్పాలని వ్యాఖ్యానించారు. గ్రూప్-1 పేపర్ తయారు చేసేవారు, నియమించేవారు అంతకంటే పైస్థాయి వారు అయి ఉండాలన్నారు. అంతేతప్ప.. రాజకీయ పునరావాస కేంద్రాలుగా విద్యావ్యవస్థలు మారకూడదన్నారు. తమ ప్రభుత్వం ఏర్పడిన 90 రోజుల్లోనే 30 వేల ఉద్యోగాల నియామక పత్రాలు అందించామని తెలిపారు. డీఎస్సీ, గ్రూప్-1, గ్రూప్-2, గ్రూప్-3 తదితర అన్ని ఉద్యోగాలనూ ఈ ఏడాది ఆఖర్లోగా భర్తీ చేయాలనుకుంటున్నామని ప్రకటించారు. సెప్టెంబరులో జరగనున్న ఆర్టిఫిషియల్ గ్లోబల్ సమ్మిట్‌కు సంబంధించిన ఏఐ లోగోను సీఎం రేవంత్‌రెడ్డి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మంత్రి శ్రీధర్‌బాబు మాట్లాడుతూ.. కోర్ ఇంజనీరింగ్‌ను మరిచిపోకుండా అధునాతన టెక్నాలజీలను అందిపుచ్చుకోవాల్సిన అవసరం ఉందన్నారు. జీహెచ్ఎంసీ నడిబొడ్డున ఏఐ సిటీ ఏర్పాటుకు 200 ఎకరాలను సీఎం రేవంత్‌రెడ్డి కేటాయించారని, ఏఐ గ్లోబల్ సమ్మిట్ అనంతరం ఏఐ సిటీ నిర్మాణం ప్రారంభిస్తామని తెలిపారు.



జేఎన్‌టీయూలో జరిగిన 'క్వాలిటీ ఇంజనీరింగ్ ఎడ్యుకేషన్ ఇన్ తెలంగాణ' కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న సీఎం

పరీక్షలు రాయనివాళ్లే
దీక్షలు చేస్తున్నారు..

ప్రభుత్వ విధానాలు విద్యార్థుల జీవితాలపై చెడు ప్రభావం చూపకూడదని నియామక పరీక్షలు ఇబ్బంది లేకుండా నిర్వహిస్తుంటే కొందరు వాయిదా కావాలంటున్నారని సీఎం రేవంత్‌రెడ్డి విమర్శించారు. కొన్ని రాజకీయ శక్తులు, కోచింగ్ సెంటర్లు.. వాటి స్వలాభం కోసం పరీక్షలు వాయిదా వేయాలని కోరుతున్నాయన్నారు. ఏ పరీక్షా రాయని వారు పరీక్షల వాయిదా అడుగుతున్నారని, దీక్ష చేస్తున్న ముగ్గురిలో ఒక్కరు కూడా ఏ పరీక్షా రాయడంలేదని తన దృష్టికి వచ్చిందని చెప్పారు. "ఒక కోచింగ్ సెంటర్ యజమాని పరీక్ష వాయిదా వేయాలంటూ ఆమరణ నిరాహార దీక్ష చేస్తున్నడు. ఆయన ఏ పరీక్ష రాస్తున్నడని అడిగితే.. ఆయనకు కోచింగ్ సెంటర్ ఉందని, డీఎస్సీని రెండు నెలలు వాయిదా వేస్తే రూ.100 కోట్లు లాభం వస్తుందన్నట్లు చెబుతున్నారు. మరో ఇద్దరు కూడా ఇతరత్రా రాజకీయ కారణాలతోనే దీక్షలు చేస్తున్నరు" అని సీఎం రేవంత్‌రెడ్డి వ్యాఖ్యానించారు.

ఇక వారానికొక జిల్లాలో
సీఎం పర్యటన

నేడు రంగారెడ్డి జిల్లాకు సీఎం రేవంత్

హైదరాబాద్, జూలై 13 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఇక నుంచి వారానికొక జిల్లాలో పర్యటించనున్నారు. కలెక్టర్లు కార్యాలయాలకే పరిమితంకాకుండా ప్రజలతో మమేకం కావాలని ప్రభుత్వం ఆదేశించిన నేపథ్యంలో సీఎం కూడా వారానికొక జిల్లాలో పర్యటించేలా ప్రణాళిక సిద్ధం చేశారు. ప్రజలతో కలిసి పని చేసినప్పుడే ప్రభుత్వంపై ప్రజలకు విశ్వాసం పెరుగుతుందని సర్కారు భావిస్తోంది. ఈ నేపథ్యంలో సీఎం జిల్లాల పర్యటనకు శ్రీకారం చుడుతున్నారు. ఇందులో భాగంగా ఆదివారం రంగారెడ్డి జిల్లా అబ్దుల్లాపూర్‌మెట్ మండలంలో ఆయన పర్యటించనున్నారు. లష్కర్‌గూడలో జరిగే సభలో సీఎం పాల్గొననున్నందున దీనికి సంబంధించిన ఏర్పాట్లను బీసీ సంక్షేమ, రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్.. ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డితో కలిసి శనివారం పరిశీలించారు. రాష్ట్రవ్యాప్తంగా కల్లు గీత కార్మికుల భద్రత కోసం బీసీ వెల్ఫేర్ ఆధ్వర్యంలో కాటమయ్య రక్షణ కవచాలను పంపిణీ చేయనున్నారు. ఇందుకు సంబంధించి లష్కర్‌గూడలో ఆదివారం ఉదయం 11 గంటలకు ప్రారంభమయ్యే కార్యక్రమంలో సీఎం రేవంత్‌రెడ్డి ముఖ్య అతిథిగా హాజరై పలువురు మంత్రులతో కలిసి కాటమయ్య రక్ష కిట్లను అందజేయనున్నారు. సుమారు 60 మంది గీత కార్మికులకు సీఎం చేతుల మీదుగా వీటి పంపిణీ చేయనున్నారు. అనంతరం వారితో కలిసి సహ పంక్తి భోజనం చేయనున్నారు. ఈ కార్యక్రమంలో సుమారు వెయ్యి మంది గీత కార్మికులతోపాటు పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొననున్నారు.

రిప్రజెంటేషన్ల నుంచి పోస్టింగ్ ఇచ్చే స్థాయికి వచ్చా: రేవంత్

"నేను జడ్పీటీసీగా ఉన్నప్పుడు ప్రస్తుత సీపీ శ్రీనివాస్‌రెడ్డి మా జిల్లా ఎస్పీగా ఉన్నారు. సమస్యల పరిష్కారం కోసం ఆయనకు రిప్రజెంటేషన్లు ఇచ్చేవాడిని. సరిగ్గా 15 ఏళ్ల తర్వాత నేను సీఎంను అయ్యాను. అదే శ్రీనివాస్‌రెడ్డికి ఇప్పుడు నేనే పోస్టింగ్ ఇచ్చాను. లక్ష్యంతో పనిచేస్తే అనుకున్నది సాధిస్తారు. అందుకు నేనే నిదర్శనం" అని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అన్నారు. శనివారం 'డ్రగ్స్ నియంత్రణ, మహిళా భద్రతలో వాలంటీర్లు' అనే అంశంపై జేఎన్‌టీయూలో ఎన్ఎస్ఎస్ వాలంటీర్లు, పోలీసు ఉన్నతాధికారులతో సీఎం సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రాష్ట్రంలో డ్రగ్స్ నిర్మూలనపై ప్రతి ఒక్కరూ సీరియస్‌గా దృష్టి సారించాల్సిన అవసరం ఉందన్నారు. కొన్ని పెద్ద పెద్ద స్కూళ్లల్లో విద్యార్థులు పుస్తకాలు పెట్టుకునేందుకు కల్పించే ర్యాక్ సదుపాయంలో గంజాయి చాక్లెట్లు, ఇతర మత్తు పదార్థాలు బయట పడుతుండటం ఆందోళనకరమన్నారు. తెలంగాణను డ్రగ్స్ రహిత రాష్ట్రంగా మార్చేందుకు ప్రభుత్వం దృఢ సంకల్పంతో ఉందని, డ్రగ్స్‌పై యుద్ధం ప్రకటించిందని అన్నారు. డ్రగ్స్ నిర్మూలనలో పోలీసులతోపాటు మోరల్ పోలీసింగ్ కీలక పాత్ర పోషించాలని పిలుపునిచ్చారు. కాలేజీల్లో పాఠ్యాంశాలతోపాటు మోరల్ పోలీసింగ్ నేర్పించాలని సూచించారు. డ్రగ్స్ నిర్మూలనకు ఎన్ఎస్ఎస్ వాలంటీర్లు సహకరించాలని కోరారు. సమాజంలో పెడ ధోరణులకు టెక్నాలజీ కూడా ఓ కారణమని, పిల్లలను మొబైల్ ఫోన్లకు దూరంగా ఉంచితే చాలా సమస్యలు పరిష్కారమవుతాయని అన్నారు. విద్యార్థులు చదువుతోపాటు క్రీడలకు ప్రాధాన్యం ఇవ్వాలని సీఎం సూచించారు. తమ ప్రభుత్వం క్రీడలకు మరింత ప్రోత్సాహం ఇవ్వాలని నిర్ణయించిందని, ప్రతి అసెంబ్లీ నియోజకవర్గంలో ఒక స్టేడియం ఏర్పాటు చేయాలని భావిస్తోందని చెప్పారు. ఈ కార్యక్రమంలో డీజీపీ జితేందర్, ప్రభుత్వ ముఖ్య కార్యదర్శి బుర్రా వెంకటేశం, పోలీస్ కమిషనర్లు కె.శ్రీనివాస్‌రెడ్డి, అవినాష్ మహంతి, సుధీర్‌బాబు తదితరులు పాల్గొన్నారు.

వారంలో 'అమృత్' టెండర్లు
రద్దుచేయాలి

▸ రేవంత్ సోదరుడు, బావమరిదికి కాంట్రాక్టులు

▸ రద్దు చేయకపోతే ఉద్యమం: బీజేఎల్పీ నేత ఏలేటి

హైదరాబాద్, జూలై 13 (ఆంధ్రజ్యోతి): అమృత్ పథకం పనులకు సంబంధించి పిలిచిన టెండర్లను వారం రోజుల్లో రద్దు చేసి, గ్లోబల్ టెండర్లను పిలవాలని బీజేఎల్పీ నేత ఏలేటి మహేశ్వర్‌రెడ్డి రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. కాంట్రాక్టు కేటాయింపులో అవినీతి జరిగిందని, మూడు కంపెనీలకు 40శాతం అధిక రేటుతో పనులు కట్టబెట్టారని ఆరోపించారు. సీఎం రేవంత్ బావమరిది సృజన్ కంపెనీ శోధకి రూ.1,110కోట్లు, రేవంత్ సోదరుడు తిరుపతిరెడ్డి కంపెనీ కేఎల్ఆర్‌కు రూ.1,135కోట్లు, మరో ప్రముఖ కంపెనీకి రూ.1,200కోట్ల అంచనాతో అమృత్ స్కీం పనులను ప్రభుత్వం కట్టబెట్టిందని చెప్పారు. గ్లోబల్ టెండర్లు పిలిస్తే కనీసం 30శాతం తక్కువకు పనులు చేయించేందుకు తాము సిద్ధంగా ఉన్నామని ప్రభుత్వానికి మహేశ్వర్‌రెడ్డి సవాల్ చేశారు. వారం రోజుల్లో టెండర్లు రద్దు చేయకపోతే బీజేపీ ఉద్యమం చేస్తుందని హెచ్చరించారు. రేవంత్ బావమరిది సృజన్ అటు బీఆర్ఎస్ ఎమ్మెల్సీ కవితతో కలిసి వ్యాపారం చేస్తారని.. ఇక్కడ ఆయనకు కాంగ్రెస్ కాంట్రాక్టులు ఇస్తుందని అన్నారు. రేవంత్ బాబా-11 దొంగలు మాదిరి ఎవరికి తోచినంత వారు బీ ట్యాక్స్, యూ ట్యాక్స్, డబుల్ ఆర్, ట్రిపుల్ ఆర్ ట్యాక్స్ పేరిట రాష్ట్రాన్ని భ్రష్టుపట్టిస్తున్నారన్నారు.

మైనార్టీ గురుకులాల్లో బదిలీలపై హైకోర్టు స్టే

హైదరాబాద్, జూలై 13 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ మైనార్టీ సంక్షేమ గురుకుల విద్యాసంస్థల సొసైటీ(టీజీఎండబ్ల్యూఆర్ఈఐఎస్) ఆధ్వర్యంలో నిర్వహించే గురుకులాల ఉపాధ్యాయుల బదిలీలపై హైకోర్టు స్టే విధిస్తూ మధ్యంతర ఉత్తర్వులు జారీచేసింది. ఈ గురుకులాల్లో పనిచేసే ప్రిన్సిపాళ్లు, జూనియర్ లెక్చరర్లు, పీజీటీ, టీజీటీ, లైబ్రేరియన్, ఇతర సిబ్బంది బదిలీలకు ప్రభుత్వం జూలై 6న మార్గదర్శకాలను విడుదల చేసింది. ఈ మార్గదర్శకాలు చెల్లవని పేర్కొంటూ పీజీటీ జి.హేమలత, ఇతర ఉద్యోగులు వేర్వేరుగా హైకోర్టులో పిటిషన్లు దాఖలు చేశారు. ఈ పిటిషన్లపై జస్టిస్ పుల్ల కార్తీక్ ధర్మాసనం విచారణ చేపట్టింది. పిటిషనర్ల తరఫున న్యాయవాది ఫణిభూషణ్ వాదనలను వినిపిస్తూ.. మైనార్టీ గురుకుల సొసైటీని తెలంగాణ పబ్లిక్ ఎంప్లాయిమెంట్ ఆర్డర్స్-2018 పరిధిలోకి తెస్తూ 2022లో ప్రభుత్వం మెమో జారీచేసిందని.. దానిపై హైకోర్టు డివిజన్ బెంచ్ స్టే విధించిందని గుర్తుచేశారు. వాదనలను నమోదు చేసుకున్న ధర్మాసనం.. మైనార్టీ గురుకుల సొసైటీ తెలంగాణ పబ్లిక్ ఎంప్లాయిమెంట్ ఆర్డర్స్-2018 పరిధిలో లేదని.. దానిపై హైకోర్టు డివిజన్ బెంచ్ స్టే కొనసాగుతోందని వ్యాఖ్యానించింది. డివిజన్ బెంచ్ స్టేను వెకేట్ చేయించుకోకుండా బదిలీలు చేపట్టడం చెల్లదని స్పష్టంచేసింది. తదుపరి విచారణ(ఈనెల 18) వరకు బదిలీల విషయంలో ఎలాంటి చర్యలు చేపట్టరాదని మధ్యంతర స్టే విధించింది.



'ఎక్స్' వేదికగా కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి పోస్ట్ చేసిన చర్లపల్లి స్టేషన్ ఫొటోలు

చర్లపల్లి స్టేషన్ నిర్మాణ పనులు 98% పూర్తి

▸ కేంద్ర బొగ్గు, గనుల శాఖ మంత్రి కిషన్‌రెడ్డి

▸ ఆరేళ్లుగా కొనసాగుతున్న విస్తరణ పనులు

న్యూఢిల్లీ/కుషాయిగూడ, జూలై 13 (ఆంధ్రజ్యోతి): చర్లపల్లి రైల్వే స్టేషన్ నిర్మాణ పనులు 98 శాతం పూర్తయ్యాయని కేంద్ర బొగ్గు, గనుల శాఖ మంత్రి కిషన్‌రెడ్డి తెలిపారు. రూ.434 కోట్ల వ్యయంతో నిర్మితమవుతున్న ఈ స్టేషన్ రాష్ట్రంలోనే నాలుగో అతి పెద్ద రైల్వే స్టేషన్‌గా అవతరించబోతుందని వెల్లడించారు. ఈ మేరకు చర్లపల్లి రైల్వే స్టేషన్ చిత్రాలను శనివారం ఎక్స్‌లో పోస్ట్ చేశారు. ఈ స్టేషన్ అందుబాటులోకి వచ్చాక హైదరాబాద్, సికింద్రాబాద్, కాచిగూడ రైల్వే స్టేషన్లలో రద్దీ తగ్గుతుందని కిషన్‌రెడ్డి పేర్కొన్నారు. కాగా, దాదాపు ఆరేళ్లుగా కొనసాగుతోన్న చర్లపల్లి రైల్వే టర్మినల్ పనులు తుది దశకు చేరుకున్నాయి. చర్లపల్లి భరత్ నగర్ వద్ద నిర్మించిన రైల్వే ఓవర్ బ్రిడ్జి కూడా నిర్మాణం పూర్తి చేసుకొని వాహనదారులకు అందుబాటులోకి వచ్చింది. రైల్వే స్టేషన్ ప్రధాన ద్వారం నుంచి గోకుల్ నగర్, మల్లాపూర్, ఎన్ఎఫ్‌సీ బ్రిడ్జి వరకు వంద అడుగుల రోడ్డు నిర్మాణం చేపట్టాల్సి ఉంది. ఇందుకు భూసేకరణ కోసం అధికారులు కసరత్తు చేస్తున్నారు. గత అసెంబ్లీ ఎన్నికలకు ముందే ఈ రైల్వే స్టేషన్‌ను ప్రారంభించాలని భావించినా, సాంకేతికపరమైన కొన్ని పనులు పూర్తికాకపోవడంతో మరి కొంతకాలం వేచి ఉండాల్సిన పరిస్థితి నెలకొంది. అయితే, శనివారం కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి 98 శాతం పనులు పూర్తయ్యాయని తెలిపారు. కానీ, స్టేషన్‌ను ఎప్పుడు ప్రారంభిస్తారో చెప్పలేదు. దీంతో ఈ విషయం మరోసారి చర్చనీయాంశమైంది.

పది ప్రభుత్వాలను
కూల్చిన చరిత్ర బీజేపీది..

▸ ఫిరాయింపులపై మీరా నీతులు చెప్పేది?

▸ కిషన్‌రెడ్డిపై కాంగ్రెస్ ఎంపీ చామల ధ్వజం

▸ విద్యుత్తు సంస్థలు ప్రైవేట్‌కు అప్పగిస్తే పోరాటమే..: మల్లు రవి

హైదరాబాద్/హైదరాబాద్ సిటీ/నాగర్‌కర్నూల్ టౌన్, జూలై 13 (ఆంధ్రజ్యోతి): 'దేశంలో ప్రజాస్వామ్యయుతంగా ఏర్పాటైన 10 ప్రభుత్వాలను కూల్చేసిన చరిత్ర బీజేపీది.. సుప్రీంకోర్టుతో చీవాట్లు తింటూనే.. ఈడీ, సీబీఐ, ఐటీలతో బెదిరించి ఎమ్మెల్యేలను పార్టీలో చేర్చుకుంది. ఫిరాయింపులపై నీతులు చెబుతున్న కేంద్రమంత్రి కిషన్‌రెడ్డికి ఇవి కనిపించట్లేదా?' అంటూ కాంగ్రెస్ ఎంపీ చామల కిరణ్‌కుమార్‌రెడ్డి ప్రశ్నించారు. శనివారం గాంధీభవన్‌లో ఆయన మీడియాతో మాట్లాడుతూ.. మధ్యప్రదేశ్‌లో కాంగ్రెస్ టికెట్‌పై గెలిచిన మోహన్‌యాదవ్‌ను మంత్రివర్గంలోకి తీసుకున్న అక్కడి బీజేపీ సర్కారు.. ఆయనతో ఇప్పటికీ రాజీనామా చేయించలేదని విమర్శించారు. అది రాజ్యాంగ అవహేళన కిందకు రాదా అంటూ కిషన్‌రెడ్డిని ప్రశ్నించారు. బీఆర్ఎస్ సైతం.. టీడీపీ నుంచి గెలిచిన తలసాని శ్రీనివాస్ యాదవ్‌ను రాజీనామా చేయించకుండానే మంత్రివర్గంలోకి తీసుకుందని గుర్తు చేశారు. కవితకు బెయిల్ కోసం మోదీ కాళ్లు పట్టుకోవడానికి కేసీఆర్ కుటుంబం సిద్ధమైందని ఆరోపించారు. విద్యుత్తు సంస్థలను ప్రైవేట్‌కు అప్పగిస్తే ఊరుకోబోమని, విద్యుత్తు ఉద్యోగులతో కలసి కేంద్రంపై పోరాడుతామని కాంగ్రెస్ ఎంపీ మల్లు రవి అన్నారు. ప్రభుత్వ సంస్థలున్నప్పుడే ప్రజా సంక్షేమం సాధ్యమవుతుందని.. రైతులకు ఉచిత కరెంట్, 200 యూనిట్ల ఉచిత విద్యుత్తు కాంగ్రెస్‌తోనే సాధ్యమైందని చెప్పారు. మాజీ ప్రధాని ఇందిరాగాంధీ పాలనలో అప్పటి దేశ పరిస్థితుల దృష్ట్యా విధించిన ఎమర్జెన్సీని రాజ్యాంగ సంవిధాన్ హత్య దివస్‌గా అభివర్ణిస్తున్న కేంద్ర హోంమంత్రి అమిత్ షా.. బీజేపీ పాలనలో జరిగిన గోద్రా, మణిపూర్ అల్లర్లను ఏమంటారో సమాధానం చెప్పాలని కాంగ్రెస్ సీనియర్ నేత వీహెచ్ డిమాండ్ చేశారు. తాను చేసే పనులకు ఒక న్యాయం, ఇతరులకు మరో న్యాయం అన్నట్లుగా బీజేపీ వ్యవహరిస్తోందని విమర్శించారు. అప్పటి ఇందిరా గాంధీ ప్రభుత్వంపై ఎమర్జెన్సీ ప్రభావం ఏమాత్రం లేదని, 1977లో ఓడిన మూడేళ్లకే 1980లో కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన సంగతి బీజేపీ నేతలు గుర్తుంచుకోవాలన్నారు.

ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలు రూ.4,769 కోట్లు

▸ ఇంటర్ నుంచి ఇంజనీరింగ్ వరకు మూడేళ్ల నుంచి పెండింగ్‌లోనే..

▸ వన్‌టైమ్ సెటిల్‌మెంట్ కింద చెల్లిస్తామన్న సీఎం

▸ స్పష్టత ఇవ్వాలని కోరుతున్న కాలేజీల యాజమాన్యాలు

హైదరాబాద్, జూలై 13 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో ఫీజు రీయింబర్స్‌మెంట్ కింద దాదాపు రూ.4,769 కోట్లు బకాయిలు పేరుకుపోయాయి. గత ప్రభుత్వం సకాలంలో చెల్లించకపోవడంతో బకాయిలు పోగయ్యాయి. ఇంటర్ నుంచి ఇంజనీరింగ్ వరకు మూడేళ్లుగా రీయింబర్స్‌మెంట్ కింద చెల్లింపులు చేయలేదు. 2021-22లో రూ.326కోట్లు, 2022-23లో రూ.1,830కోట్లు, 2023-24లో రూ.2,250కోట్లతో పాటు ప్రొఫెషనల్ కోర్సులకు సంబంధించి 2020-21లో రూ.250 కోట్లు, మెస్‌చార్జీలకు రూ.500 కోట్లు కలిపి దాదాపు రూ.5,156 కోట్లకుపైగా బకాయిలున్నాయి. గతేడాది డిసెంబరులో కాంగ్రెస్ అధికారంలోకి రాగానే పాత బకాయిల కింద రూ.387కోట్లు చెల్లించింది. ఇవి పోగా సుమారు రూ.4,769 కోట్ల బకాయిలున్నట్టు సమాచారం. మరోవైపు ప్రస్తుత విద్యా సంవత్సరానికి సంబంధించిన చెల్లింపుల కోసం రూ.2,250కోట్లు అవసరంకానున్నాయి. ఈ నేపథ్యంలో శనివారం హైదరాబాద్‌లోని జేఎన్టీయూలో జరిగిన సమావేశంలో ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిల చెల్లింపులపై సీఎం రేవంత్ చేసిన ప్రకటన చర్చనీయాశంగా మారింది. ఈ విద్యా సంవత్సరం నుంచి సకాలంలో రీయింబర్స్‌మెంట్ చెల్లింపులు ఉంటాయని, పాత బకాయిల చెల్లింపును వన్‌టైమ్ సెటిల్‌మెంట్ కింద చేస్తామన్నారు. దీనిపై యాజమాన్యాలు ఒక ఆలోచనకు వచ్చి తమకు తెలియజేస్తే దానికి కట్టుబడి ఉంటామని సీఎం తెలిపారు. అయితే చెల్లింపులు బాగానే ఉన్నా.. వన్ టైమ్ సెటిల్‌మెంట్ విధానం కొత్తగా ఉందని ఇంజనీరింగ్ కాలేజీల యాజమాన్యాలు అంటున్నాయి. ఇప్పటికే సిబ్బందికి పూర్తిస్థాయి జీతాలిచ్చామని, ఇప్పుడు వన్‌టైమ్ సెటిల్‌మెంట్ కింద ఓ ఆలోచనతో రావాలనడంపై అయోమయంలో ఉన్నట్టు పేర్కొన్నాయి. దీనిపై స్పష్టతివ్వాలని కోరుతున్నాయి. కాగా గత ప్రభుత్వం రెండున్నరేళ్ల నుంచి పెండింగ్‌లో ఉంచిన విద్యా బకాయిలను చెల్లించేందుకు తమ ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందని సీఎం రేవంత్‌రెడ్డి ప్రకటించడాన్ని స్వాగతిస్తున్నట్టు తెలంగాణ ప్రైవేటు విద్యా సంస్థల అసోసియేషన్ అధ్యక్షులు గౌరి సతీష్ 'ఆంధ్రజ్యోతి'కి చెప్పారు. త్వరితగతిన చెల్లింపునకు చర్యలు చేపట్టాలని కోరారు.

డిప్యూటీ తహసీల్దార్ వేధింపులు తాళలేక..
రికార్డు అసిస్టెంట్ ఆత్మహత్య


ప్రశాంత్ (ఫైల్)

రామారెడ్డి, జూలై 13: డిప్యూటీ తహసీల్దార్ వేధింపులు తాళలేక ఓ రికార్డు అసిస్టెంట్ ఆత్మహత్య చేసుకున్నాడు. కామారెడ్డి జిల్లా రామారెడ్డి మండలం కన్నాపూర్ శివారులో శనివారం జరిగిన ఈ ఘటనలో తెడ్డు ప్రశాంత్(28) అనే యువకుడు బలవన్మరణం పొందాడు. పోలీసుల కథనం ప్రకారం.. కామారెడ్డి మండలం గుడెం గ్రామానికి చెందిన తెడ్డు ప్రశాంత్ తాడ్వాయి మండలంలోని తహసీల్దార్ కార్యాలయంలో రికార్డు అసిస్టెంట్‌గా పని చేస్తున్నాడు. ప్రశాంత్‌కు భార్య, ఇద్దరు కుమార్తెలు, ఓ కుమారుడు(ఇటీవల జన్మించాడు) ఉన్నారు. అయితే, కన్నాపూర్ శివారులో అటవీ ప్రాంతంలోని ఓ చెట్టుకు ఉరి వేసుకుని ప్రశాంత్ శనివారం ఉదయం ఆత్మహత్య చేసుకున్నాడు. దీనిపై స్థానికుల ద్వారా సమాచారం అందుకున్న పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాన్ని పరిశీలించగా ఓ లేఖ(సూసైడ్ నోట్) లభ్యమైంది. తమ కార్యాలయంలో పని చేసే డిప్యూటీ తహసీల్దార్ వెంకటేశ్ అనవసరమైన పనులు చెబుతూ ఒత్తిడికి గురి చేస్తూ వేధింపులకు పాల్పడుతున్నాడని ప్రశాంత్ ఆ లేఖలో రాశాడు. కాగా, డిప్యూటీ తహసీల్దార్ తీరు వల్ల ఇబ్బంది పడుతున్నానని ప్రశాంత్ తమతో చెప్పుకుని పలుమార్లు బాధపడ్డాడని అతని కుటుంబసభ్యులు కూడా తెలిపారు. ప్రశాంత్ భార్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసిన పోలీసులు దర్యాప్తు చేపట్టారు.

ఐటీ కొలువుల కష్టాలు!

- ఈ ఏడాది ప్రాంగణ నియామకాలు తక్కువే
- ప్రముఖ కాలేజీల్లోనూ అంతంతమాత్రమే
- ఎంపికైన వారూ ఎక్కువగా బెంచ్‌లకే!!
- 4 నెలలు గడుస్తున్నా.. కంపెనీల్లోకి ప్రవేశాల్లేవ్
- మరో ఏడాది పాటు ఇలాగే ఉంటుందని అంచనా!



హైదరాబాద్, జూలై 13 (ఆంధ్రజ్యోతి): ఇంజనీరింగ్ విద్య పూర్తవుతున్న సమయంలోనే విద్యార్థులకు ఐటీ సంస్థలు ప్రాంగణ నియామకాల పేరిట కొలువులు ఇస్తుంటాయి. విద్యార్థుల ప్రతిభ ఆధారంగా వేతన ప్యాకేజీలూ భారీగా ఉంటాయి. అలాంటి ఐటీ ఉద్యోగాలు ఇప్పుడు ఇబ్బందుల్లో ఉన్నాయి. ఓ వైపు ఈ ఏడాది ప్రాంగణ నియామకాలు (క్యాంపస్ ప్లేస్‌మెంట్లు) తక్కువగా ఉండగా.. మరోవైపు ఉద్యోగాలకు ఎంపికైన వారు బెంచ్‌లకే పరిమితం అవుతున్నారు. ఏడాది కాలంగా ఇదే పరిస్థితి కొనసాగుతోంది. మరో ఏడాది పాటు ఈ సంక్షోభం తప్పదని అంచనా వేస్తున్నారు. గత ఏడాదితో పోలిస్తే ప్రస్తుతం క్యాంపస్ ప్లేస్‌మెంట్లు గణనీయంగా పడిపోయాయి. అనేక ఐటీ కంపెనీలు ప్రాంగణ నియామకాలకు దూరంగా ఉంటున్నాయి. దాంతో పేరుమోసిన కాలేజీల్లో ఇంజనీరింగ్ కోర్సులను పూర్తి చేసిన విద్యార్థులకూ ఉద్యోగ అవకాశాలు రావడం లేదు. సాధారణంగా ఏటా డిసెంబరులో తొలి విడత; ఫిబ్రవరి, మార్చిలో రెండో విడతగా ఆయా విద్యా సంస్థల్లో ప్రాంగణ నియామకాలు జరుగుతాయి. బహుళజాతి కంపెనీలతో పాటు ప్రఖ్యాత ఐటీ సంస్థలు కూడా కాలేజీల్లో నిర్వహించే ప్లేస్‌మెంట్లలో పాల్గొని విద్యార్థులను తమ సంస్థల్లోకి తీసుకోవడానికి పోటీ పడతాయి. ఈ పోటీలో అత్యుత్తమ మానవ వనరులను దక్కించుకోవడానికి వీలుగా అభ్యర్థులకు ఆఫర్ లెటర్లను ఇస్తాయి. ప్రస్తుతం ఆ పరిస్థితి కనిపించడం లేదు. ఏటా సాధారణంగా జరిగే ప్లేస్‌మెంట్లతో పోలిస్తే గత డిసెంబరులో అభ్యర్థులకు వచ్చిన అవకాశాలు సగమే ఉన్నాయి. ఫిబ్రవరి, మార్చి నెలల్లో జరిగిన ప్రాంగణ నియామకాల్లోనూ పరిస్థితి మెరుగు పడలేదు. చాలా కంపెనీలు తమ భవిష్యత్తు అవసరాలతో పాటు విస్తరణ ప్రాజెక్టుల కోసం కూడా ముందుగానే ఉద్యోగులను ఎంపిక చేసుకుంటాయి. కొత్తగా వచ్చే ప్రాజెక్టుల ఆధారంగా ఎంపిక చేసుకున్న అభ్యర్థులను తమ సంస్థల్లోకి చేర్చుకుంటాయి. అయితే.. ఈ ఏడాది అందుకు భిన్నమైన పరిస్థితులు కనిపిస్తున్నాయి.

ఇప్పటికీ చేర్చుకోలేదు..

గత డిసెంబరులో ప్రాంగణ నియామకాల్లో ఎంపికైన వారిలో కొంత మందిని ఇప్పటికీ ఉద్యోగాల్లో చేర్చుకోలేదు. ఫిబ్రవరి, మార్చిలో ఎంపికైన అభ్యర్థుల పరిస్థితి కూడా అలాగే ఉంది. ఆఫర్ లెటర్ ఇచ్చినా.. వారిని ఇంకా ఉద్యోగాల్లో చేర్చుకోకపోవడంతో బెంచ్‌లకే పరిమితం అవుతున్నారు. ఇలాంటి వారు కొత్త ఉద్యోగాలను వెతుక్కోలేక.. వచ్చిన ఉద్యోగంలో చేరలేక సతమతమవుతున్నారు. ఏ క్షణంలోనైనా తాము ఆయా సంస్థల్లో చేరాల్సి ఉంటుందనే అభిప్రాయంతో ఉద్యోగాలకు ఎంపికైన అభ్యర్థులు నాలుగైదు నెలల నుంచి హైదరాబాద్, ఇతర పట్టణాల్లో నివాసం ఉంటున్నారు. రోజులు గడుస్తున్న కొద్దీ ఈ ఉద్యోగాల పట్ల వారికి అనుమానం కలుగుతోంది. అభ్యర్థులు ఆర్థిక పరిస్థితుల కారణంగా ఐదారుగురు కలిసి ఒక గదిని అద్దెకు తీసుకుని నెట్టుకొస్తున్నారు. ఐటీ ఉద్యోగాలపై ఆశలు సన్నగిల్లుతుండడంతో ప్రత్యామ్నాయ మార్గాలను అన్వేషిస్తున్నారు. మరో ఏడాది పాటు పరిస్థితి ఇలాగే ఉంటుందని నిపుణులు అంచనా వేస్తున్నారు. ముఖ్యంగా అమెరికాలో పరిస్థితి బాగా లేకపోవడంతో దాని ప్రభావం ఇక్కడ పడుతోందని చెబుతున్నారు. రాష్ట్రంలో పేరుమోసిన ఎన్ఐటీ, ఐఐటీ వంటి కాలేజీలతో పాటు ప్రముఖ ఇంజనీరింగ్ కాలేజీల్లో చదువుకున్న అభ్యర్థులకు కూడా ఈ సమస్య తప్పడం లేదు. ఉదాహరణకు వరంగల్‌లోని ఎన్ఐటీలో బీటెక్, ఎంటెక్ ముఖ్యంగా సీఎస్ఈ కోర్సులను పూర్తి చేసిన వారికి 99-100 శాతం ప్లేస్‌మెంట్ లభిస్తుంది. కానీ, ఈ ఏడాది అలాంటి పరిస్థితి కనిపించడం లేదు. ఈ కాలేజీలో ఈ ఏడాది సాధారణం కంటే 10 శాతం ప్లేస్‌మెంట్లు తగ్గిపోయాయి. మెకానికల్, సివిల్ రంగాల్లో అయితే ఇంకా తగ్గాయి. ఈ కాలేజీకి ఏటా సుమారు 300 కంపెనీలు ఉద్యోగాలను ఇవ్వడానికి ముందుకొస్తాయి. ఈ ఏడాది మాత్రం అందులో 60 కంపెనీలే ఆసక్తి చూపాయి. ఐఐటీ హైదరాబాద్‌లోనూ ఇదే పరిస్థితి నెలకొంది. గత ఏడాది ఈ కాలేజీ నుంచి సుమారు 335 జాతీయ, అంతర్జాతీయ కంపెనీలు విద్యార్థులను ఎంపిక చేసుకోగా, ఈ సారి మాత్రం సగానికి పడిపోయింది. ఉద్యోగాలు పొందే అభ్యర్థుల సంఖ్యతో పాటు వారికి చెల్లించే ప్యాకేజీలు కూడా భారీగా తగ్గాయి. ఉస్మానియా, జేఎన్‌టీయూలతో పాటు పలు ప్రముఖ ప్రైవేట్ ఇంజనీరింగ్ కాలేజీల్లోనూ ప్రాంగణ నియామకాలు గణనీయంగా పడిపోయాయి. కొన్ని కంపెనీలు మాత్రం ఎంపికైన అభ్యర్థుల నుంచి ఉచిత సేవలను పొందుతున్నాయి. శిక్షణ పేరిట వారితో పని చేయించుకుంటున్నా.. జీతాలు చెల్లించడం లేదన్న ఆరోపణలు ఉన్నాయి. మరికొన్ని సంస్థలు మాత్రం ఎంపిక చేసుకున్న అభ్యర్థులను ఇప్పటికీ ఉద్యోగాల్లోకి ఆహ్వానించడం లేదు. దాంతో వారంతా బెంచ్‌లకే పరిమితం అవుతున్నారు.

ఒడిశాలో రోడ్డు ప్రమాదం.. హైదరాబాద్‌కు చెందిన
ముగ్గురి మృతి

- 15 మందికి పైగా గాయాలు
- ఈ నెల 8న నగరం నుంచి బస్సులో తీర్థయాత్రలకు వెళ్లిన 25 మంది
- శనివారం తెల్లవారుజామున ప్రమాదం

చార్మినార్/హయత్‌నగర్/చంద్రాయణగుట్ట, జూలై 13 (ఆంధ్రజ్యోతి): ఒడిశాలో శనివారం తెల్లవారుజామున జరిగిన ఘోర రోడ్డు ప్రమాదంలో హైదరాబాద్ పాతబస్తీకి చెందిన ముగ్గురు చనిపోయారు. రాష్ట్రానికే చెందిన మరో 15మందికి గాయాలయ్యాయి. హైదరాబాద్‌లోని ఉప్పుగూడకు చెందిన ఉదయ్ సింగ్ ఠాకూర్(52) వృత్తిరీత్యా డ్రైవర్. ప్రజలను తీర్థయాత్రలకు కూడా తీసుకువెళ్తుంటాడు. ఈ నేపథ్యంలోనే దానయ్యనగర్, కందికల్ గేట్, నగరంలోని పలు ప్రాంతాలకు చెందిన 25 మందితో కలసి ఈశాన్య భారతంలోని దేవాలయాల సందర్శనకు టూర్ ప్లాన్‌ను సిద్ధం చేశాడు 12-15 రోజుల పాటు జరిగే ఈ యాత్ర కోసం శివాజీనగర్‌కు చెందిన నిత్యశ్రీ ట్రావెల్స్ నుంచి 22 సీటర్ల బస్సును(ఏపీ29 వీ 9277) మాట్లాడాడు. బస్సును నడపడానికి మల్లేశ్ అనే మరో డ్రైవర్‌తో ఒప్పందం కుదుర్చుకున్నాడు. ఈ నెల 8వ తేదీన ఉప్పుగూడ నుంచి ఉదయ్‌సింగ్ కుటుంబసభ్యులతో పాటు మరో 19మంది ఈశాన్య భారత పర్యటనకు వెళ్లారు. 12న ఒడిశాలోని పూరీ జగన్నాథ దేవాలయంలో దర్శనం తర్వాత బాలాపూర్ మీదుగా బిహార్‌కు వెళ్తున్న క్రమంలో మయూర్‌భంజ్ జిల్లా బెత్నోనటి పోలీస్ స్టేషన్ వీరి బస్సును రాంగ్‌రూట్‌లో వచ్చిన ఓ ట్రక్కు ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో ఉదయ్‌సింగ్, అతని సోదరుడు ఉప్పలయ్య(70), చెల్లెలు క్రాంతిబాయి(62) చనిపోయారు. డ్రైవర్ మల్లేశ్‌తో పాటు బస్సులో ఉన్న పలువురికి గాయాలయ్యాయి. గాయపడిన వారిని బెత్నోనటి మెడికల్ ఆసుపత్రికి తీసుకువెళ్లి చికిత్స అందిస్తున్నారు. ఒడిశాలో బస్సు ప్రమాదంపై కేంద్రహోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. ప్రమాణికుల ఆరోగ్య పరిస్థితిపై స్థానిక జిల్లా అధికారులతో ఆయన మాట్లాడినట్లు తెలిసింది. కాగా, ప్రమాదంలో చనిపోయినవారి మృతదేహాలను వెంటనే వారి స్వస్థలాలకు పంపించాలని, గాయపడిన వారికి మెరుగైన చికిత్స అందించాలని హోంమంత్రిత్వ శాఖ కార్యాలయం ఒడిశా అధికారులను కోరింది.

Printed and Published by Koganti Venkata Seshagiri Rao on behalf of Aamoda Publications Pvt. Ltd., printed at Aamoda Press, H.No.5-9-287/10 & 11, Plot No. 53 & 54, Prasanth Towers, Rajeev Gandhi Nagar, Moosapet, Kukatpally (Mandal), Kukatpally Municipality, Ranga Reddy District and Published at Plot No.76, Ashwini Layout, Huda Heights, Road No.70, Jubilee Hills, Hyderabad-500033. Editor: K. Srinivas. Fax No. 23558288, Phone No: 23558233 / 44 / 55, Regd. No.H/HD 674, RNI No.44903 / 86. Managing Director: Vemuri Radha Krishna, Founder: K.L.N.Prasad.


ఆంధ్రజ్యోతి
నవ్య దృశ్యం
ఆదివారం • 14 జూలై 2024

ప్రభాస్ ఫౌజీ?



ప్రస్తుతం 'కల్కి 2898 ఏడీ' చిత్రం ఘన విజయాన్ని ఆస్వాదిస్తున్నాడు ప్రభాస్. ప్రపంచ వ్యాప్తంగా ఈ సినిమాకు దక్కుతున్న ఆదరణ అభిమానులను సంతోషంలో ముంచెత్తుతోంది. ఇక త్వరలోనే ప్రభాస్ 'సలార్ 2' చిత్రం కోసం రంగంలోకి దిగబోతున్నారు. దీని తర్వాత ఆయన దర్శకుడు సందీప్‌రెడ్డి వంగాతో 'స్పిరిట్' చిత్రం చేయాల్సి ఉంది. వీటితో పాటు మైత్రీ మూవీ మేకర్స్ ప్రభాస్‌తో ఓ భారీ బడ్జెట్ చిత్రాన్ని ప్రకటించింది. పీరియాడిక్ యాక్షన్ థ్రిల్లర్‌గా ఈ చిత్రం తెరకెక్కుతోంది. హనూ రాఘవపూడి దర్శకత్వం వహిస్తున్న ఈ సినిమాకు మేకర్స్ 'ఫౌజీ' అనే టైటిల్‌ను అనుకుంటున్నట్లు పరిశ్రమలో వినిపిస్తోంది. ప్రభాస్ ఈ చిత్రంలో సైనికుడి పాత్రలో కనిపించనున్నారు కాబట్టి 'ఫౌజీ' టైటిల్ అయితే బావుంటుందని నిర్ణయానికి వచ్చారట. 1940వ దశకం నేపథ్యంలో సాగే ఈ కథలో ప్రభాస్ బ్రిటీష్ సైన్యంలో సిపాయిగా కనిపించనున్నారు. యాక్షన్ అంశాలతో పాటు మంచి ప్రేమకథను మేళవించి ఈ సినిమాను తీర్చిదిద్దుతున్నారు. ఇందులో ప్రభాస్‌కు జోడీగా మృణాల్ ఠాకూర్ నటిస్తున్నట్లు వార్తలు వచ్చాయి, కానీ అధికారికంగా ఖరారు కావాల్సి ఉంది.

మార్ ముంత... ఛోడ్ చింత





'మార్ ముంత... ఛోడ్ చింత' అంటున్నారు హీరో రామ్ పోతినేని. ఆయన హీరోగా దర్శకుడు పూరి జగన్నాథ్ తెరకెక్కిస్తున్న చిత్రం 'డబుల్ ఇస్మార్ట్'. గతంలో వీరిద్దరి కలయికలో వచ్చిన 'ఇస్మార్ట్ శంకర్' చిత్రానికి ఇది కొనసాగింపు. ఆగస్టు 15న విడుదలవుతోంది. ఇటీవలే చిత్రబృందం మ్యూజిక్ ప్రమోషన్స్‌ను ప్రారంభించింది. రెండో గీతాన్ని ఈ నెల 16న విడుదల చేయబోతున్నట్లు యూనిట్ శనివారం తెలిపింది. ఈ సందర్భంగా విడుదల చేసిన పోస్టర్‌లో రామ్ రెండు బాటిళ్ల కల్లును ఆస్వాదిస్తూ కనిపించారు. 'మార్ ముంత ఛోడ్ చింత' అనేది ఈ సిరీస్‌లో హీరో పాపులర్ డైలాగ్. ఈ పాట కూడా ఈ డైలాగ్‌తోనే ప్రారంభమవుతుంది. ఈ చిత్రంలో సంజయ్‌దత్ కీలకపాత్ర పోషిస్తున్నారు. రామ్ సరసన కావ్య థాపర్ హీరోయిన్‌గా కనిపించనున్నారు. ఈ చిత్రానికి మణిశర్మ సంగీతం అందిస్తున్నారు.

అమ్మోరు తల్లి మళ్లీ వస్తోంది



నయనతార అమ్మవారి పాత్రలో నటించిన 'మూకుత్తి అమ్మన్' చిత్రం 2020లో విడుదలై మంచి విజయాన్ని అందుకొంది. తెలుగులో 'అమ్మోరు తల్లి' పేరుతో విడుదలైంది. ప్రస్తుతం ఈ చిత్రానికి సీక్వెల్ తెరకెక్కుతోంది. కానీ ఈసారి నయనతారకు బదులు త్రిష అమ్మవారి పాత్ర పోషిస్తున్నారంటూ కొన్నాళ్లుగా కోలీవుడ్ మీడియాలో ప్రచారమౌతోంది. అయితే ఇందులో నిజం లేదని తేలిపోయింది. అమ్మవారి పాత్రలో నయనతార నటిస్తున్నట్లు చిత్రబృందం ప్రకటించింది. నిర్మాణ సంస్థ వేల్స్ ఫిల్మ్ ఇంటర్నేషనల్ లిమిటెడ్ అనౌన్స్‌మెంట్ వీడియోను విడుదల చేసింది. అందులో అమ్మవారిగా నయనతార లుక్‌ను ఆవిష్కరించారు. దర్శకుడు ఆర్‌జే బాలాజీ ఈ చిత్రాన్ని తెరకెక్కిస్తున్నారు.

బాలీవుడ్, టాలీవుడ్, కోలీవుడ్, మాలీవుడ్... తారలంతా ఒకే వేదికపై కనిపించడం చాలా అరుదు. అలా జరిగితే అభిమానులకు నిజంగా అది పండగే. అటువంటి అరుదైన కలయిక అపర కుబేరుడు, ముఖేశ్ అంబానీ చిన్న కొడుకు అనంత్ అంబానీ, వ్యాపారవేత్త విజయ్ మర్చంట్ కూతురు రాధికా మర్చంట్ వివాహ వేడుకలో ఆవిష్కృతమైంది. కనివినీ ఎరుగని రీతిలో.. అంగరంగ వైభవంగా సాగిన ఈ పెళ్లి వేడుకకు హాజరవడానికి తారలు బారులు దీరారు. ఆకాశంలో నక్షత్రాలన్నీ ఒకేచోట చేరినట్లు ముంబైలోని జియో వరల్డ్ కన్వెన్షన్ సెంటర్‌కు తారలంతా హాజరై కనువిందు చేశారు.

తారలు దిగివచ్చిన వేళ...




టాలీవుడ్ తారల సందడి

ఈ వేడుకకు టాలీవుడ్ నటీనటులు తరలి వచ్చారు. మహేశ్‌బాబు కుటుంబ సమేతంగా నమ్రత, సితారలతో.. రామ్‌చరణ్ తన సతీమణి ఉపాసనతో.. వెంకటేశ్, తన భార్య నీరజతో.. రానా దగ్గుబాటి దంపతులు పెళ్లికి వచ్చి వధూవరులను ఆశీర్వదించి శుభాకాంక్షలు అందజేశారు.










బాలీవుడ్ అతిరథులంతా విచ్చేయగా...

బాలీవుడ్ తారాగణం అంతా కలసి ఈ పెళ్లి వేడుకలో సందడి చేయడం విశేషం. అమితాబ్ బచ్చన్ తన సతీమణి జయ బచ్చన్, ఖాన్ త్రయం(షారుఖ్, సల్మాన్, ఆమిర్), రణబీర్, తన సతీమణి ఆలియా, ప్రియాంక చోప్రా తన భర్త నిక్ జోనాస్, రణ్‌వీర్.. విక్కీ కౌశల్ దంపతులు, జాన్వీకపూర్, ఖుషీకపూర్, అర్జున్ కపూర్, మాధురి దీక్షిత్, కృతీ సనన్, అనన్య పాండే, సారా అలీఖాన్ తళుక్కున మెరిశారు. ఈ వేడుకలో ఐశ్వర్య తన కూతురు ఆరాధ్యతో వచ్చారు. ఆమెతో తన భర్త అభిషేక్ కనిపించకపోవడంతో.. ఈ మధ్య వారి వైవాహిక జీవితానికి సంబంధించి జరుగుతున్న చర్చను మరింతగా పెంచేలా చేసింది.











కనువిందు చేసిన కోలీవుడ్ స్టార్స్

తమిళ నటీనటులు కూడా పెద్ద సంఖ్యలో ఈ వివాహానికి హాజరయ్యారు. ఈ సెలబ్రిటీల లిస్టులో నయనతార, ఆమె భర్త విఘ్నేశ్ శివన్, సూర్య, జ్యోతిక, అట్లీ దంపతులు ప్రముఖంగా ఉన్నారు.





స్టెప్పులేసిన సూపర్ స్టార్



సూపర్‌స్టార్ రజనీకాంత్ తెరపైనా, తెరవెనుకా ఏది చేసినా సంచలనమే. ఆయన తెరపై కనిపిస్తే చాలు రజనీని డెమీ గాడ్‌లా భావించి పులకించిపోయే అభిమానులు సూపర్‌స్టార్ సొంతం. సినిమాల్లో ఎంత స్టైలిష్‌గా, హుషారుగా ఉంటారో.. రియల్‌లైఫ్‌లో అంత సింపుల్‌గా, హుందాగా ఉంటారాయన. అలాంటి రజనీ ఈ పెళ్లి వేడుకలో స్టెప్పులేయడం హైలైట్‌గా నిలిచింది. 'దిల్ దఢకనే దో' చిత్రంలోని 'గలన్ గూడియాన్' పాటకు రజనీ స్టెప్పులేసిన ఈ వీడియో ప్రస్తుతం సోషల్ మీడియాలో హల్‌చల్ చేస్తోంది.

మాలీవుడ్ నుంచి 'దేవ'

'సలార్' సినిమాలో 'దేవ'గా అందరికీ సుపరిచితమైన మలయాళ నటుడు పృథ్వీరాజ్ సుకుమారన్, తన భార్య సుప్రియా మీనన్‌తో ఈ వేడుకలో తళుక్కున మెరిశారు. మాలీవుడ్ నుంచి ఈ పెళ్లి వేడుకకు హాజరైన వారిలో ఈ దంపతులు మాత్రమే ఉండటం గమనార్హం.



అంతర్జాతీయ అతిథులూ...

ఈ వేడుకకు దేశం నుంచి నలువైపుల నుంచి అతిథులు విచ్చేశారు.. అందులో సినీ తారలే కాకుండా, క్రీడా ప్రముఖులూ, రాజకీయనాయకులూ, వ్యాపార దిగ్గజాలూ ఉన్నారు. అయితే ఈ వేడుకలో అంతర్జాతీయ అతిథులు కూడా భాగం కావడం స్పెషల్ అట్రాక్షన్‌గా మారింది. బాక్సింగ్ సంచలనం, నటుడు మైక్ టైసన్, రెజ్లింగ్ స్టార్, నటుడు జాన్ సీనా, పాప్ గాయని రిహానా, కిమ్ కర్దశియాన్ ఈ లిస్ట్‌లో ఉన్నారు.

షూటింగ్‌లో మహేశ్వరిని చూసి అంతా కంగారు పడ్డారు




వరకట్న దురాచారాన్ని నిరసిస్తూ తెలుగులో చాలా చిత్రాలు వచ్చాయి. వాటిల్లో సీనియర్ దర్శకుడు ముత్యాల సుబ్బయ్య రూపొందించిన 'అమ్మాయి కాపురం' చిత్రం ఒకటి. మహేశ్వరి లీడ్ రోల్ పోషించిన ఈ చిత్రంలో అలీ, ఆనంద్, కోట శ్రీనివాసరావు ఇతర ముఖ్య పాత్రలు పోషించారు. చిత్ర కథ మొత్తం హీరోయిన్ చుట్టూ తిరుగుతుంది కనుక పేరున్న కథానాయిక కాకుండా కొత్త నటిని తీసుకుందామని దర్శకుడు ముత్యాల సుబ్బయ్య, నిర్మాత నాగేశ్వరరావు నిర్ణయించుకున్నారు. ఆ సమయంలోనే హీరోయిన్ శ్రీదేవి చెల్లెలు మహేశ్వరిని తమిళ దర్శకుడు భారతీరాజా పరిచయం చేస్తున్నారని తెలిసి, ఆమె ఫొటోలు తెప్పించుకుని చూసి ఫైనలైజ్ చేశారు. భారతీరాజా మీద నమ్మకంతో మహేశ్వరిని చూడకుండానే ఆమెని ఎంపిక చేశారు. ఒంగోలులో 'అమ్మాయి కాపురం' షూటింగ్‌కు తొలి రోజు వచ్చిన మహేశ్వరిని చూసి అంతా నిర్ఘాంత పోయారు.

భారతీరాజా షూటింగ్ కోసం ఎక్కడో పొల్లాచ్చిలో మంచి ఎండల్లో షూటింగ్ చేసి వచ్చిందేమో ఆమె మొహం నల్లగా మాడిపోయింది. మనిషి చాలా సన్నగా, ఏ మాత్రం గ్లామర్ లేకుండా ఉంది. ఆమెను చూడగానే దర్శకుడు ముత్యాల సుబ్బయ్యకు నోట మాట రాలేదు. 'ఈ అమ్మాయి హీరోయినా.. ఇంత చండాలంగా ఉందేమిటి' అని షూటింగ్ చూడడానికి వచ్చిన జనం చేసిన కామెంట్స్ ఆయన చెవిన పడ్డాయి.. అప్పటికే సినిమాలోని ఆర్టిస్టులంతా ఒంగోలు చేరుకున్నారు. షూటింగ్ ఆపడం కష్టం. మంచి కథతో వస్తున్న సినిమాను ఇలాంటి అమ్మాయి హీరోయిన్‌గా ఎలా తీయడం? అని ఆయన చాలా మదనపడ్డారు. అయినా రాజీ పడి, మహేశ్వరి ఏ యాంగిల్‌లో బాగుంటుందో చూసుకుని అలాగే కొన్ని రోజులు షూటింగ్ చేశారు సుబ్బయ్య. స్వర్గీయ దర్శకుడు టి.కృష్ణ పెద్ద కుమారుడు ప్రేమ్‌చంద్ 'అమ్మాయి కాపురం' చిత్రం ప్రొడక్షన్ వ్యవహారాలు చూసేవారు. అతను అనుకోకుండా ఓ రోజు హఠాత్తుగా రోడ్డు ప్రమాదంలో మరణించడంతో 'అమ్మాయి కాపురం' షూటింగ్ వాయిదా పడింది. యూనిట్ సభ్యులంతా షాక్‌లో ఉండడం వల్ల ఓ రెండు నెలల పాటు ఈ సినిమా విషయమే ఆలోచించలేదు. షూటింగ్ ఇలా రెండు నెలలు గ్యాప్ ఇవ్వడం వల్ల ఒక రకంగా మేలే జరిగింది. మహేశ్వరి పరవాలేదనిపించే విధంగా తయారైంది. దాంతో మళ్లీ షూటింగ్ మొదలు పెట్టి ఆమె ఏ యాంగిల్‌లో అందంగా కనిపిస్తుందో అలాగే షాట్ చేసి, సినిమాను పూర్తి చేశారు. 'అమ్మాయి కాపురం' మంచి హిట్. బాగానే ఆడినా ఫంక్షన్ మాత్రం చేయలేదు. కాకపోతే నిర్మాత నాగేశ్వరరావు ముఖ్యమైన టెక్నీషియన్లకు బ్రాస్‌లెట్స్ చేయించాడు. ఈ సినిమాకు నంది అవార్డ్ వచ్చింది. ఆనాటి ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు చేతుల మీదుగా అవార్డు కూడా అందుకున్నారు దర్శకుడు ముత్యాల సుబ్బయ్య.

ఐశ్వర్యారాయ్‌కు సారీ చెబుతా

\- ఇమ్రాన్ హష్మీ



గతంలో ఐశ్వర్యారాయ్ బచ్చన్‌ను ప్లాస్టిక్‌తో పోల్చుతూ చేసిన వివాదాస్పద వ్యాఖ్యల పట్ల బాలీవుడ్‌నటుడు ఇమ్రాన్‌హష్మీ విచారం వ్యక్తం చేశారు. ఈ సారి ఆమెను కలసినప్పుడు క్షమాపణలు చెబుతానని చెప్పారు. 2014లో 'కాఫీ విత్ కరణ్' షోకి హాజరయ్యాడు ఇమ్రాన్. ర్యాపిడ్ ఫైర్ రౌండ్‌లో యాంకర్ ఏదైనా ఒక వస్తువు పేరు చెబితే బదులుగా ఇమ్రాన్ ఒక సెలబ్రిటీ పేరు చెప్పాలి అనేది టాస్క్. యాంకర్ 'ప్లాస్టిక్' అనే పదం చెప్పగానే ఇమ్రాన్ హష్మి 'ఐశ్వర్యారాయ్' అని బదులు చెప్పాడు. అది కాస్తా వివాదంగా మారింది. అప్పటి నుంచి ఐశ్వర్యారాయ్ అభిమానులు ఇమ్రాన్‌ను వెంటాడుతున్నారు. విశ్వసుందరిని ప్లాస్టిక్‌తో పోల్చడం ఏంటంటూ ఇమ్రాన్‌పై ఫైర్ అయ్యారు. ఆ తర్వాత కూడా ఆ వివాదాన్ని తిరగదోడుతూ ఏదో ఒక సందర్భంలో ఇమ్రాన్ హష్మీని లక్ష్యంగా చేసుకొని విమర్శలకు దిగారు. అయితే ఇమ్రాన్ కూడా వెనక్కి తగ్గలేదు. తన వ్యాఖ్యలను వెనక్కు తీసుకునేది లేదని తెగేసి చెప్పాడు. ఎప్పటికీ ఐశ్వర్యకు క్షమాపణలు చెప్పబోనని పలు సందర్భాల్లో చెప్పాడు. అయితే ఇటీవలే మీడియాకు ఇచ్చిన ఓ ఇంటర్వ్యూలో ఇమ్రాన్ తన వ్యాఖ్యల పట్ల విచారం వ్యక్తం చేశారు. ఆ రోజు అలా మాట్లాడి ఉండాల్సింది కాదని పశ్చాత్తాపం వ్యక్తం చేశారు. ఐశ్వర్యకు తాను చాలా పెద్ద అభిమానిని అన్నారు. ఆమెను చాలా గౌరవిస్తానని చెప్పాడు. సరదాగా చేసిన వ్యాఖ్య వల్ల ఇన్నేళ్లుగా నేను విమర్శలు ఎదుర్కోవాల్సి వచ్చిందని వాపోయాడు. ఈ సారి ఐశ్వర్యారాయ్‌ను కలసినప్పుడు క్షమించమని అడుగుతాను అని చెప్పాడు.

ఇది ఆరంభం మాత్రమే

మూవీ ఆర్టిస్టు అసోసియేషన్




సినీ తారలు.. వారి జీవితాలే లక్ష్యంగా విమర్శలు.. కామెంట్లు చేస్తూ వీడియోలు చేసే యూట్యూబర్లకు 'మా' అధ్యక్షుడు మంచు విష్ణు రెండు రోజుల క్రితం ఓ హెచ్చరిక జారీ చేసిన సంగతి తెలిసిందే. ఆ హెచ్చరికలో.. 48 గంటల్లోగా ఇలాంటి వీడియోలను సంబంధిత యూట్యూబ్ చానెళ్ల నుంచి తొలగించాలని..లేదంటే సైబర్ సెక్యూరిటీకి ఫిర్యాదు చేసి.. చర్యలు తీసుకుంటామని.. చానళ్లను నిషేధిస్తామని వార్నింగ్ ఇచ్చారు. ఈ గడువు దాటిన మేరకు 'మా' శనివారం పలు యూట్యూబ్ చానళ్లపై చర్యలు తీసుకుని.. ఐదు యూట్యూబ్ చానళ్లపై నిషేధం విధించింది. ఇది కేవలం ఆరంభం మాత్రమేనని.. భవిష్యత్తులో ఇలా సెలబ్రిటీల జీవితాలను టార్గెట్ చేసుకుని వీడియోలు చేసే వారిపై మరిన్ని కఠిన చర్యలు ఉంటాయని 'మా' ఎక్స్‌లో పేర్కొంది. ఈ రద్దు చేసిన యూట్యూబ్ చానళ్ల లిస్ట్‌లో జస్ట్ వాచ్ బీబీసీ, ట్రోల్స్ రాజా, బచినా లలిత్, హైదరాబాద్ కుర్రాడు, ఎక్స్‌వైజెడ్ ఎడిట్జ్ 007 ఉన్నాయి.

సోషల్ కంటెంట్

1. భూమి ఉపరితలం నుంచి ఎన్ని మీటర్లు ఎత్తుకు వెళ్లే కొద్దీ 1 డిగ్రీ ఉష్ణోగ్రత పెరుగుతుంది?
   1. 190మీ. 2. 150మీ. 3. 165మీ. 4. 185మీ.
2. సున్నా డిగ్రీ రేఖాంశం కింద పేర్కొన్న ఏ ఖండం మీదుగా గీయలేదు?
   1. ఆసియా 2. యూరప్ 3. ఆఫ్రికా 4. అంటార్కిటికా
3. భారత రాజ్యాంగ పీఠిక ప్రకారం అత్యున్నత అధికారం వీరికి ఉంటుంది.
   1. భారత రాష్ట్రపతి 2. ప్రధానమంత్రి
   3. రాష్ట్రపతికి, ప్రధానమంత్రికి, స్థానిక రాష్ట్ర పాలకులకు
   4. మొత్తం భారతదేశ ప్రజలకు
4. కింద పేర్కొన్న మృత్తికల్లో తనను తాను దున్నుకునే నేలలు అని వేటిని పిలుస్తారు?
   1. ఎర్ర మృత్తికలు 2. నల్ల మృత్తికలు
   3. ఒండ్రు మృత్తికలు
   4. లేటరైట్ మృత్తికలు
5. సున్నపురాయిని కింది ఏ పరిశ్రమల్లో ముడి పదార్థంగా ఉపయోగిస్తారు.
   1. సిమెంట్ పరిశ్రమల్లో
   2. ఇనుము, ఉక్కు పరిశ్రమ
   3. ఎరువుల పరిశ్రమ 4. పైవన్నీ
6. పేపర్ తయారీ దశలో ముఖ్యమైన దశను గుర్తించండి.
   1. ముక్కలు చేయడం
   2. కలపగుజ్జు తయారీ
   3. గుజ్జును పరచడం 4. కత్తిరించడం
7. కింది ఏ నగరంలో సూర్యకిరణాల తీవ్రత ఎక్కువ?
   1. బెంగళూరు 2. హైదరాబాద్
   3. ఢిల్లీ 4. భోపాల్
8. కళాక్షేత్ర అనే సంస్థను స్థాపించి, భరత నాట్య పునరుద్ధరణకు కృషిచేసింది ఎవరు?
   1. రుక్మిణిదేవి 2. బాల సరస్వతి
   3. ఇ.కృష్ణ అయ్యర్
   4. బెంగళూరు నాగరత్నమ్మ
9. భారతదేశంలో మొట్టమొదటి మహిళా రైల్ ఇంజన్ డ్రైవర్ ఎవరు?
   1. సురేఖ యాదవ్ 2. సరళ తక్రాల్
   3. అర్చన పట్నాయక్
   4. పద్మావతి బందోపాధ్యాయ
10. ఉత్తరమేరూర్ శాసనం ఏ వంశానికి చెందింది?
    1. చోళులు 2. రాష్ట్రకూటులు
    3. కాకతీయులు 4. శాతవాహనులు
11. హిరణగర్భ అనే సంస్కారనిధిని నిర్వహించింది ఎవరు?
    1. దంతి దుర్గుడు 2. విజయాలయుడు
    3. నాగభట్ట 4. ధంగదేవుడు
12. దాశరథి శతకాన్ని రాసింది.
    1. దాశరథి కృష్ణమాచార్యులు
    2. దాశరథి రంగాచార్యులు
    3. తాళ్లపాక అన్నమాచార్యులు
    4. కంచర్ల గోపన్న
13. 1948 సెప్టెంబరులో హైదరాబాద్ రాష్ట్రాన్ని భారతదేశంలో విలీనం చేయడానికి సాయుధ బలగాలను పంపిన కేంద్ర హోంశాఖ మంత్రి కింది వారిలో ఎవరు?
    1. బూర్గుల రామకృష్ణారావు
    2. సర్దార్ వల్లభాయ్ పటేల్
    3. శ్యాంప్రసాద్ ముఖర్జీ
    4. సి.రాజగోపాలాచారి
14. కోరిన సమాచారాన్ని పొందడానికి దరఖాస్తు అందించిన తేదీ నుంచి గల గడువు
    1. 25 రోజులు 2. 30 రోజులు
    3. 35 రోజులు 4. 40 రోజులు
15. భారతదేశంలో ద్రవ్య ముద్రణ, పంపిణీకి ఎవరు బాధ్యత వహిస్తారు?
    1. ఆర్థిక మంత్రిత్వశాఖ
    2. రాష్ట్రపతి
    3. రిజర్వుబ్యాంక్ ఆఫ్ ఇండియా
    4. పార్లమెంటు
16. విషయ నిర్దేశిత పటాల్లో తెలుపురంగు దేనిని సూచిస్తుంది.
    1. అడవి 2. బంజరు భూములు
    3. ఖనిజాలు దొరికే ప్రాంతం
    4. సముద్రాలు
17. ఏటీఎంను విస్తరించండి?
    1. ఎనీ టైమ్ మనీ 2. ఎనీ టైమ్ మెడిసిన్
    3. ఆటోమేటిక్ టెల్లర్ మెషిన్
    4. ఆటోమేటిక్ టెల్లర్ మొబైల్
18. జబ్త్ అంటే?
    1. సైనిక విధానం
    2. విదేశాంగ విధానం
    3. రెవిన్యూ విధానం 4. పైవేవీకావు

సమాధానాలు

1) 3 2) 1 3) 4 4) 2 5) 1 6) 3 7) 2 8) 1 9) 1 10) 1 11) 1 12) 2 13) 2 14) 2 15) 3 16) 3 17) 3 18) 3



డీఎస్సీ(ఎస్‌జీటీ) మోడల్ ప్రశ్నలు

Methods

1. In which of the steps of evaluation, testing is done orally
   1. Home assignment 2. Recapitulation
   3. Comprehension of Text
   4. All the above
2. Planning, executing, feedback, re-planning, re-execution and re-feedback are the steps followed in ....
   1. Seminars 2. Lesson Planning
   3. Micro Teaching
   4. Remedial Teaching
3. Identify the number of syllables in the word "Continuously"
   1. Six 2. Five 3. Four 4. Three
4. TOEFL, JELTS are examples for .....
   1. Standardised tests 2. Diagnostic tests
   3. Proficiency tests 4. Placement tests
5. Which type of reading strategy is looking up a word in the dictionary, finding the names of characters in a story, looking at a railway time table?
   1. Skimming 2. Scanning
   3. Intensive Reading
   4. Extensive Reading
6. One of the following method uses mother tongue as stimulus for evoking the foreign language as response. Identify it.
   1. Grammar Translation 2. Direct
   3. lingual 4. Total Physical Response
7. సమగ్ర ఆంధ్ర సాహిత్య చరిత్రను రాసింది.
   1. నార్ల వెంకటేశ్వరరావు
   2. పండరీపుర సూర్య ప్రకాశ దీక్షితులు
   3. భాగవతులు సదాశివ శంకరశాస్త్రి
   4. దివాకర్ల వెంకటావధాని
8. విస్తార పఠనం ప్రయోజనాల్లో చేరనిది.
   1. విద్యార్థుల్లో మౌన పఠన సామర్థ్యం పెంపొందుతుంది
   2. విరామ కాలాన్ని సద్వినియోగ పరుస్తుంది
   3. విషయంపై సంపూర్ణమైన అవగాహన కలుగుతుంది
   4. విశేషమైన జ్ఞానార్జనకు తోడ్పడుతుంది
9. బోధనలో భాగంగా విద్యార్థుల అభ్యసన ప్రగతిని ఎప్పటికప్పుడు అంచనా వేస్తూ అవసరమైన చర్యలు చేపట్టి, అభ్యసన ప్రగతిని సాధించడానికి దోహదపడేది.
   1. రూపణ మూల్యాంకనం
   2. సంకలన మూల్యాంకనం
   3. లక్ష్యాధార మూల్యాంకనం
   4. సామర్థ్యాధార మూల్యాంకనం
10. కింది వాటిలో దంత్యోష్మం.
    1. హ 2. ష 3. శ 4. స
11. మూలభాషలోని విషయాన్ని లక్ష్యభాషలోకి మార్చడాన్ని ఏమంటారు.
    1. వాగ్రూప వ్యక్తీకరణ 2. లిఖితరూప వ్యక్తీకరణ
    3. భాషాంతరీకరణ సామర్థ్యం 4. ఏదీకాదు
12. ఉపాధ్యాయుడు పాఠ్యభాగ విశదీకరణలో కొన్ని లక్ష్యాలను ఏర్పర్చుకుంటాడు. ఆ లక్ష్యాల సాధనకు ఉపయోగపడేవే బోధనోపకరణాలు అని నిర్వచించింది.
    1. హుమయూన్ కబీర్ 2. వెబ్‌స్టర్
    3. కొంపెల్లి ఆంజనేయులు 4. కోబాల్
13. కింది వాటిలో సాంఘికశాస్త్ర బోధనోద్దేశం కానిది?
    1. విద్యార్థుల్లో దేశభక్తి భావాన్ని పెంపొందించడం
    2. సమాజంలో దగ్గర సంబంధాన్ని పెంపొందించుట
    3. మానవ నాగరికతాభివృద్ధిని తెలియచేయడం
    4. విద్యార్థులకు స్వయం ఉపాధిని అంద చేయడం
14. మీ నియోజకవర్గంలో పోలింగ్ శాతాన్ని మెరుగుపర్చడానికి తీసుకోవాల్సిన చర్యలను సూచించుము అనే ప్రశ్న ఏ లక్ష్యాన్ని పరీక్షించడానికి గాను ఉద్దేశించింది?
    1. అవగాహన - వివరణ ఇచ్చుట
    2. వినియోగం - సంశ్లేషణ
    3. వినియోగం - కారణాలు చెప్పడం
    4. నైపుణ్యం - అనువాదం చేయుట
15. జన్మభూమి కార్యక్రమంలో గ్రామసభ గురించి విద్యార్థులకు అవగాహన కల్పించడానికి ఉపాధ్యాయుడు మాదిరి గ్రామసభను నిర్వహించాడు. అతడు అనుసరించిన బోధనా టెక్నిక్ కింది వాటిలో ఏది.
    1. నాటకీకరణ 2. పాత్రాభినయం
    3. చర్చ 4. సిమ్యూలేషన్

సమాధానాలు

1) 2 2) 3 3) 2 4) 3 5) 2 6) 3 7) 1 8) 3 9) 1 10) 3 11) 3 12) 3 13) 4 14) 4 15) 4

ప్రశ్న పత్రాన్ని హైదరాబాద్‌లోని బాసర ఇన్‌స్టిట్యూట్‌కు చెందిన శీలం దేవేందర్‌రెడ్డి నేతృత్వంలో సీనియర్ ఫ్యాకల్టీ బృందం రూపొందించింది.

ఇగ్నోలో నూతన కోర్సులు



ఇందిరాగాంధీ నేషనల్ ఓపెన్ యూనివర్సిటీ(ఇగ్నో) కొత్తగా 13 కోర్సులను ప్రవేశపెట్టింది. వీటిలో నాలుగు ఎంబీఏ స్పెషలైజేషన్స్ ఉన్నాయి. ఈ కోర్సులన్నీ ఆంగ్ల మాధ్యమంలోనే అందుబాటులో ఉంటాయి. కనీసం 50 శాతం మార్కులతో ఏదైనా మూడేళ్ల బ్యాచిలర్స్ డిగ్రీ ఉత్తీర్ణులైన అభ్యర్థులు ఈ కోర్సుల్లో చేరేందుకు అర్హులు. రిజర్వ్‌డ్ క్యాటగిరీ అభ్యర్థులకు 45 శాతం మార్కులుంటే చాలు. ఎంబీఏ కోర్సు కనీస వ్యవధి రెండేళ్లు. నాలుగేళ్లలోపు పూర్తి చేయాలి. మొత్తం 4 సెమిస్టర్లు ఉంటాయి. ఆసక్తి ఉన్న అభ్యర్థులు పూర్తి సమాచారాన్ని http://www.ignou.ac.in/ వెబ్‌సైట్ నుంచి పొందవచ్చు.

ప్రధాన కోర్సులు

- ఎంబీఏ ఇన్ కన్‌స్ట్రక్షన్ మేనేజ్‌మెంట్
- ఎంబీఏ ఇన్ లాజిస్టిక్స్ అండ్ సప్లయ్ చెయిన్ మేనేజ్‌మెంట్
- ఎంబీఏ ఇన్ అగ్రి బిజినెస్ మేనేజ్‌మెంట్
- ఎంబీఏ ఇన్ హెల్త్‌కేర్ అండ్ హాస్పిటల్ మేనేజ్‌మెంట్
- పీజీ డిప్లొమా ఇన్ రీహాబిలిటేషన్ సైకాలజీ
- పీజీ డిప్లొమా ఇన్ డిజాస్టర్ రిస్క్ రిడక్షన్ అండ్ మేనేజ్‌మెంట్
- ఎంఏ ఇన్ గీతా స్టడీస్
- సర్టిఫికెట్ ఇన్ ఎర్లీ చైల్డ్ హుడ్ స్పెషల్ ఎడ్యుకేషన్ ఎనేబ్లింగ్ ఇన్‌క్లూజన్ - హియరింగ్ ఇంపెయిర్‌మెంట్
- సర్టిఫికెట్ ఇన్ ఎర్లీ చైల్డ్‌హుడ్ స్పెషల్ ఎడ్యుకేషన్ ఎనేబ్లింగ్ ఇన్‌క్లూజన్ - ఇంటలెక్చువల్ డిజెబిలిటీ
- ఎమ్మెస్సీ ఇన్ హోమ్ సైన్స్(కమ్యూనిటీ డెవలప్‌మెంట్ అండ్ ఎక్స్‌టెన్షన్ మేనేజ్‌మెంట్)

'జంతు సంక్షేమం'లో పీజీ డిప్లొమా

ఇందిరాగాంధీ నేషనల్ ఓపెన్ యూనివర్సిటీ(ఇగ్నో), పోస్ట్ గ్రాడ్యుయేట్ డిప్లొమా ఇన్ యానిమల్ వెల్ఫేర్(పీజీడీఏడబ్ల్యూ) కోర్సులో ప్రవేశానికి దరఖాస్తులు స్వీకరిస్తోంది. ఇటీవల ప్రారంభించిన ఈ కోర్సు 'లార్జెస్ట్ గ్లోబల్ యానిమల్ వెల్ఫేర్ ఎడ్యుకేషన్ ప్రోగ్రామ్'గా గుర్తింపు పొందింది. కరికులమ్‌ని యూకేలోని యూనివర్సిటీ ఆఫ్ ఎడిన్‌బరో సహకారంతో రూపొందించారు. యానిమల్ వెల్ఫేర్ బోర్డ్ ఆఫ్ ఇండియా గుర్తించింది. అడ్మిషన్ల ప్రక్రియ ప్రారంభమైంది. ఆసక్తి ఉన్న అభ్యర్థులు https://ignouadmission.samarth.edu.in/ వెబ్‌సైట్ ద్వారా దరఖాస్తు చేసుకోవచ్చు.



ప్రోగ్రామ్ వివరాలు: కోర్సు వ్యవధి ఏడాది. కోర్సులో ప్రధానంగా నాలుగు విభాగాలుంటాయి. అవి.. యానిమల్ వెల్ఫేర్ సైన్స్ అండ్ ఎథిక్స్, యానిమల్ వెల్ఫేర్ ఇష్యూస్, యానిమల్ వెల్ఫేర్ లాస్ అండ్ పాలిసీస్, యానిమల్ వెల్ఫేర్ ప్రాక్టీసెస్ అండ్ స్టాండర్డ్స్ మొదలైనవి. కరికులమ్‌లో 85 మాడ్యూల్స్ ఉంటాయి. ఇవి సైంటిఫిక్, ఎథికల్, లీగల్, ప్రాక్టికల్ యాస్పెక్ట్స్ ఆఫ్ యానిమల్ వెల్ఫేర్ వంటి ప్రధాన అంశాలు ఈ మాడ్యుల్స్‌లో భాగంగా ఉన్నాయి. వీటితో పాటు జూ, ల్యాబ్, స్ట్రీట్ యానిమల్స్ వంటి వాటి నిర్వహణను కూడా ఇందులో చేర్చారు.

కోర్సులో ఎవరు చేరొచ్చు?

- జంతు ప్రేమికులు
- జంతు సంక్షేమ సంస్థలు/ఎన్‌జీవోలు/గోశాలల సిబ్బంది
- యూనివర్సిటీలు, వెటర్నరీ కాలేజీలకు చెందిన ఫ్యాకల్టీ, పరిశోధకులు, విద్యార్థులు
- ప్రభుత్వం, మిలిటరీ సర్వీసెస్‌కు చెందిన వెటరినేరియన్స్, నాన్-వెటరినేరియన్స్
- జంతు సంక్షేమ బోర్డులు/కమిటీల సభ్యులు
- లా ఎన్‌ఫోర్స్‌మెంట్ ప్రొఫెషనల్స్
- సివిల్ సర్వెంట్స్, ఫారెస్ట్ సర్వీస్ ఆఫీసర్స్ అండ్ వైల్డ్‌లైఫ్ కన్జర్వేషనిస్ట్‌లు.

కరికులమ్ హైలైట్స్

యానిమల్ వెల్ఫేర్ సైన్స్ అండ్ ఎథిక్స్: జంతు సంక్షేమంపై అవగాహన, జంతువుల వ్యవహార శైలి, జంతు సంక్షేమాన్ని ప్రమోట్ చేయడంలో వెటరినేరియన్స్ పాత్ర, ఎథికల్ ఫ్రేమ్ వర్క్స్ వంటి ప్రధానాంశాలను ఈ విభాగం ద్వారా నేర్చుకోవచ్చు.

యానిమల్ వెల్ఫేర్ ఇష్యూస్: ఫార్మ్ యానిమల్స్ సహా పలు రకాల జంతు జాతులు, పెంపుడు జంతువులు, జూ - క్రూర మృగాలు, ల్యాబొరేటరీ యానిమల్స్ సంక్షేమం అదేవిధంగా స్లాటర్ అండ్ డిజాస్టర్ వంటి అంశాలు ఇందులో చర్చిస్తారు.

యానిమల్ వెల్ఫేర్ లాస్, పాలిసీస్ అండ్ ఆర్గనేజేషన్స్: పెర్టినెంట్ లెజిస్లేషన్, ఎన్‌ఫోర్స్‌మెంట్ మెకానిజమ్స్ వంటి అంశాలు ఇందులో ఉంటాయి. వీటితో పాటు వివిధ అంశాలపై డిష్కషన్స్ ఆర్గనైజేషనల్ ఫ్రేమ్ వర్క్స్ కూడా ఇందులో భాగాంటా ఉంటాయి.

యానిమల్ వెల్ఫేర్ ప్రాక్టీసెస్, ఎకనామిక్స్ అండ్ లైవ్‌లీహుడ్: జంతు సంక్షేమ ప్రాధాన్యతలు, సస్టయినేబుల్ ప్రాక్టీసెస్ వంటి వాటిని ఇందులో చర్చిస్తారు.

జాబ్ కార్నర్

ఇండియన్ ఆర్మీలో హవల్దార్, నాయబ్ సుబేదార్ పోస్టులు

ఇండియన్ ఆర్మీ.. క్రీడా కోటా ఎంట్రీ కింద డైరెక్ట్ ఎంట్రీ(ఇంటేక్ 02/2024) ద్వారా హవల్దార్, నాయబ్ సుబేదార్(స్పోర్ట్స్) ఖాళీల భర్తీకి అర్హులైన అవివాహిత పురుష, మహిళా క్రీడాకారుల నుంచి దరఖాస్తులు కోరుతోంది.

పోస్టు: హవల్దార్, నాయబ్ సుబేదార్(స్పోర్ట్స్)- ఇంటేక్ 01/2024

క్రీడా విభాగాలు: అథ్లెటిక్స్, ఆర్చరీ, బాస్కెట్‌బాల్, బాక్సింగ్, డైవింగ్, ఫుట్‌బాల్, ఫెన్సింగ్, జిమ్నాస్టిక్స్, హాకీ, హ్యాండ్‌బాల్, కబడ్డీ.

అర్హత: పదో తరగతి ఉత్తీర్ణతతోపాటు నిర్దిష్ట శారీరక ప్రమాణాలు అవసరం. అంతర్జాతీయ/జూనియర్ లేదా సీనియర్ నేషనల్ చాంపియన్‌షిప్/ఖేలో ఇండియా గేమ్స్/యూత్ గేమ్స్‌లో పాల్గొన్న అత్యుత్తమ క్రీడాకారులై ఉండాలి.

వయోపరిమితి: 17 నుంచి 25 ఏళ్ల మధ్య ఉండాలి.

ఎంపిక: స్పోర్ట్స్ ట్రయల్స్, ఫిజికల్ ఫిట్‌నెస్ టెస్ట్, ఫిజికల్ స్టాండర్డ్స్ టెస్ట్, స్కిల్ టెస్ట్, మెడికల్ ఎగ్జామినేషన్, సర్టిఫికెట్ వెరిఫికేషన్ తదితరాల ఆధారంగా



దరఖాస్తు: ఆఫ్‌లైన్ దరఖాస్తులను డైరెక్టరేట్ ఆఫ్ పీటీ అండ్ స్పోర్ట్స్, జనరల్ స్టాఫ్ బ్రాంచ్, ఐహెచ్‌క్యూ(ఆర్మీ), రూమ్ నెం. 147, 'ఎ' వింగ్, సేనా భవన్, న్యూఢిల్లీ చిరునామాకు పంపాలి.

దరఖాస్తు స్వీకరణకు చివరి తేదీ: సెప్టెంబరు 30

వెబ్‌సైట్: https://joinindian-army.nic.in/

బ్యాంక్ ఆఫ్ మహారాష్ట్రలో ఆఫీసర్లు

ఖాళీలు 195

పుణెలోని బ్యాంక్ ఆఫ్ మహారాష్ట్ర.. వివిధ విభాగాల్లో ఆఫీసర్(స్కేల్: 2, 3, 4, 5, 6) పోస్టుల భర్తీకి నోటిఫికేషన్ విడుదల చేసింది.

1. ఇంటిగ్రేటెడ్ రిస్క్ మేనేజ్‌మెంట్
2. ఫారెక్స్ అండ్ ట్రెజరీ
3. ఐటీ/డిజిటల్ బ్యాంకింగ్/సీఐఎస్‌ఓ/సీడీఓ
4. క్రెడిట్, ఎకనామిస్ట్ విభాగాలు

పోస్టుల వివరాలు: డిప్యూటీ జనరల్ మేనేజర్, అసిస్టెంట్ జనరల్ మేనేజర్, చీఫ్ మేనేజర్, సీనియర్ మేనేజర్, మేనేజర్, బిజినెస్ డెవలప్‌మెంట్ ఆఫీసర్

అర్హత: సంబంధిత విభాగాల్లో డిగ్రీ/పీజీ, పీజీ డిప్లొమా, సీఏ ఉత్తీర్ణతతో పాటు పని అనుభవం ఉండాలి.

జీతం: నెలకు స్కేల్-2 పోస్టులకు రూ.64,820 - రూ.93,960, స్కేల్-3కి రూ.85,920 - రూ.1,05,280, స్కేల్-4కు రూ.1,02,300 - రూ.1,20,940, స్కేల్-5కు రూ.1,20,940-రూ.1,35,020, స్కేల్-6 పోస్టులకు రూ.1,40,500 - రూ.1,56,500.

ఎంపిక విధానం: రాత పరీక్ష, ఇంటర్వ్యూ, గ్రూప్ డిస్కషన్ తదితరాల ఆధారంగా ఎంపిక చేస్తారు.

దరఖాస్తు ఫీజు: ఎస్సీ/ఎస్టీ/దివ్యాంగ అభ్యర్థులకు రూ.118. ఇతరులకు రూ.1180.

దరఖాస్తు విధానం: ఆఫ్‌లైన్ దరఖాస్తులను జనరల్ మేనేజర్, బ్యాంక్ ఆఫ్ మహారాష్ట్ర, హెచ్.ఆర్.ఎం డిపార్ట్‌మెంట్, హెడ్ ఆఫీస్, లోక్‌మంగల్, శివాజీనగర్, పుణె చిరునామాకు పోస్టు ద్వారా పంపించాలి.

దరఖాస్తులకు చివరి తేదీ: జూలై 26

వెబ్‌సైట్: bankofmaharashtra.in/

లిటిల్స్




ఎవరిల్లు వారికి గొప్ప


అడవిలో ఉండే ఒక కొలను దగ్గర ఒక తాబేలు మరియు చిన్న పిట్ట ఒక దానికొకటి పరిచయం అయ్యాయి. ఆ తాబేలు పదేపదే తన గొప్పలు బయటకు చెబుతూ అందరినీ చిన్నబుచ్చుతూ ఉండేది. పిట్ట మాత్రం అందరితో మర్యాదగా స్నేహంగా నడుచుకునేది. అలా అందరినీ మాటలతో ఇబ్బంది పెట్టవద్దని పిట్ట తాబేలుకు ఎన్నోసార్లు హితవు చెప్పడానికి ప్రయత్నించింది కానీ తాబేలు దాని మాటలు పెడచెవిన పెట్టేది. 'అందరినీ అంటున్నది కానీ నన్ను ఏమీ అనదు తాబేలు' అనుకున్నది పిట్ట. ఒక రోజు పిట్ట చెట్టు కొమ్మ మీద వాలి ఉండగా, కిందనుండి వెళు తున్న తాబేలు దాన్ని చూస, 'ఏమీ అలా కూర్చున్నావు? నీకు ఇల్లు లేదా?నువ్వు ఇల్లు కట్టుకోవాలంటే ఎంత కష్టంమైన పని కదా. ఎవరినైన సాయం కూడా అడగాలి, అదే నా ఇల్లు చూడు, అదెప్పుడూ నా వీపునే ఉంటుంది. నాకు ఏ ఇబ్బంది కలిగినా క్షణంలో అందులోకి దూరిపోతాను పాపం నీ పరిస్థితి' అన్నది. ఆ మాటలకు నొచ్చుకున్న పిట్ట 'నీ ఇంట్లో నువ్వు ఒక దానివే ఉండగలవు అదే నా ఇంట్లో అయితే నా కుటుంబం అంతా నాతోనే నివసించవచ్చు. ఎవరి ఇల్లు వారికి గొప్ప కదా' అన్నది.




10 తేడాలు గుర్తించండి!



దారి కనుక్కోండి



సరైన నీడ ఏది?



డైలీ సుడోకు - 358

					3		
		8					
	7			2		5	
	3	1	2		8		
6			1		7		
			6		9	1	
	4	2		6			

సుడోకు - 357 సమాధానం

1	4	9	2	7	8	5	3	6
8	7	5	6	3	1	2	4	9
6	2	3	9	5	4	8	1	7
9	6	2	4	8	7	1	5	3
7	1	8	5	2	3	6	9	4
3	5	4	1	6	9	7	8	2
4	8	6	3	1	2	9	7	5
5	9	1	7	4	6	3	2	8
2	3	7	8	9	5	4	6	1

ప్రతి బాక్స్‌లో 9 గళ్లు ఉంటాయి. ఒక్కో బాక్స్‌ను 1 నుంచి 9 వరకు అంకెలతో పూరించాలి. అన్ని బాక్స్‌లనూ కలిపి చూస్తే నిలువుగా, అడ్డంగానూ ఏ లైనులోనూ ఒకసారి వాడిన అంకెను తిరిగి వాడకూడదు.